సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 139

శనివారం 3-2-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



'యశస్వీ భవ'

జైస్వాల్ 179 నాటౌట్.. ఇంగ్లండ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 336/6 - 13లో



నిఫ్టీ కొత్త రికార్డు నమోదు

మళ్లీ 72 వేల స్థాయికి సెన్సెక్స్ రాణించిన రిలయన్స్, ఐటీ షేర్లు -13లో



తమిళ రాజకీయాల్లోకి హీరో

తమిళగ వెట్రి కళగం పేరిట తాను క్రియాశీలక రాజకీయాల్లో అడుగుపెడుతున్నట్లు తమిళ హీరో విజయ్ ప్రకటించారు.

వివరాలు 6లో ▸



కెన్యాలో పేలిన గ్యాస్ ట్యాంకర్

కెన్యా రాజధాని నైరోబీలో గ్యాస్ ట్యాంకర్ పేలిన ఘటనలో ముగ్గురు చనిపోగా 270 మందికి పైగా గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



'ప్రత్యేక దేశం' వ్యాఖ్యలపై రగడ

దక్షిణాది రాష్ట్రాలన్నింటినీ కలిపి దేశం చేయాలని కాంగ్రెస్ ఎంపీ సురేశ్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్‌లో తీవ్ర రగడ జరిగింది.

వివరాలు 6లో ▸



కేజ్రీవాల్ మళ్లీ డుమ్మా

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఈడీ విచారణకు వరుసగా ఐదోసారి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హాజరుకాలేదు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

నాదెండ్ల బుకాయింపు

రామోజీ దరువు!



ప్రభుత్వ సలహాదారులకు రూ. 680 కోట్లు

- సలహాదారులకు రూ.680 కోట్లు అంటూ నిస్సిగ్గుగా అబద్ధాలు
- బడ్జెట్ కేటాయింపులకు మించి రూ.వందల కోట్లు సాధ్యమేనా?
- అసలు నియమించిందే 46 మంది.. మరి 89 మంది ఎక్కడి నుంచి?
- నియామకాలు, జీతభత్యాలతో పారదర్శకంగా జీవోలు
- ప్రచార ఆర్భాటాలకు ప్రజాధనాన్ని నీళ్లలా వెదజల్లింది చంద్రబాబే
- నాడు పోలవరం ప్రాజెక్ట్ వద్దకు సొంత ప్రచారం కోసం బస్సుల్లో జనాన్ని తరలించిన బాబు

5 లో

నీడనిచ్చిన కుప్పాన్ని కూడా..

చప్పరించేసారు

రాజకీయ భిక్ష పెట్టిన పురిటిగడ్డకు చంద్రబాబు నయవంచన

కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు చేయకుండా కమీషన్లకే ప్రాధాన్యం

- సాగు, తాగునీరు ముసుగులో అంచనా వ్యయం భారీగా పెంపు
- సీఎం రమేష్‌ను అడ్డుపెట్టుకుని ఖజానాకు కన్నం.. కాంట్రాక్టు విలువ కంటే అధికంగా బిల్లులు చెల్లించినా పూర్తికాని పనులు
- పాలార్‌పై రిజర్వాయర్ పనులకూ అడ్డుపడి పొట్టగొట్టిన చంద్రబాబు
- కుప్పంను మున్సిపాలిటీగా చేసి రెవెన్యూ డివిజన్ చేసిన సీఎం జగన్.. కుప్పం బ్రాంచ్ కెనాల్ పూర్తి చేసి కృష్ణా జలాల తరలింపు
- ఇప్పటికే రామకుప్పం మండలానికి చేరుకున్న కృష్ణమ్మ
- ఈ నెలలోనే కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయనున్న సీఎం జగన్

2 లో



పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచి ఆయన రెక్కల కష్టంతో నిర్మించిన పార్టీని, అధికారాన్ని గుంజుకోవడాన్ని ఏమంటారు? మోసం.. ద్రోహం.. వంచన అనే కదా!

నోట్ల కట్టలతో దొంగ ఓట్లతో మూడు దశాబ్దాలుగా నెగ్గుకొచ్చి రాజకీయ భిక్ష పెట్టిన ప్రజలకు చుక్క నీళ్లు ఇవ్వకుండా ఖజానాను దోచేసిన మనిషిని నమ్మకద్రోహి అనే కదా అంటారు!

రాజకీయ అరంగేట్రంలోనే చంద్రబాబు ఫోర్ ట్వంటీ వేషాలు వేయడంతో సొంత నియోజకవర్గం అయిన చంద్రగిరి ప్రజలు తరిమికొట్టారు. గత్యంతరం లేక వలస వెళ్లిన కుప్పంలోనూ ఆయన అవే వేషాలు వేశారు! ఏడుసార్లు తనను గెలిపించిన కుప్పాన్ని తన కమీషన్ల కోసం తాకట్టు పెట్టి.. నీళ్లివ్వకుండా ఎండగట్టారు!



గుడూరి శ్రీనివాస్ | గుడూరి ఉమాబాల | ఉమ్మారెడ్డి వెంకట రమణ | ఎస్.రెడ్డప్ప | సర్నాల తిరుపతి రావు యాదవ్



అన్నా రాంబాబు | కె.నాగార్జున రెడ్డి | ఎండీ.ఖలీల్ | కె.నారాయణ స్వామి | బుట్టా రేణుక

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

ఆరో జాబితాలో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు ఎంపిక

రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు సజ్జల వెల్లడి

ఐదుగురు కొత్తవారికి ఈ సారి అవకాశం

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు/ఏలూరు/రాజమహేంద్రవరం సిటీ/నెల్లూరు: రాష్ట్రంలో మరో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఆ వివరాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. ప్రజాబలమే గీటురాయిగా.. సామాజిక న్యాయం పాటిస్తూ... ఆరో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. గత ఎన్నికల్లో నర్సాపురం లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా... ఈ సారి బీసీ వర్గానికి చెందిన మహిళా అడ్వొకేట్ గూడూరి ఉమాబాలను

మిగతా 2వ పేజీలో ▶

బాబు.. ఓ 'పిల్స్'

ఫ్యాక్టరీ

10 లో

సీనియర్లతో బాబు దొంగాట

పవన్ పేరుతో పలువురు సీనియర్లకు టిక్కెట్లు ఎగ్గొడుతున్న చంద్రబాబు

తాను సీట్లు ఇవ్వొద్దని అనుకుంటున్న వారికి నేరుగా చెప్పడానికి భయం

పవన్ చెప్పాడంటూ ఏడుగురికి టికెట్లు తిరస్కరణ.. గతంలో వారు పవన్‌ను తిట్టారనే సాకు

వారికి సీట్లిస్తే జనసేన ఓట్ల బదలాయింపు ఉండదని పవన్ హెచ్చరించినట్లు ప్రచారం

ఈ జాబితాలో చింతమనేని, చింతకాయల విజయ్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితరులు


పవన్ ముసుగులో దెందులూరులో చింతమనేనికి సీటు నిరాకరణ.. జనసేన అభ్యర్థి ద్వారా బుచ్చయ్య చౌదరికి ఎసరు.. అయ్యన్న కొడుకు విజయ్‌కీ సీటు లేదని చెప్పిన బాబు

10 లో



రామోజీరావుకు 'సుప్రీం'లో ఎదురుదెబ్బ

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో ఆ సంస్థ అధిపతి రామోజీరావుకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరుగుతున్న పిటిషన్లను తెలంగాణ హైకోర్టుకు మార్చాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఏపీ హైకోర్టుకే వెళ్లాలని తేల్చి చెప్పింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్‌ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదిస్తూ.. ఏపీలో నమోదైన ఎఫ్ఐఆర్‌లపై తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్లు వేశామన్నారు. అదే సమయంలో ఏపీలో సీఐడీ వేసిన చార్జిషీట్లను అక్కడి కింది కోర్టు తిరస్కరించిందన్నారు. దీన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఏపీ హైకోర్టును ఆశ్రయించిందన్నారు. ఓ పక్క ఏపీ హైకోర్టు, మరోపక్క తెలంగాణ హైకోర్టు వేర్వేరుగా విచారణ జరిపి భిన్నమైన తీర్పులు ఇస్తే ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. సంస్థ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉన్నందున సొమ్ములన్నీ తెలంగాణకే చేరతాయన్నారు. తెలంగాణ హైకోర్టులో అనుకూలంగా తీర్పు వస్తే ఎఫ్ఐఆర్‌లు నిరర్థకం అవుతాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం 'ఏపీ హైకోర్టులో విచారణ జరుగుతున్న పిటిషన్లు తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయడం కుదరదు. కాబట్టి తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్లపై విచారణ పూర్తయ్యే వరకు ఏపీ హైకోర్టులో పిటిషన్లపై స్టే విధించాలని ఏపీ హైకోర్టులోనే ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్ వేసుకోండి'' అని ధర్మాసనం ఆదేశించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్‌ను కొట్టివేసింది.





ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

30 ఏళ్ల కల నెరవేరింది



కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే బతుకు తెరువు కోసం శ్రీకాకుళం జిల్లా బూర్జ గ్రామం నుంచి నరసన్నపేట మండలం ఉర్లాంకు 30 ఏళ్ల క్రితం వలస వచ్చాం. కొన్నాళ్లకు మా ఆయన కన్నుమూశారు. ఒక్కగానొక్క కొడుకుని చదివిస్తూ, షాపుల్లో పని చేస్తూ.. అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగించాను. గతంలో ఉన్న ప్రభుత్వాలకు పక్కా ఇంటి కోసం ఎన్నో సార్లు దరఖాస్తు చేశాను. స్థలం ఉంటే ఇల్లు ఇస్తామన్నారు. స్థలం కొనే స్తోమత లేక అద్దెలు చెల్లిస్తూ జీవనం కొనసాగించాం. జగన్‌ బాబు ముఖ్యమంత్రి అయ్యాక మా కోరిక తీరింది. ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టుకొనేందుకు ఆర్థిక సాయం చేశారు. డబ్బు సరిపోకపోతే డ్వాక్రా రుణం ఇప్పించారు. ఇంటి నిర్మాణం పూర్తయింది. ఇప్పుడు సొంత ఇంట్లో హాయిగా జీవనం సాగిస్తున్నాం. ఇదివరకు సొంత ఇల్లు లేదని ప్రైవేటు దుకాణంలో పని చేస్తున్న మా అబ్బాయి వైకుంఠరావుకు పెళ్లి సంబంధాలు కుదరలేదు. ఇప్పుడు సంబంధాలు వస్తున్నాయి. ఈ వేసవికి పెళ్లి చేయాలనుకుంటున్నా. ఇదంతా ముఖ్యమంత్రి చలువే. ఆయన సీఎం కాకపోతే మా కల నెరవేరేదికాదు. అలాగే ఈ ప్రభుత్వం నుంచి నాకు ఎంతో మంచి జరుగుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే వితంతు పింఛన్‌ వస్తోంది. డ్వాక్రా రుణం మాఫీ చేస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌ ఆసరా కింద నాలుగు విడతల్లో రూ.60 వేలు వచ్చింది. వైఎస్సార్‌ చేయూత పథకం ద్వారా ప్రతి ఏటా రూ.18,750 చొప్పున వచ్చింది. సీఎం జగన్‌ రుణం తీర్చుకోలేం.

– పైడిశెట్టి సత్యవతి, ఉర్లాం
(మామిడి రవి, విలేకరి, నరసన్నపేట)

పింఛన్‌ మా ఇంటికే వస్తోంది



మాది నిరుపేద కుటుంబం. మేము పల్నాడు జిల్లా దాచేపల్లిలో ఉంటున్నాం. మా నాన్న చిన్నతనంలోనే చనిపోయాడు. పుట్టుకతోనే నా రెండు కాళ్లు చచ్చుబడటంతో దివ్యాంగుడినయ్యాను. సెంటు భూమి కూడా లేని నన్ను మా అమ్మ కూలి పనులు చేసి బతికించింది. దివ్యాంగుడిని కావడంతో నన్ను ఎవరూ పనులకు పిలిచేవారు కాదు. అమ్మ కష్టాన్ని చూడలేకపోయాను. పెళ్లి మండపాల డేకరేషన్‌ పనులు నేర్చుకొని అప్పుడప్పుడు ఆ పనులకు వెళ్తున్నాను. ఎనిమిదేళ్ల క్రితం సలోమి అనే దివ్యాంగురాలితో నాకు వివాహమైంది. మాకు రాకేష్, సతీష్‌ అనే ఇద్దరు పిల్లలున్నారు. నా భార్య కూడా దివ్యాంగురాలు కావడంతో ఆమె కూడా పనులకు వెళ్లే వీలు లేకుండా పోయింది. ఇద్దరికీ వచ్చే పింఛనే జీవనాధారంగా మారింది. గతంలో పింఛను తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయం వద్ద రోజుల తరబడి నిరీక్షించేవాళ్లం. ట్రై సైకిల్‌ పై రోజూ అక్కడకు వెళ్లి రోజుల తరబడి తిరిగితే గాని పింఛను డబ్బులు వచ్చేవి కావు. కానీ నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నాకు, నా భార్యకు మొత్తం రూ.6 వేలు మా వలంటీర్‌ ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకు తెచ్చి అందిస్తున్నారు. మా అమ్మకు వితంతు పింఛను కింద రూ.3 వేలు వస్తున్నాయి. వైఎస్సార్‌ చేయూత కింద ఏటా రూ.18,750 వంతున వస్తోంది. మా బాబు ఈ ఏడాదే ఒకటో తరగతిలో చేరాడు. విద్యాకానుక కింద బూట్లు, బ్యాగ్, పుస్తకాలు అన్నీ ఉచితంగా ఇచ్చారు. మాకు వస్తున్న పింఛను డబ్బులతోనే మేము బతుకుతున్నాం. మా కుటుంబానికి ప్రభుత్వ పథకాలే అండగా నిలుస్తున్నాయి. ఈ ప్రభుత్వం చేస్తున్న సాయం ఎప్పటికీ మరచిపోలేం.

– మేడి నాగరాజు, దాచేపల్లి
(వినుకొండ అజయ్‌కుమార్, విలేకరి, దాచేపల్లి)

పిల్లలపై ఆధార పడకుండా బతుకుతున్నా



మాది చేనేత కుటుంబం. మా ఆయన అశ్వర్థ నారాయణ ఏడేళ్ల క్రితం గుండెపోటుతో మరణించారు. మాకు ముగ్గురు కుమారులు. వారందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. వైఎస్సార్‌ జిల్లా జమ్మలమడుగులో మగ్గం నేతతోపాటు నేను కూలి పనులకు వెళ్లేదాన్ని. ఇప్పుడు నా వయసు 58 సంవత్సరాలు. ఒంట్లో సత్తువ తగ్గి బయట పనులకు వెళ్లలేకపోతున్నా. గతంలో కేవలం రూ.వెయ్యి మాత్రమే పెన్షన్‌ వచ్చేది. 2019లో జగన్‌ సీఎం అయ్యాక పెన్షన్‌ పెరిగింది. ఇపుడు రూ.3 వేలు వస్తోంది. చేనేత వృత్తిలో ఉండటంతో వలంటీరే ఇంటికొచ్చి మరీ వైఎస్సార్‌ నేతన్న నేస్తంలో నా పేరు నమోదు చేశారు. ఈ పథకం కింద ఏటా రూ.24 వేలు చొప్పున ఇప్పటి వరకు ఐదు సార్లు కలిపి మొత్తం రూ.1.20 లక్షలు నా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. వైఎస్సార్‌ చేయూత పథకం కూడా వర్తించింది. రూ.18,750 చొప్పున మూడుసార్లు డబ్బులు అందుకున్నా. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నాకు కొండంత భరోసానిచ్చాయి. నాలాంటి ఒంటరి మహిళలు ఎలాంటి ఆర్థిక ఇబ్బందుల్లేకుండా, సంతోషంగా బతికే ధైర్యాన్నిస్తున్నాయి.

– శిరివెళ్ల లక్ష్మీదేవి, జమ్మలమడుగు
(నాయబ్‌ అబ్దుల్‌ బషీర్, విలేకరి, జమ్మలమడుగు)

వైఎస్సార్‌సీపీలో చేరిన విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్‌



సాక్షి, అమరావతి: టీడీపీ నేత, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్‌ గోగుల వెంకట రమణ శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన సీఎం జగన్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, విజయవాడ ఎంపీ కేశినేని నాని పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్‌ కో ఆర్డినేటర్‌గా వైవీ

డిప్యూటీ కో ఆర్డినేటర్‌గా మజ్జి శ్రీనివాసరావు





సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి, విశాఖపట్నం, అరకు, విజయనగరం, శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గాలకు వై.వి.సుబ్బారెడ్డిని రీజినల్‌ కో ఆర్డినేటర్‌గా నియమించారు. అలాగే అరకు పార్లమెంటు నియోజకవర్గంలోని సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు, దీంతోపాటు విజయనగరం, శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గాలకు మజ్జి శ్రీనివాసరావుని డిప్యూటీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌గా నియమించారు. పార్టీ అధ్యక్షుల నిర్దేశానుసారం రీజినల్‌ కో ఆర్డినేటర్‌ ఆధ్వర్యంలో డిప్యూటీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తారని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పేర్కొంది.

నీడనిచ్చిన కుప్పాన్ని కూడా..

చప్పరించేసారు

రాజకీయ భిక్ష పెట్టిన పురిటిగడ్డకు చంద్రబాబు నయవంచన



సీఎం వైఎస్‌ జగన్‌ చొరవతో పూర్తి అయిన కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌

సాక్షి, అమరావతి: కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ **ద్వారా కృష్ణా** జలాలను తరలించి సాగు, తాగునీరు **అందిస్తా**నని నమ్మబలికిన స్థానిక టీడీపీ **ఎమ్మెల్యే,** ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయు**డు ఆ** ముసుగులో ఖజానాను దోచేసి పనులు **చేయ**లేక చేతులెత్తేసి నయవంచనకు పాల్పడ్డా**రు!** తన కమీషన్ల కోసం సొంత నియోజకవర్గం కుప్పంను తాకట్టుపెట్టి నీచ రాజకీయం చేస్తున్నారు. బాబు ఇలా మోసం చేస్తే, 2022 సెప్టెంబరు 23న కుప్పం నియోజకవర్గ పర్యటన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి మే**లు** చేస్తున్నారు. పూర్తయిన కుప్పం బ్రాంచ్‌ **కెనా**ల్‌ను ఈ నెలలోనే సీఎం జగన్‌ ప్రారం**భించి** నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయ**నున్నారు.** ఇప్పటికే రామకుప్పం మండలం వర**కూ కృష్ణా** జలాలను తరలించారు. కుప్పం బ్రాం**చ్‌ కెనాల్‌** ద్వారా చెరువులు నింపి సమృద్ధిగా సాగు, **తాగునీరు** అందించనున్నారు.

> సీఎం జగన్‌ అధికారం చేపట్టాక ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కుప్పంను మున్సిపాల్టీని చేశారు. కుప్పం కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు చేశారు. మున్సిపాల్టీతోపాటు గ్రామాల్లో అంతర్గత రహదారులు, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ను పూర్తి చేసి కృష్ణా జలాలను అందించి సుభిక్షం చేస్తానని సీఎం జగన్‌ హామీ ఇచ్చారు. మాట నిలబెట్టుకుంటూ యుద్ధప్రాతిపదికన కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ పనులను పూర్తి చేయించారు. ఇప్పటికే కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ 74 కి.మీ. వరకూ అంటే రామకుప్పం మండలం మనేంద్రం గ్రామం వరకూ కెనాల్‌ నీటిని తరలించారు. చెరువులను నింపి సాగు, తాగునీరు అందించనున్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌..

పురిటిగడ్డకు ద్రోహం

సొంతూరు నారావారిపల్లె ఉన్న చంద్రగిరి నియోజకవర్గం నుంచి 1983 ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసిన చంద్రబాబు నాడు టీడీపీ అభ్యర్థి మేడసాని వెంకట్రామనాయుడి చేతిలో 17,429 ఓట్ల తేడాతో ఘోరంగా ఓడిపోయారు. ఆ దెబ్బకు 1985 ఎన్నికల్లో పోటీ చేయడానికే జంకిన చంద్రబాబు పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌ పంచన చేరి 1989లో తమిళనాడు, కర్ణాటక, రాష్ట్ర సరిహద్దుల్లోని కుప్పం నియోజకవర్గానికి వలస వెళ్లారు. అప్పటి నుంచి గూండాయిజం, నోట్ల కట్టలు, దొంగ ఓట్లతో నెగ్గుకొస్తున్నారు. దుర్భిక్ష రాయలసీమను సుభిక్షం చేయడానికి జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్సార్‌ చేపట్టిన హంద్రీ–నీవా సుజల స్రవంతిలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ ద్వారా సాగు, తాగునీరు అందిస్తానని చంద్రబాబు నమ్మబలికారు. హంద్రీ–నీవాలో అంతర్భాగమైన పుంగనూరు బ్రాంచ్‌ కెనాల్‌లో చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం అప్పినపల్లి (207.8 కిమీ వద్ద) నుంచి రోజుకు 216 క్యూసెక్కులను మూడు (పంప్‌ హౌస్‌లు) దశల్లో ఎత్తిపోసి 123.641 కి.మీ. పొడవున తవ్వే కాలువ ద్వారా తరలించి, 110 చెరువులను నింపడం ద్వారా కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 6,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 4.02 లక్షల మందికి తాగునీరు అందిస్తామని నమ్మించారు.

అంచనాల్లోనే రూ.120 కోట్ల లూటీ!

కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ను 123.641 కి.మీ. పొడవున తవ్వేందుకు 98,85,140 క్యూబిక్‌ మీటర్ల మట్టి పని, 3,84,457 క్యూబిక్‌ మీటర్ల కాంక్రీట్‌ పనులు చేయాలి. 2015–16 ఎస్‌ఎస్‌ఆర్‌ (స్టాండర్డ్‌ షెడ్యూల్డ్‌ రేట్స్‌) ప్రకారం క్యూబిక్‌ మీటర్‌ మట్టిపనికి రూ.89, క్యూబిక్‌ మీటర్‌ కాంక్రీట్‌ పనికి రూ.3 వేలు చొప్పున వ్యయం అవుతుంది. ఈ లెక్కన కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌లో మట్టి, కాంక్రీట్‌ పనులకు రూ.203.11 కోట్లు ఖర్చు అవుతుంది. మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం, మోటార్లు, ప్రెజర్‌మైన్లు, విద్యుత్‌ సరఫరా ఏర్పాటుకు రూ.90 కోట్ల వ్యయం అవుతుంది. 2015–16 ధరల ప్రకారం కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ పనులకు రూ.293.11 కోట్ల వ్యయం అవుతుంది. ఆ మేరకు జలవనరుల శాఖ అధికారులు 2015 మేలో అంచనాలు రూపొందించారు. కానీ అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడితో పనుల అంచనా వ్యయాన్ని రూ.413 కోట్లకు పెంచేశారు. అంటే టెండర్ల దశలోనే రూ.120 కోట్ల మేర పెంచేసినట్లు స్పష్టమవుతోంది.



సీఎం వైఎస్‌ జగన్‌ చొరవతో పూర్తి అయిన కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌

కడప టీడీపీ అధ్యక్షుడికి కానుక..

అంచనా వ్యయం పెంచేసిన పనులను కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఆర్‌.శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు కట్టబెట్టి రూ.120 కోట్లు కాజేయడానికి చంద్రబాబు స్కెచ్‌ వేశారు. ఆ మేరకు కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ పనులకు రూ.413 కోట్లు అంచనా విలువగా నిర్ణయించి 2015 ఆగస్టులో టెండర్లు పిలిచారు. ఆర్కే ఇన్‌ఫ్రా సంస్థకే పనులు దక్కేలా టెండర్లలో నిబంధనలు పెట్టారు. టెండర్లలో ఆ సంస్థ ఒక్కటే నాలుగు శాతం అధిక(ఎక్సెస్‌) ధరకు కోట్‌ చేస్తూ షెడ్యూలు దాఖలు చేసింది. నిబంధనల ప్రకారం ఒకే షెడ్యూలు (సింగిల్‌ బిడ్‌) దాఖలైతే ఆ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ పిలవాలి. కానీ చంద్రబాబు ఒత్తిడి మేరకు ఆర్కే ఇన్‌ఫ్రాకు 4 శాతం అధిక ధరకు రూ.430.26 కోట్లకు పనులు కట్టబెట్టారు. మొబిలైజేషన్‌ అడ్వాన్సుల కింద రూ.43 కోట్లు దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి వాటిని బాబు జేబులో వేసేశారు.

సీఎం రమేష్‌ పేచీతో చెరిసగం..

శ్రీనివాసరెడ్డికి భారీ ఎత్తున లబ్ధి చేకూర్చుతూ కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ పనులు కట్టబెట్టడంపై అప్పటి టీడీపీ ఎంపీ సీఎం రమేష్‌ పేచీ పెట్టారు.

పాలార్‌కు మోకాలడ్డు

కుప్పం నియోజకవర్గాన్ని సుభిక్షం చేయడమే లక్ష్యంగా జలయజ్ఞంలో భాగంగా కుప్పం మండలం గణేశపురం వద్ద పాలారు నదిపై 0.6 టీఎంసీల సామర్థ్యంతో రూ.55 కోట్ల వ్యయంతో రిజర్వాయర్‌ పనులను 2005లో దివంగత వైఎస్‌ రాజశేఖరరెడ్డి చేపట్టారు. ఈ రిజర్వాయర్‌ ద్వారా నాలుగు వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల మందికి తాగునీరు అందించేలా పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రిజర్వాయర్‌ పూర్తయితే కుప్పం నియోజకవర్గంలో తనకు రాజకీయంగా ఉనికి లేకుండా పోతుందని ఆందోళన చెందిన చంద్రబాబు తమిళనాడు ప్రభుత్వాన్ని రెచ్చగొట్టారు. పాలారు రిజర్వాయర్‌ నిర్మాణం వల్ల తమ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని, దాని నిర్మాణాన్ని నిలిపివేసేలా ఆంధ్రప్రదేశ్‌ను ఆదేశించాలంటూ తమిళనాడు ప్రభుత్వంతో సుప్రీం కోర్టులో రిట్‌ పిటిషన్‌ దాఖలు చేయించారు. పాలార్‌ రిజర్వాయర్‌ నిర్మాణాన్ని ఆపేయాలని సుప్రీం కోర్టు ఆదేశించడంతో అప్పట్లో ఆ పనులు ఆగిపోయాయి.

తనకు అత్యంత సన్నిహితుడైన సీఎం రమేష్‌ ఒత్తిడి చేయడంతో దిగివచ్చిన చంద్రబాబు చీకటి పంచాయతీ చేశారు. శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు 50 శాతం పనులు, మిగతా 50 శాతం పనులు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్‌ ప్రాజెక్ట్స్‌కు సబ్‌ కాంట్రాక్టు కింద ఇవ్వాలని ఆదేశించారు.

ప్రధాన కాంట్రాక్టర్‌పై వేటు.. 'సబ్‌'కే మొత్తం

చెరి సగం పనులు దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి, సీఎం రమేష్‌ క్యూబిక్‌ మీటర్‌కు రూ.40 చొప్పున మట్టి తవ్వకం పనులను సబ్‌ కాంట్రాక్టర్లకు ఇచ్చేసి భారీ లబ్ధి పొందుతూ వచ్చారు. వారి వద్ద నుంచి చంద్రబాబు ఎప్పటికప్పుడు కమీషన్లు వసూలు చేసుకుంటూ వచ్చారని టీడీపీ నేతలే అప్పట్లో ఆరోపించారు. తనతోపాటు శ్రీనివాసరెడ్డి భారీ ఎత్తున లబ్ధి పొందుతుండటాన్ని సహించలేని సీఎం రమేష్‌ మొత్తం పనులను తనకే కట్టబెట్టాలని మరోసారి పేచీకి దిగారు. దీంతో పనులన్నీ రిత్విక్‌ ప్రాజెక్ట్స్‌కే కట్టబెట్టాలని జలవనరుల శాఖను చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలో టెండర్‌ ద్వారా పనులు దక్కించుకున్న శ్రీనివాసరెడ్డిపై వేటు వేసి సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్‌ ప్రాజెక్ట్స్‌కే మొత్తం పనులు అప్పగించేశారు.

రూ.460.88 కోట్లు నీళ్ల పాలు..

కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌లో సీఎం రమేష్‌ సంస్థకు రూ.460.88 కోట్లను 2019 ఏప్రిల్‌ నాటికి ప్రభుత్వం బిల్లుల రూపంలో చెల్లించింది. అంటే కాంట్రాక్టు విలువ కంటే రూ.30 కోట్లు ఎక్కువగా చెల్లించినా పనులు పూర్తి కాలేదు. రూ.99.41 కోట్ల విలువైన పనులు మిగిలిపోయాయి. నాసిరకమైన పైపులు వేయడం వల్ల వర్షపునీటికే పగిలిపోయాయి. దీన్ని బట్టి కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ పనుల్లో సీఎం రమేష్‌తో కలిసి చంద్రబాబు ఏ స్థాయిలో దోపిడీకి పాల్పడ్డారో విశదం చేసుకోవచ్చు. వరుసగా ఏడు సార్లు గెలిపించిన కుప్పం ప్రజలకు సాగునీటి మాట దేవుడెరుగు గుక్కెడు తాగునీళ్లు కూడా అందించకుండా చంద్రబాబు నమ్మకద్రోహం చేశారు.

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపిక చేశారు. రాజమండ్రి లోక్‌సభ స్థానానికి డాక్టర్‌ గూడూరి శ్రీనివాస్‌(బీసీ)ను, గుంటూరుకు ఉమ్మారెడ్డి వెంకటరమణ, చిత్తూరుకు సిటింగ్‌ ఎంపీ ఎన్‌.రెడ్డప్పను ఎంపిక చేశారు. గత ఎన్నికల్లో మైలవరం శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఈ సారి సర్నాల తిరుపతిరావు యాదవ్‌(బీసీ)ను నియమించారు. గత ఎన్నికల్లో ఎమ్మిగనూరు శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు మాజీ ఎంపీ బుట్టా రేణుకను నియమించారు. మార్కాపురానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరుకు ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి, గంగాధరనెల్లూరు(ఎస్సీ)కు డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, నెల్లూరు సిటీకి ఎండీ ఖలీల్‌ను నియమించారు. వీరి నియామకంతో ఇప్పటివరకూ 63 శాసనసభ, 16 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను కొత్తగా నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయకర్తల్లో 21 మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 18 మంది బీసీలు, ఐదుగురు మైనార్టీలు, 16 మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 16 లోక్‌సభ స్థానాలకు నియమించిన సమన్వయకర్తల్లో బీసీలు తొమ్మిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు నలుగురు ఉన్నారు. ఈసారి వెలువరించిన జాబితాలో ఐదుగురు కొత్త వారు ఉండటం గమనార్హం.

గుంటూరు లోక్‌సభకు వెంకటరమణ

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానికి ఎంపికైన ఉమ్మారెడ్డి వెంకటరమణ వాస్తవానికి తొలిసారిగా బరిలో నిలవనున్నారు. పార్టీ సీనియర్‌ నాయకుడు, శాసన మండలి చీఫ్‌ విప్‌గా ఉన్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు ఈయన పెద్దకుమారుడు. 1961లో జన్మించిన ఈయన మాస్టర్‌ ఆఫ్‌ ఫిషరీస్‌ సైన్స్‌లో డిస్టింక్షన్‌లో పాస్‌ అయ్యారు. స్ట్రాటజిక్‌ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్‌ స్కూల్‌ బాధ్యతలు చూస్తున్నారు.

నర్సాపురం నుంచి తొలి బీసీ మహిళ

నర్సాపురం లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్తగా తొలిసారిగా బీసీ మహిళను ఎంపిక చేశారు. పశ్చిమగోదావరి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలైన గూడూరి ఉమాబాల పేరెన్నిక గన్న న్యాయవాది. న్యాయవాద విద్యలో బంగారు పతకం సాధించిన ఆమె న్యాయవాదిగా ఉంటూనే 1995 నుంచి భీమవరం మున్సిపల్‌ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 2001లో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌గా పోటీ చేశారు. అంతకుముందు కాంగ్రెస్‌ పార్టీలో జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా, జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శిగా, డీసీసీ ప్రధాన కార్యదర్శిగా, ఐఎస్‌ఆర్‌సీపీ మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా, ద్వారకాతిరుమల దేవస్థానం పాలకమండలి సభ్యురాలుగా కూడా వ్యవహరించారు.

ప్రజల నాడి పట్టగల డాక్టర్‌ శ్రీనివాస్‌

రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపిక చేసిన డాక్టర్‌ గూడూరి శ్రీనివాస్‌ స్వగ్రామం నరసాపురం. ఎంబీబీఎస్, డీఎల్‌ఓ (ఈఎన్‌టీ), ఎండీ (పల్మొనాలజీ) ఎఫ్‌సీసీపీ అభ్యసించిన ఈయన విజయ భారతి చెస్ట్‌ ఇన్‌స్టిట్యూట్‌లో శ్వాసకోశ నిపుణులుగా కొనసాగుతున్నారు. ఇప్పటివరకూ ఐఎంఏ సెక్రటరీగా, రాజమహేంద్రవరం ఏపీఎస్‌ఏ సెక్రటరీ ప్రెసిడెంట్‌గా, ఉమ్మడి తూర్పు గోదావరి ఇండియన్‌ చెస్ట్‌ సొసైటీ సభ్యునిగా వ్యవహరించారు. ఈయన భార్య గూడూరి రాధిక అడ్వొకేట్‌గా మాజీ కార్పొరేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయన 8 నెలల క్రితం వైఎస్సార్‌సీపీలో చేరారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగారు. అనంతరం ఆయన స్థానంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను నియమించి, ఈయన్ను రాజమహేంద్రవరం లోక్‌సభ సమన్వయకర్తగా నియమించారు. మృదుస్వభావిగా, వైద్యునిగా మంచి ఆదరణ పొందారు.

జెడ్పీటీసీకి నియోజకవర్గ బాధ్యతలు

ఎన్టీఆర్‌ జిల్లా మైలవరం శాసనసభ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన సర్నాల తిరుపతిరావు(బీసీ–యాదవ) ప్రస్తుతం జెడ్పీటీసీగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన 2013నుంచి రాజకీయాల్లో ఉన్నారు.

నెల్లూరు సిటీ నుంచి డిప్యూటీమేయర్‌

నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎండీ ఖలీల్‌ ప్రస్తుతం నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా వ్యవహరిస్తున్నారు. నెల్లూరు నగరం 43వ డివిజన్‌ పరిధిలోని జెండావీధి ప్రాంతంలోగల కంతర్షావలీ దర్గా సమీపంలో నివసిస్తున్న మహ్మద్‌గౌస్, మహ్మద్‌ జుబేదాబేగం దంపతుల ఏడుగురి సంతానంలో ఈయన చివరివాడు. డీవైఎఫ్‌ఐలో కొంతకాలం పనిచేసి, తరువాత సీపీఎంలో సభ్యుడిగా చేరారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్‌.రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4శాతం రిజర్వేషన్‌ కల్పించడంతో ఆయనకు అభిమానిగా మారారు. వైఎస్సార్‌ మరణం అనంతరం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలో చేరారు. 2013, 2021లో కార్పొరేటర్‌గా పోటీచేసి విజయం సాధించారు.

100 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే..

- ఆ దిశగా ప్రభుత్వం అడుగులు
- గతేడాది ఏప్రిల్‌ నుంచి డిసెంబర్‌ మధ్య 4.61 లక్షల ప్రసవాల నమోదు

సాక్షి, అమరావతి : గర్భిణులు ఆస్పత్రుల్లోనే బిడ్డకు జన్మనిచ్చేలా వైద్య శాఖ అడుగులేస్తోంది. ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు ఇప్పటికే సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 99.97 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే నమోదవుతున్నాయి. మిగిలిన 0.03 శాతాన్ని కూడా అధిగమించి వందకు వంద శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగేలా దృష్టి పెట్టారు. గతేడాది ఏప్రిల్‌ నుంచి డిసెంబర్‌ నెలాఖరు వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 4,61,700 జరగ్గా.. వీటిలో 99.97 శాతం 4,61,670 ఆస్పత్రుల్లోనే నిర్వహించారు. కేవలం 0.03 శాతం ఆస్పత్రులకు బయట ప్రసవాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో 26 జిల్లాలుండగా 21 జిల్లాల్లో వంద శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగాయి. తూర్పుగోదావరి(0.01), వైఎస్సార్‌(0.02), ఏఎస్‌ఆర్‌(1.25), ఏలూరు(0.01), శ్రీసత్యసాయి(0.03)%చొప్పున ప్రసవాలు ఆస్పత్రులకు వెలుపల జరిగాయి.

46 శాతం ప్రభుత్వాస్పత్రుల్లోనే..

గత ప్రభుత్వంలో రాష్ట్రంలో జరిగిన మొత్తం ప్రసవాల్లో 30–35 శాతం ప్రసవాలు ప్రభుత్వాస్పత్రుల్లో ఉండేవి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచింది. అవసరమైన వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేపట్టింది. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం జరిగితే కలిగే ప్రయోజనాలపై ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. గతేడాది ఏప్రిల్‌ నుంచి డిసెంబర్‌ నెలాఖరు మధ్య 4.61 లక్షల ప్రసవాలు జరగ్గా.. వీటిలో 46 శాతం 2.12 లక్షలు ప్రభుత్వాస్పత్రుల్లోనే నమోదయ్యాయి. ఏఎస్‌ఆర్‌ జిల్లాలో వంద శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేపట్టారు. పార్వతీపురం మన్యంలో 87.34 శాతం, అనకాపల్లిలో 81.99 శాతం ప్రసవాలు ప్రభుత్వాస్పత్రుల్లోనే జరిగాయి.

మాతృ మరణాల కట్టడే లక్ష్యంగా

రాష్ట్రంలో మాతృ మరణాల కట్టడి లక్ష్యంగా తొలి నుంచి సీఎం జగన్‌ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో గర్భం దాల్చిన మహిళలను ఆర్‌సీహెచ్‌ పోర్టల్‌లో రిజిస్టర్‌ చేయడం దగ్గర్నుంచి వారికి ప్రసవానికి ముందు, తర్వాత అవసరమైన వైద్య సేవలు అందేలా చూడటం, పౌష్టికాహారం అందించడం.. ఇలా బిడ్డకు జన్మనిచ్చి క్షేమంగా ఇంటికి చేరుకునే వరకూ ప్రతి అడుగులో చేయి పట్టి ముందుకు నడిపిస్తోంది. ఆరోగ్యశ్రీ కింద ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో సైతం ఉచితంగా ప్రసవాలు నిర్వహించడం, ఆరోగ్య ఆసరా కింద ప్రసవానంతరం విశ్రాంత సమయానికి రూ.5 వేల చొప్పున జీవన భృతి అందించడం వంటివి చేస్తోంది. ఇక ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించిన మహిళలను వైఎస్సార్‌ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ వాహనాల్లో క్షేమంగా ఇంటికి చేరుస్తున్నారు. రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలున్న హైరిస్క్‌ గర్భిణులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

టిడ్కో ఇళ్లవద్ద జగనన్న మహిళా మార్టులు

తొలివిడతలో 21 ప్రాంతాల్లో ఏర్పాటు

సాక్షి, అమరావతి: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పట్టణ మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్టులు టిడ్కో సముదాయాల్లోను ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు టిడ్కో, మెప్మా సంయుక్తంగా ఏర్పాట్ల ప్రక్రియను ప్రారంభించాయి. తొలి విడతలో ఎంపిక చేసిన 21 పట్టణ స్థానిక సంస్థల్లోని (యూఎల్బీల్లోని) టిడ్కో నివాసాల వద్ద ఏర్పాటు చేయనున్నారు. వీటికి అదనంగా ఆయా ప్రాంతాల్లో స్థానికుల అవసరాల కోసం కమ్యూనిటీ హాళ్లను సైతం మెప్మా నిర్మించనుంది. ఇందుకోసం ఇళ్ల ప్రాంగణాల్లో టిడ్కో విభాగం వెయ్యి చదరపు గజాల స్థలం కేటాయిస్తోంది. ఇక్కడ రెండంతస్తుల భవనం నిర్మించనున్నారు. మొదటి అంతస్తులో జగనన్న మహిళా మార్టు ఏర్పాటుచేసి, రెండో అంతస్తును కమ్యూనిటీ హాల్‌కు కేటాయించనున్నారు. దీంతో దాదాపు నాలుగువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మార్టు, కమ్యూనిటీ హాల్‌ అందుబాటులోకి రానున్నాయి. వీటి నిర్మాణానికి టెండర్‌ ప్రక్రియ దాదాపు పూర్తయింది. రాష్ట్రంలో 88 యూఎల్బీల్లో 163 ప్రాంతాల్లో ప్రభుత్వం టిడ్కో ఇళ్లు నిర్మిస్తోంది. ఇప్పటికే దాదాపు లక్ష ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసింది. నివాసితుల్లో ఎక్కువమంది మెప్మా సభ్యులే. వారికి ఉపాధితో పాటు ఆదాయ మార్గాలను కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో ఇళ్ల పంపిణీ పూర్తయినచోట మార్టులు, కమ్యూనిటీ హాళ్లు రానున్నాయి. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక వాటి నిర్వహణను స్థానిక టిడ్కో నివాసితులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకే అప్పగించనున్నారు.

11 పట్టణాల్లో జేఎంఎంలు విజయవంతం

మున్సిపల్‌ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు, ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందిస్తున్న మెప్మాలో దాదాపు 24 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్నారు. మూడేళ్ల కిందట పులివెందుల మున్సిపాలిటీలో దేశంలోనే తొలిసారిగా సంఘసభ్యులే వాటాదారులుగా జగనన్న మహిళా మార్టు (జేఎంఎం) ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎనిమిదివేలమంది సభ్యులు రూ.150 చొప్పున పెట్టుబడిగా పెట్టారు. మొత్తం మార్టు నిర్వహణ, సరుకుల కొనుగోలు వంటి సమస్త అంశాలను వారే నిర్వహించుకునేలా మెప్మా శిక్షణ ఇచ్చింది. వచ్చిన లాభాలు సైతం వారే తీసుకుంటున్నారు. పులివెందులలో పైలట్‌ ప్రాజెక్టుగా ప్రారంభించిన మార్టు విజయవంతం కావడంతో మరో 10 యూఎల్బీల్లో జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించడంతో పాటు వచ్చిన లాభాలను సైతం వారే పంచుకుంటున్నారు. ఇది దేశంలోనే ఎంతో విజయవంతమైన ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం నుంచి 'స్పార్క్‌' అవార్డుతో పాటు రూ.20 కోట్ల బహుమతిని సైతం సాధించింది. ఇప్పుడు ఇదే తరహాలో టిడ్కో ప్రాంగణాల్లో జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడతలో 21 ప్రాంతాల్లో ఏర్పాటు చేసే మహిళా మార్టుల్లో పట్టణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ.150 చొప్పున మూలధనం వాటాగా పెట్టుబడి పెట్టనున్నారు.

సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

సంబరంగా ఊరూరా 'వైఎస్సార్ ఆసరా'

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో కొనసాగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగిన 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాల పేరిట మహిళలకు బ్యాంకుల్లో ఉండే అప్పు మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో నేరుగా వారికి అందజేస్తున్న నేపథ్యంలో.. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకాలు చేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తంచేస్తున్నారు. బ్యాంకర్ల సంఘం (ఎస్ఎల్‌బీసీ) గణాంకాల ప్రకారం.. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి 78,94,169 మంది మహిళల పేరిట రూ.25,570.80 కోట్లు పొదుపు సంఘాల రుణాలు ఉండగా.. జగన్ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటికే మూడు విడతల్లో రూ.19,175.97 కోట్లను ఆయా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. ప్రస్తుతం నాలుగో విడత కింద మిగిలిన రూ.6,394.83 కోట్లను కూడా నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తున్నారు. ఈ సందర్భంగా మండలాలు, మున్సిపాలిటీల వారీగా జరుగుతున్న కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు హాజరవుతున్నారు. వీరికి పొదుపు మహిళలు వివిధ రూపాల్లో అఖండ స్వాగతం పలుకుతున్నారు. ఇక వైఎస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీకి సంబంధించి ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 231 మండలాల్లోని లబ్ధిదారులతో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. మరో 81 మున్సిపల్, నగర పాలిక వార్డుల్లోనూ స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో లబ్ధిదారులతో ముఖాముఖీ సమావేశాలు జరిగాయి.

టెలీ మెడిసిన్ హబ్‌ల్లో 12 వైద్య పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని టెలీ మెడిసిన్ హబ్‌ల్లో 12 వైద్య పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 10లోగా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. http:// apmsrb.ap.gov.in/msrb/ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచారు. పూర్తి నోటిఫికేషన్‌ను https://dme.ap.nic.in, http://apmsrb.ap.gov.in/msrb/ వెబ్‌సైట్స్‌లో చూడవచ్చు.

తుది దశకు కులగణన

90 శాతం కుటుంబాల వివరాలు నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చరిత్రాత్మకంగా కొనసాగుతున్న కులగణన ప్రక్రియ తుది దశకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 1,50,66,681 కుటుంబాలకు సంబంధించి మొత్తం నాలుగు కోట్ల మందికిపైగా సభ్యుల వివరాల నమోదు ఇప్పటికే పూర్తయినట్టు గ్రామ వార్డు సచివాలయాల అధికారులు వెల్లడించారు. శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 90% కుటుంబాలకు పైబడి వివరాల నమోదు పూర్తయినట్టు వారు చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన ప్రక్రియను గ్రామ వార్డు సచివాలయాల వారీగా కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 4 వరకు సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని కొనసాగించడానికి గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత కూడా మిగిలిపోయిన కుటుంబాల వారు తమ వివరాలను వారి గ్రామ వార్డు సచివాలయాలకు వెళ్లి నమోదు చేసుకునేందుకు ఫిబ్రవరి 7 వరకు అవకాశం కల్పించింది.

10న విశాఖలో ఏఐ అండ్ క్లౌడ్ సమ్మిట్

డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ ప్రతినిధుల వెల్లడి



మాట్లాడుతున్న శ్రీధర్ కొసరాజు, ఆనంద్ కృష్ణన్, రవిచంద్ర

సాక్షి, విశాఖపట్నం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్‌పై రాష్ట్ర యువతకు అవకాశాలు కల్పించేందుకు విశాఖలో ఏఐ అండ్ క్లౌడ్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ చైర్మన్, వ్యవస్థాపకుడు శ్రీధర్ కొసరాజు తెలిపారు. డీటీఎన్ఎఫ్ ప్రతినిధులు ఆనంద్ కృష్ణన్, రవిచంద్రతో కలిసి శుక్రవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడారు. కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగంలో దేశంలో అపారమైన అవకాశాలున్నాయని, అయితే కావల్సిన నైపుణ్య అభ్యర్థుల్లేరన్నారు. దేశంలో 10 మంది డేటా సైన్స్ ఇంజినీర్స్ అవసరం కాగా.. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే దొరుకుతున్నారని చెప్పారు. భవిష్యత్తులో అపారమైన అవకాశాలు పెరగనున్న నేపథ్యంలో యువతని అప్రమత్తం చేసేందుకు విశాఖలో ఈ నెల 10 న ఏఐ వక్లౌడ్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్), డీప్‌టెక్ సమ్మిట్స్ సంయుక్తంగా వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో పలు అంతర్జాతీయ సంస్థలకు చెందిన చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్లు, ఐటీ నిపుణులు, ప్రొఫెసర్లు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు, ఇంక్యుబేటర్స్, డీప్‌టెక్ కెరీర్ ఆశావహులు, విద్యార్థులు, కృత్రిమ మేధ, క్లౌడ్ టెండర్ నిపుణులు, సంస్థలు పాల్గొంటాయని వివరించారు. ఇప్పటి వరకూ 240కి పైగా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని తెలిపారు. ఐటీ, ఐటీ అనుబంధ పరిశ్రమల్లో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితి ఈ ఏడాది చివరికి సద్దుమణిగే అవకాశం ఉందన్నారు.

మద్యం కుంభకోణం దర్యాప్తులో సీఐడీ దూకుడు

- కీలక పాత్రధారుల విచారణకు సీఐడీ సన్నద్ధం
- నిందితులుగా చంద్రబాబు, కొల్లు రవీంద్ర, అప్పటి ఎక్సైజ్ కమిషనర్ ఐఎస్ నరేష్ తదితరులు
- మద్యం కొనుగోళ్లపై ప్రివిలేజ్ ఫీజు తొలగింపు
- అడ్డగోలుగా కథ నడిపిన చంద్రబాబు అండ్ కో



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో సీఐడీ దూకుడు పెంచింది. చీకటి జీవోలతో అస్మదీయ కంపెనీలకు అడ్డగోలుగా మద్యం కాంట్రాక్టులు కట్టబెట్టి ఏటా రూ.1,300 కోట్లు కొల్లగొట్టిన చంద్రబాబు ముఠా అవినీతిపై దర్యాప్తు వేగవంతం చేస్తోంది. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీఐడీ ఈ కుంభకోణం సూత్రధారులు, పాత్రధారులు ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన తీరుపై కీలక ఆధారాలు సేకరించింది. దాంతో ఈ కుంభకోణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమేయం ఉన్నవారికి త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించాలని నిర్ణయించింది. ఈ కేసులో ఇప్పటికే టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ కమిషనర్ ఐఎస్ నరేష్ తదితరులపై ఐపీసీ సెక్షన్లు: 166, 167, 409, 120 (బి) రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 13 (1),(డి), రెడ్ విత్ 13(2) కింద సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

నోట్ ఫైళ్లు, చీకటి జీవోల గుట్టురట్టు: రాష్ట్రంలో 2012 నుంచి అమలులో ఉన్న మద్యం కొనుగోళ్లపై ప్రివిలేజ్ ఫీజును తొలగించి అస్మదీయ కంపెనీలకు ప్రయోజనం కలిగించేందుకు అడ్డగోలుగా కథ నడిపిన తీరుపై సీఐడీ కీలక ఆధారాలు సేకరించింది. ప్రివిలేజ్ ఫీజును కొనసాగించడంతోపాటు 10 రెట్లు పెంచాలని అప్పటి ఎక్సైజ్ శాఖ కమిషనర్ నోట్ ఫైల్ పంపారు. దానిపై కేబినెట్‌లో చర్చించలేదు. కానీ కేబినెట్ సమావేశం ముగిసిన రోజే సాయంత్రం మళ్లీ అదే ఎక్సైజ్ కమిషనర్ ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలనే ప్రతిపాదనతో నోట్ ఫైల్ పంపారు. 'కాపీ టు పీఎస్ టు సీఎం'అని స్పష్టంగా పేర్కొంటూ ఆ నోట్ ఫైల్ పంపడం గమనార్హం. ఆ వెంటనే డిస్టిలరీలకు ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ టీడీపీ ప్రభుత్వం 2015 జూన్ 22న సాయంత్రం గుట్టుగా జీవో 218 జారీ చేసింది. అంటే కేబినెట్‌కు తెలియకుండానే వ్యవహారం నడిపింది. బార్లకు ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ 2015 సెప్టెంబరు 1న సర్క్యులర్ జారీ చేసింది. అయితే, ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలని కోరతూ బార్ల యజమానుల సంఘం 2015 సెప్టెంబరు 9న వినతిపత్రం సమర్పించినట్టు చూపించడం గమనార్హం. అంటే బార్ల యజమానుల నుంచి వినతి పత్రం రాకముందే ఆ ఫీజును రద్దు చేయాలని ప్రతిపాదిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. దాన్ని రాటిఫై చేసేందుకు అన్నట్టుగా లేని వినతి పత్రాన్ని ఒకదానిని సృష్టించారు. అక్రమాన్ని కప్పిపుచ్చుకునేందుకు బార్ల యజమానుల పేరిట ఇలా లేఖను సృష్టించినట్టు సీఐడీ గుర్తించింది. అనంతరం బార్లపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేస్తూ 2015 డిసెంబర్ 11న జీవో 468 జారీ అయింది. అందుకు సంబంధించిన నోట్ ఫైళ్లపై ఎక్సైజ్ శాఖ మంత్రి హోదాలో కొల్లు రవీంద్ర 2015 డిసెంబర్ 3న సంతకం చేయగా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు 2015 డిసెంబర్ 4న డిజిటల్ సంతకాలు చేయడం వారి పన్నాగానికి నిదర్శనం. మరోపక్క డిస్టిలరీలకు అడ్డగోలుగా అనుమతులు జారీ చేయడమే కాకుండా, అప్పటివరకు లేని మద్యం బ్రాండ్లను ప్రవేశపెట్టారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.1,300 కోట్ల మేర గండిపడిందని 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)' ఆధ్వర్యంలో స్వతంత్రంగా విధులు నిర్వర్తించే ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ నివేదించారు. చంద్రబాబు సర్కారు నిర్వాకంతో రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.1,300 కోట్లు నష్టం వాటిల్లిందని స్పష్టం చేశారు. ఈ మొత్తం బాగోతంపై గురించి సీఐడీ కీలక ఆధారాలు సేకరించింది.

ఇక నిందితుల విచారణే

మద్యం కుంభకోణంపై కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ, అందులో పాత్రధారులు, సూత్రధారులను విచారించేందుకు ఉపక్రమిస్తోంది. దీనిపై ఇప్పటికే న్యాయ సలహా తీసుకుంది. ప్రధానంగా నోట్‌ఫైళ్లు, ఇతర ఆధారాలను సేకరించింది. ఒకే రోజులో పరస్పర విరుద్ధంగా నోట్‌ఫైళ్లు రూపొందించడం, ప్రివిలేజ్ ఫీజు రద్దు చేసిన తరువాత కూడా బార్ల యజమానుల పేరిట వినతిపత్రాన్ని రికార్డుల్లో చేర్చిన పన్నాగాన్ని ఛేదించనుంది. అందుకోసం త్వరలోనే నిందితులకు నోటీసులు జారీ చేయనుంది. నిందితుల విచారణకు ప్రశ్నావళిని కూడా సిద్ధం చేసింది. ఈ వ్యవహారంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు కీలకంగా వ్యవహరించారని గుర్తించింది. వారికీ నోటీసులు జారీ చేయనుంది. మద్యం కంపెనీల ప్రతినిధులతోపాటు కీలక ఉన్నతాధికారులను విచారించేందుకు సిద్ధపడుతోంది. ఆ విచారణ ద్వారా గుర్తించిన అంశాలను సమీక్షించిన తరువాత కేసు దర్యాప్తుపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు.

ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయండి

- పోలింగ్ స్టేషన్లు, మౌలిక వసతుల ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయండి
- జిల్లా ఎన్నికల అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎన్నికల సంసిద్ధత, ఓటర్ల జాబితా నవీకరణపై సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ప్రకటన, నోటిఫికేషన్ జారీకి ఎక్కువ సమయం లేదని, ఈలోపే పోలింగ్ స్టేషన్లు, మౌలిక వసతులను పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ నెల 5వ తేదీకల్లా ర్యాంపుల నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులనే తప్పనిసరిగా నియమించాలని, సకాలంలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ పూర్తి చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రం పరిసరాల్లోనూ వెబ్ టెలికాస్టింగ్

జిల్లాల వారీగా ఉన్న సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. సున్నితమైన, సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లలతో పాటు 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లకు తప్పనిసరిగా వెబ్ టెలీకాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. వెబ్ కాస్టింగ్‌పై తాత్కాలిక నివేదికను వెంటనే పంపాలన్నారు. ప్రతి జిల్లాలో కనీసం 50 శాతం పోలింగ్ స్టేషన్లు వెబ్ టెలీకాస్టింగ్‌లో కవర్ అవ్వాలని, ఇది పోలింగ్ స్టేషన్‌కే పరిమితం కాకుండా చుట్టు ప్రక్కల ఉన్న ప్రాంతాలు కూడా కవర్ అవ్వాలని తెలిపారు. ప్రాంతాల వారీగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల మ్యాపింగ్ కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు.

వచ్చే సోమవారానికల్లా ఎన్నికల నిర్వహణ ముసాయిదా పంపాలి

ప్రతి జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక ముసాయిదా ప్రతిని వచ్చే సోమవారానికల్లా తమ కార్యాలయానికి పంపాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సమన్వయంతో అక్రమ నగదు, లిక్కరు, ఇతర నిషేధిత సామగ్రి రవాణాపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. కేవలం రాష్ట్ర సరిహద్దుల్లోనే కాకుండా జిల్లాల్లోనూ అక్రమ కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలను తమకు సకాలంలో పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, డిప్యూటీ సీఈవోలు ఎస్.మల్లిబాబు, కె.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

9న విశాఖలో నేషనల్ స్కిల్ కాన్‌క్లేవ్

పోస్టర్ విడుదల చేసిన నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యువత అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. దీన్లో భాగంగా ఫిబ్రవరి 9న విశాఖ వేదికగా నేషనల్ స్కిల్ కాన్‌క్లేవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో ఈ కాన్‌క్లేవ్‌కు చెందిన ఫ్లయర్‌ను బుగ్గన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఇండస్ట్రీ 4.0, వర్చువల్ రియాలిటీ మొదలైన కోర్సుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని ఆయన తెలిపారు. దీనికి అనుగుణంగా అంతర్జాతీయ పరిశ్రమలను అనుసంధానం చేయడం కోసం విశాఖ వేదికగా ఫిబ్రవరి 9న నేషనల్ స్కిల్ కాన్ క్లేవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ విభాగాల్లో నైపుణ్యం కలిగిన ఐఐటీ ప్రొఫెసర్లు, ఇండస్ట్రీ నిపుణులు, ఐఏఎస్ అధికారులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ఎస్ సురేశ్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్రంలో యువతకు అందించిన శిక్షణ, భవిష్యత్తు అవసరాలకు సంబంధించిన పరిశ్రమల డిమాండ్, వాటి కోర్సులు, అకడమిక్-ఇండస్ట్రీ మధ్య వ్యత్యాసాన్ని ఎలా తగ్గించాలి, పరిశ్రమలకు అనుసంధానంగా స్కిల్ కోర్సులు రూపొందించడం వంటి వాటిపై ఈ కాన్‌క్లేవ్‌లో చర్చిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో డాక్టర్ వినోద్ కుమార్, ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ నవ్య, సీడాప్ సీఈవో ఎం.కె.వి శ్రీనివాసులు పాల్గొన్నారు.

జపాన్ ఆటోమోటివ్ ఎక్స్‌పోలో మెరిసిన శ్రీసిటీ

శ్రీసిటీ (వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): దేశంలోని ప్రముఖ పారిశ్రామిక నగరం శ్రీసిటీ, గతవారం జపాన్‌లోని టోక్యోలో జరిగిన ఆటోమోటివ్ వరల్డ్-2024లో పాల్గొని, ప్రపంచస్థాయిలో ప్రధాన వ్యాపార గమ్యస్థానంగా తన ప్రాధాన్యతను చాటుకుంది. ఈ ఎక్స్‌పోలో తాము రూపొందించుకున్న మార్కెటింగ్ సూత్రాలు, ప్రణాళికల మేరకు శ్రీసిటీ మార్కెటింగ్ బృందం, ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న పెట్టుబడిదారులకు ఇచ్చిన సమగ్ర వివరణ, శ్రీసిటీపై ఆసక్తి పెంచింది. ఎలక్ట్రిక్ వాహనాలు, అటానమస్ డ్రైవింగ్, కనెక్టెడ్ కార్ల అత్యాధునిక పురోగతిని ఈ కార్యక్రమంలో ప్రదర్శన ఇచ్చారు. దేశంలో రెండో అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా, పలు ప్రత్యేకతలను హైలైట్ చేస్తూ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ అందరి దృష్టిని ఆకర్షించింది. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) గోపీకృష్ణ స్టాల్ సందర్శకులకు శ్రీసిటీ అగ్రశ్రేణి మౌలిక సదుపాయాలు, వేగవంతమైన అభివృద్ధి, శ్రీసిటీ హబ్‌లో తయారీ యూనిట్లను స్థాపించడం వల్ల కలిగే వివిధ ప్రయోజనాలను వివరించారు. ఈ ఎక్స్‌పోలో తమ భాగస్వామ్యం విజయవంతమైందంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో వ్యాఖ్యానించారు. ఈ భాగస్వామ్యం శ్రీసిటీ మరింత పారిశ్రామిక అభివృద్ధికి, ప్రత్యేకించి ఆటోమోటివ్ తయారీ రంగంలో నిరంతర వృద్ధికి దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


స్టాల్‌లో సందర్శకులతో శ్రీసిటీ మార్కెటింగ్ అధికారులు, మసనోరి నకనో

రైల్వే శాఖకు నెల కిందటే భూమి అప్పగించాం

- రైల్వే భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేసినట్టు డీఆర్ఎంకు వివరించాం
- రైల్వే అథారిటీకి సమాచారమిచ్చాం
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి జాప్యమూ లేదు: మీడియాతో జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున



సాక్షి, విశాఖపట్నం: దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ఆలస్యమవ్వడానికి కారణం విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన భూమి ఇంకా రైల్వే శాఖకు అందలేదంటూ వస్తున్న కథనాలు పూర్తి అవాస్తవమని జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున స్పష్టం చేశారు. ఆయన చాంబర్‌లో శుక్రవారం ఉదయం మీడియాతో మాట్లాడి దీనికి సంబంధించిన సమగ్ర వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు డిసెంబర్ మొదటి వారంలో చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన సమీక్షలో తనతో పాటు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, రైల్వే డీఆర్ఎం, ఇతర అధికారులు పాల్గొన్నారని తెలిపారు. రైల్వే శాఖకు ఇవ్వాల్సిన స్థలానికి సంబంధించిన స్థితిగతుల్ని అడిగి తెలుసుకుని వీలైనంత త్వరగా భూమిని అప్పగించాలని ఆదేశించినట్టు కలెక్టర్ వివరించారు. అనంతరం .. అక్కడ ఉన్న ఆక్రమణల్ని తొలగించి.. స్థానికులతో సంప్రదింపులు చేసి.. సమస్యల్ని పూర్తిస్థాయిలో పరిష్కరించి తమ ఆధీనంలోకి తీసుకుని భూముల హద్దుల్ని గుర్తించామన్నారు. మొత్తం స్థలానికి కంచె కూడా వేసినట్టు కలెక్టర్ తెలిపారు. రైల్వేకు ఇవ్వాల్సిన 52.22 ఎకరాల భూమిని క్లియర్ టైటిల్‌తో సిద్ధం చేశామని, వీలైనంత త్వరగా హ్యాండోవర్ చేసుకోవాలని వాల్తేరు డీఆర్ఎంకు జనవరి 2న జీవీఎంసీ కమిషనర్ లేఖ ద్వారా స్పష్టం చేసినట్లు డా.మల్లికార్జున తెలిపారు. అనంతరం ఇదే లేఖను రైల్వే అథారిటీకి కూడా పంపించినట్లు తెలిపారు. ఆ తర్వాత కూడా ఐదారు సార్లు ఫోన్ కాల్స్ ద్వారా కూడా సమాచారం అందించామని, కానీ ఇంతవరకూ ఆ స్థలం గురించి రైల్వే అధికారులెవ్వరూ సంప్రదించలేదన్నారు. ముడసర్లోవలో అప్పగించాల్సిన భూమి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి పొరపాటు లేదని కలెక్టర్ డా.మల్లికార్జున స్పష్టం చేశారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : సీఎస్

సాక్షి, అమరావతి: వేసవిలో గ్రామాలు, ఆవాసాల్లో తాగునీటికి ఇబ్బంది కలగకుండా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సీఎస్ డా.కెఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన కరువు, విపత్తుల నిర్వహణ చర్యలపై అధికారులతో సమీక్షించారు. మంచినీటి పథకాలు, ఇతర తాగునీటి వనరులన్నిటినీ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రహదారుల మరమ్మతులు వేగంగా చేపట్టేందుకు త్వరలోనే నిధులు కేటాయిస్తామన్నారు. మిచాంగ్ తుఫాన్ తరువాత ఎక్కడైనా పశువులకు దాణా కొరత ఉందా అని ఆరా తీయగా కొరత లేదని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది వివరించారు. మిచాంగ్ తుపాన్‌లో పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర పరిహారానికి సంబంధించి నిధులు ఈనెలలో వస్తాయన్నారు. కరువు ప్రభావిత మండలాలు, ఇతర ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

కొమ్మి.. అమీతుమీ

భువనేశ్వరి పర్యటనలో అవమానం

- ఆనంపై విరుచుకుపడ్డ మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలకు ఘోర అవమానాలు తప్పడం లేదు. కష్టకాలంలో పార్టీ అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, గూటూరు కన్నబాబులకు మరోసారి పరాభవం జరిగింది. తాజాగా నారా భువనేశ్వరి పర్యటన సందర్భంగా మరోసారి ఆ ఇద్దరు నేతలకు ఆహ్వానం అందలేదు. పార్టీని నమ్ముకున్నందుకు తమకు సరైన గుణపాఠం చెప్పారంటూ ఆనం వర్గంపై కొమ్మి లక్ష్మయ్య నాయుడు బహిరంగంగానే తిట్ల దండకం అందుకున్నారు. ఇక తాడో పేడో తేల్చుకుంటామని హెచ్చరిక జారీ చేశారు.

నేనేంటో చూపిస్తా: కొమ్మి

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని అల్లిపురంలో పర్యటించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి.. టీడీపీ సీనియర్ నేత గూటూరు కన్నబాబుకు ఆహ్వానం పంపలేదు. కొమ్మి లక్ష్మయ్యనాయుడుకు ఆహ్వానం పంపకపోయినా వచ్చారు. కార్యక్రమం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎక్కడా కొమ్మి, కన్నబాబు ఫొటోలు కన్పించలేదు.


ఫ్లెక్సీలో తన ఫొటో లేకపోవడంపై కౌన్సిలర్ శ్రీనివాసులును ప్రశ్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మయ్యనాయుడు

దీంతో కోపోద్రిక్తుడైన కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఆనం అనుచరులపై తిట్ల దండకం ప్రారంభించారు. గత నాలుగు నెలలుగా పార్టీని పాడెపై పెట్టారంటూ మండిపడ్డారు. టికెట్ ఖరారు కాకముందే అభ్యర్థిగా ఆనం విర్రవీగుతున్నారంటూ మండిపడ్డారు. తమను పొమ్మనలేక పొగబెడుతున్నారా? అని మండిపడ్డారు. ఇక తామేంటో చూపిస్తామంటూ రెచ్చిపోయారు. కొమ్మిని కూల్ చేసేందుకు కొందరు టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలు ప్రయత్నించినా ఆయన శాంతించలేదు.

లోకేశ్ పాదయాత్రలోనూ అవమానం

నారా భువనేశ్వరిని కలిసేందుకు కొమ్మి లక్ష్మయ్యనాయుడు వెళ్లగా ఆమె వ్యక్తిగత సిబ్బంది అడ్డుకున్నారు. లోపలికి వెళ్లేందుకు ససేమిరా అనడంతో కొమ్మి మరింత రెచ్చిపోయారు. తాను మాజీ ఎమ్మెల్యేనని గద్దించి మాట్లాడడంతో చివరికి ఆయనను లోపలికి పంపారు. గతంలో కూడా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇలాంటి అవమానమే జరిగింది. లోకేశ్ బసచేసే ప్రాంతానికి కొమ్మిని వెళ్లకుండా అడ్డుకోవడంతో వెనుదిరగాల్సి వచ్చింది.

వలస నేతలకు రెడ్‌కార్పెట్

ఆత్మకూరులో ఎన్నికల సమయంలో వలస నేతలు లేదా పారిశ్రామికవేత్తలను టీడీపీ రంగంలోకి దింపడం.. వారు ఓడిపోవడం కామన్.. మళ్లీ ఎన్నికలొచ్చేవరకు వారు నియోజకవర్గం ముఖం చూడడం లేదు. ప్రతిసారి ఇదే రిపీటవుతుంది. స్థానికంగా బలమైన నేతలున్నా వారిని ఎన్నికల సమయంలో కరివేపాకులా వాడుకుని వదిలేయడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు.

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో బాబు, రామోజీ దిట్ట

- తెలంగాణలో అయితే తప్పించుకోవచ్చనే సుప్రీంకోర్టును ఆశ్రయించిన రామోజీ
- రామోజీరావుపై ఫైర్ అయిన వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఏపీలో మార్గదర్శి కేసు విచారణ జరిగితే తనకు శిక్షపడడం ఖాయమనే భయంతోనే రామోజీరావు తెలంగాణ కోర్టులో విచారణ చేయాలని సుప్రీంకోర్టుని ఆశ్రయించాడని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి మండిపడ్డారు. విశాఖపట్నం గాజువాకలో శుక్రవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రామోజీరావు తనకు ఆరోగ్యం బాలేదని బెడ్‌మీద పడుకుని యాక్టింగ్ చేస్తూ చంద్రబాబు డైరెక్షన్‌లో జీవిస్తున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, రామోజీరావు ఇద్దరూ వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట అని విమర్శించారు. మార్గదర్శి పేరుతో ప్రజలను మోసం చేస్తున్న రామోజీరావు విచారణ జరిగితే జైలు శిక్ష ఖాయమనే ఆయన పత్రికలో తప్పుడు రాతలు రాయిస్తున్నాడని మండిపడ్డారు. న్యాయస్థానాలపై తమకు గౌరవం, నమ్మకం ఉన్నాయని, తప్పుచేసిన రామోజీరావుకు శిక్ష పడక తప్పదని పేర్కొన్నారు.

వీఆర్ఏలకు రూ.500 డీఏ మంజూరు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్ఏలు) రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చంద్రబాబు పాలనలో వీఆర్ఏలకు రద్దు చేసిన డీఏను పునరుద్ధరించింది. ఇక నుంచి వీఆర్ఏలకు రూ.500 డీఏ చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం జీవో ఎంఎస్ నంబర్ 40 జారీ చేసింది. వీఆర్ఏలకు గతంలో రూ.300 డీఏ ఇచ్చేవారు. చంద్రబాబు హయాంలో దాన్ని రద్దు చేశారు. దీంతో తిరిగి తమ డీఏను పునరుద్ధరించాలని వీఆర్ఏలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... డీఏను పునరుద్ధరించడమే కాకుండా, దానిని రూ.300 నుంచి రూ.500కి పెంచి ఇవ్వాలని నిర్ణయించారు. ఆయన ఆదేశాల ప్రకారం డీఏ పెంపునకు సంబంధించిన జీవో కూడా జారీ చేశారు. రాష్ట్రంలో సుమారు 19,500 మంది వీఆర్ఏలు పనిచేస్తున్నారు. వారందరికీ మేలు చేకూరేలా సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారు.

సీఎంకు ఉద్యోగ సంఘాల కృతజ్ఞతలు

వీఆర్ఏలకు డీఏ మంజూరు చేయడం పట్ల సీఎం వైఎస్ జగన్‌కు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్ఏల డీఏ కోసం తమ సంఘం తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసి విన్నవించామని, తమ అభ్యర్థన మేరకే సీఎం స్పందించారని ఆయన తెలిపారు. వీఆర్ఏలు ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని సీఎం జగన్ నిలబెట్టుకున్నారని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం వీఆర్ఏలకు సీఎం వైఎస్ జగన్ డీఏ పెంచి తాను ఉద్యోగుల పక్షపాతినని మరోసారి నిరూపించుకున్నారని ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఆఎస్ దివాకర్ పేర్కొన్నారు. ఇప్పటికే రెవెన్యూ శాఖకు సంబంధించి అన్ని తరగతుల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఉద్యోగులందరూ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర నాయకులు పెద్దన్న, ధైర్యం, సత్తిరాజు, నారాయణ, గణేష్ తదితరులు డీఏ పెంపుపై హర్షం వ్యక్తంచేశారు.

ఏపీలో 92.35 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: ఏపీ అంతటా అవ్వాతాతలు సహా వితంతు, దివ్యాంగులు, వివిధ రకాల చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఒంటరి మహిళల ఇంటింటికీ వెళ్లి శుక్రవారం కూడా వలంటీర్లు పింఛను అందజేశారు. ఠంఛన్‌గా 1నే పింఛన్ల పంపిణీ మొదలుపెట్టి.. కేవలం గురు, శుక్రవారాల్లోనే 61,09,122 మంది లబ్ధిదారులకు రూ.1,810.33 కోట్లను అందజేశారు. ఫిబ్రవరికి సంబంధించి ప్రభుత్వం.. మొత్తం 66,15,482 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ. 1,961.13 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో ఇప్పటికే 92.35 శాతం పంపిణీ పూర్తయినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు వెల్లడించారు. మిగిలిన వారి కోసం మరో మూడు రోజుల పాటు వలంటీర్లు ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేసే కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. కాగా, చంద్రబాబు ప్రభుత్వంలో అవ్వాతాతలు ప్రతి నెలా పింఛను తీసుకోవడానికి ఎదురు చూసే పరిస్థితికి తోడు.. పంపిణీ జరిగే రోజున గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండేది. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లుగా అవ్వాతాతలకు ఏ చిన్న కష్టం లేకుండా వాళ్ల ఇంటికే వలంటీర్లు వచ్చి పింఛను అందజేసే విధానం అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

> మేము ఆకాశం నుండి నీటిని కురిపించినపుడు, దానిని భూమిలోని చెట్లూ చేమలు పీల్చుకొని (పచ్చగా పెరుగుతాయి). అవి ఎండి పొట్టుగా మారిపోయినపుడు, గాలి వాటిని చెల్లాచెదురు చేస్తుంది. అల్లాహ్‌యే ప్రతిదీ చేయగల సమర్థుడు.
> – ఇస్లాం ధర్మం

సాక్షి
శనివారం, 3 ఫిబ్రవరి 2024

ఇంత నాటకీయత దేనికి?!


జార్ఖండ్ చుట్టూ ఈ వారమంతా చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజానీకాన్ని నివ్వెరపరిచాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధినేత, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జాడ తెలియడం లేదనీ, ఆయన గురించి జనవరి 27 నుంచి వెదుకుతున్నామనీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గత నెల 28న చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత 30 గంటల పాటు ఆయన ఆచూకీ లేదు. ఢిల్లీ వెళ్లారన్న సమాచారం ఉన్నా అక్కడి నివాసంలో ఆయన అధికారులకు చిక్కలేదు. అన్ని మార్గాలనూ దిగ్బంధించి వెతుకులాడిన దర్యాప్తు అధికారులకు చివరకు నిరాశే మిగిలింది. జనవరి 31న ఆయన తనంత తానే రాంచీ నివాసంలో ప్రత్యక్షం కావటం, గవర్నర్‌ను కలిసి రాజీనామా సమర్పించటం, అటుపై ఆయన్ను రాత్రి 9.30కి ఈడీ అరెస్టు చేయటం చకచకా జరిగిపోయాయి. హేమంత్ స్థానంలో కొత్త సీఎంగా 'జార్ఖండ్ టైగర్'గా పేరున్న చంపయ్ సోరెన్ శుక్రవారం ప్రమాణస్వీకారం కూడా చేశారు. ఈ నెల 5 లోపు బలపరీక్ష నిరూపించుకోవాల్సిన నేపథ్యంలో జేఎంఎం ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌కు తరలివచ్చారు. రాష్ట్ర గవర్నర్ ప్రభుత్వం ఏర్పాటుకు పిలుస్తారో లేదోనన్న ఆందోళన సమసిపోయాక, తమ ఎమ్మెల్యేలను కాపాడుకోవటం ఎలా అన్నది జేఎంఎంకు సమస్యగా మారినట్టుంది. కూటమి సర్కారులో భాగస్వామి అయిన కాంగ్రెస్ మిత్రధర్మంగా తెలంగాణలో తలదాచుకోవటానికి చోటిచ్చింది.

ఈ వ్యవహారంలో ఈడీ పట్టుదల... ఏదేమైనా దానికి చిక్కరాదన్న హేమంత్ తీరు... మీడియాకు కావలసినంత మేతనిచ్చాయి. ముఖ్యమంత్రి హోదాలో వున్న నాయకుణ్ణి, అందులోనూ ఒక ఆదివాసీ నేతనూ వెంటాడటం అంత అత్యవసరం ఎందుకైందో బోధపడదు. ఆయనపై వున్న కేసులు తీవ్రమైనవే కావొచ్చు, వాటి విషయమై ప్రశ్నించాలని ఈడీ అధికారులు భావించివుండొచ్చు... దాన్ని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. ఫోర్జరీ పత్రాలతో ఆయన రాంచీలోనూ, వేరేచోట్లా భూములు కాజేశారని ఆ సంస్థ ఆరోపణ. కానీ ఆయన చట్టానికి దొరక్కుండా తప్పించుకుపోయే సాధారణ వ్యక్తేమీ కాదు. అలాగని బ్యాంకులకు వేలకోట్లు ఎగనామంపెట్టి విదేశాలకు పోయిన కొందరిలా వ్యాపారో, పారిశ్రామికవేత్తో కాదు. ఆయన ఒక రాజకీయ పార్టీకి నేతృత్వం వహిస్తున్న నాయకుడు. జార్ఖండ్ సీఎం. జనం మధ్యనే ఉండి, వారి మద్దతుతో రాజకీయాల్లో కొనసాగదల్చుకున్నవారు. హేమంత్ సోరెన్ ఉద్దేశపూర్వకంగా ఈడీ సమన్లను బేఖాతరు చేయటం వల్ల వారంలో పూర్తయ్యే దర్యాప్తు నెలరోజులు పట్టొచ్చు. లేదా మరికొన్ని నెలలు కొనసాగొచ్చు. ఈలోగా మిన్ను విరిగి మీద పడుతుందా? ఇప్పటికే 41 చోట్ల సోదాలు చేసి, అయిదు సర్వేలు నిర్వహించామని ఈడీ చెబుతోంది. హేమంత్ ఢిల్లీ నివాసంలో నిర్వహించిన దాడిలో భారీగా నగదు, కీలకమైన పత్రాలు లభించాయన్నది ఈడీ ప్రకటన సారాంశం. ఈ విషయంలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని హేమంత్ సోరెన్ ఆరోపిస్తూ ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఈడీ సిబ్బందిపై కేసు కూడా పెట్టారు. దేనికైనా సమయం, సందర్భం ఉండాలంటారు. మరో మూడు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ ఏడాది ఆఖరుకు జార్ఖండ్ అసెంబ్లీ గడువు కూడా ముగుస్తుంది. ఇప్పటికిప్పుడు ఈ కేసుల్లో ఇరికించి అరెస్టు చేయాలనుకోవటం అప్రదిష్ట పాలు చేయటానికేననీ, తనను రాజకీయంగా దెబ్బతీసే కుట్రనీ హేమంత్ చేస్తున్న ఆరోపణ జనం విశ్వసించే అవకాశం లేదా? హేమంత్ కూడా ఇంత నాటకీయతకు తావివ్వకుండా ఉండాల్సింది. రాజకీయంగా ఆయన ఇబ్బందులు ఆయనకుండొచ్చు. తన అరెస్టు ఖాయమని తెలిశాక తదుపరి సీఎం ఎవరన్న అంశంలో గృహచ్ఛిద్రాలు కమ్ముకున్నాయి. సతీమణి కల్పనా సోరెన్ వైపు ఆయన మొగ్గుచూపగా, హేమంత్ దివంగత సోదరుడి సతీమణి, ఎమ్మెల్యే సీతా సోరెన్ పేచీకి దిగటం సమస్య అయిందంటున్నారు. సంక్షేమ పథకాల అమలులో, మెరుగైన పాలన అందించటంలో హేమంత్ సర్కారుకు మంచిపేరే ఉంది.

జార్ఖండ్ ఏర్పడి 24 ఏళ్లు కావస్తుండగా 2014–19 మధ్య అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు మినహా ఏ ప్రభుత్వమూ పూర్తిగా అయిదేళ్లూ పాలించలేకపోయింది. అస్థిరత్వమే రాజ్యమేలిన ఆ రాష్ట్రంలో తొలిసారి 2019 ఆఖరులో జరిగిన ఎన్నికల్లో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాల కూటమికి 47 స్థానాలు లభించాయి. 81 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో అధికార కూటమికి ఇంత మెజారిటీ ఉండటం అదే మొదటిసారి. చిత్రమేమంటే అంతకు ఆర్నెల్ల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాలకు బీజేపీ–ఏజేఎస్‌యూ కూటమి 12 గెల్చుకుంది. జార్ఖండ్‌లో గతంలో బీజేపీతో జేఎంఎం కూటమి కట్టిన సందర్భాలు లేకపోలేదు. కానీ మౌలికంగా రాష్ట్రంలో తనకు బీజేపీయే ప్రధాన ప్రత్యర్థి అని గ్రహించాక గత దశాబ్ద కాలంగా బీజేపీతో పొత్తుకు జేఎంఎం సుముఖత చూపటం లేదు. పైగా ఆదివాసీలను హిందువులుగా చూపాలన్న సంఘ్ పరివార్ వైఖరికి భిన్నంగా వారిని ప్రత్యేక మతస్థులుగా గుర్తించాలని హేమంత్ డిమాండ్ చేస్తున్నారు. ఈ కారణాల వల్లే ఈడీ ఆయన్ను వేధిస్తున్నదని ఆదివాసీలు నమ్మితే అది రాజకీయంగా బీజేపీకి నష్టంగా పరిణమిస్తుంది. ఏదేమైనా ఈ వ్యవహారంలో ఈడీ అత్యుత్సాహం ప్రదర్శించిందన్న అప్రదిష్టను మూటకట్టుకుంది. ఇప్పటికే ఆ సంస్థ తీరును విపక్షాలు తూర్పారబడుతున్నాయి. అటు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కూడా హేమంత్ సోరెన్ మాదిరే ఈడీ సమన్లను ధిక్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈడీ సంయమనంతో వ్యవహరించి నిందకు తావులేకుండా చూసుకోవాలి. అలాగే జార్ఖండ్‌లో ఎలాంటి రాజకీయ అస్థిరతకూ బీజేపీ తావీయరాదు.

ఇతర రాష్ట్రాలకు నమూనాగా ఏపీ విద్య

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొన్న జనవరి 30న ఒకటవ తరగతి నుంచే ఐబీ సిలబస్‌తో పాఠశాల విద్యను ప్రారంభించడానికి ఒక అంతర్జాతీయ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇంగ్లిష్ మీడియంలో ప్రభుత్వ పాఠశాల విద్యను ప్రపంచ ప్రమాణాలకు అనుసంధానం చేయడంలో ఇది మరో ప్రధాన అడుగు. విద్యార్థులు దీంతో ఉమ్మడి సర్టిఫికెట్ పొందుతారు. విజ్ఞాన భారత్‌ను నిర్మించడంలో భాగంగా, ఏపీ ప్రభుత్వం అసాధారణ రీతిలో పాఠశాల విద్యపై దృష్టి సారించిందన్న విషయం, గణతంత్ర దినోత్సవం నాడు ప్రదర్శించిన రాష్ట్ర శకటంలో ప్రతిఫలించింది. గ్రామీణ పాఠశాల విద్య నుండి ప్రపంచ స్థాయి తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వైద్యులను సృష్టిస్తుందని ప్రపంచానికి చాటడానికి ప్రదర్శించిన అత్యంత గొప్ప భవిష్యత్ శకటం ఇది.

న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగిన 2024 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో, 'పాఠశాల విద్య పరివర్తన' థీమ్‌తో ఒక శకటాన్ని ప్రపంచ, జాతీయ నాయకత్వం ముందు ప్రదర్శించడం ద్వారా భవిష్యత్తుకు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఓ కొత్త దృక్పథాన్ని చూపించింది.

విద్యార్థులు, ఉపాధ్యాయులు పాడుతూ, నృత్యాలు చేస్తూ శకటం వెంట కదిలారు. అధికారులు సృజనాత్మకంగా నిర్మించిన ఆ శకటాన్ని పరేడ్‌లో ఉంచడానికి ఏపీ ముఖ్యమంత్రికి ధైర్యం, విశ్వాసం అవసరం. దాన్ని వీక్షించిన అంతర్జాతీయ, జాతీయ వీక్షకులు చాలా ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు. ఎందుకంటే ఇది ఇతర రాష్ట్ర శకటాల కంటే ఒక ప్రధాన వ్యత్యాసాన్ని కనబర్చింది.

'సకల విద్యలకు మేమే సాటి / విశ్వ విద్యకు మేమే పోటీ' అంటూ పిల్లలు పాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లల కోసం అందిస్తున్న ఇంగ్లిష్ మీడియం విద్యా నాణ్యత గురించి ఈ పాట చెబుతుంది. తమ పాఠశాల యూనిఫారంలో నిలబడి ఉన్న విద్యార్థులు వారి టాబ్లెట్‌లు, ద్విభాషా పుస్తకాలను చూపుతున్నారు. ఉపాధ్యాయులు నైపుణ్యాలను, జ్ఞానాన్ని నేర్చుకోవడంలో వారికి సహాయం చేస్తున్నారు. భారతదేశం తన గ్రామీణ పాఠశాల విద్య నుండి ప్రపంచ స్థాయి తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వైద్యులను సృష్టిస్తుందని ప్రపంచానికి చాటడానికి ప్రదర్శించిన అత్యంత గొప్ప భవిష్యత్ శకటం ఇది. గణతంత్ర దినోత్సవ అతిథిగా వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ దానిని ఆసక్తితో చూశారు. పాఠశాల విద్యకు సంబంధించిన పరివర్తన సందేశం గురించి ఒక అనువాదకుడు ఆయనకు వివరించడం కనిపించింది.

గత 74 సంవత్సరాల్లో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా రిపబ్లిక్ డే పరేడ్‌లలో ఇలాంటి వినూత్న పాఠశాల విద్యా నమూనాను ప్రదర్శించలేదు. నాణ్యమైన విద్య కాకపోయినా, అక్షరాస్యత రేటును చూపించడానికి ధైర్యం చేయగల ఏకైక రాష్ట్రం కేరళ కూడా ఇన్నేళ్లుగా తమ పాఠశాల విద్యా విజయాన్ని ఏపీ ప్రభుత్వం రీతిలో జరుపుకోవాలని అనుకోలేదు.

వాస్తవానికి, ప్రతి అధికార రాజకీయ పార్టీ తన పనితీరు, విధాన కార్యక్రమం ఆధారంగా ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తుంది. కానీ పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన కొత్త ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్య, గ్లోబల్ పవర్ హౌజ్‌గా మారాలని భావిస్తున్న ప్రజాస్వామ్యంలో హృదయాన్ని కదిలించే విషయం. నాణ్యమైన పాఠశాల విద్య అనే ఆలోచనను జగన్ ప్రైవేట్ నుంచి పబ్లిక్‌గా మార్చారు. మారుమూల గ్రామాల్లోని పేద పిల్లలు తమ సొంత గ్రామంలోని పాఠశాలల్లో ఆధునిక ప్రపంచ నైపుణ్యాలను నేర్చుకుంటూ ఆత్మవిశ్వాసంతో, గౌరవంగా జాతీయ, ప్రపంచ మార్కెట్లలోకి రావాలని ఆశపడుతున్నారు. జగన్ తన ముందున్న అభివృద్ధి నమూనాకు విరుద్ధంగా ఈ అభివృద్ధి నమూనాను ఎంచుకున్నట్లు కనిపిస్తుంది. చంద్రబాబు నాయుడు సింగపూర్ వంటి రాజధాని నగరం నిర్మించడానికి 30,000 ఎకరాల భూమిని సమీకరించడంలో రాష్ట్ర వనరులను పెట్టుబడిగా పెట్టారు. ప్రభుత్వ రంగాన్ని ఏమాత్రం పట్టించుకోని ప్రైవేట్ రంగ పెట్టుబడి నమూనాయే ఆయన నమూనా. విద్యా రంగంలో కూడా ప్రైవేట్ పెట్టుబడిదారులను ఆయన ప్రోత్సహించారు.



గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రదర్శించిన 'పాఠశాల విద్య పరివర్తన' శకటం

ఏపీ శకటం ఇతర రాష్ట్ర శకటాలతో పోలిస్తే భిన్నంగా ఉంది. గత వైభవం, స్వాతంత్ర్య పోరాట చిహ్నాలు, మతపరమైన చిహ్నాలు లేదా వారి గిరిజన, సాదాసీదా జీవన స్త్రీలను మిగతా రాష్ట్రాలు ప్రదర్శించాయి. ఈ ఏడాది రిపబ్లిక్ పరేడ్ కవాతును దేశంలో మహిళా సాధికారతను ప్రత్యేకంగా ప్రదర్శించడానికి ఉద్దేశించారు. సైన్యంలోని అన్ని విభాగాల్లో, ఇస్రో వంటి వైజ్ఞానిక కార్యకలాపాలలో, ప్రతి రంగంలో దేశం మహిళలను ఎలా ప్రోత్సహిస్తోందో ప్రపంచానికి చూపించడానికి దీన్ని రూపొందించారు. అంతరిక్ష శాస్త్రంలో తన సొంత మహిళా శక్తిని 'ఇస్రో' తన శకటంలో ఉంచింది. ఆ రకంగా అది దాని సొంత భవిష్యత్తు యోగ్యతను కలిగి ఉంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ (రామ్ లల్లాపై తన శకటాన్ని రూపొందించింది) వంటివి తమ సాంప్రదాయ నృత్యం చేసే మహిళలతో తమ శకటాలను రూపొందించాయి. కానీ ప్రపంచీకరణ యుగంలో ఆధునికమైన, చక్కగా అమర్చిన ఇంగ్లిష్ మీడియం విద్యతో, పాఠశాల విద్యను ఈ దేశ భవిష్యత్తుగా చూపిన ఏకైక రాష్ట్రం ఏపీయే.

ఇప్పటికీ అర్ధ–మధ్యయుగ జీవన వ్యవస్థలతో వేలాడుతున్న గిరిజన (ఈశాన్య రాష్ట్రాలు, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ మొదలైనవి) లేదా గిరిజనేతర మహిళల భవిష్యత్తు సవాళ్లు ఏమిటో ఆ యా రాష్ట్రాలు చూపలేదు. ముస్లిం మహిళల స్థితిగతులు ఏమిటో ఏ శకటమూ చెప్పలేదు. కశ్మీర్ నుంచి కనీసం అలాంటి ఒక్క శకటాన్నయినా తేవాల్సింది.

రాష్ట్ర చరిత్రను చూపించడం ఒక విషయం; పిల్లలకు చక్కగా, ప్రణాళికాబద్ధమైన విద్యను అందించడం ద్వారా దేశ భవిష్యత్తును చూపించడం మరొక విషయం. ఆంధ్రప్రదేశ్ దీనిని స్పష్టమైన విజన్ తో చేసింది. ఏపీ శకటం కదులుతుండగా ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని జాగ్రత్తగా గమనించారు. ఆయన సొంత గుజరాత్ మోడల్ కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యను అంత బాగా అందించలేకపోయింది. గుజరాత్ కూడా ఇప్పుడు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య కోసం ప్రైవేట్ పాఠ శాలలపై ఆధారపడుతోంది. అది కూడా ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉంది.

భారతదేశం పాశ్చాత్య దేశాలతో, చైనాతో పోటీ పడాలని ఆకాంక్షిస్తున్నప్పుడు, తమ సొంత ప్రాంతీయ భాషలో చక్కటి పునాది కలిగివుండి, ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందించడమే ఏకైక మార్గం. జగన్ మోహన్ రెడ్డి చైతన్యపూర్వకమైన ప్రయత్నంతో నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యపై ఆంధ్రా విద్యార్థులకు విశ్వాసం ఏర్పడింది. ఇప్పుడు దాన్నే వైఎస్ జగన్ తన ఎన్నికల ఆయుధంగా మలుచుకున్నారు. ఆ ఆలోచనతోనే ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాఠశాల విద్యా శకటాన్ని ప్రదర్శింపజేశారు.

పాఠశాల విద్యలో కేంద్రం లేదా రాష్ట్రం ఏదైనా పెద్ద సానుకూల అడుగు వేసిందంటే తప్పనిసరిగా అభినందించాలి. దేశ భవిష్యత్తు అక్కడే ఉంది. సైద్ధాంతిక విభేదాలు ఏ విషయంలోనైనా ఉండవచ్చు, కానీ ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా నాణ్యమైన పాఠశాల విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించడంలో కచ్చితంగా విభేదాలు ఉండకూడదు. అప్పుడు మాత్రమే పిల్లల భవిష్యత్తుకు ఎదురుదెబ్బ తగలదు. ఏ పిల్లవాడు అయినా రెండు భాషలను చాలా సులభంగా నేర్చుకోగలడు. మన విషయంలో అది ఇంగ్లిష్, పిల్లల ప్రాంతీయ భాష అయి ఉండాలి. కేంద్ర ప్రభుత్వం కూడా ఆంధ్రా విద్యా నమూనాను అర్థం చేసుకుంటుందని, అభినందిస్తుందని ఎవరైనా ఆశిస్తారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చివరి శిఖరం



నా భర్త గత రాత్రి (ఫిబ్రవరి 1) ప్రశాంతంగా వెళ్లిపోయారు. ఒక పర్వతారోహకుడిగా అత్యంత ఎత్తయిన శిఖరానికి ఆయన చేసిన చివరి ప్రయాణం ఇది. ముందుకు సాగిపో, తర్వాత వచ్చి కలుస్తానని చెప్పాను. పూర్తి జీవితం ఇతరుల సేవలో గడిపిన మంచి మనిషి ఆయన!

– మేరీ జోల్స్, నాచురలిస్ట్

బరువు కాకూడదు!



ఇప్పుడే లెక్క గట్టాను: మొత్తం బీఎస్సీ వరకు ఇండియాలో నా చదువుకు అయిన ఖర్చు కేవలం 15,000 రూపాయలు. ఇది 1978–1994 వరకు. చదువు అందుబాటులో ఉండటం వల్ల మాత్రమే నేను ఈరోజు ఇక్కడ (ఛైర్, మిషిగన్ పబ్లిక్ హెల్త్, యూఎస్‌ఏ) ఉండగలిగాను. అందరికీ ఉచిత విద్య అనేది నా కల!

– భ్రమర్ ముఖర్జీ, పరిశోధకురాలు

సున్నితత్వం లేదా?



మొన్న కోల్‌కతా విమానాశ్రయంలో సెక్యూరిటీ క్లియరెన్స్ కోసం వెళ్లినప్పుడు అక్కడి అధికారి నన్ను లేచి నిలబడమన్నారు. వీల్‌చైర్‌లో ఉన్నానని తెలిసీ, ఒకసారి కాదు, మూడుసార్లు అన్నారు. ఆమె నన్ను లేచి కనీసం రెండు అడుగులైనా వేయమన్నారు. నేను పుట్టుకతో నడవలేనని వివరించాల్సి వచ్చింది.

– ఆరుషి సింగ్, న్యాయవాది

వాగ్దానం నెరవేరేనా?



ఇండియాలోని పన్ను చెల్లింపుదారులు, ముఖ్యంగా క్రమంగా ఆదాయ పన్ను చెల్లించే ఉద్యోగులందరికీ కొంత శాతం నల్లధనాన్ని బహుమతిగా ఇస్తానని ప్రధాని కావడానికి ముందు మోదీ వాగ్దానం చేశారు. ఆయన అధికారంలోకి వచ్చి దాదాపు పదేళ్లు అవుతోంది.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

పెరిగిన వయసు



పూర్తిగా పని చేయడం మానేసే దాకా నా ఫోన్ మార్చని వయసుకు నేను అధికారికంగా వచ్చేశాను.

– జెన్ని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్ బాక్స్

ఈ ఆహారంతో ఎంతో మేలు

సంపూర్ణ ఆరోగ్యానికీ, క్యాన్సర్ నివారణకూ క్షారదేహతత్వ ఆహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆల్కలైన్ (క్షారతత్వ) ఆహారాలు, సమతుల తత్వ ఆహారాలు, ఎసిడిక్ (ఆమ్ల తత్వ) ఆహారాలు అని ఆహారాలను విభజించవచ్చు. వీటిలో సమతులతత్వ ఆహారం తీసుకుంటే కేన్సర్ తదితర అనారోగ్య సమస్యలు దరికి చేరవు. శరీరంలోని అంతర్గత వాతావరణంలోని పీహెచ్ (పొటెన్షియల్ ఆఫ్ హైడ్రోజన్) బ్యాలెన్స్ క్షారతత్వంగా ఉండాలి. రోజువారి జీవితంలోని శారీరక జీవ ప్రక్రియలు (మెటబాలిజం) సక్రమంగా కొనసాగడంలో శరీరంలోని ఈ 'పీహెచ్ బ్యాలెన్స్' కీలక పాత్ర పోషిస్తుంది.

అమ్లతత్వాలు, క్షార తత్వాలు సాధారణంగా 0 నుండి 14 వరకు ఉంటాయి. పీహెచ్ 7ను 'న్యూట్రల్'గా... అంటే 'సమతుల దేహతత్వం'గా భావించాలి. అంతకన్నా తగ్గితే 'ఆమ్ల దేహతత్వం' గాను, పెరిగితే 'క్షార దేహతత్వం'గాను పరిగణించాలి. పీహెచ్ బ్యాలెన్స్ స్థిరంగా ఉంచే ఆహారాన్ని ఆల్కలైన్ ఆహారం అంటారు. టమోట, బొప్పాయి, సిస్ పండ్లు, దబ్బకాయ, నారింజ, బెర్రీస్, బ్రకోలి, కాలిఫ్లవర్, బుడమదోస కాయ, సొరకాయ, దోసకాయ, బూడిద గుమ్మడి, నేతి బీర, కొబ్బరి, కొబ్బరి నూనె, తులసి, మంచి పసుపు, గోధుమనారు గడ్డి వంటివి క్షారతత్వ గుణాన్ని పెంచుతాయి. పారిజాతం ఆకులు, మారేడు ఆకులు, తమలపాకుల కషాయాలు; కెమోమెల్ల, పెప్పర్‌మెంట్ లాంటి హెర్బల్ టీలు కూడా ఉపయోగపడతాయి.

ఎండు మిరపకాయలు, ఎండు కారం, చింతపండు, మితిమించిన ఉప్పు, అధిక వేపుళ్ళు, బాండీ వంటకాలు, కలుషిత వంట నూనెలు; పాలు, పెరుగు, జున్ను మొదలైన పాల ఉత్పత్తి ఆహారాలు 'ఎసిడిక్ (ఆమ్ల) గుణాన్ని పెంచుతాయి. వీటికి బదులుగా కొబ్బరి పాలు, నువ్వుల పాలు, వేరుశెనగ పప్పుల పాలు, ఈ పాల పెరుగునూ వాడవచ్చు.

ముఖ్యంగా 'చిరుధాన్యాల అంబలి' వంటివి ప్రత్యామ్నాయాలుగా ఎంచుకోవాలి. ఎక్కువగా ప్రాసెస్ చేసిన రిఫైండ్ వంట నూనెలు, పంచాదర, తీపి ఉత్పత్తులు; ఇవి గాక తెల్లని పంచదార, తెల్లని పాలు, తెల్లని ఉప్పు, తెల్లని బియ్యం, తెల్లని ఇడ్లీలు, కాఫీ, టీ, శీతల పానీయాలు ఆమ్ల తత్వాన్ని పెంచుతాయి. పౌష్టిక ఆహారమైన మాంసం, గుడ్లు, చేపలు, మొదలైనవి కూడా ఈ తత్వాన్ని పెంచుతాయి. అయితే ... అలాగని 'ఆమ్ల తత్వ ఆహార' పదార్థాలకు పూర్తిగా దూరమైతే పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉంది. ఈ లోపం తలెత్తకుండా వాటిలోని ఆరోగ్యకరమైన ఆహార పదార్థములను ఎంచుకొని పరిమితంగా తీసుకుంటూ ఉండాలి.

అలాగే ఈ ఆహార నియమాలతో పాటు... వేళకు తగినంత నిద్ర పోవడం, వేళకు ఆహారం తీసుకోవడం, వ్యాయామం, యోగా, ధ్యానం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం లాంటి ప్రకృతి వైద్య విధానాలు కూడా పాటించాలి. 'ప్రపంచ క్యాన్సర్ డే' సందర్భముగా ఈ నియమాలు తెలుసుకుని, పాటిస్తూ ప్రజలందరు ఆయురారోగ్యంగా ఉండాలి. ఈ ప్రకృతి జీవన విధానం ద్వారా క్యాన్సర్ రహిత ప్రపంచాన్ని సృష్టించవచ్చు.

– డా॥ ఎస్. శ్రీనివాస్, బాపట్ల; డా॥ కోట్నీస్ శత జయంతి పురస్కార గ్రహీత

(రేపు వరల్డ్ క్యాన్సర్ డే)

విద్యుత్ ఉత్పత్తిలో మున్ముందుకు...

అభిప్రాయం



ఎల్. రఘురామిరెడ్డి

పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పాదన సంస్థ (ఏపీజెన్‌కో) నూతన ఆవిష్కరణల దిశగా పరుగులు పెడుతోంది. కేవలం తొమ్మిది నెలల స్వల్పకాలంలో రెండు థర్మల్ విద్యుత్ యూనిట్లు వాణిజ్య ఉత్పత్తికి శ్రీకారం చుట్టడం ఏపీజెన్‌కో చరిత్రలో ఓ రికార్డు. ఈ ఉత్సాహంతో 10 వేల గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్య సాధన దిశగా సంస్థ పకడ్బందీ ప్రణాళికతో అడుగులు వేస్తోంది.

దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండు శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో 2023 మార్చి 9న శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లో 800 మెగావాట్ల మూడో యూనిట్‌ను ఏపీజెన్‌కో ప్రారంభించింది. రూ. 8238.31 కోట్లతో నిర్మించిన ఈ యూనిట్‌ను జాతికి అంకితం చేసిన స్వల్పకాలంలోనే (డిసెంబరు 20వ తేదీన) ఎన్‌టీఆర్ జిల్లాలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం (డాక్టర్ ఎన్‌టీటీపీఎస్)లో మరో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్ వాణిజ్య ఉత్పత్తికి శ్రీకారం చుట్టడం శుభసూచకం. ఏడాది తిరగకముందే 1600 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పాదక యూనిట్లు అందుబాటులోకి తేవడం ముదావహం. ఇవి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఏపీజెన్‌కో సాధించిన గొప్ప రికార్డులుగా విద్యుత్ రంగ నిపుణులు అభివర్ణిస్తున్నారు.

800 మెగావాట్ల అయిదో యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించడంతో డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ 2560 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో రాష్ట్రంలో అతి పెద్ద విద్యుత్ ఉత్పాదన కేంద్రంగా అవతరించింది. దీంతో ఏపీ జెన్‌కో (అనుబంధ సంస్థ ఏపీపీడీసీఎల్‌తో కలిపి) రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 5810 నుంచి 6610 మెగావాట్లకు పెరిగింది. హైడల్ 1773.60 మెగావాట్లు, సోలార్ 405.43తో కలిపి ఏపీజెన్‌కో మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 8789.03 మెగావాట్లకు పెరిగింది.

ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశవ్యాప్తంగా ప్రతియేటా సగటున 10 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతూ వస్తోంది. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండులో అత్యధిక భాగం ఏపీజెన్‌కో నుంచే సమకూర్చాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మార్గదర్శకత్వం మేరకు సంస్థ విస్తరణ దిశగా శరవేగంగా ముందుకెళుతోంది.

గరిష్ఠ విద్యుత్ డిమాండు (పీక్ లోడ్) సమయంలో అధిక ధరకు విద్యుత్ కొనుగోళ్లను కనీస స్థాయికి తగ్గించాలనే లక్ష్యంతో మొట్టమొదటిసారి పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుల (పీఎస్‌పీ) రంగంలోకి ప్రవేశించేందుకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగానే సొంతంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఎగువ సీలేరులో 1350 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజి ప్లాంట్ నిర్మించాలని డీపీఆర్ తయారు చేసింది. రూ. 11,000 కోట్ల అంచనా వ్యయంతో దీని నిర్మాణానికి కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) అనుమతి తీసుకుంది.



మినీరత్న హోదా కలిగిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్' (ఎన్‌హెచ్‌పీసీ)తో కలిసి పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులతోపాటు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు చేపట్టాలని ఏపీజెన్‌కో నిర్ణయించింది. 5,000 మెగావాట్ల సామర్థ్యం గల అయిదు పీఎస్‌పీల నిర్మాణంతోపాటు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు సంయుక్తంగా ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి జగన్ ఇంధన, అటవీ పర్యావరణం, భూగర్భ గనుల శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో ఎన్‌హెచ్‌పీసీ, ఏపీజెన్‌కో ఇటీవల అవగాహన ఒప్పందం (ఎంఓయూపై)పై సంతకాలు జరిగాయి.

దిగువ సీలేరు జలవిద్యుత్ కేంద్రం సామర్థ్యం పెంపు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ 115 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల నాలుగు యూనిట్లు (మొత్తం 460 మెగావాట్లు) ఉన్నాయి. 115 మెగావాట్ల సామర్థ్యం గల మరో రెండు యూనిట్ల నిర్మాణ పనులను ఏపీజెన్‌కో చేపట్టింది. పోలవరం సాగునీటి ప్రాజెక్టుకు అనుసంధానంగా 960 మెగావాట్ల సామర్థ్యంతో జలవిద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు సాగుతున్నాయి. 80 మెగా వాట్ల సామర్థ్యం గల 12 యూనిట్లను ఇక్కడ దశలవారీగా పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక అమలవుతోంది.

ఒడిశా రాష్ట్రంలో మాచ్‌ఖండ్ నదిపై ప్రస్తుతం ఉన్న 120 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రం విస్తరణ చర్యల్లో భాగంగా మరో 98 మెగావాట్ల సామర్థ్యంతో మూడు యూనిట్లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ – ఒడిశా విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఉమ్మడిగా నిర్ణయించాయి. ఈమేరకు వ్యయం, విద్యుత్ వినియోగంలో ఇరు రాష్ట్రాలకు సమాన వాటా ఉండేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ఇలా పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తికి తీసుకోవలసిన సకల చర్యలూ తీసుకుంటూ ఆదర్శంగా నిలుస్తోంది.

వ్యాసకర్త ఏపీజెన్‌కో ప్రజా సంబంధాల విభాగం సీనియర్ కన్సల్టెంట్ । 99121 99484

జీవిత ప్రవాహం

రాయి నుండి లోహంగా, లోహం నుండి మొక్కగా, మొక్క నుండి నేలమీద పాకే పురుగుగా, పురుగు నుండి నీళ్ళలో ఈదే చేపగా, చేప నుండి ఆకాశంలో ఎగిరే పక్షిగా, పక్షి నుండి సహజ ప్రవృత్తి గల జంతువుగా, జంతువు నుండి విచక్షణా జ్ఞానం గల మనిషిగా – ఇట్లా వివిధ దశల్లో పరిణామం చెందుతూ ముందుకు సాగటం సృష్టి లక్షణం. పరిణామ క్రమంలో మనిషిది చివరి దశ, చైతన్య వికసనంలోగాని, ఆకార విశేషంలోగాని.

జ్యోతిర్మయం

పరస్పరం అర్థం చేసుకోవటానికి, అనుభవాలు పంచుకోవటానికి నోటి మాట, చేతి రాత రూపంలో మనుషులకో భాష ఉన్నది. అలాగే వృక్షాలకు, జంతువులకు కూడా వాటి సొంతమైన భాష వాటికి ఉన్నది. ఆ భాష అత్యంత ప్రాథమిక, అపరిపక్వ స్థితిలో ఉండినది అవచ్చుగాక. అన్ని జీవ రాశులూ ఒకే ప్రపంచంలో మనుగడ సాగిస్తూ జీవిత ప్రవాహంలో ముందుకు సాగుతున్నాయి. పక్షులు, జంతువులు, మనుషులు – ఇలా ప్రతి ప్రాణీ జీవిత లక్ష్యాన్ని సాధించటంలో తన వంతు పాత్ర పోషిస్తున్నది. దైనందిన జీవితంలో దైవత్వాన్ని ఆవిష్కరింప జేసుకోవటమే ప్రతి ప్రాణి యొక్క పరమ లక్ష్యంగా ఉన్నది.

మానవుని ఆత్మ ఒకసారి మానవ రూపం ధరించి జన్మించినట్లయితే, ఇక ముందు ఎప్పుడు పునర్జన్మ ఎత్తినా మానవుడిగానే జన్మిస్తుంది. సృష్టి పరిణామ క్రమంలో జీవిత ప్రవాహం పురోగ మిస్తుందే తప్ప తిరోగమించదు. అయితే దీనికి ఒక మినహాయింపు ఉన్నది. మనిషి తనకు సంప్రాప్తించిన శక్తి యుక్తుల్ని అత్యంత హీన కార్యాలకు ఉపయోగ పెట్టినట్లయితే, మరణానంతరం తదుపరి జన్మలో అతడు జంతువుగానో, పక్షిగానో, మరే ఇతర రూపంలోనో పుట్టవచ్చు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.అష్టమి ప.12.25 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** విశాఖ రా.3.07 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.7.51 నుండి 9.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.33 నుండి 8.05 వరకు, **అమృతఘడియలు:** సా.5.44 నుండి 6.34 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.52.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

గవర్నర్‌కు శ్రీశారదాపీఠం ఆహ్వానం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

పెందుర్తి/ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ శుక్రవారం కలిశారు. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయోధ్య రామమందిరం అంశంపై ఇరువురు చర్చించుకున్నారు. సుప్రీంకోర్టులో అయోధ్య రామ మందిరం నిర్మాణానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన న్యాయమూర్తుల్లో ఒక్కరైన అబ్దుల్ నజీర్‌ను స్వాత్మానందేంద్ర ప్రత్యేకంగా అభినందించారు. కాగా, విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను స్వాత్మానందేంద్ర సరస్వతీ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు సాదరంగా స్వాగతం పలికారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

బాబా మందిరానికి యాచకుడి విరాళం

విడతల వారీగా
రూ. 9.54 లక్షలు అందజేత




నగదును మందిరం గౌరవ అధ్యక్షుడు గౌతంరెడ్డికి అందజేస్తున్న యాదిరెడ్డి

మధురానగర్ (విజయవాడసెంట్రల్):సాయి బాబా మందిర అభివృద్ధికి ఓ యాచకుడు శుక్రవారం లక్షరూపాయల విరాళం అందజేశారు. దీంతో ఇప్పటివరకూ ఆయన అందజేసిన విరాళం రూ.9.54 లక్షలకు చేరుకుంది. వివరాల్లోకి వెళితే ఎన్టీఆర్ జిల్లా విజయవాడ, ముత్యాలంపాడులోని శ్రీ షిర్డీసాయి బాబా మందిరం వద్ద యాదిరెడ్డి అనే వృద్ధుడు యాచకుడిగా జీవనం సాగిస్తున్నారు. భక్తుల నుంచి సేకరించిన సొమ్ముతో లక్షరూపాయలు పోగుచేసి బాబా మందిర అభివృద్ధికి ఇచ్చేలా నిర్ణయించుకుని, ఆ డబ్బును మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ... బాబామందిరానికి యాదిరెడ్డి విరాళం ఇవ్వడం ఇది మొదటిసారికాదని, ఇప్పటివరకూ పలు దఫాలుగా రూ.8,54,691 అందజేశారని తెలిపారు. తాజాగా శుక్రవారం అందజేసిన రూ.లక్షతో కలిపి రూ.9,54,691 ఇచ్చినట్లయిందని చెప్పారు. ఈ రకంగా విరాళం అందజేయడం అభినందనీయమన్నారు. దాత యాదిరెడ్డి మాట్లాడుతూ బాబా మందిరం వద్ద యాచించి సంపాదించిన డబ్బు బాబాకే ఇవ్వడం ఆనందంగా ఉందని, ఇకపై తాను సేకరించే ప్రతి పైసా దైవకార్యాలకే వినియోగిస్తానని తెలిపారు. మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తదితరులు యాదిరెడ్డిని అభినందించారు. అనంతరం యాదిరెడ్డిని బాబావారి శేషవస్త్రంతో గౌతంరెడ్డి సత్కరించారు.

నేటి నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు

- 3 టీటీడీ కళాశాలలకు అటానమస్ హోదా
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి



తిరుమల:తిరుమల ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3-5 వరకు ధార్మిక సదస్సును నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. దీనికి దేశం నలుమూలల నుంచి 57 మంది పీఠాధిపతులు, మఠాధిపతులు హాజరవుతారని పేర్కొన్నారు. హైందవ ధర్మాన్ని, శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేసేందుకు, చిన్న వయసు నుండే పిల్లల్లో మానవతా విలువలను పెంపొందించేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తిరుమలలో ఈ నెల 16న రథసప్తమిని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల గుండె ఆసుపత్రిలో 26 నెలల్లో 2,350 గుండె ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. 2 రోజుల వయసున్న చంటిపాపకు కూడా గుండె ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా 11 గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేపట్టినట్లు వెల్లడించారు. టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలకు అటానమస్ హోదా లభించినట్లు చెప్పారు. కొత్త ఆసుపత్రిని శ్రీ పద్మావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ పేరిట చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. టీటీడీ ఐటీ విభాగం 52 నకిలీ వెబ్‌సైట్లను, 13 నకిలీ మొబైల్ యాప్‌లను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిందని చెప్పారు.

నాదెండ్ల బుకాయింపు రామోజీ దరువు!

సలహాదారులకు రూ.680 కోట్లు అంటూ నిస్సిగ్గుగా అబద్ధాలు



సజ్జలకే రూ.140 కోట్లు!
ప్రభుత్వ సలహాదారులకు రూ. 680 కోట్ల వ్యయం

సాక్షి, అమరావతి: బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నాడట! చంద్రబాబుతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్న జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ నోటికొచ్చిన అబద్ధాలు వల్లిస్తే రాజగురువు రామోజీ తాటికాయంత అక్షరాలతో ముద్రించి మురిసిపోయారు! సలహాదారుల పేరుతో 89 మందిని నియమించారని.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.680 కోట్లు వ్యయం చేసిందని.. ఒక్క సజ్జల రామకృష్ణారెడ్డికే రూ.140 కోట్లు చెల్లించారంటూ నాదెండ్ల గాలి కబుర్లు చెప్పారు. అసలు ప్రభుత్వం నియమించిందే 46 మంది సలహాదారులైతే మిగతావారంతా ఎక్కడి నుంచి వచ్చినట్లు? నాదెండ్ల ఆరోపణల్లో నిజం లేదని ఇక్కడే తేలిపోతోంది. నెలకు రూ.లక్షన్నరలోపే జీతభత్యాల రూపంలో చెల్లిస్తుండగా ఏకంగా రూ.వందల కోట్లు ఇస్తున్నారంటూ నిస్సిగ్గుగా అబద్ధాలను ప్రచురించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ హోదాలో సలహాదారులను నియమిస్తోంది? వారికి వేతనాలు, భత్యాల రూపంలో ఎంత చెల్లిస్తున్నారు? అనే వివరాలు జీవోల రూపంలో పారదర్శకంగానే ఉన్నా గోప్యంగా దాచిపెడుతున్నట్లు ఎల్లో మీడియా దుష్ప్రచారానికి తెగబడుతోంది. 2023–24లో మంత్రులు, చైర్మన్లు, సలహాదారుల కోసం బడ్జెట్ కేటాయింపులే రూ.29.61 కోట్లు అయినప్పుడు ఒక్క సలహాదారులకే రూ.వందల కోట్లు చెల్లించడం ఎలా సాధ్యమవుతుందని అధికార యంత్రాంగం విస్మయం వ్యక్తం చేస్తోంది.

- రాష్ట్రప్రభుత్వం ఐదు కేటగిరీలుగా సలహాదారులను నియమిస్తోంది. కేటగిరీ 'ఎస్' కింద నియమితులైన వారికి క్యాబినెట్ ర్యాంక్ ప్రోటోకాల్ మాత్రమే ఉంటుంది. వారికి సిబ్బంది కానీ జీతభత్యాలు కానీ ఉండవు. క్యాబినెట్ ర్యాంక్ ఉన్న సలహాదారులకు క్యాబినెట్ మంత్రులతో సమానంగా వసతులు కల్పిస్తారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ ఎలాంటి గౌరవ వేతనాలు లేకుండా సలహాదారులుగా వ్యవహరిస్తున్నారు.
- చంద్రబాబు అధికారంలో ఉండగా రాజధాని డిజైన్ల పేరుతో ప్రచార ఆర్భాటం కోసం కన్సల్టెన్సీలు, సలహాదారులకు రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని గుమ్మరించారు. నార్మన్ ఫోస్టర్, సుర్బానా జురాంగ్ తదితర కన్సల్టెన్సీ సంస్థలు ఈ జాబితాలోనే ఉన్నాయి. పోలవరం సందర్శన పేరుతో చంద్రన్నకు జయము జయము అంటూ సొంత ప్రచారం కోసం బస్సుల్లో జనాన్ని తరలించేందుకు డబ్బులను నీళ్లలా ఖర్చు చేశారు. గోదావరి, కృష్ణా పుష్కరాల సమయంలో షూటింగ్‌లను తలపిస్తూ సినీ దర్శకుడితో డ్రోన్లతో చిత్రీకరణకు విచ్చలవిడిగా ఖర్చు చేయడంతోపాటు అమాయకులను పొట్టనబెట్టుకున్నారు. ఇప్పుడు గుండెలు బాదుకుంటున్న రామోజీగానీ నాదెండ్లగానీ అప్పుడు నోరెత్తితే ఒట్టు!.



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
Advisors - GAD - Fixation of Pay and allowances and Protocol to the Advisors and Experts to Government Orders - Issued.

GENERAL ADMINISTRATION (POLL.A) DEPARTMENT

G.O.Ms.No.36 Dated:17-05-2022
Read
G.O.Ms.No.80, G.A. (Poll. A) Department, dt: 01.06.2018

ORDER:
It is felt by the Government that, Pay & allowances to all the Advisors and Experts appointed by Government given in the reference read above shall be reviewed.

2. Accordingly, after careful examination of the matter and in supersession of orders issued in G.O.Ms.No.80, G.A. (Poll. A) Department, dated: 01.06.2018, Government hereby fix the pay and allowances/rank/protocol to all the Advisors/ Experts as per the following categories:

		CATEGORY-P	CATEGORY-Q	CATEGORY-R	CATEGORY-S
Salary (Rs. p.m.)		60,000/-	1.25 lakhs	2.00 lakhs	Cabinet Rank With Protocol Without staff Without Pay and Allowances
One time grant for furniture and crockery		Nil	Nil	Nil	
Personal staff allowance @ 25,000/- for PS, 18,000/- for PA, 12,000/- for OS, 15,000/- for driver		33,000/- (1 PA, 1 driver)	52,000/- (1 PS, 1 OS, 1 driver)	70,000/- (1 PS, 1 PA, 1 OS, 1 driver)	
Vehicle		1 vehicle with 250 lts	1 vehicle with 250 lts	1 vehicle with 250 lts	
Vehicle allowance in lieu of vehicle (Rs. p.m)		45,000/-	60,000/-	60,000/-	
Mobile phone with dataconnection (Rs. p.m.)		2,000/- (1 connection)	2,000/- (1 connection)	2,000/- (1 connection)	
Accommodation (Rs.p.m.)		20,000/-	Official quarters(or) 40,000/-	Official quarters(or) 50,000/-	
Medical reimbursement		As per APIMA rules	As per APIMA rules	As per APIMA rules	
Warrant of precedence		30	26	23	
Travel eligibility	Domestic	II AC train/ Economy flight	I AC train/ Economy flight	I AC train/ Economy flight	
	International	Economy	Business	Business	
Total		1,60,000/-	3,79,000/-	3,82,000/-	

3. The Departments concerned in Secretariat shall take necessary action accordingly for fixation of Pay & allowances of the Advisors and Experts appointed by them.

4. The District Collectors/Heads of Departments/Secretaries to Government are requested to [illegible]

సలహాదారుల అలవెన్సుల జీవో కాపీ

ఫేక్ ప్రచారం

ఎల్లో మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న టీడీపీకి ఈసారి కూడా ప్రజలు దిమ్మతిరిగే తీర్పు ఇవ్వడం ఖాయమని, శాశ్వత సమాధి తప్పదని వైఎస్సార్‌సీపీ శుక్రవారం ట్విట్టర్‌లో పేర్కొంది. సలహాదారులకు రూ.వందల కోట్లు చెల్లిస్తున్నారంటూ నిస్సిగ్గుగా అబద్ధాలను వల్లిస్తున్నారని మండిపడింది.

అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

- ఒకే ఇంట్లో వేర్వేరు గదుల్లో ఉరి వేసుకుని బలవన్మరణం
- అనంత జిల్లాలో ఘటన
- ఆత్మహత్యలకు గల కారణాలపై ఆరా తీస్తున్న పోలీసులు



రూప (ఫైల్)



జ్యోతి (ఫైల్)

శెట్టూరు :ఏం కష్టం వచ్చిందో పాపం ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం యాటకల్లులో శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన చాకలి నారాయణస్వామి, సరస్వతి దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె రూప(20), చిన్న కుమార్తె జ్యోతి(18) ప్రస్తుతం అనంతపురంలో డిగ్రీ చదువుతున్నారు. వారం కిందట కళాశాల నుంచి స్వగ్రామానికి వచ్చిన ఇద్దరూ.. శనివారం కళాశాలకు వెళుతున్నట్టు ఇంట్లో చెప్పి సామగ్రి సర్దుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లిలో సమీప బంధువు చనిపోవడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తల్లిదండ్రులు వెళ్లారు. సోదరుడు మనోజ్ పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కచెల్లెళ్లిద్దరూ ఒకరు వంట గదిలో, మరొకరు హాల్లో చీరలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అంత్యక్రియలకు వెళ్లిన నారాయణ.. కుమార్తెలకు ఫోన్ చేయగా, వారు లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆయన గ్రామానికి చెందిన తన స్నేహితులకు తెలిపి ఇంటి వద్దకెళ్లి కుమార్తెలకు ఫోన్ ఇవ్వాలని కోరాడు. ఈ క్రమంలో వారు ఇంటి వద్దకెళ్లి చూడగా.. యువతులిద్దరూ ఉరికి వేలాడుతూ కనిపించారు. వెంటనే ఈ విషయాన్ని వారు నారాయణ స్వామికి చెప్పడంతో హుటాహుటిన స్వగ్రామానికి చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య ఘటనపై శుక్రవారం సాయంత్రం జిల్లా అడిషనల్ ఎస్పీ విజయభాస్కరరెడ్డి విచారణ చేపట్టారు. కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో ఉన్న మృతదేహాలను డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగరాజుతో కలిసి ఆయన పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. అంతకు మునుపు యాటకల్లులో అడిషనల్ ఎస్పీ పర్యటించారు. శెట్టూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాబు అండ్‌కో పార్టీలను తుంగలో తొక్కుతాం

1,223వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రాష్ట్రంలో పేదల హక్కులకు అడుగడుగునా అడ్డం పడుతున్న బాబును, ఆయనకు వత్తాసు పలుకుతున్న పార్టీలను తుంగలో తొక్కి సత్తా చూపుతామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్ రోడ్డులో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,223వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలలో శుక్రవారం పలువురు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో పేదవారికి అన్ని హక్కులు అందుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగన్ పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. పార్టీని అమ్ముకుని.. చంద్రబాబును నమ్ముకుని రాష్ట్రానికి వచ్చిన షర్మిలకు, తన సీటు తాను గెలవలేని పవన్‌కళ్యాణ్‌కు భంగపాటు తప్పదని హెచ్చరించారు. అధికార యావ, పేదల దోపిడీ తప్ప, బాబుకు ముందు చూపు లేనందునే గత ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించారని, ఇప్పుడు కూడా బాబుకు డిపాజిట్లు లేకుండా రాష్ట్రం నుంచి తరిమికొడతామని స్పష్టం చేశారు.నాయకులు పులిదాసు, మాదిగాని గురునాథం ,ఈపూరి ఆదాం, నూతక్కి జోషి, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు 2,902 మందికి అనుమతి

ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్

సాక్షి, అమరావతి: హజ్–2024 యాత్రకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ పూర్తైందని, ఏపీ నుంచి 2,902 మందిని ఎంపిక చేశారని ఏపీ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజమ్ చెప్పారు. శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ముస్లిం జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాష్ట్ర హజ్ కోటా 2,931 మందికి అవకాశం ఉందన్నారు. గతేడాది డిసెంబర్ 4 నుంచి ఈ ఏడాది జనవరి 15 వరకు దరఖాస్తులు స్వీకరించినట్టు చెప్పారు. డిజిటల్ ర్యాండమ్ సెలక్షన్ (డీఆర్ఎస్) పద్ధతిలో కేంద్ర హజ్ కమిటీ పరిశీలన అనంతరం 2,902 మంది దరఖాస్తును ఆమోదించినట్టు తెలిపారు. వారికి తోడ్పాటుగా వెళ్లేందుకు ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఈ నెల 15వ తేదీలోగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ (విజయవాడ) , టోల్ ఫ్రీనంబర్ 1800 4257873, ల్యాండ్‌లైన్ 0866 2471786, aphajcommittee@gmail.comలో సంప్రదించవచ్చన్నారు. వివరాలకు www.hajcommittee.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చని హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్ తెలిపారు.

మంత్రి రోజా కార్యాలయ నిర్వాహకుడిపై హత్యాయత్నం

- తిరుత్తణిలో వాకింగ్ చేస్తుండగా ఇనుపరాడ్లతో దాడి చేసిన దుండగులు
- గతంలో టీడీపీ ర్యాలీలోనూ అతడి షోరూంపై దాడి



ప్రతీష్‌ను చెన్నైకి తరలిస్తున్న వైద్యసిబ్బంది

నగరి (చిత్తూరు జిల్లా): నగరిలోని మంత్రి ఆర్కే రోజా కార్యాలయ నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతీష్‌పై రాష్ట్ర సరిహద్దుకు సమీపంలో తమిళనాడులోని తిరుత్తణిలో శుక్రవారం ముగ్గురు దుండగులు హత్యాయత్నం చేశారు. తిరుత్తణిలో కాపురం ఉంటున్న ఆయన ఉదయం వాకింగ్‌కు వెళుతుండగా ముసుగేసుకుని వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఇనుపరాడ్లతో దాడిచేసి కొట్టారు. ప్రతీష్ అరుపులకు స్థానికులు అక్కడకు రావడంతో వారు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ప్రతీష్‌ను తిరుత్తణి ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం చెన్నై మియాట్ ఆస్పత్రికి తరలించారు. తిరుత్తణి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మదిఅరసన్, ఎస్ఐ రాకీకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజకీయ కక్షలే కారణం కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రతిపక్ష పార్టీ కుట్రే: ప్రతీష్‌పై హత్యాయత్నం ప్రతిపక్ష పార్టీ కుట్రేనని వైఎస్సార్‌సీపీ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ నగరి పట్టణంలో ర్యాలీ నిర్వహించినప్పుడు ప్రతీష్‌కు చెందిన ద్విచక్రవాహన షోరూమ్‌పై టీడీపీ రౌడీమూకలు దాడిచేశాయని గుర్తుచేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చురుగ్గా వ్యవహరిస్తున్న ప్రతీష్‌ను అడ్డుతొలగించుకోవాలని తిరుత్తణిలో అతడి మీద దాడిచేశారని ఆరోపిస్తున్నారు. చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతీష్‌ను మంత్రి రోజా పరామర్శించారు. వైద్యులను అడిగి అతడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. హత్యాయత్నం చేసినవారు ఎవరో త్వరలోనే తెలుస్తుందని, చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

మేధో వలసపై పునరాలోచన చేయాలి

ప్రముఖ ఆర్థికవేత్త సంజయ్‌బారూ



మధురవాడ (విశాఖపట్నం): మేధో వలసపై అంతా పునరాలోచన చేయాలని ప్రముఖ ఆర్థికవేత్త, జర్నలిస్ట్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మీడియా అడ్వైజర్ సంజయ్‌బారూ సూచించారు. మధురవాడలోని విశాఖపట్నం ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ (ఐడీఎస్‌ఏపీ)లో రొక్కం రాధాకృష్ణ 2వ స్మారక ఉపన్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంజయ్ బారూ మాట్లాడుతూ భారత్ నుంచి ప్రపంచ దేశాలకు వలస వెళ్లిన వారు మూడున్నర కోట్ల మందికి పైగా ఉన్నారన్నారు. వీరిలో 2 కోట్ల మంది బ్రిటిష్ కాలంలోనే వెళ్లిపోయారని తెలిపారు. మారిషస్, డయానా తదితర దేశాలకు పేదరికంతో వలస వెళ్లిపోయారన్నారు. ఈ వలసలు మొదటి జనరేషన్ వలసలుగా పేర్కొనవచ్చని, ఇవి 1830–1920 మధ్య జరిగాయని తెలిపారు. రెండోసారి 1970 తర్వాత గల్ఫ్ దేశాలకు వెళ్లారని, తర్వాత అమెరికా వంటి దేశాలకు సాఫ్ట్‌వేర్ ప్రొఫెషన్స్ వెళ్లారన్నారు. దీనిని సెకండ్ మైగ్రేషన్ (మిడిల్ క్లాస్ మైగ్రేషన్) అంటారని తెలిపారు. కానీ ప్రస్తుతం ఎంతో మంది మన దేశాన్ని వదిలి వెళ్లిపోతున్నారని, ఇది మన దేశ ఆర్థిక వ్యవస్థకి చాలా నష్టం కలిగిస్తుందని గుర్తించాలని పిలుపు నిచ్చారు.

ఎన్నికల్లో చంద్రబాబును తరిమికొట్టడం ఖాయం

- ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు
- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 20 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన కాట్రేనిపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే మేకా ప్రతాప్

నూజివీడు: రాబోయే ఎన్నికల్లో తమ ఓటు హక్కు ద్వారా చంద్రబాబును రాష్ట్రం నుంచి ప్రజలు తరిమికొట్టడం ఖాయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన 20 కుటుంబాలు గురువారం రాత్రి టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. కలపాల నాగేశ్వరరావు, శ్రీను, నాగరాజు, ఏసు, సొంగా నాగరాజు, నిడమర్తి శ్రీను తదితర 20 కుటుంబాల వారు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు.రాష్ట్ర ప్రజలు చంద్రబాబును 2014లో గెలిపించినందుకే ఆంధ్రప్రదేశ్‌ను నాశనం చేశారని, రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకవైపు పేదల సంక్షేమాన్ని, మరోవైపు అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పరిపాలన చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైఎస్సార్‌సీపీ ముసునూరు మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, సోషల్ మీడియా మండల కన్వీనర్ కంభాల దాసు పాల్గొన్నారు.

వంట చేయలేదని తల్లిని కొట్టి చంపిన బాలుడు

- బెంగళూరులోని కృష్ణరాజపురంలో ఘటన



కృష్ణరాజపురం: వంట చేయలేదని తల్లిని బాలుడు ఇనుపరాడ్‌తో కొట్టి చంపిన అమానుష ఘటన బెంగళూరులోని కృష్ణరాజపురంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కోలారుజిల్లా ముళబాగిలుకు చెందిన నేత్రావతి(45) భర్తతో విడిపోయి కృష్ణరాజపురానికి వలస వచ్చింది. ఆమెకు పవన్ (17) అనే కుమారుడు ఉన్నాడు. సొంత ఊరిలో ఇటీవల కొత్తగా ఇల్లు నిర్మించారు. కుమారుడితో కలిసి సొంత ఊరు వెళ్లి గురువారం రాత్రి తిరిగి కృష్ణరాజపురం వచ్చారు. శుక్రవారం ఉదయం పవన్ పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమై టిఫిన్ గురించి తల్లిని ప్రశ్నించాడు. 'నీకు ఎందుకు టిఫిన్ చేయాలి.. నువ్వు నా కొడుకువు కాదు.. నేను నీ తల్లిని కాదు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆవేశానికి గురైన పవన్ అక్కడే ఉన్న ఇనుప రాడ్‌తో తల్లి తలపై బాదాడు. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం బాలుడు కృష్ణరాజపురం పోలీసులకు ఫోన్ చేసి జరిగిన ఘటనను తెలియజేశాడు. వారు రాగానే లొంగిపోయాడు. పోలీసులు నేత్రావతి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా హంపీ ఉత్సవాలు ప్రారంభం



డోలు వాయించి హంపీ ఉత్సవాలను ప్రారంభిస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

సాక్షి, బళ్లారి: ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన హంపీ ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. విజయనగర జిల్లా, హొస్పేట్ సమీపంలోని హంపీలో గాయత్రి పీఠం వద్ద ఏర్పాటు చేసిన ప్రధాన వేదికపై నుంచి శుక్రవారం రాత్రి సీఎం సిద్ధ రామయ్య భువనేశ్వరీ మాతకు ప్రత్యేక పూజలు చేసి, హారతి ఇచ్చిన అనంతరం సంప్రదాయబద్ధంగా డోలు వాయించి హంపీ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఉత్సవాలు మూడు రోజులు జరుగుతాయని సీఎం చెప్పారు. గాయత్రీ పీఠం, ఎదురు బసవణ్ణ, విరూపాక్షేశ్వర ఆలయం, సాసివెకాళు గణేశుడి ఆలయం వద్ద వేదికలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ క్రీడలు రసవత్తరంగా సాగాయి. ఈ ఉత్సవాల కోసం హొస్పేట్ నుంచి హంపీకి ఉచిత బస్సు సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

భార్యకు శిరోముండనం

- భార్యాభర్తల మధ్య మనస్పర్థలు
- భర్త, కుటుంబ సభ్యులపై భార్య పోలీసులకు ఫిర్యాదు
- కోర్టులో కేసు ఉండగా భార్య ఇంటికి వచ్చిందంటూ తీవ్రంగా కొట్టి శిరోముండనం చేసిన భర్త
- తూర్పుగోదావరి జిల్లాలో ఘటన



సీతానగరం : భార్యకు భర్త శిరోముండనం చేసిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. తూర్పు గోదావరి జిల్లా పెదకొండేపూడికి చెందిన అభిరామ్(రాంబాబు), హైదరాబాద్‌లో షార్ట్ ఫిల్ముల షూటింగులకు వెళ్లేవాడు. అక్కడికి ఆ ప్రాంతానికే చెందిన షేక్ ఆశా కూడా వచ్చేది. ఈ క్రమంలో వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ 2016లో వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు కలిగాడు. కొన్నేళ్లు కాపురం సజావుగా సాగాక అభిరామ్‌కు వేరే అమ్మాయితో పరిచయం ఏర్పడి ఆశాను నిర్లక్ష్యం చేయడంతో ఇద్దరి మధ్య గొడవలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో భార్యకు చెప్పకుండా అభిరామ్ పెదకొండేపూడి వచ్చి పోలవరం ప్రాజెక్టులో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి ఆచూకీ కోసం ఆరా తీస్తున్న ఆశా కూడా కొద్ది రోజులకు ఇక్కడకు చేరుకుంది. ఇద్దరి మధ్య గొడవలు కొనసాగడంతో పెద్దలు రాజీ చేశారు. అయినా గొడవలు తగ్గకపోవడంతో భర్త, అత్త రాఘవ, మామ చిట్టిబాబుపై ఆశా 2021 జూన్‌లో సీతానగరం పోలీస్ స్టేషన్‌లో వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచీ భార్యాభర్తలిద్దరూ దూరంగా ఉంటున్నారు. ఈ కేసు కోర్టులో ఉండగా.. తన భర్త అభిరామ్‌కు రెండో పెళ్లి చేస్తున్నారనే అనుమానం రావడంతో ఆశా తన ఆరేళ్ల కొడుకుతో కలసి మూడు రోజుల క్రితం పెదకొండేపూడిలోని అతడి ఇంటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో గొడవలు అవుతాయనే భయంతో అత్తమామలిద్దరూ వేరే ఊరు వెళ్లారు. అభిరామ్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇంటికి వచ్చి, కోర్టు కేసు ఉండగా ఎందుకు మా ఇంటికి వచ్చావంటూ ఆశాపై ఆగ్రహంతో ఊగిపోయాడు. ఆమెను కొడుతూ గదిలోకి తీసుకువెళ్లి రెండు చేతులు కట్టి, పీకపై కాలు ఉంచి, కత్తితో శిరోముండనం చేశాడు. దీనిపై ఆశా సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని, ఆశాను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్ఐ టి.రామకృష్ణ చెప్పారు.

ఆన్‌లైన్ యాప్ ఉచ్చులో ఏజెన్సీ యువత

- ఒకొక్కరూ రూ.5 వేల నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి
- మోసపోయిన 5వేల మంది యువత

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): తక్కువ సమయంలో సులువుగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశ ఏజెన్సీ యువతను నిండాముంచింది. చింతూరు ఏజెన్సీలో చైన్‌లింక్ ద్వారా పాపులర్ అయిన ఓ యాప్ ముందుగా డబ్బులు రుచి చూపించి చివరకు అకస్మాత్తుగా మూసేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే.. 'టీసీఐ యాప్' పేరుతో ఓ మహిళ ఏజెన్సీ యువతను ఆన్‌లైన్ ద్వారా పరిచయం చేసుకుని ఓ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. లింకు ద్వారా ఈ గ్రూపులో చేరిన వారు ముందుగా రూ.490 ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే రోజుకు రూ.23 చొప్పున 45 రోజుల అనంతరం రూ.950 వస్తాయని నమ్మబలికింది. దీంతోపాటు లింక్ ద్వారా ఇతరులను చేర్పిస్తే ఒక్కొక్కరికీ రూ.100 చొప్పున ఎంతమందిని చేర్పిస్తే అన్ని వందలు వస్తాయని నమ్మించింది. 50 మందిని చేరిస్తే లీడర్‌షిప్ కూడా వస్తుందని గాలం వేసింది. కాగా, ఈ వలలో చిక్కుకుని ముందుగా పెట్టుబడి పెట్టిన వారికి ప్రతిరోజూ విత్‌డ్రా రూపంలో అధిక మొత్తంలో సొమ్ము రావడంతో మిగతా యువత కూడా ఆశతో వారి లింక్ ద్వారా గ్రూపులో చేరి భారీగా డిపాజిట్ చేశారు.

నిలిచిన చెల్లింపులు..

గత మూడ్రోజుల క్రితం అకస్మాత్తుగా యాప్ చెల్లింపులు నిలిచిపోయాయని బాధితులు వాపోతున్నారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో సుమారు ఐదువేల మంది యువత సుమారు రూ.5 వేల నుంచి రూ.3 లక్షల వరకు ఈ యాప్‌లో డిపాజిట్ చేసినట్లు సమాచారం. నష్టపోయిన యువత తమకు జరిగిన నష్టాన్ని ఎవరికీ చెప్పుకోలేక పోవడంతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడంలేదు. దీనిపై చింతూరు సీఐ గజేంద్రకుమార్‌ను వివరణ కోరగా.. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పెన్షనర్ల ధర్నా వాయిదా

సాక్షి,అమరావతి: రాష్ట్రంలోని పెన్షనర్లు ఈ నెల 5న తలపెట్టిన ధర్నా సహా ఇతర ఆందోళన కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (అమరావతి) తెలిపింది. శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ పింఛన్‌ను 10–7 శాతానికి తగ్గించిందని, దీన్ని పునరుద్ధరించాలని కోరుతూ తాము ఈ నెల 5 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, మంత్రుల బృందం కమిటీ సభ్యుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖరరెడ్డిలు తమను చర్చలకు పిలిచినట్లు చెప్పారు. సమావేశంలో పెన్షనర్లకు డీఏ ఎరియర్‌లు, పీఆర్సీ ఎరియర్‌లు, ఈహెచ్ఎస్ కార్డులివ్వాలని కోరగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని చెప్పారు.



రాజకీయాల్లోకి 'దళపతి' విజయ్

తమిళగ వెట్రి కళగం పేరిట పార్టీ ప్రకటన

సాక్షి, చెన్నై: తమిళ రాజకీయ ముఖచిత్రంపై మరో అగ్రతార మెరిసింది. క్రియాశీలక రాజకీయాల్లో అడుగుపెడుతున్నట్లు తమిళ అభిమానుల 'దళపతి', ప్రముఖ నటుడు విజయ్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రకటన విడుదలచేశారు. ''తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నాం. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం కేంద్ర ఎన్నికల సంఘం వద్ద దరఖాస్తు చేశాం. 2026లో తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో విజయకేతనం ఎగరేయడమే మా లక్ష్యం. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరికీ మద్దతివ్వబోం. అవినీతి, అధ్వాన్న పరిపాలన, విభజన రాజకీయాలతో పాలిటిక్స్‌ను భ్రష్టుపట్టించారు. నిస్వార్థంగా, పారదర్శకంగా, మార్గదర్శకంగా, అద్భుతమైన పరిపాలనకు బాటలు పరిచే రాజకీయ ఉద్యమం కోసం తమిళ ప్రజలు ఎదురుచూస్తున్నారు. కుల, మత విభేదాలకు అతీతంగా పాలించే అవినీతిరహిత ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు '' అని విజయ్ వ్యాఖ్యానించారు. పార్టీ అధ్యక్షుడు విజయ్, సీనియర్ నేతలు గత నెల 25వ తేదీన పార్టీ సర్వసభ్య మండలి, కార్యనిర్వాహణ మండలి సమావేశంలో పాల్గొని పార్టీ నియమావళి, నిబంధనలకు ఆమోద ముద్ర వేశారని పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్నాళ్లనుంచో సేవ చేద్దామనుకుంటున్నా

''రాజకీయాల్లో మార్పులు తేగల సత్తా ప్రజా ఉద్యమానికే ఉంది. అది మాత్రమే తమిళనాడు పౌరుల హక్కులను కాపాడగలదు. కన్న తల్లిదండ్రులతో పాటు నాకు పేరు ప్రతిష్టలు తెచ్చిన రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలని ఎన్నాళ్ల నుంచో అనుకుంటున్నా. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి, విజయం సాధించి ప్రజలు కలలుగన్న రాజకీయ మార్పుకు బాటలు వేయడమే మా లక్ష్యం. ఈసీ నుంచి అనుమతులు వచ్చాక పార్టీ కార్యక్రమాలు మొదలుపెడతాం. లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాక పార్టీ కార్యకర్తలను సంఘటితం చేసి పార్టీ విధానాలు, పార్టీ జెండా, పార్టీ గుర్తు, ఇతర కార్యాచరణకు తుదిరూపునిస్తాం'' అని విజయ్ స్పష్టంచేశారు. '' రాజకీయాలంటే సినిమా ప్రపంచం నుంచి నాకు ఒక విరామం కాదు. తపనతో రాజకీయాల్లోకి వస్తున్నా. రాజనీతి అంటే ప్రజలకు గొప్పగా సేవ చేయడం. ఇప్పటికే ఒప్పుకున్న సినిమాలు పూర్తిచేసి రాజకీయాలకు అంకితమవుతా'' అని అన్నారు.

సైన్యం పడగ నీడన... పాక్‌లో ఎన్నికలకు వేళాయె

సైన్యం దన్ను నవాజ్ షరీఫ్‌కే • నాలుగోసారి గద్దెనెక్కడం ఖాయమే! • జైల్లో ఇమ్రాన్, దీలాపడ్డ పీటీఐ • ప్రభావం చూపేలా లేని పీపీపీ

అది 2018. పాకిస్తాన్లో సాధారణ ఎన్నికల సమయం. సైన్యం ఆగ్రహానికి గురై అవినీతి కేసుల్లో దోషిగా తేలడంతో నవాజ్ షరీఫ్ అప్పటికి ఏడాది క్రితమే ప్రధాని పదవి పోగొట్టుకున్నారు. జైల్లో మగ్గుతున్నందున ఎన్నికల్లో పోటీకీ దూరమయ్యారు. క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్‌ఖాన్ సైన్యం ఆశీస్సులతో ఎన్నికల్లో నెగ్గి ఏకంగా ప్రధాని పీఠమెక్కారు. ఆరేళ్లు గడిచి పాక్ మళ్లీ సాధారణ ఎన్నికల ముంగిట నిలిచేనాటికి ఈ ఇద్దరు మాజీ ప్రధానుల విషయంలో ఓడలు బళ్లు, బళ్లు ఓడలూ అయ్యాయి. సైన్యం కన్నెర్రతో ఇమ్రాన్ పదవి పోగొట్టుకోవడమే గాక అవినీతి కేసుల్లో జైలుపాలయ్యారు. శిక్షల మీద శిక్షలు అనుభవిస్తూ ఎన్నికలకు దూరమయ్యారు. పార్టీకి కనీసం ఎన్నికల గుర్తు కూడా దక్కని దుస్థితి నెలకొంది! చికిత్స పేరుతో ఆరేళ్ల కిందట లండన్ చేరి బతుకు జీవుడా అంటూ ప్రవాసంలో కాలం వెళ్లదీసిన నవాజ్ మళ్లీ సైన్యం దన్నుతో దర్జాగా స్వదేశాగమనం చేశారు. సైన్యం స్క్రిప్టులో భాగంగా అవినీతి కేసులన్నీ కొట్టుకుపోయి నాలుగోసారి ప్రధాని అయ్యేందుకు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు. ఇలా దశాబ్దాలుగా పాక్‌లో నేతల భాగ్యరేఖలను ఇష్టానికి నిర్దేశిస్తూ వస్తున్న సైన్యం కనుసన్నల్లో ఎప్పట్లాగే మరో ఎన్నికల తంతుకు సర్వం సిద్ధమవుతోంది...

సాక్షి, నేషనల్ డెస్క్

ఏ పౌర ప్రభుత్వమూ పూర్తి పదవీకాలం మనుగడ సాగించని చరిత్ర పాక్ సొంతం. చాలాకాలం పాటు ప్రత్యక్షంగా, మిగతా సమయంలో పరోక్షంగా సైనిక నియంతృత్వపు పడగ నీడలోనే ఆ దేశంలో పాలన సాగుతూ వస్తోంది. అలాంటి దేశంలో సైనిక పాలన ఊసు లేకుండా వరుసగా మూడోసారి సాధారణ ఎన్నికలు జరగబోతుండటం విశేషం! ఇలా జరగడం ఆ దేశ చరిత్రలో ఇదే తొలిసారి. 342 మంది సభ్యుల జాతీయ అసెంబ్లీకి ఫిబ్రవరి 8న పోలింగ్‌కు సర్వం సిద్ధమవుతోంది. ఎప్పటి మాదిరే ఈసారి కూడా ఏయే పార్టీలు పోటీ చేయాలో, వాటి తరఫున ఎక్కణ్నుంచి ఎవరు బరిలో ఉండాలో కూడా సైన్యమే నిర్దేశిస్తూ వస్తోంది. దేశ ఆర్థికంగా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలి, నిత్యావసరాలతో పాటు అన్ని ధరలూ ఆకాశాన్నంటుతూ ప్రజల బతుకే దుర్భరంగా మారిన వేళ జరుగుతున్న ఎన్నికలివి. అక్కడ ఏ ఎన్నికలూ వివాదరహితంగా జరగలేదు. కానీ ఈసారి మాత్రం అవి పరాకాష్టకు చేరాయి. నిజానికి గత నవంబర్‌లోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాల్సింది. జనగణనను కారణంగా చూపి ఫిబ్రవరి దాకా వాయిదా వేశారు. నవాజ్ స్వీయ ప్రవాసం నుంచి తిరిగొచ్చి కాలూ చేయీ కూడదీసుకుని బరిలో దిగేందుకు వీలుగానే ఇలా చేశారన్న ఆరోపణలున్నాయి. ఏదేలా ఉన్నా కనీసం ఈసారన్న కాస్త సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు కావాలన్నది సగటు పాక్ పౌరుల ఆశ. అమెరికాతో పాటు అంతర్జాతీయ సంస్థల నుంచి అవసమైన ఆర్థిక సాయం రాబట్టి అవ్యవస్థను చక్కదిద్దడంతో పాటు అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న భారత్‌తో సంబంధాలను మెరుగు పరుచుకోవాలన్నది వారి ఆకాంక్ష. కానీ సర్వం సైన్యం కనుసన్నల్లో సాగుతున్న తీరును బట్టి చూస్తే ఈసారీ అది అత్యాశే అయ్యేలా కనిపిస్తోంది.

నవాజ్ షరీఫ్

పాక్ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా పని చేసిన రికార్డు 74 ఏళ్ల నవాజ్ సొంతం. భారత్‌తో సత్సంబంధాలకు ప్రాధాన్యమిచ్చే నేతగానూ పేరుంది. దేశంలోకెల్లా అత్యంత ధనవంతుడని కూడా చెబుతారు. పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్) సారథిగా మూడోసారి ప్రధానిగా ఉండగా 2017లో పనామా పేపర్స్, లండన్ అపార్ట్‌మెంట్స్ వంటి నానారకాల కేసుల్లో ఇరుక్కున్నారు. పదవి పోగొట్టుకుని జైలుపాలై ప్రాణ భయంతో లండన్ పారిపోయారు.



అనంతరం పగ్గాలు చేపట్టిన ఇమ్రాన్‌కూ నాలుగేళ్లలోపే అదే గతి పట్టింది. 2022లో నవాజ్ సోదరుడు షహబాజ్ షరీఫ్ సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవడంతో నవాజ్‌కు మంచి రోజులు తిరిగొచ్చాయి. గత అక్టోబర్లో ఆయన తిరిగొచ్చి పీఎంఎల్ (ఎన్) పగ్గాలు చేపట్టడం, సైన్యంతో పాటు న్యాయ వ్యవస్థ దన్నూ తోడై ఆయనపై అవినీతి కేసులు, శిక్షలూ ఒక్కొక్కటిగా రద్దవడం చకచకా జరిగిపోయాయి. అడ్డంకులన్నీ తొలిగి ఎన్నికల బరిలో నిలిచిన నవాజ్ నాలుగోసారి ప్రధాని కావడం ఖాయమేనంటున్నారు.

ఇమ్రాన్‌ఖాన్

అనితరసాధ్యమైన క్రికెట్ నైపుణ్యంతో పాక్ ప్రజలను ఉర్రూతలూగించి నేషనల్ హీరోగా వెలుగు వెలిగిన 71 ఇమ్రాన్ రాజకీయ పిచ్‌పై మాత్రం నిలదొక్కుకోలేక చతికిలపడ్డారు. అవినీతిని రూపుమాపి, కుటుంబ రాజకీయాలకు చెక్ పెట్టి సర్వం చక్కదిద్దుతానంటూ మార్పు నినాదంతో 2018లో ప్రధాని అయ్యారాయన. కానీ ఇమ్రాన్ హయాంలో ఆర్థికంగానే గాక అన్ని రంగాల్లోనూ దేశం కుప్పకూలింది. హింసతో, అశాంతితో పాక్ అట్టుడికిపోయింది. ఆయనకు ఆదరణా అడుగంటింది. నిజానికి సైన్యం చేతిలో పావుగానే ఇమ్రాన్ రాజకీయ ప్రవేశం జరిగిందంటారు. అలాంటి సైన్యానికే ఎదురు తిరగడంతో ఇమ్రాన్ పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. ఎంత ప్రయత్నించినా పదవిని కాపాడుకోలేకపోయారు. పైగా జైలు శిక్ష వల్ల తాను పోటీ చేసే అవకాశం లేదు. ఆయన పార్టీ తరఫున కొందరు ధైర్యం చేసి ఇండిపెండెంట్లుగా బరిలో దిగుతున్నా చాలా మంది జైలుపాలయ్యారు. పలువురు ఫిరాయించగా మిగిలిన వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ సమస్యలు చాలవన్నట్టు పీటీఐ ఎన్నికల గుర్తు బ్యాట్‌పైనా ఎన్నికల సంఘం వేటు వేసింది. దాంతో లక్షలాది మంది నిరక్షరాస్య ఓటర్లు బ్యాలెట్ పత్రాలపై ఇమ్రాన్ పార్టీని గుర్తించను కూడా లేరంటున్నారు.



బిలావల్ భుట్టో

35 ఏళ్ల బిలావల్ భుట్టో జర్దారీ పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ చైర్మన్. దారుణ హత్యకు గురైన మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో, పాక్ మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ కుమారుడు. షహబాజ్ షరీఫ్ సర్కారులో విదేశాంగ మంత్రిగా తన పనితీరుతో స్వదేశంలో విమర్శల పాలు, భారత్‌లో నవ్వుల పాలయ్యారు. గత ఎన్నికల్లో పీపీపీ మూడో స్థానంలో నిలిచింది. ఈసారి అన్నీ కలిసొస్తే బహుశా కింగ్‌మేకర్ అవ్వొచ్చంటున్నారు.



పాక్ జాతీయ అసెంబ్లీలో 342 మంది సభ్యులుంటారు. 266 మందిని నేరుగా ఉన్నుకుంటారు. 70 సీట్లను మహిళలు, మతపరమైన మైనారిటీలకు; ఆరింటిని గిరిజన ప్రాంతాల వారికి రిజర్వు చేశారు. ఈ స్థానాలను పార్టీలకు గెలుచుకున్న స్థానాలను బట్టి నైష్పత్తిక ప్రాతిపదికన కేటాయిస్తారు.

సీఎంగా చంపయ్ ప్రమాణం

రాంచీ: జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) శాసనసభాపక్ష నేత చంపయ్ సోరెన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ఆయనతో సీఎంగా ప్రమాణం చేయించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అలంగీర్ అలాం, రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) నేత సత్యానంద్ భోక్తా రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 67 ఏళ్ల గిరిజన నాయకుడు చంపయ్ సోరెన్ జార్ఖండ్‌కు 12వ ముఖ్యమంత్రిగా రికార్డుకెక్కారు. మనీ లాండరింగ్ కేసులో ఈడీ విచారణను ఎదుర్కొంటున్న జేఎంఎం అగ్రనేత హేమంత్ సోరెన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో పార్టీ శాసనసభాపక్ష నేతగా చంపయ్ సోరెన్‌ను ఎన్నుకున్న సంగతి తెలిసిందే. సీఎంగా ప్రమాణం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హేమంత్ సోరెన్ ప్రారంభించిన సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని చెప్పారు.

హైదరాబాద్ చేరుకున్న జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలు

జార్ఖండ్ సీఎంగా చంపయ్ సోరెన్ ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పాలిత తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తరలించారు. తమ ఎమ్మెల్యేలపై విపక్ష బీజేపీ వల విసిరే అవకాశం ఉండడంతో ముందుజాగ్రత్తగా వారిని బయటకు తరలించినట్లు కూటమి నేతలు చెప్పారు.



ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్‌తో చంపయ్ సోరెన్

సోరెన్ అరెస్టుపై జోక్యం చేసుకోలేం

సుప్రీం స్పష్టీకరణ.. పీఎంఎల్‌ఏ కోర్టులో 5 రోజుల రిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ/రాంచీ: జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన అరెస్టుపై జోక్యం చేసుకొనేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేయడం తెలిసిందే. ఇది అక్రమమంటూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఒక సీఎంనేఉ అరెస్టు చేయడం సరైంది కాదని సోరెన్ తరఫున సీనియర్ లాయర్లు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ వాదించారు. ఆధారాలు పరిశీలించాలని, ఇలాంటి కేసుల్లో తగిన సందేశమివ్వాలని కోరారు. హైకోర్టూ రాజ్యాంగబద్ధమైన న్యాయ స్థానమేనని, అరెస్టుపై ఉపశమనం కావాలంటే అక్కడికి వెళ్లొచ్చని ధర్మాసనం పేర్కొంది. మరోవైపు ఈడీ కోరిక మేరకు హేమంత్‌కు పీఎంఎల్‌ఏ కోర్టు 5 రోజుల రిమాండ్‌కు అప్పగించింది. భద్రతా కారణాల రీత్యా రాత్రిళ్లు సోరెన్ జైల్లోనే ఉండేందుకు అనుమతించాలన్న విజ్ఞప్తిపై కోర్టు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

పార్లమెంట్‌లో మాటల యుద్ధం

జార్ఖండ్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటులో జేఎంఎం కూటమికి ఎదురైన అడ్డంకులు, హేమంత్ అరెస్ట్ వ్యవహారంలో ఈడీ తీరుపై పార్లమెంట్‌లో శుక్రవారం వాడివేడిగా చర్చ జరిగింది. లోక్‌సభలో ఇండియా కూటమి ఎంపీలు వాకౌట్ చేయగా, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వాగ్వాదానికి దిగారు. బిహార్‌లో నితీశ్ కుమార్ ఇలా రాజీనామా చేసి గంటల వ్యవధిలోనే మళ్లీ సీఎంగా ప్రమాణం చేశారని ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని లెక్కచేయకపోవడం సిగ్గుచేటన్నారు. జార్ఖండ్‌లో ఉన్నది అవినీతి ప్రభుత్వమంటూ గోయల్ కౌంటర్ ఇచ్చారు.

ఢిల్లీలో ఆప్, బీజేపీ పోటాపోటీ నిరసనలు

న్యూఢిల్లీ: బీజేపీ, ఆప్ చేపట్టిన పోటీపోటీ నిరసనలతో శుక్రవారం సెంట్రల్ ఢిల్లీ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. రెండు పార్టీల శ్రేణులు నేరుగా తలపడే పరిస్థితిని నివారించేందుకు పోలీసులు పలు అంచెల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. దేశ రాజధాని వ్యాప్తంగా పోలీసులను పెద్ద సంఖ్యలో మోహరించారు. పండిట్ దీన్ దయాళ్ మార్గ్(డీడీయూ)వైపు వచ్చే వాహనాలను దారి మళ్లించారు. భారీ ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బీజేపీ మోసానికి పాల్పడిందని ఆరోపిస్తూ ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) శుక్రవారం బీజేపీ ప్రధాన కార్యాలయం ఎదురుగా నిరసన తెలపాలని నిర్ణయించింది. అదేసమయంలో, ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా ఆప్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టాలని కాషాయ పార్టీ తీర్మానించుకుంది. ఆ మేరకు రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు బయలుదేరగా పోలీసులు వారిని 800 మీటర్ల దూరంలో ఆపేశారు. రోడ్డుపై పలు అంచెల్లో బారికేడ్లను ఏర్పాటు చేసి, పెద్ద సంఖ్యలో బలగాలను మోహరించి పరస్పరం తలపడే పరిస్థితిని నివారించారు. రెండు పార్టీల నాయకులు అక్కడే ధర్నా చేపట్టారు.

ఈడీ సమన్లకు అయిదోసారీ దుమ్మా

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ప్రశ్నించేందుకు ఈడీ బుధవారం ఐదోసారి పంపిన సమన్లనూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పట్టించుకోలేదు. శుక్రవారం విచారణకు దుమ్మా కొట్టారు.

ఉత్తరాఖండ్‌లో బహుభార్యత్వం రద్దు!

- సహజీవన డిక్లరేషన్ తప్పనిసరి
- ప్రభుత్వానికి అందిన ఉమ్మడి పౌర స్మృతి ముసాయిదా
- త్వరలో చట్టం తెస్తామన్న సీఎం

డెహ్రాడూన్: బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో బహుభార్యత్వంపై నిషేధంతో పాటు సహజీవనాన్ని ధ్రువీకరిస్తూ డిక్లరేషన్‌నూ తప్పనిసరి చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. రాష్ట్రంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అమలుకు సంబంధించిన ముసాయిదాను జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ కమిటీ శుక్రవారం సీఎం పుష్కర్ సింగ్ ధామికి సమర్పించింది. అందులో కీలక ప్రతిపాదనలు చేసింది. ''రాష్ట్రంలో జరిగే ప్రతి పెళ్లినీ విధిగా రిజిస్టర్ చేయించాల్సిందే. విడాకులు కోరే హక్కులు భార్యభర్తలకు సమానంగా ఉంటాయి. భార్య జీవించి ఉండగా భర్త మరో పెళ్లి చేసుకోవడం చట్టప్రకారం నేరం. బహు భార్యత్వంపై నిషేధం అమలు చేయాలి. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకూ వారసత్వ హక్కులుంటాయి. సహజీవనం చేస్తుంటే దానిని అధికారికంగా ధ్రువీకరిస్తూ స్త్రీ, పురుషులిద్దరూ డిక్లరేషన్‌ను సమర్పించాలి'' అని పేర్కొంది. ఈ నిబంధనల నుంచి షెడ్యూల్ తెగలకు మినహాయింపు ఇవ్వనున్నారు. యూసీసీ ముసాయిదా రూపకల్పన కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం 202లో ఈ కమిటీని వేసింది. 2022 అసెంబ్లీ ఎన్నికల హామీ అమలు దిశగా ఇదో కీలక అడుగని ధామీ అభివర్ణించారు. ముసాయిదాను క్షుణ్నంగా పరిశీలించాక అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని చెప్పారు. ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో యూసీసీ బిల్లును తెచ్చి ఆమోదించి చట్టం చేస్తామన్నారు. యూసీసీ అమలైతే వివాహం, విడాకులు, ఆస్తి, వారసత్వం వంటి అంశాల్లో పౌరులందరికీ మతంతో సంబంధం లేకుండా సమాన చట్టాలు అమలవుతాయి.

మేమూ అదే బాటలో: అసోం సీఎం

బహుభార్యత్వం విధానాన్ని రద్దుచేయనున్నట్లు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కూడా ప్రకటించారు. ''అసోంలో యూసీసీ అమలుపై గతేడాదే మాకు నివేదిక అందింది. దానిని న్యాయశాఖ పరిశీలిస్తోంది. కుదిరితే ఫిబ్రవరి ఐదున మొదలయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లుగా ప్రవేశపెట్టి చట్టంగా తెస్తాం'' అని హిమంత అన్నారు.

సీబీఎస్ఈ 9వ తరగతి పుస్తకాల్లో... డేటింగ్, రిలేషన్‌షిప్ పాఠాలు

న్యూఢిల్లీ: టీనేజీ విద్యార్థులకు ఏదైనా ఒక విషయాన్ని సమాజం.. తప్పుడు కోణంలో చెప్పేలోపే దానిని స్పష్టమైన భావనతో, సహేతుకమైన విధానంలో పాఠంగా చెప్పడం మంచిదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) సీబీఎస్ఈ నిర్ణయించుకుంది. పిల్లలతో తల్లిదండ్రులు చర్చించడానికి విముఖత చూపే డేటింగ్, రిలేషన్‌షిప్ వంటి సున్నితమైన అంశాలపై టీనేజీ విద్యార్థుల్లో సుస్పష్టమైన ఆలోచనను పాదుకొల్పే సదుద్దేశంతో సీబీఎస్ఈ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా డేటింగ్, రిలేషన్‌షిప్ వంటి ఛాప్టర్లను తమ 9వ తరగతి 'వాల్యూ ఎడిషన్' పాఠ్యపుస్తకాల్లో చేర్చింది. టీనేజీ విద్యార్థుల్లో హార్మోన్ల ప్రభావంతో తోటి వయసు వారిపై ఇష్టం, కలిసి మెలసి ఉండటం వంటి సందర్భాల్లో ఎలా వ్యవహరించాలో సవివరంగా చెబుతూ ప్రత్యేకంగా పాఠాలను జతచేశారు. 'డేటింగ్ అండ్ రిలేషన్‌షిప్స్: అండర్‌స్టాండింగ్ యువర్‌సెల్ఫ్ అండ్ ది అదర్ పర్సన్' పేరుతో ఉన్న ఒక పాఠం, కొన్ని పదాలకు అర్థాలు, ఇంకొన్ని భావనలపై మీ అభిప్రాయాలేంటి? అనే ఎక్సర్‌సైజ్ సంబంధ పేజీలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. ఫొటోల వంటి ఇతరుల సమాచారాన్ని దొంగతనంగా సేకరించి వాటితో ఇంకొకరిని ఆకర్షించే 'క్యాట్‌ఫిషింగ్', సంజాయిషీ లేకుండా బంధాన్ని హఠాత్తుగా తెగతెంపులు చేసుకునే 'ఘోస్టింగ్', 'సైబర్ బులీయింగ్' పదాలకు అర్థాలను వివరిస్తూ చాప్టర్లను పొందుపరిచారు. 'క్రష్', 'స్పెషల్' ఫ్రెండ్ భావనలను చిన్న చిన్న కథలతో వివరించారు.

'ప్రత్యేక దేశం' వ్యాఖ్యలపై పార్లమెంట్‌లో రగడ

కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలి: బీజేపీ

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని, వాటన్నింటినీ కలిపి ప్రత్యేక దేశం చేయాలంటూ కర్ణాటక కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభల్లో శుక్రవారం తీవ్ర రగడ చోటుచేసుకుంది. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ తక్షణమే క్షమాపణ చెప్పాలని రాజ్యసభలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ డిమాండ్ చేశారు. దేశాన్ని ముక్కలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. కాంగ్రెస్ ఎంపీ ప్రకటనను తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదని, ఇది భారత రాజ్యాంగంపై దాడేనని స్పష్టం చేశారు. రాజ్యాంగానికి విధేయులుగా ఉంటామని ఎన్నికల్లో గెలవగానే ఎంపీలతో ప్రమాణం చేయించాలని అభిప్రాయపడ్డారు. దేశ విభజనను కాంగ్రెస్ కోరుతోందా అని ప్రశ్నించారు. రాజ్యసభ సభ్యుడు కాని వ్యక్తి వ్యాఖ్యలపై సభలో చర్చ ఎందుకని కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. విభజన ఆలోచనను తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని అన్నారు. డీకే అనుచితంగా మాట్లాడినట్లు తేలితే సభా హక్కుల కమిటీ చర్యలు తీసుకోవచ్చన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తనకు చాలా ఆదరణ ఉందంటూ ఎన్నికలను శాశ్వతంగా రద్దు చేయడం ఖాయమంటూ దుయ్యబట్టారు. లోక్‌సభ సభ్యుల వ్యాఖ్యలపై రాజ్యసభలో చర్చించవచ్చని గతంలోనే ఆదేశాలిచ్చానని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ గుర్తుచేశారు.

హైవేలపై డ్రైవర్లకు భవనాలు: మోదీ

న్యూఢిల్లీ: ట్రక్కులు, ట్యాక్సీ డ్రైవర్లకు జాతీయ రహదారులపై తగినంత విశ్రాంతి తదితర సౌకర్యాల నిమిత్తం కొత్త పథకం తేనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ''ఇందులో భాగంగా తొలి దశలో అన్ని సదుపాయాలతో కూడిన 1,000 అధునాతన భవనాలు నిర్మిస్తాం. వాటిలో ఫుడ్ స్టాళ్లు, స్వచ్ఛమైన తాగునీరు, టాయ్‌లెట్లు, పార్కింగ్, విశ్రాంతి స్థలాల వంటివన్నీ ఉంటాయి'' అని వెల్లడించారు. శుక్రవారం భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో–2024లో పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా పరుగులు తీస్తోందని మోదీ అన్నారు. తాము వరుసగా మూడోసారి గెలిచి కేంద్రంలో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేశాక ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని పునరుద్ఘాటించారు. ఆటో, ఆటోమోటివ్ పరిశ్రమది ఇందులో కీలక పాత్ర కానుందన్నారు. దేశ మొబైల్ పరిశ్రమకు ఇది స్వర్ణయుగమన్నారు.

ఆరు హైకోర్టులకు సీజేల నియామకం

న్యూఢిల్లీ: ఆరు హైకోర్టులకు నూతన ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇన్నాళ్లూ రాజస్తాన్ హైకోర్టుకు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా ఉన్న మనీంద్ర మోహన్ శ్రీవాస్తవను అదే కోర్టులో చీఫ్ జస్టిస్(సీజే)గా నియమించారు. పంజాబ్, హరియాణా హైకోర్టు యాక్టింగ్ సీజే జస్టిస్ రీతూ బహ్రీని ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా నియమించారు. పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్‌ను ఒడిశా హైకోర్టు సీజేగా నియమించారు. రాజస్తాన్ హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ను గౌహతీ హైకోర్టు సీజేగా నియమించారు. రాజస్తాన్ హైకోర్టులో జడ్జి జస్టిస్ అరుణ్ భన్సాలీని అలహాబాద్ హైకోర్టు సీజేగా నియమించారు. మద్రాస్ హైకోర్టులో జడ్జి జస్టిస్ ఎస్. వైద్యనాథన్‌ను మేఘాలయ హైకోర్టుకు సీజేగా నియమించారు.

అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి

నెల రోజుల వ్యవధిలో మరణించిన నాలుగో భారత విద్యార్థి

న్యూయార్క్: అమెరికాలో మరో భారతీయ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. నెల రోజుల వ్యవధిలో అమెరికాలో చోటుచేసుకున్న నాలుగో ఘటన ఇది. ఓహియో రాష్ట్రం సిన్సినాటిలో లింద్నెర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుకుంటున్న శ్రేయస్ రెడ్డి బెనిగెరి అనే తెలుగు విద్యార్థి చనిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారని, అతడి మరణం వెనక ఎటువంటి కుట్ర లేదని భావిస్తున్నట్లు న్యూయార్క్‌లోని భారత దౌత్య కార్యాలయం గురువారం తెలిపింది. శ్రేయస్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నామని, సాధ్యమైనంత మేర వారికి సాయం అందజేస్తామని పేర్కొంది. శ్రేయస్ రెడ్డి తండ్రి త్వరలోనే అమెరికా రానున్నారని తెలిపింది.

భారత్‌లో 9 లక్షల క్యాన్సర్ మరణాలు

2022లో 14 లక్షలకుపైగా కేసులు: డబ్ల్యూహెచ్‌వో

న్యూఢిల్లీ: భారత్‌ను క్యాన్సర్ మహమ్మారి కబళిస్తున్న తీరును ప్రపంచ ఆరోగ్య సంస్థ తన తాజా గణాంకాల్లో వెల్లడించింది. ది ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ గణాంకాల ప్రకారం 2022లో భారత్‌లో 14.1 లక్షల క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. క్యాన్సర్ కారణంగా 9.1 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. పురుషుల్లో పెదవులు, నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు సర్వసాధారణమయ్యాయి. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు మహిళల్లో ఎక్కువయ్యాయి. మొత్తం కొత్త కేసుల్లో 27 శాతం బ్రెస్ట్, 18 శాతం సెర్విక్స్ యుటెరీ క్యాన్సర్లు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ సోకి ఐదేళ్లుగా బాధపడుతున్న వారి సంఖ్య 5.3 కోట్లకు చేరిందని నివేదికలో పేర్కొన్నారు.

జార్ఖండ్ సర్కార్‌ను కూల్చే కుట్ర: రాహుల్

పాకూర్(జార్ఖండ్): హేమంత్ సోరెన్‌ను అక్రమంగా జైలుకు పంపి జార్ఖండ్‌లో రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలదోయాలని బీజేపీ కుట్ర పన్నిందని, ప్రజాతీర్పుకు భంగం కల్గకుండా తాము అడ్డుకున్నామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. శుక్రవారం జార్ఖండ్‌లోకి భారత్ జోడో న్యాయ్ యాత్ర అడుగుపెట్టిన సందర్భంగా పాకూర్ జిల్లాలో కార్యకర్తలనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. '' ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోసి ప్రజాతీర్పును బీజేపీ పరిహసించాలని చూసింది. మేం దానిని అడ్డుకున్నాం. ధనం, దర్యాప్తు సంస్థల అండతో బీజేపీ చెలరేగుతోంది'' అని రాహుల్ ఆరోపించారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు తాను కట్టుబడిఉంటానన్నారు. '' అస్సాంలో యాత్రకు అడ్డుపడిన సీఎం హిమంత బిశ్వ శర్మ, మహారాష్ట్రలో పార్టీ మారిన మిలింద్ దేవ్‌రా వంటి నేతలతో పార్టీకి పనిలేదు'' అని రాహుల్ అన్నారు.

నకిలీ రాహుల్ ఆచూకీ దొరికింది: హిమంత

మరోవైపు, అస్సాంలో న్యాయ్‌యాత్ర వేళ బస్సులో రాహుల్ స్థానంలో కూర్చుని అభివాదం చేస్తున్న నకిలీ రాహుల్ ఆచూకీ తాము గుర్తించామని హిమంత చెప్పారు. '' అస్సాంలో మోదీ పర్యటన ముగిశాక పత్రికా సమావేశం ఏర్పాటుచేసి మరో రాహుల్ వివరాలు బహిర్గతం చేస్తా. జనానికి చేతులు ఊపుతూ, యాత్ర బస్సులో ఉన్నది రాహుల్ కాదు'' అని హిమంత అన్నారు.

మద్రాస్ ఐఐటీలో స్పోర్ట్స్ కోటా

ప్రతి యూజీ కోర్సులో అదనంగా రెండేసి సీట్లు

న్యూఢిల్లీ: అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు తొలిసారిగా స్పోర్ట్స్ కోటాను ప్రవేశపెట్టిన ఐఐటీగా మద్రాస్ ఐఐటీ నిలిచింది. 2024–25 అకడమిక్ సెషన్ నుంచి ప్రతి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో అదనంగా రెండు సీట్లను ఇందుకోసం సృష్టించాలని నిర్ణయించినట్లు ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి తెలిపారు. స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అడ్మిషన్(ఎస్ఈఏ) ప్రోగ్రాం కింద సృష్టించిన ఈ రెండు సీట్లలో భారతీయ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని చెప్పారు. ఇందులో ఒకటి విద్యార్థినులకు రిజర్వు చేస్తామన్నారు. ఐఐటీల్లో ప్రస్తుతం స్పోర్ట్స్ కోటా లేదు.

కాంగ్రెస్‌కు 40 సీట్లూ కష్టమే: మమత

కోల్‌కతా: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 40 సీట్లు దక్కేది కూడా కష్టమేనని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. 'బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా దేశవ్యాప్తంగా ఉన్న 300 సీట్లలో పోటీ చేయాలని కాంగ్రెస్‌కు చెప్పాను. కానీ వాళ్లు పట్టించుకోలేదు. ముస్లిం ఓటర్లను రెచ్చగొట్టేందుకు మా రాష్ట్రానికి వచ్చారు. వాళ్లు 300 స్థానాల్లో పోటీ చేస్తే 40 సీట్లయినా వచ్చేది డౌటే' అన్నారు. చేతనైతే హిందీ ప్రాబల్య రాష్ట్రాల్లో బీజేపీని ఢీకొట్టాలని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు.

రేప్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ ఫ్రెండ్స్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో 18 ఏళ్ల యువతి దారుణ అత్యాచారానికి గురైంది. ఇన్‌స్టాగ్రాంలో స్నేహితులుగా మారిన ఇద్దరు యువకులు ఢిల్లీలో ఆమెపై గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. ఆహారంలో మత్తుమందు కలిపి ఈ దారుణానికి పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు.

'జ్ఞానవాపి' పిటిషన్‌పై 6న విచారణ

ప్రయాగ్‌రాజ్: జ్ఞానవాపి మసీదు సెల్లార్‌లో హిందువుల పూజలకు అనుమతిస్తూ వారణాసి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మసీదు కమిటీ వేసిన పిటిషన్‌పై ఈ నెల 6న అలహాబాద్ హైకోర్టు విచారణ చేపట్టనుంది. శుక్రవారం వాదనల అనంతరం న్యాయమూర్తి జస్టిస్ అగర్వాల్ ఈ మేరకు వెల్లడించారు.

కెన్యాలో ట్యాంకర్ పేలి ముగ్గురు మృతి

నైరోబీ: కెన్యా రాజధాని నైరోబీలో గురువారం అర్ధ రాత్రి సమయంలో గ్యాస్ ట్యాంకర్ పేలి బీభత్సం సృష్టించింది. ఘటన లో ముగ్గురు చనిపోగా 270 మందికి పైగా గాయాల పాలయ్యారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకా శం ఉందని సమాచారం.



బెంగళూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసు విభాగం చర్యలు చేపట్టింది. శుక్రవారం కేఆర్‌పురం వద్ద డ్రోన్లను ప్రయోగించిన దృశ్యం

మహానగరం.. ట్రాఫిక్ చక్రబంధం

- బెంగళూరులో తీవ్రమైన వాహనాల రద్దీ
- పీక్ అవర్స్‌లో గంటకు 18 కిలోమీటర్లే ప్రయాణం
- రోజులో సగం సమయం రోడ్లపైనే
- తీవ్ర ఒత్తిడి, అలసటతో నగరవాసులు సతమతం





ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతే అంతే సంగతులు

బనశంకరి: సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలు నగరవాసులను చుక్కలు చూపుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవాల్సిన పరిస్థితిని ప్రతిరోజూ ఎదుర్కొంటున్నారు. ఉదయం ఏడుగంటలకు రోడ్డెక్కితే ఆఫీసుకు వెళ్లి తిరిగి వచ్చేందుకు రాత్రి 8 గంటలు అవుతోందని నగరవాసుల ఆవేదన. ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు.

సమయం, ఇంధనం వృథా..

అత్యంత నిదానంగా ట్రాఫిక్ సాగే నగరాల్లో బెంగళూరు నగరం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. రోడ్లు వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే సమయాల్లో నగరంలో ప్రయాణం గంటకు 18 కిలోమీటర్లే. ఉద్యాననగరిలో వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యల కోసం పోలీస్‌శాఖ నగరంలో 20 హైడెన్సిటి ట్రాఫిక్ కారిడార్లు, అవుటర్‌రింగ్‌రోడ్లలో అధ్యయనం చేసింది. ట్రాఫిక్ సమస్యతో సమయం, ఇంధనం భారీగా వృథా అవుతున్నట్లు తేలింది. నగరవాసులు తమదైనందిన ప్రయాణంలో సగానికి పైగా సమయం ట్రాఫిక్ సిగ్నల్స్‌లోనే గడిచిపోతున్నట్లు అధ్యయనంలో తేలింది.

1.25 కోట్లు దాటిన వాహనాల సంఖ్య..

నగరంలో వాహనాల సంఖ్య ఏటేటా లక్షల సంఖ్యలో పెరుగుతుండగా సంచారం మాత్రం అత్యంత మందగతిలో ఉంది. బెంగళూరు నగరం దేశంలోనే శరవేగంగా విస్తరిస్తున్న మహానగరాల్లో ఒకటి. నగర జనాభాకు సమానంగా వాహనాల సంఖ్య పెరుగుతుంది. దేశంలోనే అత్యధికంగా ఐటీ కంపెనీలు కలిగి ఉండే లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది బెంగళూరు నగరం. దీంతో అనేక రాష్ట్రాల నుంచి ఉద్యోగ, ఉపాధి, శిక్షణ కోసం ప్రజలు రాజధాని బెంగళూరుకు పోటెత్తుతున్నారు. దీంతో వ్యక్తిగత వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది. నగరంలో నిత్యం సుమారు 2 వేల నూతన వాహనాలు రోడ్లపైకి వస్తుండగా ప్రస్తుతం వాహనాల సంఖ్య 1.25 కోట్లు దాటింది. ఇందులో 70 శాతం ద్విచక్రవాహనాలు ఉన్నాయి. నగరంలో 2003లో ప్రతి వెయ్యిమందికి 400 వాహనాలు ఉండగా ప్రస్తుతం ప్రతి ఒక వెయ్యిమందికి సరాసరి 827 వాహనాలు ఉన్నట్లు అంచనా. ఢిల్లీలో ప్రతి వెయ్యిమందికి 320 వాహనాలు, ముంబైలో 220 వాహనాలు ఉన్నాయి. దేశంలోనే అత్యధిక ప్రైవేటు కార్లు కలిగిన నగరాలపైకి బెంగళూరు నగరం ఢిల్లీని దాటేసింది. ఢిల్లీలో 20.70 లక్షల ప్రైవేటు కార్లు ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మెట్రోరైలు, లోకల్ రైళ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. సంచారం ఆలస్యం కావడం, సిగ్నల్‌లో వాహనాలు నిలపడంతో ఇంధనం వృథాకు సంబంధించి ఏటా రూ.19,725 కోట్లు నష్టం వాటిల్లుతున్నట్లు ట్రాఫిక్ పరిష్కార నిపుణుల బృందం అంచనావేసింది.



ట్రాఫిక్ సమస్యకు కారణాలు..

- విపరీతంగా జనాభా పెరుగుదల
- రోజురోజుకూ వాహనాల సంఖ్య పైపైకి
- ప్రముఖులకు కల్పించే జీరో ట్రాఫిక్
- అధ్వానంగా ఉన్న రోడ్లు
- రాజకీయ, ధార్మిక సభలు, సమావేశాలు
- ధర్నాలు, ఊరేగింపులు



వాహనాలతో రద్దీగా ఉన్న ఒక ప్రాంతం

20 లోక్‌సభ స్థానాల్లో గెలుపు కోసం కాంగ్రెస్ వ్యూహ రచన

- మంత్రులతో సీఎం, డీసీఎం భేటీ

శివాజీనగర: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. 28 స్థానాల్లోకి కనీసం 20 చోట్ల విజయపతాకం ఎగురవేయాలనే లక్ష్యంతో పావులు కదుపుతోంది. ఎన్నికల నిర్వహణ, వనరుల సేకరణ, విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం సిద్దరామయ్య గురువారం రాత్రి విందు పేరుతో మంత్రులతో భేటీ అయ్యారు. హైకమాండ్ ఆమోదం తెలిపిన తరువాత జాబితాను ఫైనల్ చేస్తారని, నేటి నుంచి అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ మంత్రులకు తెలిపారని తెలిసింది. గ్యారెంటీ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిసింది. బీజేపీ తరహాలో 28కి 28 స్థానాలు గెలుపొందుతామని చెప్పలేమని, 20 స్థానాల్లో విజయం సాధించేలా లక్ష్యం పెట్టుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి అన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన ఎత్తుగడలపై మంత్రులతో చర్చించేందుకు సీఎం సమావేశం ఏర్పాటు చేశారని, అయితే మంత్రుల పోటీ గురించి చర్చ జరుగలేదన్నారు. హైకమాండ్ సూచనను పాటించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. హైకమాండ్ సూచిస్తే ఎన్నికల్లో బరిలోకి దిగుతామని చెలువరాయస్వామి తెలిపారు.

వణికిస్తున్న కోతి జ్వరాలు

యశవంతపుర: ఉత్తరకన్నడ జిల్లాను కోతిజ్వరాలు వణికిస్తున్నాయి. సిద్ధాపుర తాలూకా కొర్లకై, బిళగి గ్రామాల్లో జ్వరాల బారిన పడినవారి సంఖ్య పెరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా 21 మంది కోతి జ్వరం బారిన పడినట్లు రక్త పరీక్షల్లో వెలుగు చూసింది. ఇద్దరు మంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో, ఆరు మంది సిద్ధాపుర తాలూకా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా 13 మందికి వైద్యులు ఇంటి వద్దనే చికిత్స అందజేస్తున్నారు.

న్యూస్‌రీల్

ఈడీ విచారణపై హైకోర్టు స్టే



బనశంకరి: విచారణ సమయంలో ఈడీ అధికారులు తనను హింసించారని ఆరోపిస్తూ కోముల్ డైరెక్టర్ వైబీ అశ్వత్థనారాయణ ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ఇద్దరు ఈడీ అధికారులపై విల్సన్ గార్డెన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈడీ డిప్యూటీ డైరెక్టర్ మనోజ్‌మిట్టల్, అసిస్టెంట్ డైరెక్టర్ అజయ్‌కుమార్ వైద్యపై విల్సన్ గార్డెన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు రద్దు చేయాలని ఈడీ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయపీఠం ముందు వైబీ అశ్వత్థనారాయణ ప్లాస్టిక్‌పైపుతో తనపై దాడి చేశారని ఆరోపించారు. ఇది అబద్ధమని అదనపు సోలిటరీ జనరల్ ఎస్‌వీ.రాజు కోర్టు దృష్టికి తెచ్చారు. హైకోర్టు న్యాయపీఠం కేసుకు సంబంధించి ఫిర్యాదుదారుడు వైబీ.అశ్వత్థనారాయణకు నోటీస్ జారీచేసి కేసుకు సంబంధించి ఎలాంటి విచారణ చేపట్టరాదని విల్సన్‌గార్డెన్ పోలీసులకు స్టే ఇచ్చింది.

బీఎంటీసీ బస్సు ఢీకొని విద్యార్థిని దుర్మరణం



కుసుమిత(ఫైల్)

యశవంతపుర: బెంగళూరు నగరంలో బీఎంటీసీ బస్సు స్కూటర్‌పైకి దూసుకెళ్లి విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన రాజాజీనగర హరిశ్చంద్ర ఘాట్ వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. కెంగేరి సమీపంలోని ప్రైవేట్ కాలేజీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న మల్లేశ్వరానికి చెందిన కుసుమిత (21) రోజులాగానే శుక్రవారం ఉదయం 8:30 గంటలకు కళాశాలకు బయల్దేరింది. మార్గం మధ్యలో బీఎంటీసీ బస్సు స్కూటర్‌ను ఢీకొని కొంత దూరం వరకు లాక్కెళ్లింది. ప్రమాదంలో కుసుమితాకు బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసీ జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మల్లేశ్వరం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు డీసీపీ సిరిగౌరి తెలిపారు.

సిగరెట్ డిస్ట్రిబ్యూటర్‌పై దాడి, రూ. 15 లక్షల దోపిడీ

- పిస్టోల్ చూపి నగదుతో ఉడాయింపు



బనశంకరి: పట్టపగలే పిస్టోల్ చూపి ఓ సిగరెట్ డిస్ట్రిబ్యూటర్‌పై దాడి చేసిన దోపిడీదొంగలు అతని వద్ద ఉన్న రూ.15 లక్షలు దోచుకెళ్లారు. ఈఘటన అన్నపూర్ణేశ్వరి నగర పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సిగరెట్ డిస్ట్రిబ్యూటర్ గోపాల్ శుక్రవారం టాటా ఎస్ వాహనంలో దుకాణాల నుంచి సిగరెట్ బిల్లులు సేకరిస్తున్నారు. కెంగేరి నుంచి గోపాల్ దుకాణాల ద్వారా సిగరెట్ బిల్లు సేకరించుకుని వస్తున్నారు. ఈ సమయంలో బైకుల్లో వెంబడించిన ముగ్గురు దోపిడీదొంగలు నాగరబావి పాపిరెడ్డి పాళ్యకు వచ్చిన గోపాల్, నాథూరామ్ దుకాణం వద్ద వాహనం నిలిపి సిగరెట్ బిల్లు వసూలు చేసుకోవడానికి కిందికి దిగాడు. ఈ సమయంలో దోపిడీ దొంగలు గోపాల్‌పై దాడికి యత్నించగా ఆయన సమీపంలోని ప్రావిజన్‌స్టోర్‌లోకి దూరాడు. దొంగలు అతనిపై పెప్పర్‌స్ప్రే చేసి గన్ చూపించి కొడవలితో దాడి చేసి అతని వద్ద ఉన్న నగదు బ్యాగ్ తీసుకుని బైక్‌ల్లో ఉడాయించారు. బాధితుడిపై అన్నపూర్ణేశ్వరినగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం



మహనీయులకు విజయేంద్ర పూజలు

తుమకూరు: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 28 నియోజకవర్గాల్లో విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే బీవై విజయేంద్ర అన్నారు. శుక్రవారం తుమకూరు నగరంలోని శ్రీ సిద్ధ వినాయక సముదాయ భవనంలో జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి శక్తి వందనా అభియాన్ సమావేశంలో మాట్లాడారు. అంతకు ముందు ఆయన మహనీయుల చిత్రపటాలకు పూజలు చేసి మాట్లాడారు. వారం రోజులుగా తాను రాయచూరు, యాదగిరి, మంగళూరు, చిక్కమగళూరు, హావేరి, హుబ్బళిలలో పర్యటించానని, ప్రస్తుతం తుమకూరు వచ్చినట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

నభూతో.. నభవిష్యతి.. హంపీ ఉత్సవాలు



శుక్రవారం రాత్రి హంపి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు



సంగీత ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

- అంగరంగ వైభవంగా ప్రారంభ వేడుక
- హాజరైన సీఎం, పలువురు మంత్రులు
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, పర్యాటకులు

సాక్షి,బళ్లారి: రాయల వైభవాన్ని చాటుతూ విజయనగర జిల్లా హంపీలో ఉత్సవాలు శుక్రవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే హంపీ ఉత్సవాలను శుక్రవారం సీఎం సిద్దరామయ్య భువనేశ్వరీ మాత చిత్రపటానికి పూజలు చేసి ప్రారంభించారు. హంపీ ఉత్సవాలను తిలకించేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి భారీ ఎత్తున తరలివచ్చిన జనంతో హంపీ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. దేశ విదేశాల నుంచి వచ్చి సంగీత కళాకారులు ఇచ్చిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉమ్మడి బళ్లారి జిల్లాతో పాటు కర్ణాటకలోని పలు జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు నాలుగు ప్రధాన వేదికల మీదనుంచి వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. గ్రామీణ క్రీడా పోటీలు అద్భుతంగా జరిగాయి. ప్రధాన వేదికలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు కూడా ఏర్పాటు చేశారు. ప్రజలు ఎక్కడ నిలబడినా, కూర్చొన్నా ప్రధాన వేదిక వద్ద నిర్వహించే కార్యక్రమాలు తిలకించేలా స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

స్మారకాలు జిగేల్..

రాత్రి వేళలో కూడా పగటి వేళలా కనిపించేలా విద్యుత్ దీపాలను అలంకరించారు. శ్రీవిరుపాక్షేశ్వరుని ఆలయం నుంచి ప్రతి కట్టడం వద్ద రంగురంగుల విద్యుత్ దీపాలను అలంకరించడంతో సందర్శకులు తన్మయత్వం పొందారు.

పర్యాటకులకు సకల సౌకర్యాలు..

పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హంపీ పరిసరాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. హంపీ బైస్కైని కూడా ప్రారంభించడంతో హెలిప్యాడ్ వద్ద జనం సందడి కనిపిస్తోంది. 10 నిమిషాల్లో హంపీ మొత్తం చూసేందుకు ఏర్పాటు చేయడంతో జనం ఆసక్తి చూపుతున్నారు.

ఉత్సవాలపై పర్యాటకుల హర్షం..

దేశ భాషలందు తెలుగు లెస్స అని గర్వంగా చాటిన విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల పాలన గత వైభవం తాము చూడకపోయినా ప్రస్తుతం ఆయన పాలించిన ప్రాంతంలో ఉత్సవాలను చూస్తుండటం ఆనందంగా ఉందని పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు. పిల్లాపాపలు, వృద్ధులు ఇలా వయో భేదం లేకుండా హంపీ వీధుల్లో ఉత్సవాల్లో జనం కనిపిస్తున్నారు. ఒకవైపు శ్రీ కృష్ణదేవరాయల గత వైభవం తలపించేలా ఏర్పాట్లు, మరోవైపు వినోదం, ఆహ్లాదం కలిగించేందుకు సంగీత, సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు, ఇంకో వైపు ఎంతో మహిమాన్వితమైన శ్రీవిరుపాక్షేశ్వర స్వామి దర్శనంతో భక్తులు తరించారు.

ఎమ్మెల్యే బాలకృష్ణపై ఈసీకి ఫిర్యాదు

శివాజీనగర: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలైతే గ్యారెంటీ పథకాలు రద్దు అవుతాయనే వ్యాఖ్యానించిన మాగడి కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణపై జేడీఎస్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. జేడీఎస్ యువ విభాగం రాష్ట్రాధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి నేతృత్వంలో జేడీఎస్ నాయకుల బృందం శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి మనోజ్‌కుమార్ మీనాను భేటీ చేసి ఎమ్మెల్యే బాలకృష్ణపై ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని, బాలకృష్ణ ఎమ్మెల్యే సభ్యత్వాన్ని తొలగించాలని విన్నవించారు. కాంగ్రెస్ పార్టీ లోకసభలో ఓటమిపాలైతే ఐదు గ్యారెంటీ పథకాలు రద్దు చేస్తామని చెప్పటం ప్రజలను బెదిరింపులకు గురిచేయడమేనని, బాలకృష్ణ ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని జేడీఎస్ డిమాండ్ చేసింది.

ఓటమి భయంతోనే..

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం నిఖిల్ కుమారస్వామి విలేకరులతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే బాలకృష్ణ ముఖ్యమంత్రి సిద్దరామయ్య, రాహుల్ గాంధీ అనుమతి లేకుండానే ఇలాంటి వ్యాఖ్యలు చేయటానికి సాధ్యం కాదని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి తథ్యమనే కాంగ్రెస్ నాయకులు ఇటువంటి వ్యాఖ్యలను చేయిస్తున్నారని ఆరోపించారు.

బంగారు నగల ప్రదర్శన జిగేల్


బొమ్మనహళ్లి : బెంగళూరులోని హెచ్‌ఎస్ఆర్ లేఔట్ బీడీఏ కాంప్లెక్స్ సమీపంలోని వైట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన ది బెంగళూరు జ్యూవెలరి షో ఆభరణా ప్రదర్శనను శుక్రవారం కన్నడ నటి శరణ్య శెట్టి, మరో నటి, మిస్ సౌత్ ఇండియా సుష్మా నాణయ్య ప్రారంభించారు. బంగారు నగలు, వజ్రాభరణాలతో నటీమణులు హొయలు పోయారు. ఈ నెల 4 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో కళ్లు మిరమిట్లు గొలిపే వైవిధ్యమైన డిజైన్లతో కూడిన బంగారు నగలు, వజ్రాభరణాలు మగువలను కనువిందు చేశాయి.సుమారు 16 జ్యూవెలరీ సంస్థలు ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేసి బంగారు నగలను ప్రదర్శించారు.



నగలు, వజ్రాభరణాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

7న ఢిల్లీలో కర్ణాటక కాంగ్రెస్ ధర్నా

బనశంకరి: కేంద్ర బడ్జెట్‌లో కర్ణాటక రాష్ట్రానికి నిరంతరం అన్యాయం జరుగుతోందని కేంద్రం తారతమ్య ధోరణితో గత ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.62 వేల కోట్లు నష్టపోయిందని దీంతో కాంగ్రెస్ పార్టీ ఈనెల 7వ తేదీన కర్ణాటక ప్రభుత్వం తరపున ఢిల్లీలో ధర్నా చేపడతామని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తెలిపారు. శుక్రవారం విధానసౌధలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో తనతో పాటు రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. ధర్నాకు స్థలం కోసం కేంద్రానికి లేఖ రాశామని, అనుమతి అభించిన వెంటనే ధర్నా చేస్తామని చెప్పారు. 2018–19 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.46 వేల కోట్ల నిధులు అందాయి. అయితే 2024–25లో రాష్ట్రానికి వచ్చిన నిధులు కేవలం రూ.50 వేల కోట్లు మాత్రమే. కేంద్రప్రభుత్వ బడ్జెట్ మాత్రం భారీగా పెరిగినప్పటికీ రాష్ట్రానికి వచ్చే నిధుల ప్రమాణంలో అత్యల్పంగా మాత్రమే ఉందన్నారు.



క్లుప్తంగా

జూన్‌లో అఖిల భారత సాహిత్య సమ్మేళనం



మాట్లాడుతున్న మంత్రి చెలువరాయస్వామి

మండ్య: వచ్చే జూన్ నెల 7, 8, 9 తేదీలలో 87వ అఖిల భారత సాహిత్య సమ్మేళనం నిర్వహించడానికి తీర్మానం చేశామని మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెలువరాయస్వామి అన్నారు. శుక్రవారం మండ్య నగరంలోని జిల్లా అధికారి కార్యాలయంలో ఆయన అధికారుల సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ...బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో ఈ విషయంపై చర్చించామని, జూన్‌లో మూడు రోజుల పాటు సమ్మేళనం ఘనంగా నిర్వహిస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తుమకూరు: మన సంస్కృతి, సాంప్రదాయాలు మంచి మార్గాన్ని చూపిస్తాయని కుణిగల్ ఎమ్మెల్యే డాక్టర్.రంగనాథ్ అన్నారు. తుమకూరు జిల్లా శిరా తాలూకా పట్టనాయనహళ్లిలోని శ్రీగురుగుండ బ్రహ్మేశ్వర స్వామి మఠం జాతర సందర్భంగా ఉచిత వైద్య వైద్య శిబిరం, గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న స్పటికపుర మహాసంస్థాన పీఠాధ్యక్షుడు శ్రీనంజావదూత మహాస్వామీజీ మాట్లాడుతూ... ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు.

కెరగోడులో భద్రత కట్టుదిట్టం చేయాలి

మండ్య: మండ్య తాలూకా కెరెగోడులో హనుమాన్ జెండా వివాదం ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్నా కూడా భవిష్యత్‌లో ఎటువంటి కలహాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి చెలువరాయస్వామి జిల్లా అధికారి, జిల్లా ఎస్పీకి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కల్లడ్క ప్రభాకర్‌భట్, ప్రమోద్ ముతాలిక్, చక్రవర్తి సూలిబెలె లాంటి వారు జిల్లాకు వచ్చి కుట్రలు చేసే ప్రమాదం ఉందని, అధికారులు జాగ్రతగా నిఘా ఉంచాలన్నారు.

రాధాకృష్ణ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గం మండూరు రాధాకృష్ణ ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే మంజుల లింబావలి, మాజీ మంత్రి అరవింద లింబావలి ప్రత్యేక పూజలు చేశారు. కన్నడ నాడిన అభివృద్ధి కోసం పూజలు చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు తలలతో మేక పిల్ల జననం



మండ్య : రెండు తలలతో మేక పిల్లల జన్మించిన ఘటన మద్దూరు తాలూకా గెజ్జలగెరెలో జరిగింది. గ్రామానికి చెందిన నింగమ్మ, రామచంద్ర దంపతులు మేకలను పోసిస్తూ జీవిస్తున్నారు. మందలోని ఒక మేక శుక్రవారం రెండు తలల ఉన్న మేక పిల్లకు జన్మ ఇచ్చింది. ఈ వింతను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తల్లి, పిల్ల మేక ఆరోగ్యంగా ఉన్నట్లు పశు వైద్యులు శంకరగౌడ, శివశంకర తెలిపారు.

బనశంకరీదేవికి విశేష అలంకరణ



బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమోహన్ బనశంకరీదేవికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు చేపట్టి మూలవిరాట్‌కు అలంకరణ, విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి ప్రమిదలతో దీపారాధన చేశారు.

ఉత్సవ స్ఫూర్తి.. హంపీ గత వైభవ దీప్తి

- ఉత్సవాలకు ఆద్యుడు ఎంపీ ప్రకాష్
- ప్రముఖ సాహితీవేత్త కుంబార వీరభద్రప్ప

హొసపేటె: రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన హంపీ ఉత్సవాలకు స్ఫూర్తి నింపి గత వైభవాన్ని దశదిశలా వ్యాపింపజేసేందుకు ఆద్యుడు, దివంగత మాజీ ఉపముఖ్యమంత్రి, సాహితీ ప్రియుడు ఎంపీ ప్రకాష్ అని ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత కుంబార వీరభద్రప్ప అభిప్రాయపడ్డారు. సాంస్కృతిక రాయబారి. హంపీలోని విరుపాక్షేశ్వర ఆలయ వేదికపై ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. హంపీ ఉత్సవం మన దేశ పూర్వ వైభవాన్ని, పర్యావరణ వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెబుతోందన్నారు. హడగలి గ్రాడ్యుయేట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ఎస్ పాటిల్, వన్యప్రాణి పరిశోధకుడు, అధ్యాపకుడు డాక్టర్ సమద్ కొట్టూరు, డాక్టర్ చంద్రప్ప, మల్లికార్జున బి.మాన్వడే, కేఎస్.శివప్రకాష్, డాక్టర్ హంపీ వీరేష్ ఉత్తంగి, డాక్టర్ కే.రవీంద్రనాథ్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న వస్తు ప్రదర్శన

హంపీ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మొదటి రోజు శుక్రవారం సిరిధాన్య, పుస్తకాలు, ఆరోగ్య, ఎద్దుల, మత్స్య తదితర వివిధ ప్రదర్శనలను మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సారి హంపీ ఉత్సవాలు విజయనగర సామ్రాజ్య రాయల కాలం నాటి గత వైభవం గుర్తు తెచ్చేలా నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలు వీక్షించేందుకు వచ్చే ప్రజలకు అన్ని విధాలా మౌలిక సౌకర్యాలను కల్పించామన్నారు. ఉత్సవాల సందర్భంగా మూడు రోజులు పాటు హొసపేటె నుంచి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాధికారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఎద్దుల ప్రదర్శన

- పాల్గొన్న 52 జతల ఎద్దులు

హంపీ ఉత్సవాల్లో తొలిరోజు నిర్వహించిన ఎద్దుల ప్రదర్శన ప్రజల దృష్టిని ఆకర్షించింది. పొలాన్ని దుక్కిదున్నడంలో రైతుల భాగస్వాములుగా సహకరిస్తున్న



హంపీ ప్రధాన వీధిలో ఉత్సవాలకు హాజరైన అశేష జనవాహిని



హంపీ ఉత్సవ వేదికపై గీతాలను ఆలపిస్తున్న గాయకులు

వివిధ దేశీయ జాతుల ఎద్దులు ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచాయి. కమలాపుర పట్టణంలోని హంపీ డెవలప్‌మెంట్ అథారిటీ వెనుక ఆవరణలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ గోవులకు పూజ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో దాదాపు 52 జతల ఎద్దులు పాల్గొన్నాయి. హళ్లికర్, అమృత్ మహల్, కిలార్ తదితర అనేక దేశవాళీ జాతి ఎద్దులు రైతులకు నచ్చాయి. హొసపేటె నగరానికి చెందిన బండి కృష్ణప్ప ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ అవార్డుకు ప్రథమ స్థానంలో నిలిచాడు. హొసపేటె తాలూకా నల్లాపుర గ్రామానికి చెందిన రైతు హనుమంతప్ప ముడియప్ప ద్వితీయ స్థానం, వెంకటాపుర గ్రామానికి చెందిన రైతు హులిగేష్ తృతీయ స్థానం సాధించారు. మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ స్వయంగా రూ.లక్ష బహుమతిని అందించడం విశేషం. ఈ సందర్భంగా విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప, జిల్లాధికారి దివాకర్, జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు, రైతులు, ప్రజలు హాజరయ్యా రు. ఎద్దుల ప్రదర్శనకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ఎస్‌ఎస్.పాటిల్, డాక్టర్ మంజునాథ్ వ్యవహరించారు.

ఫల, పుష్పప్రదర్శన ప్రారంభం

ఈ ఏడాది హంపీ ఉత్సవాల సందర్భంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫల, పుష్ప ప్రదర్శనలో హంపీలోని కమల్ మహల్ నమూనాను 2 లక్షల చెండు పూలు, లక్ష గులాబీ పూలు, వివిధ రకాల పూలతో రూపొందించారు. విజయనగర సామ్రాజ్య గతవైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవం, ఉద్యానవన శాఖ నుంచి హంపీ మాతంగ పర్వత మైదానంలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరిగిన ఫల, పుష్ప ప్రదర్శనను మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ ప్రారంభించారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ యూనిట్లు, మిక్స్‌డ్ హార్టికల్చర్ ఫార్మింగ్ మోడల్, మహాత్మా గాంధీ వంటి స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, భగత్‌సింగ్, సుభాష్ చంద్ర బోస్, సంఘం సంస్కర్తలు బసవణ్ణ, శివకుమార స్వామీజీ, మాజీ అధ్యక్షులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల కళాఖండాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మరో విశేషమేమిటంటే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మైసూరు దసరా అంబారీని మోసే ఏనుగు అర్జున ప్రతిరూపాన్ని కూడా ప్రదర్శించారు.

సేంద్రియ, తృణధాన్యాల ప్రదర్శన

హంపీ ఉత్సవంలో భాగంగా మాతంగ పర్వత మైదానంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సేంద్రియ, తృణధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన ప్రజల దృష్టిని ఆకర్షించింది. మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. కన్నడాంబ భువనేశ్వరి మాత, విశ్వగురు బసవణ్ణ వివిధ కళా ఖండాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు అదుర్స్

హంపీ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రధాన వేదికలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకొన్నాయి. అదే విధంగా వివిధ కళాకారుల ఊరేగింపు ప్రదర్శనలు కూడా అలరించాయి.

రంగురంగుల రంగోలిలతో శోభాయమానం

హంపీ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం విరుపాక్షేశ్వర ఆలయం ఎదుట నిర్వహించిన రంగోలి పోటీల్లో రంగురంగుల రంగోలి చిత్రాలు హంపీ ఉత్సవాలను శోభాయమానం చేశాయి. పోటీలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 74 మంది మహిళలు పాల్గొన్నారు. వివిధ రంగోలిలు పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప, జిల్లాధికారి దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు, కన్నడ, సంస్కృతి శాఖ సహాయ సంచాలకులు సిద్దలింగేష్ రంగన్న, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.



రంగురంగుల ముగ్గులను వేసిన దృశ్యం



విజేతకు నగదును అందిస్తున్న మంత్రి



వివిధ రకాల వెదురు ఉత్పత్తుల ప్రదర్శన



వివిధ రకాల సిరిధాన్యాల ప్రదర్శన



విశ్వగురు బసవణ్ణ, భువనేశ్వరిమాత ప్రతిమలు



అర్జున అంబారీ ప్రదర్శన



ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన ఫలప్రదర్శనలో పండ్లపై చెక్కిన మహనీయుల చిత్రాలు



వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన పంటల సాగు ప్రదర్శన



లక్షలాది పూలతో రూపుదిద్దుకున్న కమల మహల్ నమూనా



హంపీ ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన మత్స్యప్రదర్శన



ఫలప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పండ్లు

ఆపరేషన్ కమలమే వారి పని

- బీజేపీపై సీఎం సిద్ధరామయ్య ఆగ్రహం

సాక్షి,బళ్లారి/ రాయచూరు రూరల్: ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంలో బీజేపీ విఫలమైనందునే ఆపరేషన్ కమల పేరుతో ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తోందని సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విజయపుర జిల్లా ముద్దేబిహాళ్ హెలిప్యాడ్ వద్ద విలేకరులతో మాట్లాడారు. డబ్బులతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ చూస్తోందన్నారు. కాంగ్రెస్ నుంచి పలువురు ఎమ్మెల్యేలు బీజేపీలోకి వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, విధాన పరిషత్ సభ్యుడు, మాజీ సీఎం జగదీష్‌శెట్టర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. బీజేపీ రాష్ట్రంలో గతంలో రెండు సార్లు అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఆపరేషన్ కమలం ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 2008 అధికారంలో వచ్చినప్పుడు బీజేపీకి పూర్తి అధికారం ఇవ్వలేదన్నారు. ఆపరేషన్ కమలం చేసి యడియూరప్ప సీఎం అయ్యారన్నారు. అనంతరం బసవరాజ్ బొమ్మై కూడా ఇదే తరహాలో సీఎం అయ్యారన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అయినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రస్తుతం ఎవరూ బీజేపీలోకి వెళ్లే ప్రశ్నే లేదన్నారు. రాష్ట్రంలో పూర్తి మెజార్టీ బీజేపీకి ఇవ్వకపోవడంతో గతంలో 2008, 2013, 2018 బీజేపీకి అధికారం ఇవ్వలేదన్నారు.

పూర్తి మెజార్టీ కాంగ్రెస్‌కే

కాంగ్రెస్ పార్టీ 2013లో పూర్తి మెజార్టీతో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం 136 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి ఉన్నారన్నారు. వారి పగటి కలలు సాకారం కాబోవన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాతీర్పుతో అధికారంలోకి వస్తే వారు దొడ్డిదారిన అధికారంలో వస్తారని ఎద్దేవా చేశారు. మండ్యలో ఏమి జరిగిందన్న వాస్తవాలను బీజేపీ చూడటం లేదన్నారు. 140 కోట్ల మంది ప్రజలు జాతీయ జెండాను గౌరవిస్తారన్నారు. బీజేపీ వారికి జాతీయ జెండాపై గౌరవం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి జాతీయ జెండాపై ఎంతో గౌరవం ఉందన్నారు. 1935లో జాతీయ జెండాను దేశానికి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని గుర్తు చేశారు. అనంతరం ఆయన ముద్దేబిహాళ్ తాలూకాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. కష్టకాలంలో కూడా ఐదు గ్యారెంటీలను ప్రజలకు అందజేస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటిని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. అనంతరం ఆయన హంపీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కరువులోనూ మన సంస్కృతిని కాపాడుకోవడానికి హంపీ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

బసవణ్ణ వచనాలను కాపాడిన మాచిదేవుడు

గౌరిబిదనూరు: బసవణ్ణ వచనాలను రక్షించడంలో మడివాళ మాచిదేవుని శ్రమ చాలా గొప్పదని, ఆనాడు వారు వచనాలను కాపాడలేకపోయి ఉంటే నేడు అవి మనకు లభ్యమయ్యేవి కాదని ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ తెలిపారు. గురువారం సాయంత్రం తాలూకా కార్యాలయం సభాభవనంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మడివాళ మాచిదేవుని జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మడివాళరు శ్రమజీవులు, సమాజానికి కావాల్సినవారు. వారికి సమాజం నుండి సహాయ హస్తం కావాలి అన్నారు. బసవణ్ణ మడివాళ మాచిదేవునికి కలంతో పాటుగా ఖడ్గాన్ని ఇచ్చారు. కల్యాణ క్రాంతి సమయయంలో బిజ్జళ మహారాజుకు శివశరణులకు జరిగిన యుద్ధంలో సైనికులు బసవణ్ణ వచనాలను కాల్చడానికి ప్రయత్నించినపుడు మాచిదేవుడు రహస్య స్థలంలో వాటిని సంరక్షించారని, దీంతో నేడు బసవణ్ణ వచనాలు మనకు లభ్యయ్యాయన్నారు. ప్రముఖ ఉపన్యాసకులుగా గిరిధర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దారు మహేశ్ పత్రి, శ్రీనివాసగౌడ, మడివాళ సంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి, రాజేశ్, వెంకటస్వామి, కెంపరాజు, అశ్వత్థప్ప, లక్ష్మి, సుదర్శన్ పాల్గొన్నారు.

నియామకం



కెంబోడి నారాయణస్వామి

కోలారు: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన కెంబోడి నారాయణస్వామిని నియమిస్తూ శుక్రవారం బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ ఎస్‌బీ సురేష్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. కాగా నూతన అధ్యక్షుడిగా నియమితుడైన కెంబోడి నారాయణస్వామిని పార్టీ ప్రముఖులు అభినందించారు.

భార్యను వేధించినందుకే స్నేహితుడి హత్య



విజయబసవ(హతుడు), నిందితుడు అజర్

హుబ్లీ: యువకుడిని దారుణంగా హత్య చేసి నిప్పంటించి కాల్చి వేసిన నిందితుడిని అరెస్ట్ చేయడంలో పాత హుబ్లీ పోలీసులు సఫలీకృతులయ్యారు. హతుడి ఆప్త మిత్రుడు, మంటూరు రోడ్డు మిల్లత్ నగర్ నివాసి సయ్యద్ అజర్(25) అనే వ్యక్తి నిందితుడని జంట నగరాల పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార మీడియాకు తెలిపారు. వివరాలు.. అజర్, హతుడు విజయ బసవ ఇద్దరు ఆప్త మిత్రులు. అయితే హతుడు విజయ్ బసవ తన స్నేహితుడు అజర్ భార్యకు ఫోన్ చేసి రకరకాలుగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో మిత్రుడికి అజర్ ఎంత బుద్ధి చెప్పినా కూడా వినలేదు. దీంతో హత్య చేయాలని పథకం రూపొందించి ఆ మేరకు నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఇకపై అవన్ని వదిలేయాలని నచ్చ చెప్పాడు. అయినా విజయబసవ వినిపించుకోలేదు. దీంతో కోపోద్రిక్తుడైన అజర్ బండరాయి తీసుకొని స్నేహితుడిపై దాడి చేయడమే కాక పెట్రోల్ తెచ్చి శరీరంపై పోసి నిప్పుపెట్టి పరారయ్యాడు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కేసులో అతడొక్కడే నిందితుడని ఆమె వివరించారు.

హంపీ ఉత్సవాల్లో నేటి కార్యక్రమాలు

హొసపేటె: ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీ ఉత్సవాల్లో రెండో రోజు శనివారం జరిగే కార్యక్రమాల వివరాలివే. ప్రధాన గాయత్రీ పీఠ వేదికలో ప్రసిద్ధ కన్నడ సినీ నటుడు దర్శన్, సంగీత దర్శకుడు హరికృష్ణల ఆధ్వర్యంలో రసమంజరి కార్యక్రమం, పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోల్డన్ గర్ల్స్ ఆధ్వర్యంలో విశేష నృత్యాలు, ఎదురు బసవణ్ణ వేదికలో సాయంత్రం 4 గంటలకు స్థానిక కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, విరుపాక్షేశ్వర దేవస్థాన వేదిక వద్ద మహిళాగోష్ఠి,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సాసివెకాళు గణపతి వేదిక వద్ద వివిధ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, అలాగే కుస్తీ పోటీలు కూడా నిర్వహిస్తున్నారు.

జిల్లా చలువాది మహాజన సభ

కంప్లి: రాజ్యాంగ ప్రముఖ ఆశయాలైన లౌకిక ప్రజాప్రభుత్వం, సమాజవాదం అవసాన దశలో ఉందని చలువాది మహాసభ జిల్లా అధ్యక్షుడు సీఆర్ హనుమంత తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లా చలువాది మహాజన సభలో ఆయన మాట్లాడుతూ నేడు సంఘం ప్రారంభం, తనకు నూతన పదాధికారుల ప్రమాణోత్సవంలో పాల్గొనే అవకాశం లభించడం సంతోషమన్నారు. రాజ్యాంగ ఆశయాల బాట చేపట్టడం మహాసభ ఉద్దేశమని, సమాజ అభివృద్ధి ముమ్ముందు మరింత బలోపేతం చేస్తామన్నారు.

కోలారు వార్తలు...

లక్ష్మీనృసింహునికి స్వాతి నక్షత్ర పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కేజీఎఫ్: నగరంలోని స్వామినాథపురం మెయిన్ రోడ్డులో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర విశేష పూజా కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామితో పాటు ఆలయంలో ఉన్న లక్ష్మీ అమ్మవారికి కూడా ప్రత్యేక పూజలను చేశారు. నగరంలో 130 సంవత్సరాల చరిత్ర కలిగిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రతియేటా మాదిరిగా స్వాతి నక్షత్ర విశేష పూజల్లో భాగంగా హోమం, హవనం, అభిషేకం, కలశపూజ, అష్టోత్తర పూజ, నైవేద్యం, మహామంగళారతి తదితర కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ జరిగింది.

సాధకులకు సన్మానం



సాధకులను సన్మానించిన దృశ్యం

మాలూరు: తాలూకాలోని లక్కూరు జీపీలోని కోడూరు గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన విద్యా పరికరాల పంపిణీ, సాధకులకు సన్మాన కార్యక్రమంలో పాఠశాలకు దాతలు అందించిన యూనిఫాం, నోటు పుస్తకాలు, జామెట్రీ, బాక్సులు, గుర్తింపు కార్డులు, లేఖన సామగ్రితో పాటు వివిధ విద్యా పరికరాలను అందించారు. ఇదే సమయంలో వివిధ రంగాల్లో విశేష సాధన చేసిన వారిని, సిరిగన్నడ వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హెచ్ రామచంద్రప్ప, క్షేత్ర సమన్వయ అధికారి నంజుండగౌడ, జీపీ అధ్యక్షురాలు చైత్ర రమేష్, పర్యావరణ ప్రేమి వెంకటేష్ మూర్తి, బ్రమేంద్రరెడ్డిలను సన్మానించారు. జీపీ మాజీ అధ్యక్షుడు ఎల్ఎస్ చేతన్‌గౌడ, నివృత్త ప్రధానోపాధ్యాయుడు బి.మునియప్ప, భగవాన్ సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక సంఘం



క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: మహిళా ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రారంభిస్తున్న నూతన సంఘం సమావేశంలో మూడు నెలలకోసారి మహిళా ఉద్యోగులు తెలియజేసే తమ సమస్యలను జెడ్పీ సీఈఓ నేతృత్వంలో పరిష్కరిస్తారని ఈఓ ఎస్ శివకుమారి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఉద్యోగుల భవనంలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ విడుదల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రామాణికంగా విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తారన్నారు. బీఈఓ మునిలక్ష్మయ్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న మహిళల పాత్ర సమాజ అభివృద్ధిలో ఎంతో ఉందన్నారు. మహిళా ఉద్యోగులందరూ సంఘటితమై తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. డాక్టర్ చంద్రకళ, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎంబీ గౌరవనహళ్లి, బీఆర్‌సీ కేసీ వసంత పాల్గొన్నారు.

మోదీ మరోసారి క్యాంపెయిన్ ప్రారంభం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోలారు: నగరంలో బీజేపీ నాయకులు కుడా మాజీ అధ్యక్షుడు ఓంశక్తి చలపతి నేతృత్వంలో మోదీ మరోసారి(మోదీ మత్తొమ్మె) గోడ రాతల క్యాంపెయిన్‌ను శుక్రవారం నుంచి ప్రారంభించారు. అనంతరం ఓంశక్తి చలపతి మాట్లాడుతూ దేశంలోని ప్రతి బూత్‌లోను కనీసం రెండు లేదా మూడు చోట్ల మోదీ మత్తొమ్మె అనే గోడ రాతను రాయాలని కేంద్ర, రాష్ట్ర బీజేపీ నాయకులు సూచించిన మేరకు క్యాంపెయిన్‌ను ప్రారంభించామన్నారు. దేశ సమగ్ర అభివృద్ధికి శ్రమిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయాల్సిన అవసరం దేశ ప్రజలపై ఉందన్నారు. ప్రధాని అందిస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయన్నారు. ఈ క్యాంపెయిన్‌లో బీజేపీ నాయకులతో పాటు ఎంతో మంది స్వచ్ఛందంగా, ఉత్సాహంగా పాల్గొంటుండడం హర్షణీయమన్నారు. కోలారు లోక్‌సభ నియోజకవర్గం నుంచి మరోమారు బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కుడా మాజీ అధ్యక్షుడు విజయకుమార్, దిశా సమితి సభ్యుడు నామా బాబు, బీజేపీ నాయకుడు నామల్ మంజు, శిల్లంగెరె మహేష్, నాగరాజ్ ఉన్నారు.

ఉత్తమ పశువులకు బహుమతుల పంపిణీ



యజమానులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

మాలూరు: తాలూకాలోని తోర్నహళ్లి సఫలాంబా దేవి, భీమేశ్వరస్వామి ఆలయ జాతర మహోత్సవం సందర్భంగా జాతరలో పాల్గొన్న ఉత్తమ పశువులకు బహుమతులను పంపిణీ చేశారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వీణ మాట్లాడుతూ జాతరలో పాల్గొన్న పశువులకు బహుమతుల పంపిణీలో కాస్తంత గందరగోళం ఏర్పడిందన్నారు. వచ్చే యేడాది ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా చూసుకుంటామన్నారు. భీమేశ్వర ఆలయ జాతర మహోత్సవం 10 రోజుల పాటు నిర్వహించి జాతరలో రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సకల సౌకర్యాలను కల్పించామన్నారు. వైద్యుల కొరత వల్ల కోలారు నుంచి తీర్పునిచ్చే వారిని పిలిపించామన్నారు. ఈ సందర్భంగా జీపీ మాజీ అధ్యక్షుడు మునిశ్యామప్ప, తహసీల్దార్ కె రమేష్, కార్యనిర్వాహక అధికారి టి.సెల్వమణి, పెష్కార్ చెలువస్వామి, పూజారి మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ గొంతు కోసి హత్య


సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం: ఆటో డ్రైవర్‌ను నిర్జన ప్రదేశం లోకి తీసుకువచ్చిన దుండగులు గొంతు కోసి హత్య చేసిన సంఘటన నెలమంగల తాలూకా మాదనాయకనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బెంగళూరు ధణిసంద్రకు చెందిన ఆటోడ్రైవర్ శ్రీనివాస్ (28)హత్యకు గురైన వ్యక్తి. నెలమంగల శివారులోని హుస్కూరు రోడ్డు వద్ద నిర్జన ప్రదేశంలో ఆటోతోపాటు శ్రీనివాస్ శవం కూడా లభించింది. ఆర్థిక వ్యవహారానికి సంబంధించి హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మాదనాయకనహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్‌లు ఢీ, ఒకరి మృతి

బాగేపల్లి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొవ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన బాగేపల్లి పట్టణంలోని డాక్టర్ జచని రోడ్డులో చోటు చేసుకుంది. జచని రోడ్డులో మరమ్మతులు పనులు జరుగుతుండగా ఒక పక్క నుంచి వాహనాలు వెళ్తున్న సమయంలో రెండు బైక్‌లు వేగంగా వస్తూ ఢీకొన్నాయి. దీంతో ప్రమాదంలో సోమశేఖర్ (22) అనే వ్యక్తి మృతి చెందాడు. గాయపడిన రమేశ్ అనే వ్యక్తిని బాగేపల్లికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రాజ్యాంగాన్ని గురించి తెలుసుకోవాలి


రాజ్యాంగ రథయాత్రలో ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: రాజ్యాంగాన్ని గురించి ప్రతి పౌరుడు తెలుసుకోవాలని రాజ్యాంగ జాతిరథ యాత్రకు శుక్రవారం నగరంలో ఘన స్వాగతం పలికారు. మహిళలు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అంబేడ్కర్ రచించిన రాజ్యాంగా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మారిందన్నారు. అనంతరం అంబేడ్కర్ శకటాన్ని ఆత్మీయంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దారు మహేశ్ పత్రి, మల్లసంద్ర గంగాధరప్ప, అబ్దుల్లా, నంజుండప్ప, ప్రభు, నారాయణస్వామి, దళిత నాయకులు పాల్గొన్నారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: మైసూరు జిల్లా హుణసూరు, మైసూరు రోడ్డులో రాత్రి వేళల్లో చిరుత కనిపించడంతో అదే ప్రాంతానికి చెందిన గిరీశ్ అనే వ్యక్తి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారులు చిరుత కోసం బోను ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో చిక్కింది. వెంటనే చిరుతను నాగరహోళె ఉద్యాన వనంకు తరలించారు.

కల్కుణికె వద్ద మరో చిరుత :.
మైసూరు జిల్లా కేఆర్ నగర రోడ్డు సర్కిల్‌లోని శని దేవుడి ఆలయం వద్ద ఉదయం మరో చిరుత కనిపించింది. దీంతో స్థానికులు హుటాహుటిన అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని చిరుత కోసం గాలిస్తున్నారు.

గంటల వ్యవధిలో పట్టుబడిన దొంగ


స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

శివమొగ్గ: చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందిన నాలుగు గంటల్లోనే పోలీసులు దొంగను పట్టుకొని విధి నిర్వహణలో తమ సత్తా చాటారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శికారిపుర తాలూకా బాళెకొప్పకు చెందిన హనుమంత నాయక్ అనే వ్యక్తి గత నెల 29న ఉదయం ఇంటికి తాళం వేసి తాళం చెవిని ఇంటి పై భాగంలో పెట్టి శికారిపుర ఆస్పత్రికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉన్న నగదు కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి గతనెల 31న శికారిపుర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ శివానంద ఆదేశాలతో సీఐ ఆర్‌ఆర్ పాటిల్, పోలీసు సిబ్బంది వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించి దొంగల కోసం గాలింపు చేపట్టారు. కేవలం నాలుగు గంటల్లోనే దొంగను గుర్తించారు. దావణగెరె జిల్లా న్యామతి తాలూకా చీలూరు కెంగట్టికి చెందిన ఆకాశ్(18)ను అరెస్ట్ చేసి రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

కేఐఏలో బంగారం పట్టివేత

దొడ్డబళ్లాపురం: బంగారాన్ని పేస్ట్‌గా మార్చి మోకాలి క్యాప్‌లో దాచి అక్రమంగా తరలిస్తున్న ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్న బెంగళూరు కస్టమ్స్ అధికారులు రూ.47.89 లక్షల విలువైన బంగారాన్ని సీజ్ చేసారు. సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో కెంపేగౌడ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రయాణికుడు మోకాలికి వేసుకునే క్యాప్‌లోపల పేస్ట్ రూపంలో బంగారాన్ని దాచి తరలిస్తూ చెకింగ్ వద్ద పట్టుబడ్డాడు. అతడి నుండి 777 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మత్తు భూతానికి పగ్గాలు

- డ్రగ్స్ దందా అడ్డుకట్టకు రైళ్లలో పటిష్ట గస్తీ
- సరఫరా, స్మగ్లింగ్ ముఠాలపై నిఘా


బెంగళూరునగరంలోని రైళ్లలో తనిఖీలు చేస్తున్న రైల్వేపోలీసులు


డ్రగ్స్ మత్తులో జరిగే నేరాలు హత్యలు, ఆత్మహత్యలు, దొంగతనాలు ఇలా ఎన్నో..

బనశంకరి: కర్ణాటకలో డ్రగ్స్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఐటీ నగరి బెంగళూరు యువత విపరీతంగా డ్రగ్స్ ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్‌ను పూర్తిగా నిలువరించడానికి రైల్వే పోలీసులు రైళ్లపై పూర్తి నిఘా పెట్టారు. కొత్త సంవత్సరం వేడుక సమయంలో రూ. 60 లక్షల విలువైన డ్రగ్స్‌ను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని ఏడుగురు పెడ్లర్లను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో గస్తీ వ్యవస్థ మరింత పటిష్టం చేయాలని అధికారులకు రైల్వే డీఐజీ డాక్టర్ ఎస్‌డీ.శరణప్ప ఆదేశించారు.

ఇతర రాష్ట్రాల నుంచి విచ్చలవిడిగా..:
బెంగళూరు, మైసూరు, మంగళూరుతో పాటు రాష్ట్రంలోకి బయట రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున డ్రగ్స్ సరఫరా అవుతోంది. అందులో ఒడిస్సా, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా అవుతోంది. తక్కువ ఖర్చు, సులభం అనే కారణంతో బయటి రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరాకు రైళ్లను ఎక్కువగా మాదకద్రవ్యాలు విక్రయదారులు వినియోగిస్తున్నారు. రైళ్లలో తనిఖీలు తక్కువగా ఉంటాయి. కారు లేదా బస్సులు ద్వారా తరలిస్తే పోలీసులు తనిఖీలు చేస్తారు. దీంతో డ్రగ్స్ పెడ్లర్లు రైళ్లను ఆశ్రయిస్తున్నారు. అంతేగాక ఈ కేసుల్లో అరెస్టైన పెడ్లర్లు విచారణ సమయంలో రైళ్ల ద్వారా గంజాయి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రైళ్లలో పోలీసుల ముమ్మర గస్తీని అమల్లోకి తీసుకువచ్చారు.

రైళ్లలో నిరంతర గస్తీ
సీఐ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు రాష్ట్రంలో 18 రైల్వేపోలీస్‌స్టేషన్లలో పోలీసులందరూ పగలు–రాత్రి గస్తీ చేపట్టాలని నిబంధన ఉంది. రైళ్లలో పోలీసులకు ఉచిత ప్రయాణం ఉంది. ప్రస్తుతం రాత్రి గస్తీ వ్యవస్థ కూడా ముమ్మరం చేస్తామని అధికంగా గస్తీ వ్యవస్థ ఉంటే నేరకార్యకలాపాలు సైతం నియంత్రణకు వస్తాయని డీఐజీ ఎస్‌డీ.శరణప్ప తెలిపారు. గస్తీ ద్వారా రైళ్లలో పోలీసులు అంతర్‌జిల్లాలు సంచరించడంతో అక్రమ కార్యకలాపాలకు సైతం అడ్డుకట్టపడుతుంది. ఉదాహరణకు మైసూరు పోలీసులు బెంగళూరు వరకు, బెంగళూరు పోలీసులు దావణగెరె వరకు ఇలా రాత్రి రైళ్లలో సిబ్బంది గస్తీ చేపడతారు. గస్తీ విధుల్లో నియమితులైన సిబ్బంది డైరీలో ఎక్కడ నుంచి ఎక్కడ వరకు ప్రయాణించారు అనే దానిపై నమోదు చేయాలి. విధుల్లో లోపాలకు పాల్పడిన పోలీసులపై చర్యలు తప్పవని డీఐజీ శరణప్ప హెచ్చరించారు.

హాట్‌స్పాట్ గుర్తించిన పోలీసులు
కర్ణాటకకు బయటి రాష్ట్రాల నుంచి అధిక ప్రమాణంలో గంజాయి తరలించే రైళ్లను గుర్తించామని, నిఘా ఉంచామని డీఐజీ తెలిపారు. నేరకార్యకలాపాలు నియంత్రణకు రైల్వే పోలీసులు గస్తీ వ్యవస్థ పటిష్టం చేశామని అంతేగాక ప్రయాణికులకు పోలీసులు కార్యనిర్వహణలో భాగంగా ప్లాట్‌ఫామ్స్‌లో రాత్రి సమయాల్లో తనిఖీలు చేపడతామని, దీంతో ప్రయాణికులకు సురక్షత హామీ ఏర్పడుతుందని రైల్వే పోలీస్ డీఐజీ శరణప్ప తెలిపారు.


రైల్వే డీఐజీ ఎస్‌డీ.శరణప్ప

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి కార్మికురాలు మృతి


మంజుల మృతదేహం

కృష్ణరాజపురం: టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి మహిళా కార్మికురాలి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ ఘటన బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె తాలూకా మోతుకదహళ్లిలో జరిగింది. గ్రామానికి చెందిన విశ్వ వినాయక స్టోన్ క్రషర్స్ సంస్థలో మంజుల(39) అనే మహిళ చెత్తను తొలగించే పని చేస్తోంది. శుక్రవారం టిప్పర్ వద్ద పరిసరాలను శుభ్రం చేస్తుండగా డ్రైవర్ గమనించకుండా వాహనాన్ని ముందుకు తీసుకెళ్లాడు. దీంతో ఆమెపై చక్రాలు వెళ్లడంతో కాళ్లు, కడుపు భాగం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ పరారీ అయ్యాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి డ్రైవర్ చిక్క రేవణ్ణ, మేనేజర్ వేణులపై కేసు నమోదు చేశారు.

పులివేషధారి అశోక్ కన్నుమూత

యశవంతపుర: ప్రసిద్ధ పులి వేషదారుడు అశోక్ రాజ్ కాడబెట్టు (56) కన్నుమూశారు. ఏడాదిన్నరగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఉడుపిలో మృతి చెందారు. టైగర్ అశోక్‌గా పేరుగాంచారు. పులి వేషంతో ఆయన చేసే నృత్యం ఎంతో అలరించేది. ఇలా 26 ఏళ్ల నుంచి దక్షిణ కన్నడ జిల్లాలో పేరుపొందారు. ఉడుపి అష్టమి, విట్ల పిండియా జాతరలో ఆయన పులివేషం వేస్తారు. అయన మృతికి పలువురు కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

మైనర్లకు బైక్‌లు ఇస్తే కేసులు

బనశంకరి: బెంగళూరు నగరంలో మైనర్లకు బైక్‌లు ఇస్తూ ప్రమాదాలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ఐటీ నగరిలో ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు కార్యాచరణ నిర్వహించి మైనర్లకు బైక్‌లు ఇచ్చిన దాదాపు 1500 మంది మైనర్ల తల్లిదండ్రులకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించి తీవ్రంగా హెచ్చరించారు. ఇటీవల రోజుల్లో పాఠశాలలు, కళాశాల విద్యార్థులు విచ్చలవిడిగా బైక్‌లు నడిపిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు నగరంలో 150కి పైగా పాఠశాల, కళాశాలల్లో జాగృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులకు ఒక సర్క్యులర్ విడుదల చేస్తామని పాఠశాల, కళాశాలల పాలకమండలి హామీ ఇచ్చారని డీసీపీ దక్షిణ విభాగ ట్రాఫిక్ విభాగ డీసీపీ శివప్రకాష్ దేవరాజ్ తెలిపారు. నగరంలోని 23కు పైగా కాలేజీలు వద్ద తనిఖీలు చేపట్టి కాలేజీల ఆవరణలో ఉన్న సుమారు 800 వాహనాలకు ఇప్పటికే జరిమానా విధించారు.

మోదీని మరోసారి ప్రధానిని చేయాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శశికళజోల్లె తదితరులు

తుమకూరు: మోదీని మరోసారి ప్రధానిని చేయాలని జాతీయ సహాయ సంచాలకురాలు, ఎమ్మెల్యే శశికళజోల్లె అన్నారు. శుక్రవారం తుమకూరు నగరంలోని సిద్ధివినాయక సముదాయ భవనంలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి శక్తి వందన అభియాన్, మహిళా స్వయం సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...67 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. వాజ్‌పేయి ఆధ్వర్యంలో బీజేపీ దేశం అభివృద్ధి దిశగా వెళ్లిందని అన్నారు. ఇక ప్రధానిగా మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటపట్టించారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తరాదు


చెరువు వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శుభకల్యాణ్

తుమకూరు: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శుభకల్యాణ్ అధికారులను ఆదేశించారు. తుమకూరుకు నీటిని సరఫరా చేసే బుగుడనహళ్లి చెరువును శుక్రవారం పరిశీలించారు. 363 ఎంసీఎఫ్‌టీల నీరు ఉందని, ఏప్రిల్ వరకు నీటి కొరత ఉండదని పాలికే కార్యనిర్వహణ ఇంజినీర్ బీజీ వినయ్ కుమార్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

బండను ఢీకొని మునిగిపోయిన బోటు


మునిగిపోతున్న బోటు

యశవంతపుర: కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా మంగళూరు సమీపంలోని ఉళ్లాల నుంచి అరేబియా సముద్రంలో చేపలు పట్టడానికి మత్స్యకారులతో శుక్రవారం బయల్దేరిన బోటు ప్రమాదానికి గురైంది. బండరాతిని ఢీకొట్టడంతో బోటుతోపాటు అందులోని యూపీకి చెందిన ఐదుగురు మత్స్యకారులు సమర బహద్దూర్, రామ్ మనోజ్, రోహిత్, ప్రకాశ్, వాసులు నీట మునిగారు. సమీపంలోనే ఉన్న మరో రెండు బోట్లతో ఉన్న సిబ్బంది వెళ్లి మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

పెళ్లి పేరుతో రూ.25 లక్షలకు టోపీ

మైసూరు: పెళ్లిపేరుతో రూ.25 లక్షల మేర వంచనకు పాల్పడిన ఉదంతం మైసూరు జిల్లా హుణసూరు తాలూకా కడెమనుగనహళ్లిలో జరిగింది. గ్రామానికి చెందిన అశోక్ బిజినెస్ కరెస్పాండింగ్స్, వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన వెంకటేష్, లక్ష్మి దంపతులు గత ఏడాది జనవరిలో అశోక్‌ను కలిసి తమ కుమార్తెను వివాహం చేసుకోవాలని కోరారు. వారి ప్రతిపాదనకు అశోక్, అతని తల్లిదండ్రులు అంగీకరించారు. అయితే తాను మరో ఏడాదిపాటు చదువుకోవాలని ఉందని కాబోయే వధువు చెప్పడంతో అశోక్‌కూడా అంగీకరించాడు. అనంతరం ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని ఆ యువతి తల్లిదండ్రులు అశోక్ వద్ద వాపోయారు. అల్లం పంట చేతికందలేదని, మొక్కజొన్న, వక్క పంటసాగుకు అప్పులు చేశామని, వాటిని తీర్చేందుకు అప్పు ఇవ్వాలని కోరారు. భూమి విక్రయించి పెళ్లి చేస్తామని నమ్మబలికారు. దీంతో అశోక్ వారికి రూ.లక్షలు అందజేశాడు. అయితే ఇప్పటి వరకు పెళ్లిమాట ఎత్తడం లేదని, పైగా ఇచ్చిన నగదును కూడా వెనక్కు ఇవ్వడం లేదని బాధితుడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం




బాగేపల్లి: మోదీని మూడోసారి ప్రధానిని చేయడానికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప అన్నారు. శుక్రవారం బాగేపల్లి తాలూకా చాకవేలు గ్రామంలో రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై ఆయన సన్మానం స్వీకరించి మాట్లాడారు. మోదీ నిర్ణయాల వల్ల దేశ అభివృద్ధి ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చిందని అన్నారు. మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

అధికారి అనుమానాస్పద మృతి

దొడ్డబళ్లాపురం: ఎలక్షన్ బ్రాంచ్ ఆఫీసర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కనకపుర తాలూకా కార్యాలయంలో ఎలక్షన్ బ్రాంచ్ ఆఫీసర్‌గా సురేశ్ పనిచేస్తున్నారు. ఈయన తన కార్యాలయంలో ఉరి వేసుకున్న స్థితిలో శుక్రవారం విగతజీవిగా కనిపించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆస్పత్రికి తరలించారు. ఇతను ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా చంపి ఉరి వేశారా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఘనంగా కలశోత్సవం



తుమకూరు: హులియూరు గ్రామ దేవత శ్రీ హులియూరమ్మ దేవి 11వ జాతర మహోత్సవం సందర్భంగా శుక్రవారం కలశోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలను ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు.

కేఆర్ పురం సీఐగా వజ్రముని

కృష్ణరాజపురం: నగరంలోని కృష్ణరాజపురం పోలీస్ స్టేషన్ సీఐగా వజ్రముని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ముంజునాథ్‌ను బదిలీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు డీకే మోహన్ కొత్త సీఐ వజ్రమునిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

దొడ్డబళ్లాపురం: అడవి ఏనుగు దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కనకపుర తాలూకా గొడహళ్లి గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన రాజు (48) మృతి చెందిన వ్యక్తి. గురువారం సాయంత్రం రాజుతోపాటు మరో ఇద్దరు కలిసి గొడహళ్లి సమీపంలోని సంగమ అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఈక్రమంలో రాజు దారితప్పిపోయాడు. మిగతా ఇద్దరు ఇళ్లకు వచ్చేసారు. శుక్రవారం ఉదయం గ్రామస్తులు రాజు కోసం అడవిలో వెదకగా మృతదేహం లభించింది. మృతదేహాన్ని చూసి అడవి ఏనుగు తొక్కి చంపినట్టు గ్రామస్తులు నిర్ధారణకు వచ్చారు. అటవీశాఖ అధికారులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఏనుగు కోసం గాలింపు చేపట్టారు.

పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న దొంగ


నిందితుడు సయ్యద్ అలీ బాబాసాహెబ్(ఫైల్)

తుమకూరు: దొంగను కోర్టుకు తీసుకెళ్తుండగా పోలీసుల కళ్లు గప్పి ఉడాయించాడు. ఈ ఘటన తుమకూరు జిల్లా గుబ్బి పట్టణంలో చోటు చేసుకుంది. గదగ్ జిల్లా లక్ష్మేశ్వర తాలూకా హుల్లూరులో డాన్స్, కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్న సయ్యద్ అలీ బాబాసాహెబ్ నదాఫ్(25) ఓ దోపిడీకేసులో అరెస్ట్ అయ్యాడు. అతన్ని విచారణ చేపట్టేందుకు కోర్టు అనుమతితో గుబ్బి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. గురువారం అతన్ని కోర్టుకు తీసుకెళ్తుండగా పోలీసుల కళ్లుగప్పి ఉడాయించాడు. పోలీసులు అప్రమత్తమై వివిధ ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు.


సీఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

హోసూరు వార్తలు..

రాజకీయ పార్టీ ఏర్పాటుతో సంబరాలు


సంబరాలు నిర్వహిస్తున్న విజయ్ అభిమానులు

క్రిష్ణగిరి: తమిళ సినీ నటుడు విజయ్ కొత్త పార్టీని ప్రారంభించడంతో అభిమానులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. తమిళగ వెట్రికళగం పేరుతో పార్టీని ఏర్పాటు చేసినట్లు విజయ్ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించారు. దీంతో హోసూరు పట్టణంలో ఆయన అభిమాన సంఘం అధ్యక్షుడు వడివేలు, కార్యదర్శి సురేష్ నేతృత్వంలో గాంధీ విగ్రహం వద్ద టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు . గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రజలకు స్వీట్లు, మహిళలకు చీరలు పంచిపెట్టారు. హోసూరు మాజీ ఎమ్మెల్యే కే. గోపినాథ్‌ను అభిమానులు కలిసి తమ నాయకుడి మద్దతు తెలియజేయాలని కోరారు.

మద్యం వ్యసనం మానుకోవాలన్నందుకు ...

హోసూరు: తాగుడు మానుకోవాలని చెప్పినందుకు ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హడ్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది హోసూరు తాలూకా ఆవులపల్లి సమీపంలోని చెన్నసంద్రం గ్రామానికి చెందిన మంజునాథ్‌రెడ్డి(39)కి పెళ్లి కాలేదు. తల్లి పోషణలో ఉంటున్న ఇతను మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానుకోవాలని తల్లి మందలించడంతో జీవితంపై విరక్తి చెందిన మంజునాథ్ తన పొలంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

దేశ సమగ్రాభివృద్ధికి బాటలు వేసే బడ్జెట్


మాట్లాడుతున్న మాజీ ఎంపీ నరసింహన్

హోసూరు: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశాభివృద్ధికి బాటలు వేస్తుందని మాజీ ఎంపీ నరసింహన్ అన్నారు. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్ పేదలు, మహిళలు, రైతులకు అనుకూలంగా ఉందన్నారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిని ప్రోత్సహించేలా పెద్ద ఎత్తున ఎలక్ట్రిక్ చార్జీ కేంద్రాలను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు.

ఏనుగు దాడిలో రైతు, ఆవు బలి


రామణ్ణ మృతదేహం


మృతి చెందిన ఆవు

క్రిష్ణగిరి: ఒంటరిగా సంచరిస్తున్న ఏనుగు ఒక రైతును, అతనికి చెందిన ఆవును బలి తీసుకుంది. ఈ ఘటన సూళగిరి సమీపంలోని కోటంగిరి గ్రామం వద్ద జరిగింది. గ్రామానికి చెందిన రామణ్ణ గురువారం రాత్రి పశువులను కట్టివేసేందుకు వెళ్లిన సమయంలో పొంచి ఉన్న ఏనుగు దాడి చేసింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆవును కొమ్ములతో పొడిచి చంపింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు శుక్రవారం గ్రామానికి చేరుకొని పరిశీలించారు. ఒంటి ఏనుగును కుప్పం అటవీ ప్రాంతానికి మళ్లించారు. వేకువజామునుంచే ఆక్రోశంగా సంచరించిన ఏనుగు కర్ణాటక రాష్ట్రం బన్నేరుఘట్ట అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగులు గుంపులుగా విడిపోయి జవుళగిరి, డెంకణీకోట, శ్యానమావు అటవీ ప్రాంతాల్లో మకాం వేశాయి. శ్యానమావు అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగుల మంద నుంచి ఓ ఏనుగు విడిపోయి గురువారం వేకువజాము సూళగిరి పట్టణంలోకి వచ్చింది.బైక్‌లను, అంబులెన్స్‌లను ధ్వంసం చేసింది. ఏనుగు నుంచి ప్రాణాపాయం ఉందని, తక్షణం ఏనుగును తరిమివేయాలని స్థానికులు అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేది కాదని పేర్కొంటున్నారు.

ఉత్సాహంగా జల్లికట్టు


జల్లికట్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై. ప్రకాష్


వృషభాలను నిలువరిస్తున్న జల్లికట్టు వీరులు

హోసూరు: హోసూరు సమీపంలోని వెంకటేశపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జల్లికట్టు ఉత్సాహంగా సాగింది. డీఎంకే క్రిష్ణగిరి జిల్లా కార్యదర్శి, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని జల్లికట్టును ప్రారంభించారు. హోసూరు, డెంకణీకోట, సూళగిరి తాలూకాల నుంచి సుమారు 200కు పైగా వృషభాలను తీసుకొచ్చి పరుగెత్తించారు. జల్లికట్టువీరులు ఉత్సాహంగా పాల్గొని వృషభాలను నిలువరించారు. జల్లికట్టును తిలకించేందుకు వందలాది మంది ప్రజలు తరలివచ్చారు. వారికి గ్రామస్తులు తాగునీరు సదుపాయం కల్పించి భోజనాలు ఏర్పాటు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

క్రిష్ణగిరి: కుటుంబ కలహాలతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. క్రిష్ణగిరి సమీపంలోని బెల్లారంపల్లి గ్రామానికి చెందిన కృపాకరణ్, సంగీతప్రియ(23)కు నాలుగేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి సంతానం లేదు. దీంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో సంగీతప్రియ రెండు రోజుల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మహారాజగడ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా క్రిష్ణగిరి సమీపంలోని భీమాండపల్లి గ్రామానికి చెందిన గోవిందరాజ్ భార్య విజయలక్ష్మి (21) ఆత్మహత్య చేసుకుంది. వీరికి మూడేళ్ల క్రితం పెళ్లి జరిగింది. దంపతులకు కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాలతో విజయలక్ష్మి పురుగుల మందు తాగింది. ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. క్రిష్ణగిరి డీఎస్పీ శివలింగం కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎంపీ డీకే సురేశ్ వ్యాఖ్యలపై ఆగ్రహం

మైసూరు: దక్షిణ భారత్‌ను ప్రత్యేక దేశం చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యలు చేసిన ఎంపీ డీకే సురేశ్‌పై బీజేపీ మాజీ మంత్రి రామదాసు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మైసూరు నగరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఏఐసీసీ, కేపీసీసీ పూర్తిగా దుర్మార్గంగా తయారైందని, దీంతో ఎంపీ డీకే సురేశ్ ఇలా తప్పుడు వ్యాఖ్యలు చేయడం తగదని, వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రామదాసు డిమాండ్ చేశారు.

ఆయన వ్యాఖ్యల్లో తప్పు లేదు
రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ధ్వజమెత్తిన ఏకైక వ్యక్తి కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ అని, ఆయన స్వార్థంతో మాట్లాడలేదని మళవళ్లి ఎమ్మెల్యే నరేంద్ర స్వామి అన్నారు. శుక్రవారం మైసూరులో మీడియాతో మాట్లాడుతూ...దక్షిణ ప్రాంతాలకు కేంద్రం నిధులను మంజూరు చేయడం లేదని, దీంతో ఆయన ఆ వ్యాఖ్యలు చేశారన్నారు.

బాబు.. ఓ 'పిల్స్' ఫ్యాక్టరీ..

తప్పుడు కేసులతో రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న టీడీపీ అధినేత

- చంద్రబాబు స్పాన్సర్డ్ కేసులతో రాష్ట్రాభివృద్ధికి ఆటంకాలు
- ప్రజాహిత వ్యాజ్యాలను కూడా అపవిత్రం చేసిన ఘనత టీడీపీదే
- రాష్ట్రంలో కరోనా వైరస్ కన్నా ప్రమాదకరంగా పచ్చ మీడియా తీరు
- తప్పుడు కేసులతో జగన్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర
- 'జగన్ పాలన–న్యాయవాదుల స్పందన' అంశంపై రాష్ట్రస్థాయి సదస్సులో న్యాయ రంగ ప్రతినిధులు, మేధావులు


రాష్ట్ర అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన పోస్టర్లను విడుదల చేస్తున్న న్యాయవాదులు, మేధావులు

సాక్షి, అమరావతి: చంద్రబాబు వందలాది తప్పుడు కేసులు పెట్టించి రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి అడుగడుగునా అడ్డుతగులుతున్నారని పలువురు న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. 'పిల్స్' (ప్రజాప్రయోజన వ్యాజ్యాలు) ఫ్యాక్టరీని నడుపుతూ దేశంలో ఏ ప్రభుత్వంపైనా లేనన్ని కేసులు ఈ అభివృద్ధి నిరోధక శక్తులు వేశాయని, వారు తమ స్వార్థం కోసం ప్రజాహిత వ్యాజ్యాన్ని కూడా దుర్వినియోగపరుస్తున్నారని వారు దుయ్యబట్టారు. చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా రాష్ట్రానికి కరోనా వైరస్ కన్నా ప్రమాదకరంగా మారారని ఆరోపించారు. 'జగన్ పాలన–న్యాయవాదుల స్పందన' అంశంపై ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఇందులో పెద్ద సంఖ్యలో పాల్గొన్న న్యాయవాదులు తమ అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధిపై ఆంధ్రా అడ్వకేట్స్ ఫోరం రూపొందించిన నివేదిక ముఖ్యాంశాల పోస్టర్లను అవిష్కరించిన అనంతరం వారు తమ మాట్లాడారు. ఎవరెవరు ఏమన్నారంటే..

చంద్రబాబు ఫ్యాక్టరీ నుంచే 'పిల్స్'..

న్యాయ వ్యవస్థలోని కొందరు కక్షపూరితంగా వ్యవరించారు. జస్టిస్ రాకేష్‌కుమార్ పదవీ విరమణచేసే రోజు జగన్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. కానీ, తర్వాత అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో ఉన్న ఆయనపై ఆరోపణలు రావడంతో పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అలాగే, జగన్‌పై ఇబ్బందికర వ్యాఖ్యలు చేసిన జస్టిస్ బట్టు దేవానంద్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మందలించారు. చంద్రబాబు ఒక 'పిల్ ఫ్యాక్టరీ'ని తయారుచేసి జగన్ ప్రభుత్వంపై సొంత ఖర్చులతో పిల్స్ వేయిస్తున్నారు. అయినా ఈ ప్రభుత్వం అవన్నీ తట్టుకుంటూ ముందు కెళ్లడం అభినందనీయం.

– వీవీఆర్ కృష్ణంరాజు, అధ్యక్షుడు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్

వారికి స్థలాలిచ్చి బీసీలకు ఇవ్వకుండా కోర్టు స్టేనా!?

అమరావతిలో బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కోర్టు స్టే ఇచ్చింది. కానీ, అదే అమరావతిలో న్యాయమూర్తులకు, బ్యూరోక్రాట్లకు స్థలాలు కేటాయించారు. ఇదేం న్యాయం? పాఠశాలల్లో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టి సీఎం జగన్ మంచి పనిచేశారు. విదేశీ విద్య పథకంతో సామాన్యులను చదివిస్తున్నారు. 75 ఏళ్లలో ఎవరూ ఇలాంటి పని చేయలేదు. దేశంలోనే బెస్ట్ సీఎం జగన్.

– బి.అశోక్‌కుమార్, అధ్యక్షుడు, ఆంధ్ర అడ్వకేట్స్ ఫోరం

కేసులు లేకపోతే మరింత అభివృద్ధి..

ఇన్‌ఫ్రా రంగంలో రాష్ట్రం శరవేగంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రతి పక్షాలు, ఒక వర్గం మీడియా పురోగతి ఏమీలేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. క్రెడిట్ రేటింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం దేశంలో సుమారు రూ.70 లక్షల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుండగా.. అందులో రూ.6.75 లక్షల కోట్ల విలువైన పనులు ఒక్క ఏపీలోనే జరుగుతున్నాయి. అలాగే, జగన్ ప్రభుత్వంలో ఆరు ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, పది హార్బర్లు, నాలుగు పోర్టులు, మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, రెండు మేజర్ ఎయిర్‌పోర్టులు, 31 చిన్న, మధ్య తరహా పారిశ్రామిక పార్కుల నిర్మాణం జరుగుతోంది. ఇంత పెద్దఎత్తున ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ మరే రాష్ట్రంలోనూ జరగడంలేదు.

– వెంకట్ మేడపాటి, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ

దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ..

ఇటీవల ప్రధాని మోదీ కూడా స్వార్థపూరిత ప్రజాహిత వ్యాజ్యాలపట్ల ఆందోళన వ్యక్తంచేశారు. 2023–24లో పారిశ్రామిక రంగంలో 16.36 శాతం, సర్వీస్ సెక్టార్‌లో 20 శాతం, వ్యవసాయ రంగంలో 13 శాతం వృద్ధిని మన రాష్ట్రం సాధించింది. కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్లగా సుమారు రూ.20 లక్షల కోట్లు పేదలకు నేరుగా బదిలీ చేయగా, ఒక్క వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.2.60 లక్షల కోట్లు బదిలీచేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

– నారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు, నవరత్నాలు అమలు కమిటీ

స్వార్థశక్తుల చేతుల్లో 'పిల్'

ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో తరచుగా కోర్టులు జోక్యం చేసుకోవడంవల్ల అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉంది. సామాన్యుల కోసం పిల్ సదుపాయం కల్పిస్తే అది స్వార్థశక్తుల చేతిలో ఆయుధంగా మారింది. అనవసరమైన కోర్టు కేసులు లేకపోతే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ఉండేది.

– నరహరిశెట్టి శ్రీహరి, సీనియర్ న్యాయవాది

విద్యలో కేరళను దాటేస్తున్నాం..

రాష్ట్రంలో పిలిచి ఉద్యోగాలిస్తున్నారు.. పోర్టులు కడుతున్నారు.. విద్యా వ్యవస్థలో కేరళను దాటి ఏపీ మొదటి స్థానానికి వెళ్తోంది. తమ సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. పరోక్షంగా న్యాయవాదుల కుటుంబాలు బాగుపడుతున్నాయి. జూనియర్ లాయర్లకు రూ.5వేలు గతంలో ఎవరూ ఇవ్వలేదు.

– ధనలక్ష్మి, న్యాయవాది

ఈ సర్కారును మళ్లీ గెలిపించుకోవాలి..

విద్యావ్యవస్థలో సీఎం జగన్ ప్రక్షాళన తీసుకొచ్చారు. బడుగులు తెలుగు మీడియంలోనే చదవాలన్నట్లు గత ప్రభుత్వాలు చేశాయి. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని సీఎం జగన్ అందుబాటులోకి తెచ్చారు. ఈ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాలి.

– బి. సౌమ్య, న్యాయవాది

ప్రతీ హామీని జగన్ నెరవేర్చారు..

మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీనీ సీఎం జగన్ నెరవేర్చారు. లాయర్లు, ఆటోడ్రైవర్ల దగ్గర్నుంచి పారిశ్రామికవేత్తల వరకూ, అన్ని వర్గాల వారికీ ఆర్థిక చేయూతనిస్తున్నారు. అలాంటి సీఎంను మళ్లీ మనందరం మద్దతిచ్చి గెలిపించుకోవాలి.

– ఉషాజ్యోతి, న్యాయవాది

సంక్షేమ పాలనను లాయర్లు అందరికీ చెప్పాలి..

రాష్ట్రంలో సీఎం జగన్ చేస్తున్న సంక్షేమ పాలన గురించి న్యాయవాదులు తమ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ చెప్పి, వాళ్లకు జరిగిన మేలు గురించి గుర్తుచేయాలి. వారి ద్వారా ప్రజలందరికీ తెలిసేలా చేయాలి.

– జంగా జయలక్ష్మి, సీనియర్ న్యాయవాది

లాయర్లకు జగన్ తప్ప ఎవరూ మంచి చేయలేదు..

గతంలో న్యాయవాదులను వాడుకోవడం తప్ప ఏ ప్రభుత్వం మంచి చేయలేదు. జగన్ సీఎం అయ్యాక రూ.100 కోట్లు ఇస్తామన్నారు. అన్నట్లుగానే ఇచ్చారు. నవరత్నాలు అనే పదాన్ని ఎక్కడ చదివారోగానీ ఆ పేరుతో అందరికీ మంచి చేస్తున్నారు. అవి నిలబడాలంటే జగన్ మళ్లీ గెలవాలి.

– రమణి, సీనియర్ న్యాయవాది

మళ్లీ టీడీపీ బానిసత్వంలోకి వెళ్లొద్దు..

పద్నాలుగు సంవత్సరాల వనవాసం నుంచి బయటకు వచ్చినట్లుంది జగన్ పాలన. మళ్లీ టీడీపీ బానిసత్వంలోకి వెళ్లకుండా ఉండాలంటే న్యాయవాదులంతా కలిసికట్టుగా ఉండాలి. రాష్ట్రంలో చెడ్డ వారంతా చంద్రబాబుకి మద్దతిస్తున్నారు. మంచివాళ్లు జగన్‌ని కోరుకుంటున్నారు.

– జీవనజ్యోతి, న్యాయవాది

రాష్ట్రంలో అద్భుత ప్రగతి..

జగన్ ప్రభుత్వం ఏదైనా విధానపరమైన నిర్ణయం తీసుకుంటే వెంటనే కేసులు వేసి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుతగులుతున్నారు. ప్రజాహిత వ్యాజ్యం అనేది సామాన్యుల న్యాయం కోసం రూపొందిస్తే వాటిని పెత్తందారులు హస్తగతం చేసుకున్నారు. 24 నెలల కరోనా కాలం తర్వాత మిగిలిన మూడేళ్లలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించింది. 2023–24లో 17 శాతం స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటుతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.

– దిన్నం రామకృష్ణ, న్యాయవాది

ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు డీఎస్ఎన్‌వీ ప్రసాదబాబు, తోడుగుంట్ల గోపాలకృష్ణ, మోటుపల్లి విఠల్, సీహెచ్ సాయిరాం, తుళ్లూరు సూరిబాబు, డి. ఆంజనేయ ప్రసాద్, కె. బాబురావు, ఎన్ఆర్‌బి కృష్ణారెడ్డి, నరహరిశెట్టి జ్యోతి, మానవతా సంస్థ ప్రతినిధి సలీం మాలిక్ కూడా మాట్లాడారు.

బాలినేనితో చెవిరెడ్డి భేటీ

ఒంగోలులో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని నిర్ణయం


బాలినేనితో చెవిరెడ్డి భాస్కరరెడ్డి

సాక్షి, అమరావతి: ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తగా నియమితులైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి శుక్రవారం ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ఎలా ముందుకెళ్లాలన్న విషయమై ఇద్దరూ సుదీర్ఘంగా చర్చించుకున్నారు. స్థానికంగా పార్టీని, పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి కలిసి పనిచేయాలని, ప్రభుత్వ కార్యక్రమాలను మరింత బలంగా జనంలోకి తీసుకెళ్లాలని ఇరువురు నేతలూ నిర్ణయించుకున్నారు.

ఫేక్ ఐడీలతో టీడీపీ పోస్టింగ్‌లు

- పులివెందుల పోలీసులకు గతంలోనే వర్రా రాఘవరెడ్డి ఫిర్యాదు
- తెర వెనుక ఐ–టీడీపీ.. వెలుగులోకి మరో కుట్ర కోణం


పులివెందుల ఎస్ఐకి ఫిర్యాదు చేసిన వర్రా రాఘవరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప/సాక్షి, హైదరాబాద్: తెర వెనుక టీడీపీ కుట్రలు బహిర్గతమయ్యాయి! కుట్రపూరితంగా పోస్టింగ్‌లు చేస్తూ బురద చల్లేందుకు ఎల్లో గ్యాంగ్ చేసిన యత్నాలు వెలుగులోకి వచ్చాయి. వైఎస్సార్ జిల్లా పులివెందుల నివాసి వర్రా రాఘవరెడ్డి దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. జనవరి 26వతేదీ నుంచి తన పేరుతో కొందరు ఫేక్ ఐడీ సృష్టించి పోస్టులు పెడుతున్నట్లు గుర్తించిన ఆయన 28న పులివెందుల ఎస్ఐ అరుణ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఏపీ పీసీసీ చీఫ్ షర్మిలను అసభ్యంగా దూషిస్తూ ఫేక్ ఐడీ ద్వారా పోస్టులు చేస్తున్నారని, ఫేక్ ఐడీని ట్రేస్ చేయాలని రాఘవరెడ్డి కోరారు. ఇదే విషయంపై జనవరి 31న వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌కు కూడా ఫిర్యాదు చేశారు. కాగా మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీత తమను చంపేందుకు కుట్ర చేస్తున్నారని, ఏపీ పీసీసీ అధ్యక్షురాలిని దూషిస్తున్నారని వర్రా రాఘవరెడ్డి పేరుతో ఉన్న ఫేక్ ఐడీ వివరాలను హైదరాబాద్ పోలీసులకు అందచేశారు. తన పేరుతో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి తప్పుడు పోస్టులు ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడం వెనుక ఐ- టీడీపీ శ్రేణులున్నాయని వర్రా రాఘవరెడ్డి 'సాక్షి' ప్రతినిధితో పేర్కొన్నారు. ఇలాంటి పోస్టులను ముందే పసిగట్టిన తాను ఇప్పటికే ఏపీ పోలీసులను విచారించాలని కోరినట్లు తెలిపారు.

బెదిరింపులు పెరిగాయి: సునీత

మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత తనకు ప్రాణహాని ఉందంటూ శుక్రవారం హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'ఇద్దరినీ చంపేస్తాం..' అనే అర్థం వచ్చేలా గుర్తు తెలియని వ్యక్తులు ఫేస్‌బుక్ ద్వారా పోస్టులు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల ఈ తరహా బెదిరింపులు ఎక్కువయ్యాయని, పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ శిల్పవల్లి దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎం వైఎస్ జగన్ వెంటే నేనుంటా


కనిగిరి ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్



సాక్షి,అమరావతి: తాను పార్టీ మారుతానంటూ ఎల్లోమీడియా తప్పుడు రాతలు రాసిందని కనిగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మండిపడ్డారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. 'నేను సీఎం వైఎస్ జగన్‌ను కాదని ఎక్కడికీ వెళ్లను. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నాకు రెండుసార్లు సీఎం జగన్ బీఫామ్ ఇచ్చారు. టీటీడీ సభ్యుడిగా కూడా అవకాశం కల్పించారు. నాకు ఇద్దరు దేవుళ్లు. ఒకరు సీఎం జగన్, ఇంకొకరు వెంకటేశ్వర స్వామి. నా రాజకీయ దేవుడు సీఎం వైఎస్ జగన్. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. ఆయన ఏం చెబితే అది చేస్తా. కనిగిరిలో పార్టీ కొత్త ఇన్‌చార్జికి పూర్తిగా సహకరిస్తాం. కనిగిరి కొండమీద వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం. సీటిస్తే ఒకలాగ, ఇవ్వకపోతే మరోలాగా ఉండను. సీఎం జగన్‌తో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. దాన్ని ఎవరూ మార్చలేరు' అని ఆయన స్పష్టం చేశారు.

ఎంపీగానా... వద్దుబాబోయ్!

- అనంతపురం టీడీపీలో అభ్యర్థుల వెనకడుగు
- ఎంపీలుగానే పోటీచేయాలని జిల్లా పార్టీ అధ్యక్షులకు అధిష్టానం ఆదేశం
- ససేమిరా అంటున్న కాలవ శ్రీనివాసులు, బీకే పార్థసారథి
- టికెట్లు ప్రకటిస్తే అసమ్మతి నేతల గమనంపై ఆందోళన
- చేసేది లేక అభ్యర్థుల ఎంపికలో సాగదీత ధోరణి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: తాము చెప్పిందే వేదం ... చేసిందే చట్టం... అన్నరీతిలో సాగుతోంది టీడీపీలో అభ్యర్థుల ఎంపిక విధానం. తండ్రీకొడుకులు వేర్వేరు జాబితాలు సిద్ధం చేసుకోవడంతో వారి మధ్య సయోధ్య నడవక... మరోవైపు ఎక్కడ జాబితా ప్రకటించేస్తే అసమ్మతి నేతలు బయటకు వెళ్లిపోతారోనన్న భయంతో ఎక్కడా అభ్యర్థులను ఖరారు చేయకుండా సాగదీత ధోరణి అవలంబిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అయితే పరిస్థితి రోజు రోజుకూ దయనీయంగా తయారవుతోంది. పార్టీ జిల్లా అధ్యక్షులకే తాము కోరుకున్న చోట టికెట్ దొరికే అవకాశం లేకపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో అధిష్టానం అనుసరిస్తున్న వైఖరి వారిలో ఆందోళన రేకెత్తిస్తోంది.

ఎంపీగానే వెళ్లాలని అధిష్టానం హుకుం

అనంతపురం జిల్లాకు కాలవ శ్రీనివాసులు, శ్రీసత్యసాయి జిల్లాకు బి.కె.పార్థసారథి అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు వీరిద్దరికీ అసెంబ్లీ టికెట్లు లేవని పరోక్షంగా పార్టీ అధిష్టానం సంకేతాలిచ్చింది. ఎమ్మెల్యేలుగా గెలిచే అవకాశం లేనందున ఎంపీలుగా పోటీ చేయాలని వారికి సూచించినట్లు తెలుస్తోంది. ఇందుకు ఇద్దరూ ససేమిరా అంటున్నారు. రెండు రోజుల క్రితం కాలవ శ్రీనివాసులు తాను రాయదుర్గం నుంచే అసెంబ్లీకి పోటీ చేస్తానని కార్యకర్తల సమావేశంలో బహిరంగంగా ప్రకటించారు. అయితే ఆయన ఎట్టిపరిస్థితుల్లోనూ ఎంపీగానే వెళ్లాలని నారా లోకేశ్ తన సన్నిహితుల వద్ద తెగేసి చెప్పినట్టు తెలిసింది. బీకే పార్థసారథి కూడా ఎంపీగా వెళ్లడానికి సుముఖంగా లేరు. మూడు దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఉంటే ఇప్పుడు పెనుకొండ టికెట్ ఇవ్వకుండా ఎంపీగా వెళ్లమనడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఉరవకొండకు చంద్రబాబు వచ్చినప్పుడు కూడా టికెట్ గురించి ప్రస్తావించగా.. ఆయన దాటవేసినట్టు తెలుస్తోంది.

టికెట్లు ప్రకటించేస్తే వెళ్లపోతారేమో..

ఇప్పటికిప్పుడు టికెట్లు ఖరారు చేసేస్తే అసమ్మతి నేతలంతా పార్టీని వదిలి వెళ్లిపోతారేమోననే ఆందోళనతోనే అధినేత చంద్రబాబు సాగదీత ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు దాదాపు ఖరారై... ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తుండగా ఇప్పటికీ టీడీపీలో అభ్యర్థులెవరో తేలకపోవడం విశేషం. తాడిపత్రి, హిందూపురం, ఉరవకొండ మినహా.. మిగతా 11 సెగ్మెంట్లలోనూ అభ్యర్థి ఎవరన్నది తెలియని పరిస్థితి నెలకొంది. అనంతపురం అర్బన్ టికెట్ పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వొచ్చుననే ప్రచారం కూడా జరుగుతోంది. మరోవైపు ఎన్నికల వ్యయం కోసం ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ప్రవాసాంధ్రులకు చంద్రబాబు, లోకేశ్‌లు గాలం వేస్తున్నట్టు తెలుస్తోంది.

సీనియర్లతో బాబు దొంగాట

సాక్షి, అమరావతి: ఎవరితోనైనా దొంగాటలు ఆడగల టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు.. సొంత పార్టీలోని సీనియర్ నేతలకు టికెట్లు ఎగ్గొట్టడానికీ తొండాట ఆడుతున్నారు. ఇందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను మరోసారి పావుగా చంద్రబాబు వాడుకుంటున్నారు. ప్రతి విషయంలో చంద్రబాబు చెప్పగానే తలాడించే పవన్.. ఇప్పుడూ అదే పని చేశారు. 2014 ఎన్నికల తర్వాత తనను తిట్టారంటూ పలువురు టీడీపీ సీనియర్ నేతల పేర్లతో పవన్‌తో ఓ జాబితా తయారు చేయించి, వారికి సీట్లిస్తే జనసేన ఓట్ల బదలాయింపు జరగదని ఓ మాట చెప్పించారు. దానినే ప్రచారం చేయించారు. పవన్ ఒత్తిడి ఉందని, పొత్తులో ఇలా ఒకట్రెండు అంశాల్లో సర్దుకుపోకతప్పదంటూ చంద్రబాబు పార్టీ నేతల అమాయకత్వం ఒలకబోసి, తాను అనుకున్న పలువురికి టికెట్లు ఎగ్గొడుతున్నట్లు పార్టీలో తీవ్రంగా ప్రచారం జరుగుతోంది. టీడీపీ వర్గాల నుంచి అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం.. చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ ఇచ్చిన ఈ జాబితాలో సీనియర్లు చింతమనేని ప్రభాకర్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, చింతకాయల అయ్యన్నపాత్రుడి కుమారుడు చింతకాయల విజయ్, మరో నలుగురు ఉన్నారు. వారికి సీట్లిస్తే జనసేన నుంచి ఓట్ల బదలాయింపు జరగదని పవన్‌తో చంద్రబాబు చెప్పించారు. ఈ నాయకుల విషయంలో తన మాట వినాల్సిందేనని పవన్ కోరినట్లు ప్రచారం చేశారు. పొత్తులో భాగంగా ఇందుకు చంద్రబాబు కూడా అంగీకరించినట్లు ప్రచారం చేశారు. జనసేనతో పొత్తు కొనసాగాలంటే ఒకట్రెండు అంశాల్లో పవన్ చెప్పినట్లు వినక తప్పడంలేదంటూ నేతల ముందు చంద్రబాబు అమాయకత్వం ఒలకబోశారు. ఇలా ఏడుగురు నేతలకు చంద్రబాబు సీట్లు నిరాకరించారు.

ఈ ముగ్గురికీ ఇలా

చంద్రబాబు తొండాటలో టీడీపీ సీనియర్ నేత, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ టికెట్ కోల్పోతున్నారు. దెందులూరు సీటును ఈసారి ప్రభాకర్‌కి కాకుండా వేరొకరికి ఇవ్వడానికి బాబు నిర్ణయించారు. 2014 ఎన్నికల తర్వాత జనసేన సహకారంతోనే టీడీపీ అధికారంలోకి వచ్చిందనే వాదనను ప్రభాకర్ తిప్పికొట్టారు. అసలు జనసేనకు బలం ఎక్కడుందని ప్రశ్నించారు. పవన్‌పై వ్యక్తిగతంగానూ విమర్శలు చేశారు. దీన్ని సాకుగా చూపి, పవన్ ముసుగులో ప్రభాకర్‌కి బాబు మొండి చేయి చూపించారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా పవన్‌పై గతంలో విమర్శలు చేశారన్న సాకుతో ఆయనకూ మొండి చేయి చూపించారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేన ఖాతాలో వేశారు. తద్వారా బుచ్చయ్య చౌదరిని పక్కకు తప్పిస్తున్నారు. మరో టీడీపీ సీనియర్ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడూ గతంలో పవన్‌పై వెటకారంగా మాట్లాడారు. ఆయన కుమారుడు విజయ్ టీడీపీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు పవన్‌ను ఇరకాటంలో పెట్టేలా వ్యవహరించారు. ఈ కారణాన్ని చూపించి, అయ్యన్న కుటుంబాన్ని పవన్‌తో చెప్పించిన జాబితాలో చేర్చారు. అనకాపల్లి ఎంపీ సీటు తన కుమారుడికి ఇవ్వాలని అయ్యన్న కోరగా, ఇచ్చేది లేదని చంద్రబాబు చెప్పేశారు. ఇలా ఆయన్నపాత్రుడుని, ఆయన కుమారుడిని రాజకీయంగా దెబ్బ తీశారు. ఇంకా మరికొందరికి కూడా పవన్ ముసుగులో దెబ్బేయడానికి చంద్రబాబు రంగం సిద్ధం చేసినట్లు టీడీపీలో చర్చ జరుగుతోంది.

నేరుగా చెప్పడానికి భయపడి..

వాస్తవంగా సీనియర్ నేతలు, రాజకీయంగా పట్టు ఉన్న అయ్యన్నపాత్రుడు, బుచ్చయ్య చౌదరి, చింతమనేని ప్రభాకర్ వంటి వారికి టికెట్లు ఇవ్వడం చంద్రబాబుకు ఇష్టం లేదు. కానీ, నియోజకవర్గంలో వారిని కాదని వేరొకరికి టిక్కెట్టు ఇస్తే, వచ్చే కాసిని ఓట్లు కూడా పోతాయని, ఇంతకాలం రాజకీయం, అధికారం ముసుగులో తన నేతృత్వంలో జరిగిన అక్రమాలన్నింటినీ వారు బయటపెడతారన్న ఆందోళన చంద్రబాబులో ఉంది. ఈ భయంతోనే పవన్‌ను వాడుకొని వారికి మొండి చేయి చూపిస్తున్నారని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి

సాక్షి, అమరావతి: ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాన్ని నమ్మవద్దని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాట్సాప్ గ్రూపుల్లో తన పేరిట తప్పుగా ప్రచారం జరుగుతోందన్నారు. రిటైర్మెంట్ వయసు రెండేళ్లు పెంచడం సహా పలు అంశాలతో నకిలీ మెసేజ్‌లు వస్తున్నాయని తెలిపారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదనీ, దీనిపై సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. ఉద్యోగులకు ఐఆర్ 20 శాతం, పీఆర్సీ, డీఏ బకాయిలు సైతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామనీ, దీనిపై వచ్చే వారంలో గ్రూప్ ఆఫ్ మినిస్టర్లు చర్చలు జరుపుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐఆర్ సహా పలు డిమాండ్లపై ప్రకటన వచ్చే అవకాశం ఉందన్నారు.

కిరాయిలు ఇవ్వకుంటే ఎలా బాబూ!

- అరకులో టీడీపీ'రా కదలిరా' సభకు ఆటోల ద్వారా ప్రజల తరలింపు
- కిరాయి డబ్బుల కోసం డ్రైవర్ల ఆందోళన


బాకురులో ఆటోలతో నిరసన చేస్తున్న ఆటో డ్రైవర్లు

హుకుంపేట (అల్లూరి సీతారామరాజు జిల్లా): చంద్రబాబు సభకు ఆటోల్లో ప్రజలను తరలించిన డ్రైవర్లకు కిరాయి డబ్బులు చెల్లించకపోవడంతో వారు ఆందోళనబాట పట్టారు. టీడీపీ నేతల తీరును నిరసిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా బాకురులో ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. బాకూరు, ఉప్ప, చీకుమద్దుల, అండిభ, పంచాయతీల పరిధిలోని ఆటో డ్రైవర్లు రోడ్డెక్కారు. గతల నెల 20న అరకులో జరిగిన 'రా కదలి రా' సభకు జనాలను తరలించేందుకు ఒక్కొక్క ఆటోకు రూ.2,500 ఇస్తామని నేతలు ఒప్పందం చేసుకున్నారు. అయితే, ముందుగా కొంతమందికి మాత్రమే రూ.500 అడ్వాన్స్ ఇచ్చారని, మరికొందరికి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఒకేసారి ఇస్తామంటూ ఆటోలను సభకు తరలించారని పలువురు ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తంచేశారు. బాకురు, అండిభ యూనియన్ల పరిధిలో సుమారు 60 ఆటోలు, ఉప్ప ప్రాంత యూనియన్ నుంచి సుమారు 50 ఆటోలను మొత్తం 110 ఆటోల్లో ప్రజలను సభకు తీసుకువెళ్లామని వాపోయారు. సభ జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు తమకు కిరాయిలు చెల్లించకుండా టీడీపీ నేతలు తప్పించుకు తిరుగుతున్నారని మండిపడ్డారు. సభ జరిగే రోజు తమ ప్రాంతంలో సంత ఉంటుందని చంద్రబాబు సభకు వెళ్లకుండా అక్కడే టికెట్ సర్వీసు చేసుకుంటే సుమారు రూ.3వేల వరకు సంపాదించుకుని ఉండేవారమని వారు లబోదిబోమంటున్నారు. కిరాయిలు ఇవ్వకపోతే ఓట్ల కోసం తమ గ్రామాలకు వచ్చే టీడీపీ నాయకులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఊరుకునేది లేదు..



రోజు మా కుటుంబ పోషణ నిమిత్తం ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. కిరాయి డబ్బులు ఇస్తామని చంద్రబాబు సభకు తీసుకువెళ్లారు. ఇప్పుడు డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుతిరుగుతున్నారు. కిరాయి డబ్బులు చెల్లించకపోతే ఊరుకొనేది లేదు.

– దూసురు వెంకట రమణ,ఆటో యూనియన్ అధ్యక్షుడు, అండిభ, హుకుంపేట మండలం

మా పొట్ట కొడితే ఎలా?



నాది పేద కుటుంబం. అమ్మా నాన్న కూలి చేస్తేనే తప్ప కడుపు నిండదు. రోజు ఎంతో కష్టపడితే గాని నాలుగు వేళ్ల నోటికి వెళ్లవు. ఆటో ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం. సభలకు జనాలను తరలించేటప్పుడు అడ్వాన్సులు అడిగితే అన్నీ కలిపి ఒకేసారి ఇస్తామంటూ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

– సంతోష్, ఆటో డ్రైవర్, చట్రాయిపుట్టు

రాజకీయ ఊసరవెల్లి పురందేశ్వరి

- భీమవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ధ్వజం
- దమ్ముంటే పవన్, చంద్రబాబు భీమవరంలో పోటీ చేయాలని సవాల్



సాక్షి, భీమవరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సిద్ధాంతమంటూ లేని రాజకీయ ఊసరవెల్లి అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలను శుక్రవారం ఆయన తీవ్రంగా ఖండించారు. భీమవరంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో పురందేశ్వరి రాష్ట్ర బాధ్యతలు నిర్వర్తించడం ఆ పార్టీ అభిమానులకు అంతకంటే దౌర్భాగ్యమైన పరిస్థితి మరొకటి ఉండదన్నారు. గతంలో కాంగ్రెస్‌లో చేరి రాహుల్‌గాంధీ అనుగ్రహంతో కేంద్ర మంత్రి పదవి దక్కించుకున్నారన్నారు. తర్వాత బీజేపీలో చేరి రాష్ట్రంలో టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని చెప్పారు. ఎన్నికల వాగ్దానాలను నూటికి నూరుశాతం అమలుచేసిన సీఎం వైఎస్ జగన్ లాంటి నాయకుడిని దేశ చరిత్రలో చూడలేదన్నారు. పేదరికం పోగొట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం జగన్ గురించి ఇటువంటి ఊసరవెల్లులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

అంత భయమెందుకు పవన్?

పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోందని, మరోమారు తనపై ఓటమి తప్పదన్న భయంతోనే చంద్రబాబుతో పొత్తుపెట్టుకున్నట్టు తెలుస్తోందని గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆ పార్టీతో అంటకాగితేనే గానీ భీమవరంలో తనపై పోటీచేసే ధైర్యం ఆయనకు లేదన్నారు. దమ్ముంటే పవన్ కళ్యాణ్ ఒక్కరే కాదు, చంద్రబాబు కూడా వచ్చి భీమవరంలో తనపై పోటీచేయాలని సవాల్ చేశారు. ఇద్దరూ విడిగా పోటీచేసి తనపై గెలిచే దమ్ముందా అని ప్రశ్నించారు.

'మన దేశంలో అన్నింటికీ కోర్సులు ఉన్నాయి... పేరెంటింగ్‌కి తప్ప.
పిల్లల మానసిక సమస్యల గురించి చాలా తక్కువ పట్టింపు ఉన్న దేశం.
పిల్లల్లో మానసిక సమస్యలు అధికంగా ఉన్న దేశం మనదే.
పిల్లల గురించిన ఆలోచనే అందరికీ ప్రధానం కావాలి' అన్నారు
జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొన్న
చైల్డ్ సైకియాట్రిస్ట్‌లు డాక్టర్ శేఖర్ శేషాద్రి,
డాక్టర్ అమిత్ సేన్, పిల్లల మానసిక చికిత్సా
కేంద్రం నిర్వాహకురాలు నేహా కిర్‌పాల్.
ఇంకా వారేమన్నారు?

జెఎల్‌ఎఫ్ 2024



చిల్డ్రన్ ఫస్ట్

'మన దేశంలో పదికోట్ల మంది బాల బాలికలు మానసిక సమస్యలతో బాధ పడుతున్నారు. వారిలో కేవలం ఒక్కశాతం మందికి మాత్రమే నాణ్యమైన మానసిక చికిత్స, థెరపీ అందుతున్నాయి. తల్లిదండ్రుల ప్రపంచం, పిల్లల ప్రపంచం వేరు వేరుగా ఉంది. చాలా కుటుంబాలలో సభ్యుల మధ్య కనెక్టివిటీ లేదు. దానివల్ల అనేక సమస్యలు వస్తున్నాయి' అని తెలిపారు పిల్లల మానసిక ఆరోగ్యరంగంలో పని చేస్తున్న నేహా కిర్‌పాల్, శేఖర్ శేషాద్రి, అమిత్ సేన్.జైపూర్‌లో జరుగుతున్న జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో 'రీక్లయిమింగ్ హోప్' అనే సెషన్‌లో వీరు పాల్గొన్నారు.

చదువుల ఒత్తిడి - ఆత్మహత్యలు

'పోటీ పరీక్షల ఒత్తిడి పిల్లలను ఆత్మహత్యలకు ఉసిగొల్పుతోంది. రాజస్థాన్‌లోని 'కోటా'లో కోచింగ్ సంస్థల వ్యాపారం 12 వేల కోట్లకు చేరుకుంది. ఏటా లక్షమంది విద్యార్థులు అక్కడ జెఇఇ, నీట్ ర్యాంకుల కోసం చేరుతున్నారు. తీసుకున్న ఫీజు కోసం నిర్వాహకులు తల్లిదండ్రులను సంతృప్తిపరచడానికి పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారు. రోజుకు 12 గంటల రొటీన్ వల్ల పిల్లలకు కొద్దిగా కూడా రిలీఫ్ లేదు. రోజువారీ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్నవారికి ఒకరకమైన ట్రీట్‌మెంట్, మార్కులు రాక స్ట్రగుల్ చేస్తున్నవారికి ఒక ట్రీట్‌మెంట్ ఉంటోంది. పిల్లలు తమ మీద తాము విశ్వాసం కోల్పోతున్నారు. చెప్పుకుందామంటే తల్లిదండ్రుల నుంచి కనీస సానుభూతి దొరకడం లేదు. దాంతో ఆత్మహత్యల ఆలోచనలు, చర్యలు పెరుగుతున్నాయి. పిల్లలకు ఏం కావాలో తెలుసుకోకుండా వారు చదువుకునే గదుల్లో ఫ్యాన్లు తీసేసినంత మాత్రాన ఆత్మహత్యలు ఆగవు. పిల్లలే మనకు ప్రధానం అనుకోకపోవడం వల్ల ఈ దారుణ స్థితి ఉంది' డాక్టర్ అమిత్ సేన్ అన్నారు. ఢిల్లీకి చెందిన ఈ చైల్డ్ సైకియాట్రిస్ట్ పిల్లలకు ఎలాగైనా మానసిక చికిత్స అందించాలని 'చిల్డ్రన్ ఫస్ట్' అనే ఆన్‌లైన్ క్లినిక్‌ని నడుపుతున్నారు. కాని పల్లెటూరి పిల్లలకు ఇలాంటి సాయం ఉంటుందని కూడా తెలియడం లేదు అని వాపోయారాయన. వంద మంది పిల్లల్లో ఒక్కరే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు అని తెలిపారు.

పరీక్షల మేళాలు జరగాలి

'పరీక్షలంటే మార్కులు అని పిల్లల బుర్రల్లో ఎక్కించాం. కాని పరీక్ష రాస్తున్నాం అంటే ఏదో ఒకటి నేర్చుకునే అవకాశం వచ్చింది అనే భావన పిల్లల్లో ఎక్కించాలి. నేర్చుకుని, ఆ నేర్చుకున్నది చూపుదాం అని పిల్లలు అనుకోవాలి తప్ప మార్కులు చూపిద్దాం అనుకోకూడదు. నా దృష్టిలో పిల్లలు పరీక్షలు ఎంజాయ్ చేయాలంటే పరీక్షల మేళాలు జరగాలి. మైదానాల్లో రకరకాల పరీక్షలు రాసేందుకు పిల్లలను ఆహ్వానించాలి. అక్కడే ఆ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఉంచాలి. పురాణాలు, క్రీడలు, భౌగోళిక ప్రాంతాలు, ఆరోగ్యం... ఇలా అనేక అంశాల మీద పరీక్షలు అక్కడికక్కడ రాయించాలి. దాంతో పరీక్షల భయం పోతుంది' అన్నారు నిమ్‌హాన్స్ (బెంగళూరు) సీనియర్ చైల్డ్ సైకియాట్రిస్ట్ శేఖర్ శేషాద్రి. 'పిల్లలు ఏదైనా సమస్య చెప్పుకోవాలనుకున్నప్పుడు ముగ్గురు వారితో సున్నితంగా వ్యవహరించాలి. ఒకరు కుటుంబ సభ్యులు... రెండు స్కూల్ టీచర్లు... మూడు సమాజం అనే చుట్టుపక్కలవారు, బంధువులు. పిల్లలకు గౌరవం ఇవ్వాలి అని కూడా చాలామంది అనుకోరు' అన్నారాయన. 'చైల్డ్ అబ్యూజ్ జరిగినప్పుడు పిల్లలు వచ్చి చెప్పుకుంటే వారిని దగ్గరకు తీసుకోవాల్సింది పోయి... నువ్వే దీనికి కారణం అని నిందించే స్థితి ఉంది' అన్నారాయన.

కోవిడ్ చేసిన మేలు

'కోవిడ్ వల్ల తల్లిదండ్రులు, పిల్లలు ఇంట్లో ఎక్కువ రోజులు కలిసి ఎక్కువసేపు గడిపే వీలు వచ్చింది. అప్పటికి గాని మన దేశంలో పిల్లలు, తల్లిదండ్రులు ఒకరికి ఒకరు సంబంధం లేకుండా ఎలా జీవిస్తున్నారో పరస్పరం అర్థం కాలేదు. కోవిడ్ వల్ల బంధాలు బలపడ్డాయి. అది జరిగిన మేలు. అదే సమయంలో పిల్లల మానసిక సమస్యలు, ప్రవర్తనలు తల్లిదండ్రులకు తెలిసి వచ్చాయి. కాని వాటికి సరైన చికిత్స చేయించాలని మాత్రం అనుకోవడం లేదు' అన్నారు నేహా కిర్‌పాల్. ఈమె పిల్లల మానసిక చికిత్స కోసం 'అమాహ హెల్త్' అనే క్లినిక్‌ల వరుసను నడుపుతున్నారు.

'పిల్లల మానసిక ఆహ్లాదానికి కళలు చాలా ముఖ్యమని తెలుసుకోవాలి. ఇటీవల పిల్లల మానసిక సమస్యలకు ఆర్ట్స్ బేస్డ్ థెరపీలు బాగా ఉనికిలోకి వచ్చాయి' అని తెలిపారు వారు.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి

అను విశ్వనాథన్ ఇంజినీర్, ట్రయాథ్లెట్ (స్విమ్మింగ్, బైస్కిల్ రైడింగ్, రన్నింగ్), రైటర్, ఫిల్మ్ మేకర్. ఇప్పుడు స్టాండప్ కామెడీతో కూడా తన ప్రతిభను చాటుకుంటోంది. పిల్లలకు తల్లిగా తన అనుభవాలే 'బిఫోర్ చిల్డ్రన్: ఆఫ్టర్ డైపర్స్' (బీసి: ఏడీ). ఈ స్టాండప్ కామెడి షోతో నవ్వుల ప్రయాణాన్ని మొదలు పెట్టింది అను విశ్వనాథన్...

● మల్టీ టాలెంట్

సాహసాల నుంచి నవ్వుల వరకు


అను విశ్వనాథన్

ఢిల్లీలో పుట్టిన అను విశ్వనాథన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ చేసింది. న్యూజిలాండ్‌లోని 'యూనివర్శిటీ ఆఫ్ కాంటర్‌బరీ'లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేసింది. 2008లో 'హాఫ్ ఐరన్ మ్యాన్ 70.3 క్లియర్ వాటర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్' కు అర్హత సాధించిన మొదటి భారతీయ మహిళగా, 2009లో 'అల్ట్రామాన్ కెనడా' ఈవెంట్‌ను పూర్తి చేసిన మొదటి ఆసియా మహిళగా ప్రత్యేకత చాటుకుంది. ఐఐఎం అహ్మదాబాద్, ఐఐటీ రోపర్‌లలో విజిటింగ్ ఫ్యాకల్టీగా పనిచేసింది.

తన సాహసాలకు 'ఎనీ వేర్ బట్ హోమ్' పేరుతో పుస్తక రూపం ఇచ్చింది. ఈ పుస్తకానికి మంచి స్పందన లభించింది. సినిమా అవకాశాలు వచ్చాయి. పిల్లల తల్లిగా తన అనుభవాలను 'బిఫోర్ చిల్డ్రన్: ఆఫ్టర్ డైపర్స్'గా మలిచింది. ఈ స్టాండప్-కామెడీ షో ఘన విజయం సాధించింది.

'నవ్వించడం చాలా కష్టం' అంటున్న అను అందుకోసం 'కామిక్ పెర్‌ఫామెన్స్'లో శిక్షణ తీసుకున్న తరువాతే స్టేజీ మీద అడుగు పెట్టింది.

న్యూ మామ్స్‌లో సహజంగా ఉండే ఒత్తిడిని మాయం చేసి వారి మనసులను తేలిక చేయడంలో ఈ షో విజయం సాధించింది.

'తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఎన్నో జరుగుతుంటాయి. వాటిలో నుంచి కామెడీకి అవసరమైన ముడిసరుకు దొరుకుతుంది. మనం ఏదీ మరిచిపోవడం లేదుగానీ నవ్వును మాత్రం మరిచిపోతున్నాం. నవ్వు మనల్ని సంతోషంగానే కాదు చురుగ్గానూ ఉంచుతుంది. పిల్లలకు తల్లిగా నేను కొత్త జీవితాన్ని ప్రారంభించాను. పేరెంట్‌గా ప్రతి రోజూ ఒక కొత్త విషయం తెలుసుకోవచ్చు. ఒకవైపు పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే మరోవైపు కామెడీ షో కోసం ప్రయాణాలు చేస్తుంటాను. ఈ విషయంలో నా కుటుంబం నాకు అండగా ఉండి ముందుకు నడిపిస్తోంది' అంటుంది అను విశ్వనాథన్.





● సేవాపథం


లక్ష్మీ గౌతమ్

'అత్తమ్మ' అనే మాటలో 'అమ్మ' కూడా ఉంది.
కనక ధార అలాంటి అత్తమ్మ.
'అత్తమ్మ' ఇచ్చిన స్ఫూర్తితో ధైర్యంగా ముందడుగు వేసిన లక్ష్మీ గౌతమ్
ఆమె పేరు మీద స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించి వితంతువుల నుంచి
అనాథల వరకు ఎంతోమందికి అండగా నిలబడుతోంది.

బృందావన దేవదూత

ఉత్తర్‌ప్రదేశ్‌లోని పవిత్ర పట్టణమైన బృందావన్‌లోని యమునా నదిలో పవిత్ర స్నానాలు చేయడానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు వస్తుంటారు. అలా వచ్చే వారిలో ఎవరికి ఏ సమస్య వచ్చినా లక్ష్మికి ఫోన్ చేస్తారు. 'నేను ఉన్నాను' అంటూ వారికి అండగా నిలబడుతుంది డా.లక్ష్మి. వితంతువులు, అనాథలు, నిరుపేదలకు ఆమె బృందావన దేవదూత.

బృందావన్ 'సిటీ ఆఫ్ విడోస్' అని పేరు తెచ్చుకుంది. దీనికి కారణం లక్ష్మి మాటల్లో చెప్పాలంటే...

'పశ్చిమ బెంగాల్‌తోపాటు మన దేశంలోని మారుమూల ప్రాంతాల్లో బాలవితంతువులు ఉన్నారు. కొద్దిమంది విషయంలో భర్త చనిపోయినా, వదిలి వెళ్లినా వారిని పట్టించుకునే వారు ఉండరు. ఈ నేపథ్యంలో వితంతువులకు సురక్షితమైన ఆశ్రమాలు ఉన్న పట్టణంగా బృందావన్ మారింది'

అయితే అందరి పరిస్థితి ఒకేలా లేదు.

కొంతమంది వితంతువులు ఇక్కడ కష్టాలు పడేవారు. కొన్ని సంవత్సరాల క్రితం దర్శనం కోసం బృందావన్‌కు వచ్చిన సుప్రీంకోర్టు న్యాయవాది ఒకరు వితంతువుల దుస్థితిని చూసి ఏడుగురు సభ్యులతో ఒక కమిటీని వేశారు. అలా నియమించిన కమిటీలో లక్ష్మి కూడా ఉన్నారు. ఈ కమిటీలో భాగం కావడం ద్వారా వితంతువుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను లోతుగా తెలుసుకునే అవకాశం దొరికింది. వితంతువుల అంతిమ సంస్కారాలను ఎవరూ పట్టించుకోకపోవడం ఆమెను ఆవేదనకు గురిచేసింది. బృందావనంలో ఏ ఒక్క వితంతువు కూడా దయనీయస్థితిలో చనిపోకూడదు. వారి కర్మకాండలు గౌరవప్రదంగా చేయాలనే ఉద్దేశంతో 'కనకధార' అనే స్వచ్ఛంద సంస్థ ప్రారంభించింది. 'కనకధార' అనేది ఆమె అత్తయ్య పేరు. మృదుభాషి అయిన తనను అత్తయ్య నలుగురి ముందు గట్టిగా మాట్లాడే ధైర్యాన్ని ఇచ్చింది.

'భర్త గుర్తింపు మీద ఆధారపడవద్దు. నీదైన గుర్తింపు తెచ్చుకో' అని చెప్పేది ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అత్తయ్య.

అత్తయ్య ప్రోత్సాహంతో లక్ష్మి పీహెచ్‌డీ చేసి అధ్యాపక వృత్తిలోకి వచ్చింది. వృత్తిని, స్వచ్ఛంద సంస్థ కార్యకలాపాలతో బ్యాలెన్స్ చేసుకోవడం అంత సులభం కాదు. అయితే సంకల్పబలం ఉన్న వాళ్లకు అదేమీ కష్టం కాదు. లక్ష్మీగౌతమ్ ఈ కోవకు చెందిన మహిళ.

'కనక ధార' స్వచ్ఛంద కార్యక్రమాలలో అత్తయ్యతోపాటు భర్త విజయ్ గౌతమ్ కూడా భాగం అయ్యారు. ఇప్పటివరకు లక్ష్మి వెయ్యి మందికి పైగా వితంతువుల అంతిమ సంస్కారాలు నిర్వహించింది. అంబులెన్స్ అవసరాల నుంచి ఫైనల్ డ్రెస్సింగ్ వరకు అన్నీ ఆమె చూసుకునేది.

కరోనా మహమ్మారి కాటేస్తున్న సమయంలో మధురలో 72 రోజుల పాటు వందలాది మంది అనాథలకు వండి వడ్డించేది. ఇంటి నుంచి పారిపోయి వచ్చిన యువతులకు మార్గదర్శనం చేయడంలో, అపహరణకు గురైన యువతులను రక్షించి అండగా నిలవడంలో 'కనక ధార' స్వచ్ఛంద సంస్థ సహాయపడుతోంది.

కాలేజీలో ఒకరోజు...

వృత్తి జీవితాన్ని, సామాజిక సేవను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లేదాన్ని. సామాజిక సేవకు సంబంధించిన కార్యక్రమాలకు తప్ప వ్యక్తిగత పనుల కోసం సెలవుపెట్టే దాన్ని కాదు. ఒక వితంతువు చనిపోయిందని, మృతదేహాన్ని క్లెయిమ్ చేయకుండా అనాథలా పడి ఉందని ఒకరోజు ఫోన్ వచ్చింది. ఆ సమయంలో కాలేజీలో ఉన్నాను. వెంటనే ప్రిన్సిపల్‌ను అనుమతి అడిగి బయటికి వచ్చాను. బైకర్ నుంచి లిఫ్ట్ తీసుకొని ఘటన స్థలానికి చేరుకున్నాను. అక్కడ ఎన్నో గంటల పాటు ఉండాల్సి వచ్చింది. అంబులెన్స్ ఏర్పాటు చేసి అంత్యక్రియలు చేశాను. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

– డా.లక్ష్మీ గౌతమ్


అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ...

విశ్రాంతి ఉద్యోగానికే... జీవితానికి కాదు!

ప్రతిరోజూ మనదే.
ప్రతిరోజునీ శ్వాసించాలి.
ప్రతిరోజునీ ఆఘ్రాణించాలి.
ప్రతిరోజునీ ఆస్వాదించాలి.
ప్రతిరోజుకీ జీవం ఉండాలి.
అప్పుడే...
జీవితం జీవంతో ఉంటుంది.
సంతోషాల సుమహారమవుతుంది.

'బోర్ కొడుతోంది' చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరి ముని పెదవుల మీద ఉంటుందీ మాట. పిల్లలను బోర్‌డమ్ నుంచి బయటేయడం సులువే. కానీ రిటైర్ అయిన వాళ్లను వేధించే బోర్‌డమ్‌కు పరిష్కారం ఎలా? వయసు పై బడేకొద్దీ... అలవాటు పడిన జీవితం నుంచి కొద్దిపాటి మార్పును కూడా స్వీకరించలేని మొండితనం ఆవరించేస్తుంటుంది. ఆ మొండితనం నుంచి బయటపడలేక అవస్థలు పడే వార్ధక్యానికి ఓ సమాధానం చెన్నమాధవుని అశోక్‌రాజు. విదేశాల్లో స్థిరపడిన పిల్లల దగ్గరకు వెళ్లిన తల్లిదండ్రులు 'మేమక్కడ ఉండలేకపోయాం. బోర్ కొట్టి చచ్చాం. ఒక్క రోజు ఒక్క యుగంలా గడిచింది' అనే వాళ్లకు సమాధానంగా అశోక్‌రాజు తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

కలప కరెంట్ స్తంభాలు

"మేము హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో విశ్రాంత జీవనం గడుపుతున్నాం. యూఎస్‌లోని రెడ్‌మాండ్‌లో మా పెద్దమ్మాయి, అల్లుడు, మనుమరాలు ఉన్నారు. గడచిన ఏడాది నేను, మా ఆవిడ వీణారాణి... పెద్దమ్మాయి దగ్గరకు వెళ్లి ఆరు నెలలు ఉండి డిసెంబర్‌లో ఇండియాకొచ్చాం. టూర్‌లో భాగంగా... యూఎస్‌లో టకోమా – సియాటెల్ ఎయిర్ పోర్ట్‌లో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గాన రెడ్‌మాండ్‌కు చేరుకున్నాం. రోడ్డు వెడల్పుగా, ఇరువైపులా నిటారుగా పెరిగిన చెట్లతో పచ్చగా ఉన్నాయి పరిసరాలు. కర్రలతో నిర్మించిన ఇళ్లు చూడముచ్చటగా ఉన్నాయి. ఇంటి చుట్టూ ఎత్తుగా పెరిగిన చెట్లతో అడవిమధ్యలో ఇల్లు కట్టినట్లు ఉంది. ఇంటి నిర్మాణంలో మాత్రమే కాదు, విద్యుత్ స్తంభాలుగా కూడా కలపనే వాడతారు. బాగా ఎత్తుగా పెరిగిన చెట్లను కరెంట్ స్తంభాలుగా ఉపయోగిస్తారు. పైన్ లేక్, లేక్ వాషింగ్టన్, స్నో క్వాలమిన్ ఫాల్స్, విద్యుత్ ఉత్పాదన కేంద్రాలను చూశాం. ఓపెన్ ప్లేస్ మేరిమూర్ పార్క్‌లో సినిమా చూడడం మాకు విచిత్రమైన అనుభూతి. మన దగ్గర ఉన్నట్లు క్లోజ్‌డ్ థియేటర్ కాదది. బహిరంగ ప్రదేశంలో లాన్‌లో కుటుంబాలతో కూర్చుని స్నాక్స్ తింటూ, కూల్‌డ్రింకులు తాగుతూ సినిమా చూస్తుంటారు.

పాశ్చాత్యంలో మన పతంజలి యోగ

మెక్సికోలో ముఖ్యమైన పర్యాటక ప్రదేశం కంకూన్‌కెళ్లాం. అక్కడ క్లౌన్ ప్యారడైజ్ క్లబ్... ఐదు వందలకు పైగా గదులున్న పెద్ద హోటల్. యూఎస్, కెనడా, బ్రెజిల్, యూకే నుంచి పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. మన దగ్గర ఫైవ్ స్టార్ హోటళ్లలో జిమ్‌లుంటే... అక్కడ అతిథుల కోసం డెయిలీ రొటీన్‌లో యోగసాధన కూడా ఉంది. అక్కడి శిక్షకులు పతంజలి యోగ పుస్తకాన్ని ఆధారం చేసుకుని స్పానిష్ భాషలో వివరిస్తున్నారు. థియరీని మక్కీకి మక్కీ నేర్చుకుని అర్థమైనంతలో సాధ్యమైనంత వరకు ఆచరణలో పెడుతున్నారని అర్థమైంది. నాకున్న ముప్పై ఏళ్ల యోగ సాధన అనుభవంతో సీనియర్ సిటిజెన్ కోసం ఆరు రోజుల కోర్సు డిజైన్ చేసి నేర్పించాను. పవన ముక్తాసనం, మకరాసనం, సర్పాసనం, వజ్రాసనం, భుజంగాసనం, సూర్య నమస్కారాలతోపాటు ప్రాణాయామం, భస్త్రిక సాధనను కూడా వాళ్ల వీడియో తీసుకుని ఇకపై ఇలాగే సాధన చేస్తామని చెప్పారు. పర్యటన కోసం అక్కడికి వెళ్లిన భారతీయులకంటే పాశ్చాత్యులు, అక్కడ స్థిరపడిన భారతీయులు యోగసాధన పట్ల ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు.

శంకర నేత్రాలయ కోసం దాండియా

యూఎస్ పర్యటనలో కొన్ని రోజులు అట్లాంటాలో గడిపాం. అట్లాంటాలో ఉన్న రోజుల్లో నేను రోజూ జేమ్స్ క్రీక్ క్లబ్‌లో యోగసాధన చేసేవాడిని. అక్కడి వారి కోరిక మేరకు యోగాతోపాటు విపస్సన ధ్యాన ప్రక్రియ కూడా నేర్పించాను. అక్కడ ఉద్యోగ, వ్యాపారాల్లో భారతీయులు ఎక్కువగా ఉన్నారు. వాళ్లకు యోగ సాధన చేయాలని ఉన్నప్పటికీ టీచర్ లేకపోవడంతో ప్రాక్టీస్ చేయలేకపోయేవారు. 'అట్లాంటా విజిటర్స్ అసోసియేషన్' వాట్సాప్ గ్రూప్‌లో కనెక్ట్ అయ్యాం. అక్కడ చాలా విశాలమైన కమ్యూనిటీ హాల్ ఉంది. అందులో సమావేశపరిచి యోగ, విపస్సన నేర్పించాను. వీటన్నింటికంటే నాకు అత్యంత సంతృప్తినిచ్చిన విషయం ఏమిటంటే... సియాటెల్‌లోని మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో నవరాత్రి సందర్భంగా నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రామ్‌లో పాల్గొనడం. ఎందుకంటే అది మనదేశంలో పేదవారికి ఉచితంగా వైద్యం అందించే సేవాసంస్థ 'శంకర్ నేత్రాలయ' కోసం ఫండ్ రైజింగ్ ప్రోగ్రామ్. పాశ్చాత్య గడ్డ మీద మన భారతీయులతో కలిసి దాండియా నాట్యం చేయడం, విదేశీయులకు నేర్పించడం, అది కూడా ఒక సామాజిక ప్రయోజనం కోసం కావడం నాకు సంతోషాన్నిచ్చింది. మనం ఎక్కడ ఉన్నా సరే... రోజును ఉపయుక్తంగా మలుచుకోవడం మన చేతుల్లోనే ఉంటుందని నమ్ముతాను. అదే ఆచరణలో పెడతాను.

పని... చేసే వారికి ఎదురొస్తుంది!

ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాను. పెద్దమ్మాయి అమెరికా, చిన్నమ్మాయి ఆస్ట్రేలియాలో స్థిరపడడంతో రెండేళ్లకోసారి ఒక్కో అమ్మాయి దగ్గరకు వెళ్లడం అలవాటు చేసుకున్నాం. ఎక్కడ ఉన్నా నాకు బోర్ అనే మాట నా దగ్గరకు చేరదు. ఎందుకంటే మనిషి సంఘజీవి. ఏ సంఘంలో ఉంటే ఆ సంఘంతో మమేకమై జీవించాలనేది నా ఫిలాసఫీ. ఆస్ట్రేలియాలో ఉన్నప్పుడు అక్కడి వాళ్లతో కలిసి కమ్యూనిటీ ఫార్మింగ్ చేశాను. మా చిన్నల్లుడి సహకారంతో అక్కడి లైబ్రరీలో తెలుగు పుస్తకాలు పెట్టే ఏర్పాటు చేయగలిగాను. మనం ఖాళీగా ఉండకుండా ఎప్పుడూ ఏదో ఒక పని చేయడానికి సిద్ధంగా ఉంటే చాలు. అక్కడ మన అవసరం ఏమిటో, మనం మాత్రమే చేయగలిగిన పని ఏమిటో మనకు కనిపించి తీరుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే పని మనకు ఎదురొస్తుంది. అలా ఒక వ్యాపకంలో నిమగ్నమైతే చాలు. మన వల్ల మరొకరికి ప్రయోజనమూ కలుగుతుంది. మనకు రోజు నిర్వీర్యంగా గడిచిపోకుండా ఉపయుక్తంగా గడిచిన సంతోషమూ కలుగుతుంది" అన్నారు చెన్నమాధవుని అశోక్‌రాజు.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి


ఎక్స్టెల్లాకు యోగసాధనలో మెళకువలు నేర్పిస్తూ...


శంకర్ నేత్రాలయ ఫండ్ రైజింగ్ కోసం దాండియా ఆడుతూ...


అశోక్‌రాజు

పరుపు మార్చి ఎంతకాలం అయింది?

చాలామంది పరుపులను ఏళ్ల తరబడి వాడుతుంటారు. దీనివల్ల నడుం నొప్పి, వెన్ను నొప్పి లాంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇవి రావొద్దంటే పరుపును సకాలంలో మార్చడం అవసరం. పరుపును ఎంత కాలానికి మార్చాలో తెలుసుకుందాం!

ఉదయం నిద్రలేచిన వెంటనే వెన్ను లేదా నడుము నొప్పి ఉంటే మీరు పడుకునే పరుపే అందుకు కారణమని గుర్తించండి. వెంటనే పరుపు మార్చాలి. పాత పరుపుపై సంవత్సరాల తరబడి పడుకుంటూ ఉండటం వల్ల చాలా అనర్థాలు సంభవిస్తుంటాయి. అందుకే పరుపులను కనీసం ఏడెనిమిదేళ్లకొకసారి మారుస్తూ ఉండాలి.

పరుపును ఎక్కువ రోజులు ఉపయోగించాలంటే ముందుగా దాని గలీబును కొను గోలు చేయండి. దీని కారణంగా ఇది త్వరగా చెడిపోదు. అంతేకాదు, వీలయినంత తరచు పరుపును తిప్పి వేసుకుంటూ ఉండాలి. ఎందుకంటే ఒకేవైపు ఎక్కువ రోజులు పడుకుంటే అది దెబ్బతింటుంది.

బెడ్ షీట్లు, కుషన్ల మాదిరిగా బ్యాక్టీరియా పరుపులో చేరుతుంది. దానిని తొలగించడానికి పరుపు, బొంతలను 15 రోజులకు ఒకసారి ఎండలో వేయాలి లేదా వ్యాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించి శుభ్రం చేయాలి.

పరుపులనుంచి ఒక విధమైన చెడువాసన రావడం, పరుపు మొత్తం గుంటలు పడడం అది చెడిపోయిందనడానికి నిదర్శనం. ఇతర సమస్యలేమీ లేకుండా అలసి సొలసి పరుపు మీద చేరిన వెంటనే నిద్ర రాకపోతే పరుపులు మార్చి చూడండి.



మీకు తెలుసా?

పెయిన్ కిల్లర్స్ వాడకం ఆరోగ్యానికి అంత మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. తక్షణ ఉపశమనం కోసం మనం వాటిని వాడుతుంటాం. కానీ దీనివల్ల భవిష్యత్‌లో తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా వాడటం వల్ల జీర్ణవ్యవస్థపై చెడు ప్రభావం పడుతుంది. దీర్ఘకాలంలో ఎసిడిటీ వంటి సమస్యలను కలిగిస్తుంది. చాలా పెయిన్ కిల్లర్‌లు కిడ్నీలపై చెడు ప్రభావం చూపుతాయి. ఇవి కిడ్నీల పనితీరుని దెబ్బతీస్తాయి. నొప్పి నివారిణిలు అధికంగా వాడడం వల్ల కొంత కాలానికి ఔషధాలు తీసుకున్నా అవి పనిచేయవు. అందుకే ఏ పెయిన్ కిల్లర్ అయినా డాక్టర్ సలహా లేకుండా ఎక్కువకాలం వాడటం మంచిది కాదు.

మసాలాతో షుగర్ అదుపు

షుగర్, బీపీ వంటి జీవనశైలికి సంబంధించిన రుగ్మతలు వస్తే జీవితాంతం కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఆహారంలో ఉప్పు, చక్కెరలు తగ్గించి తీసుకోవడంతోబాటు ఇతర జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. వీటితోపాటు మన వంటింట్లో దొరికే కొన్ని రకాల మసాలా దినుసులను తీసుకోవడం ద్వారా డయాబెటిస్‌ను అదుపులో ఉంచవచ్చు. అవేమిటో తెలుసుకుందాం.

అధికంగా దాహం వేయడం, ఆకలి, తరచు మూత్రవిసర్జన చేయవలసి రావడం, బరువు తగ్గడం, చూపు మసకబారడం, చేతులు, కాళ్ళు తిమ్మిరిగా ఉండడం, గాయాలైనప్పుడు త్వరగా మానకపోవడం వంటి కొన్ని లక్షణాలను బట్టి షుగర్‌ను గుర్తించవచ్చు. ఇది అదుపులో ఉండకపోతే కాలేయం, మూత్రపిండాలు, గుండె, మెదడు, కంటికి సంబంధించిన సమస్యలొస్తాయి. అయితే, బ్లడ్ షుగర్‌ని నియంత్రణలో ఉంచే కొన్ని మసాలా దినుసులున్నాయి. వాటిని సక్రమంగా వాడటం వల్ల ఎటువంటి ఇతర దుష్ఫలితాలూ లేకుండా షుగర్‌ను అదుపులో ఉంచవచ్చు.



దాల్చిన చెక్క

ఆహార పదార్థాలకు సువాసనను, రుచిని ఇచ్చే దాల్చిన చెక్క జీవక్రియల వేగాన్ని పెంచడానికి దోహదపడుతుంది. కొన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేదంలో దీనిని విరివిగా వాడతారు. దాల్చిన చెక్క ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. దీనిని కషాయంలా చేసుకుని తాగడం మంచిది.



మిరియాలు

మిరియాలు, వాటి ఆకుల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉంటాయి. ఇవి రక్తం లో ఇన్సులిన్ సీరమ్‌ని పెంచుతాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయులను అదుపు చేయడంలో సహకరిస్తాయి. వీటిని ఏదో ఒక విధంగా ఆహారంలో చేర్చుకోవడం మంచిది. కుదరని పక్షంలో మిరియాల పొడిని గోరువెచ్చని నీటిలో కలిపి తాగొచ్చు.



మెంతులు

మధుమేహాన్ని అదుపు చేసి, బరువు తగ్గించడంలో మెంతులు బాగా పని చేస్తాయి. వీటిని తీసుకోవడం జుట్టుకి కూడా మంచిది. ఉదయాన్నే పరగడుపున మెంతులు నానబెట్టిన నీటిని తాగితే డయాబెటిస్ అదుపులోకి వస్తుంది. ఇందులోని పీచుపదార్థం, కర్కుమిన్లు రక్తంలో చక్కెరస్థాయులను తగ్గిస్తాయి.



యాలకులు

పరమాన్నానికి, ఇతర రకాల స్వీట్లకు యాలకుల పొడిని జత చేస్తే వచ్చే రుచే వేరు. పచ్చి యాలకులని మనం బిర్యానీ, టీలో కలిపి తాగొచ్చు. ఇందులో ఎక్కువగా ఔషధ గుణాలు ఉన్నాయి. యాలకులని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయులు తగ్గుతాయి. ఇది లివర్ పని తీరును మెరుగు పరుస్తుంది. ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది.



జీలకర్ర

డయాబెటిస్ లక్షణాలను, ప్రభావాలను జీలకర్ర తగ్గిస్తుంది. యాంటీడయాబెటిక్ ఔషధాల్లో కూడా దీనిని వినియోగిస్తారు. ఇన్సులిన్‌కు మీ శరీరం స్పందించే తీరును ప్రభావితం చేస్తే యూరియా స్థాయిని కూడా ఈ జీలకర్ర తగ్గిస్తుందని పరిశోధకులు తేల్చారు. అంతేకాకుండా రక్తంలో బ్లడ్ షుగర్ స్థాయి నార్మల్ రేంజ్‌లో ఉండేలా చేస్తుందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. అందువల్ల ఆహారంలో జీలకర్రను విరివిగా ఉపయోగించాలి. రోజూ ఒక స్పూను జీలకర్రను గ్లాసు నీటిలో నానబెట్టి ఆ నీటిని వడగట్టి తాగడం మధుమేహులకు మంచి మందులా పని చేస్తుంది.



లవంగాలు

షుగర్ వ్యాధిగ్రస్తులు లవంగాలను వాడటం వల్ల రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి. అంతేకాకుండా ఆహారంలో లవంగాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు తగ్గుతాయి. అలాగే కీళ్ల నొప్పులు ఉన్నప్పుడు లవంగం నూనెను పై పూతగా రాయడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. మధుమేహం ఉన్న వారు రోజు విడిచి రోజు లవంగాలతో చేసిన టీ తాగడం సత్ఫలితాలనిస్తుంది.

పైన చెప్పుకున్న మసాలా దినుసులను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల ఎటువంటి దుష్ఫలితాలూ లేకుండా డయాబెటిస్ అదుపులో ఉంటుంది.



గార్డెనింగ్

మొక్కలకు జీవకళ

ఇంటి కుండీలలో లేదా పెరటి తోటలో పెంచే మొక్కలు ఒక్కొక్కసారి ఎండి పోతుంటాయి. ఎండిన చెట్లు చిగురించాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అసలు చెట్లు ఎందుకు ఎండిపోవడానికి నీరు లేక, మరే ఇతర కారణమా అనేది గుర్తించాలి. నీరు తక్కువైనప్పుడే కాదు.. నీరు ఎక్కువగా ఉన్నా చెట్లు ఎండిపోతుంటాయి. కాబట్టి, అలా లేకుండా చూడండి. త్వరలో వసంత రుతువు రాబోతోంది. మీ పెరటి తోటలో లేదా ఇంటి కుండీలలో ఉన్న చెట్లను సంరక్షించుకోవడం ఇప్పటినుంచే ఆరంభిస్తేనే కదా అప్పటికి చక్కగా చిగిర్చి, పూలు పూసేది! ఇంకెందుకాలస్యం? చూసేద్దామా మరి!

మొక్కలు సాధారణంగా పురుగుల కారణంగా అనేక తెగుళ్ళ బారిన పడుతుంటాయి. అప్పుడు ఎండి, వాడిపోతుంటాయి. అలా కాకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు వాటిని కాపాడుకోవాలి. ఆకులపై దుమ్ము, ధూళి పేరుకుపోయినా అవి కళ తప్పుతాయి. అందువల్ల వాటిని నీటితో శుభ్రంగా కడిగేయాలి. ఇందుకు చిన్న పాటి పైపు లేదా స్ప్రేయర్ ఉపయోగపడుతుంది.

సూర్యకాంతి...

చెట్లకి సరైన కాంతి అవసరం. అలాగని మరీ ఎండలో కూడా ఉంచరాదు. లేదా బాగా చీకటి ఉన్న ప్రదేశంలో ఉంచడమూ సరికాదు. ఎండ పొడ పడే ప్రదేశంలోనే కుండీలని ఉంచాలి లేదా చెట్లని పెంచాలి.

కుండీల పరిమాణం...

కుండీలో పెంచే మొక్క తీరును బట్టే కుండీని ఎంచుకోవాలి. చెట్ల కుండీలు అవి పెరగడానికి సరిపడనంత లేకుండా చిన్నగా ఉన్నా చెట్లు ఎండిపోవడానికి కారణమవుతాయి. కాబట్టి, సరైన పరిమాణంలో ఉన్న కుండీల్లో పెంచడం మేలు.

మొక్కలని శుభ్రం చేయడం...

దెబ్బతిన్న, ఎండిన, పండిన ఆకులని ఎప్పటికప్పుడు తుంచి శుభ్రం చేయాలి. వీటిని కత్తెరతో కత్తిరించడం మంచిది. తెగులు సోకిన కొమ్మలను, ఆకులని తుంచడం వల్ల మొక్కలు చక్కగా పెరుగుతాయి.

ఎరువులు...

ఎరువు లేకుండా పెంచడం వల్ల చెట్లు నిస్తేజంగా... సారం లేనట్లు... వడలిపోయినట్లు కనిపిస్తాయి. అందువల్ల వాటికి అప్పుడప్పుడు ఎరువులు వేయాలి. అప్పుడే మొక్కలు చక్కగా పెరుగుతాయి. వీలయినంత వరకు రసాయన ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులను వాడటం మంచిది. బియ్యం, పప్పులు కడిగిన నీళ్లని పోయడం, ఉల్లిపొట్టు, కూరగాయల తొక్కలు వంటి వంటింటి వ్యర్థాలతో ఎరువులు తయారు చేసే ఉపకరణాలు ఇప్పుడు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. వాటి సాయంతో తయారు చేసిన ఎరువులు వాడటం వల్ల వాటికే కాదు, అవి తినే మన ఆరోగ్యానికి కూడా మంచిది.

సినిమా



● చిరంజీవి

విశ్వంభర డేట్ ఫిక్స్

సంక్రాంతి రిలీజ్ డేట్‌ను కన్ఫార్మ్ చేసుకున్నాడు 'విశ్వంభర'. చిరంజీవి హీరోగా రూపొందుతున్న ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్ 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. గత ఏడాది నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. తొలుత చిరంజీవి పాత్రకు సంబంధించని సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా 'విశ్వంభర' సినిమా సెట్స్‌లో ఈ శుక్రవారం చిరంజీవి జాయిన్ అయినట్లుగా చిత్ర యూనిట్ పేర్కొని, ఈ సినిమాను జనవరి 10న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. హైదరబాద్‌లో వేసిన ఓ సెట్‌లో ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని కూడా చిత్రబృందం పేర్కొంది.

వేసవిలో ఫ్యామిలీ స్టార్

వేసవిలో థియేటర్స్‌కు వచ్చేందుకు రెడీ అయ్యాడు 'ఫ్యామిలీ స్టార్'. 'గీత గోవిందం' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ-దర్శకుడు పరశురామ్ పెట్ల కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఫ్యామిలీ స్టార్'. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కాగా 'ఫ్యామిలీ స్టార్'ను ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 5న విడుదల కావాల్సిన హీరో ఎన్టీఆర్-దర్శకుడు కొరటాల శివల 'దేవర' సినిమా వాయిదా పడటం వల్లే విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్' మూవీ ఆ తేదీన విడుదలకు రెడీ అవుతున్నట్లుగా తెలుస్తోంది.



● విజయ్ దేవరకొండ



● రాజ్ తరుణ్, మాళ్వీ మల్హోత్రా

చిన్నారి మల్లె తీగ...

"చిన్నారి మల్లె తీగ చేమంతి పువ్వులాగుంది... సిగ్గూరే బుగ్గ పైన చక్కాని చుక్క బాగుంది" అంటూ సాగే సెలబ్రేషన్ సాంగ్ 'తిరగబడర సామీ' చిత్రంలోనిది. రాజ్ తరుణ్, మాళ్వీ మల్హోత్రా జంటగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందిన సినిమా ఇది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలో ఓ వేడుక నేపథ్యంలో సాగే 'చిన్నారి మల్లె తీగ..' పాట లిరికల్ వీడియోను షేర్ చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు జేబీ నేతృత్వంలో సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటను లిప్సికా భాష్యం, అదితీ బావరాజు, చైతు సత్సంగి పాడారు. ఈ చిత్రంలో మన్నారా చోప్రా, మకరంద్ దేశ్‌పాండే, రఘుబాబు, జాన్ విజయ్, అంకిత ఠాకూర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.



బ్లడ్ అండ్ బ్యాటిల్

శింబు హీరోగా దేశింగు పెరియస్వామి దర్శకత్వంలో రూపొందిన సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడైంది. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను షేర్ చేశారు కమల్‌హాసన్. 'బ్లడ్ అండ్ బ్యాటిల్' అనే క్యాప్షన్ కూడా ఇచ్చారు. నేడు (శనివారం) శింబు బర్త్ డే. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ కలిసి ఈ పీరియాడికల్ వార్ డ్రామాను తెరకెక్కిస్తున్నారు. పోస్టర్‌ని బట్టి ఈ చిత్రంలో శింబు ద్విపాత్రాభినయం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. హీరో, విలన్.. ఈ రెండు పాత్రలనూ శింబుయే చేస్తున్నట్లు కోలీవుడ్ సమాచారం.

పార్టీ వల్ల యువతకు నష్టమే

క్రిష్ సిద్దిపల్లి హీరోగా, రితికా చక్రవర్తి హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'రేవ్ పార్టీ'. ఐశ్వర్యా గౌడ ఓ కీలక పాత్రలో నటించారు. రాజు బొనగాని స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. జయరామ్ దేవ సముద్ర మరో నిర్మాత. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్‌ను ప్లాన్ చేస్తున్నారు. "'క్షణం' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా, 'గూఢచారి, టైగర్ నాగేశ్వరరావు' చిత్రాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా చేశాను. హీరోగా 'నేను లేని నా ప్రేమకథ' నా తొలి చిత్రం. ఇప్పుడు మరో మంచి కథతో 'రేవ్ పార్టీ'లో హీరోగా నటించాను" అన్నారు క్రిష్. "రేవ్ పార్టీల వల్ల యువతకు జరిగే నష్టం ఏంటి? అనే అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● క్రిష్ సిద్దిపల్లి, రితికా చక్రవర్తి



● అల్లు అర్జున్

చలో జపాన్

జపాన్ వెళ్లనున్నారట పుష్పరాజ్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా సినిమా 'పుష్ప'. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో నటిస్తున్నారు అల్లు అర్జున్. తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ఆల్రెడీ సూపర్ హిట్ సాధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మలి భాగం 'పుష్ప: ది రూల్' తీస్తున్నారు మేకర్స్. ఈ సినిమా చిత్రీకరణ హైదారాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో జరుగుతోంది. జాతర నేపథ్యంలోని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను జపాన్‌లో ప్లాన్ చేశారట. ఓ ప్రధాన యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ అక్కడి లొకేషన్స్‌లో జరుగుతుందని ఫిల్మ్‌నగర్ టాక్. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప: ది రూల్' సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది.



● వెంకటేశ్

కాంబినేషన్ రిపీట్?

'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాల (వరుణ్ తేజ్ మరో హీరో) కోసం కలిసి పని చేసిన హీరో వెంకటేశ్-దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మరో మూవీ తెరకెక్కనుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవల అనిల్ రావిపూడి ఓ కథను వెంకటేశ్‌కు వినిపించారట. ఈ కథ బాగా నచ్చడంతో వెంకీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. 'దిల్' రాజు ఈ సినిమాను నిర్మించనున్నారని సమాచారం. అయితే వెంకటేశ్-అనిల్ రావిపూడి కాంబినేషన్‌లోని సినిమా 'ఎఫ్ 4' అవుతుందా? లేక వేరే కొత్త కథా? అనే విషయాలపై స్పష్టత రావాల్సింది. మరి... వెంకటేశ్-అనిల్ రావిపూడిల కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సినిమా సెట్స్ పైకి వెళ్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

నటి పూనమ్ పాండే మృతి?

ప్రముఖ మోడల్, బాలీవుడ్ నటి పూనమ్ పాండే (32) కన్నుమూశారనే వార్త శుక్రవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పూనమ్ తుది శ్వాస విడిచినట్లు ఆ వార్త సారాంశం. సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్) క్యాన్సర్ కారణంగా పూనమ్ మృతి చెందారనే వార్త వైరల్ అయింది. "ఈ రోజు (శుక్రవారం) చాలా కఠినమైనది. సర్వైకల్ క్యాన్సర్ కారణంగా మా ప్రియమైన పూనమ్ పాండే తుది శ్వాస విడిచారు" అంటూ పూనమ్ పాండే సిబ్బంది ఆమె ఇన్‌స్టాగ్రామ్ అధికారిక హ్యాండిల్‌లో షేర్ చేశారు. అయితే పూనమ్ కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. వాళ్లెవరూ మీడియాకి అందుబాటులోకి రాలేదు. మరోవైపు పూనమ్ మృతి పట్ల తమకెలాంటి సమాచారం లేదని కాన్పూర్ పోలీసులు చెప్పినట్లు బాలీవుడ్ వర్గాల భోగట్టా. అయితే నాలుగు రోజుల క్రితం పూనమ్ ఓ పార్టీలో చలాకీగా పాల్గొన్న వీడియోను షేర్ చేస్తూ, మృతి వార్త అబద్ధమని ఆమెతో పాటు ఆ పార్టీలో పాల్గొన్నవారు అంటున్నారు. ఇదంతా ప్రచారంలో భాగంగానే జరిగిన తంతుగా కొందరు పేర్కొన్నారు. ఆదివారం 'వరల్డ్ క్యాన్సర్ డే' ప్రచారం కోసం ఈ ఫేక్ వార్త సృష్టించారన్నది పలువురి వ్యాఖ్య.



సాక్షి బిజినెస్

శనివారం
3-2-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	నిఫ్టీ ▲
440	156
72,086	21,854

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్‌	15,637	▲ 277
డోజోన్స్‌	38,587	▲ 67
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,616	▽ 7
డాక్స్‌	16,918	▲ 59
షాంఘై	2,730	▽ 41
నికాయ్‌	36,158	▲ 147

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్‌ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	63,142 ▲	543
బంగారం (99.5 స్వచ్ఛత)	62,889 ▲	505
వెండి (కిలో)	71,864 ▲	1,021

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒకటి	82.52	83.54
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	104.56	107.13
€	యూరో	ఒకటి	89.12	91.48
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	56.10	57.38
AUS$	ఆస్ట్రేలియా డాలర్‌	ఒకటి	53.74	55.71
S$	సింగపూర్‌ డాలర్‌	ఒకటి	63.01	64.26
SAR	సౌదీ రియాల్‌	ఒకటి	21.16	22.78
UAE D	యూఏఈ దిర్హామ్‌	ఒకటి	21.68	23.47
¥	చైనా యువాన్‌	ఒకటి	10.43	12.50

ఇండిగో లాభం రెట్టింపు

క్యూ3లో రూ. 2,998 కోట్లు



న్యూఢిల్లీ: విమానయాన రంగ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్‌ ఏవియేషన్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్‌–డిసెంబర్‌ (క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 2,998 కోట్లను అధిగమించింది. వెరసి వరుసగా ఐదో త్రైమాసికంలోనూ లాభదాయక పనితీరును ప్రదర్శించింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 1,423 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 15,410 కోట్ల నుంచి రూ. 20,062 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 15.4 శాతం నికర లాభ మార్జిన్లు ఆర్జించినట్లు ఇండిగో బ్రాండు విమానయాన సేవల కంపెనీ సీఈవో పీటర్‌ ఎల్బర్స్‌ పేర్కొన్నారు. వరుసగా ఐదు క్వార్టర్లపాటు లాభాలు సాధించడంతో కోవిడ్‌–19 కారణంగా నమోదైన నష్టాల నుంచి రికవర్‌ అయినట్లు తెలియజేశారు. సానుకూల నెట్‌వర్త్‌కు చేరినట్లు వెల్లడించారు. ఈ క్యూ3లో ప్రయాణికుల టికెట్‌ ఆదాయం 30 శాతం పైగా జంప్‌చేసి రూ. 17,157 కోట్లను తాకగా.. అనుబంధ విభాగాల నుంచి 24 శాతం అధికంగా రూ. 1,760 కోట్లు లభించినట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో ఇండిగో షేరు బీఎస్‌ఈలో 2 శాతం పుంజుకుని రూ. 3,127 వద్ద ముగిసింది.

ఈఫిల్‌ సందర్శనకు యూపీఐతో చెల్లింపులు

ఫ్రాన్స్‌ సంస్థ లైరాతో ఎన్‌పీసీఐ జట్టు

ముంబై: ఇకపై ఫ్రాన్స్‌లోని ఈఫిల్‌ టవర్‌ను సందర్శించాలనుకునే దేశీ పర్యాటకులు భారత్‌లో రూపొందిన యూపీఐ (ఏకీకృత చెల్లింపుల విధానం) ద్వారా చెల్లించి, ట్రిప్‌ను బుక్‌ చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి ఫ్రాన్స్‌కి చెందిన ఈ–కామర్స్‌ దిగ్గజం లైరాతో ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్‌



పేమెంట్స్‌ (ఎన్‌ఐపీఎల్‌) ఒప్పందం కుదుర్చుకుంది. దీనితో భారత టూరిస్టులు యూపీఐ క్యూఆర్‌ కోడ్‌ని స్కాన్‌ చేసి, ఆన్‌లైన్‌లో ఈఫిల్‌ టవర్‌ సందర్శన టికెట్లను బుక్‌ చేసుకోవచ్చని ఎన్‌ఐపీఎల్‌ తెలిపింది.

రూ.29కే కిలో బియ్యం

- రిటైల్‌గా భారత్‌ రైస్‌ విక్రయాలు
- వచ్చే వారమే ప్రారంభం
- ధరల కట్టడే ప్రథమ ప్రాధాన్యం
- కేంద్ర ఆహార శాఖ కార్యదర్శి చోప్రా



న్యూఢిల్లీ: బియ్యం ధరలు భగ్గుమంటున్న తరుణంలో కేంద్ర సర్కారు దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా సామాన్యులకు ఉపశమనం కల్పించేందుకు 'భారత్‌ రైస్‌' పేరిట వచ్చే వారం నుంచి కిలో బియ్యాన్ని రూ.29కే రిటైల్‌ మార్కెట్లో విక్రయించనుంది. 5కిలోలు, 10 కిలోల బ్యాగుల్లో ఇవి లభించనున్నాయి. అలాగే, ట్రేడర్లు తమవద్దనున్న బియ్యం/వడ్ల నిల్వలను ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ విషయాన్ని కేంద్ర ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్‌ చోప్రా ప్రకటించారు. ఈ రెండు చర్యలకు తోడు, బియ్యం ఎగుమతులపై ఆంక్షలతో ధరలు దిగొస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సహేతుక స్థాయికి ధరలు దిగొచ్చేంత వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. బియ్యం ధరలు గడిచిన ఏడాది కాలంలో 15 శాతానికి పైగా పెరిగిపోవడం తెలిసిందే. ధరలను కిందకు తీసుకురావడమే ప్రభుత్వం ముందున్న ప్రథమ ప్రాధాన్యమని చోప్రా చెప్పారు. సబ్సిడీ ధరలపై భారత్‌ రైస్‌ను కిలో రూ.29 చొప్పున నేషనల్‌ అగ్రికల్చరల్‌ కోఆపరేటివ్‌ మార్కెటింగ్‌ ఫెడరేషన్‌ (నాఫెడ్‌), నేషనల్‌ కోఆపరేటివ్‌ కన్జ్యూమర్స్‌ ఫెడరేషన్‌ (ఎన్‌సీసీఎఫ్‌), కేంద్రీయ భండార్‌ రిటైల్‌ దుకాణాల ద్వారా విక్రయిస్తామని తెలిపారు. ఈ కామర్స్‌ సంస్థలను సైతం భారత్‌ రైస్‌ విక్రయాలకు వినియోగించుకుంటామన్నారు. తొలి దశలో రిటైల్‌ విక్రయాలకు 5 లక్షల టన్నుల బియ్యాన్ని కేటాయించినట్టు చెప్పారు.

నిల్వలు ఉన్నా ధరలకు రెక్కలు

దేశీ మార్కెట్లో, ప్రభుత్వం వద్ద బియ్యం మిగులు నిల్వలు ఉన్నప్పటికీ ధరలు పెరుగుతున్నట్టు సంజీవ్‌ చోప్రా తెలిపారు. తాము ఇచ్చిన ఆదేశాలతో వ్యాపార సంస్థలు బియ్యం నిల్వలను మార్కెట్లోకి విడుదల చేస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ, దీంతో ధరలు దిగొస్తాయన్నారు. బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులను కేంద్రం నిషేధించగా, పారాబాయిల్డ్‌ రైస్‌ ఎగుమతులపై 20% సుంకం అమలు చేస్తోంది. అవసరమైతే బియ్యం నిల్వలపైనా ఆంక్షలు, పారాబాయిల్డ్‌ రైస్‌ ఎగుమతులు నిషేధించడాన్ని పరిశీలిస్తామని చోప్రా చెప్పారు.

ఫిబ్రవరి తర్వాత కూడా యథావిధిగా పేటీఎం సేవలు

సీఈవో విజయ్‌ శేఖర్‌ శర్మ వెల్లడి

న్యూఢిల్లీ: పేటీఎం సేవలు ఈ నెల (ఫిబ్రవరి) 29 తర్వాత కూడా యథావిధిగానే కొనసాగుతాయని డిజిటల్‌ పేమెంట్స్‌, సేవల సంస్థ పేటీఎం సీఈవో విజయ్‌ శేఖర్‌ శర్మ తెలిపారు. నిబంధనలను పూర్తిగా పాటిస్తూ దేశానికి సేవలందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని సోషల్‌ మీడియా ప్లాట్‌ఫామ్‌



ఎక్స్‌లో శర్మ పోస్ట్‌ చేశారు. నిబంధనల ఉల్లంఘనలకు గాను పేటీఎం పేమెంట్స్‌ బ్యాంక్‌ (పీపీబీఎల్‌) ఫిబ్రవరి 29 తర్వాత నుంచి డిపాజిట్లు, టాపప్‌ వంటి పలు సర్వీసులను నిలిపివేయాలంటూ ఆర్‌బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే. పేటీఎం మాతృసంస్థ వన్‌97 కమ్యూనికేషన్స్‌కి (ఓసీఎల్‌) పీపీబీఎల్‌లో 49% వాటాలు ఉన్నాయి. ఆర్‌బీఐ ఆదేశాల కారణంగా పేటీఎం కార్యకలాపాలపై కూడా ప్రభావం ఉంటుందని అంచనాలు నెలకొన్న నేపథ్యంలో శర్మ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, పేటీఎం సౌండ్‌బాక్స్‌ వంటి సర్వీసులు అందించే ఆఫ్‌లైన్‌ వ్యాపారులపై ఆర్‌బీఐ ఆదేశాల ప్రభావం ఉండబోదని పేటీఎం తెలిపింది. తమ ప్లాట్‌ఫాంపై కొత్త వ్యాపారులను చేర్చుకునే ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని పేర్కొంది.

నిఫ్టీ కొత్త రికార్డ్‌

- మళ్లీ 72 వేల స్థాయికి సెన్సెక్స్‌
- రాణించిన రిలయన్స్‌, ఐటీ షేర్లు
- కలిసొచ్చిన ప్రపంచ మార్కెట్ల రికవరీ
- ఇంట్రాడేలో 2% ర్యాలీ
- బ్యాంకులు, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో శుక్రవారం నిఫ్టీ కొత్త రికార్డు సృష్టించింది. రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌, ఐటీ స్టాకులు రాణించడంతో ఇంట్రాడేలో 429 పాయింట్లు ఎగసి 22,127 స్థాయి వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న స్టాక్‌ సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఆయిల్‌అండ్‌గ్యాస్‌, ఇంధన, మెటల్‌, సర్వీసెస్‌, యుటిలిటీ, ఐటీ, విద్యుత్‌ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ప్రథమార్థంలో 2% ర్యాలీ చేశాయి. నిఫ్టీ ఆల్‌టైం హై(22,127)ని నమోదు చేయగా.., సెన్సెక్స్‌ 1444 పాయింట్లు దూసుకెళ్లి 73,089 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే మిడ్‌సెషన్‌ నుంచి ఆయిల్‌ అండ్‌గ్యాస్‌, బ్యాంకింగ్‌, ఫైనాన్స్‌ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సెన్సెక్స్‌ 440 పాయింట్లు లాభపడి 72,086 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156 పాయింట్లు పెరిగి 21,854 వద్ద నిలిచింది. బీఎస్‌ఈలో మిడ్‌, స్మాల్‌ క్యాప్‌ సూచీలు వరుసగా 0.80%, 0.50% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.71 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,463 కోట్ల షేర్లు కొన్నారు. నాస్‌డాక్‌లో ఐటీ షేర్ల ర్యాలీ ప్రభావం గురువారం రాత్రి అమెరికా మార్కెట్లు ఒకటిన్నర శాతం లాభంతో ముగిశాయి. దీంతో శుక్రవారం ఆసియా, యూరప్‌ స్టాక్‌ సూచీలు 0.5–1% మేర పెరిగాయి.

- ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో భాగంగా సెన్సెక్స్‌ ఇంట్రాడే గరిష్టం(73,089) నుంచి ఏకంగా 1004 పాయింట్లు, నిఫ్టీ జీవితకాల గరిష్ట స్థాయి(22,127) నుంచి 273 పాయింట్లు నష్టపోయాయి. ఇక ఈ బడ్జెట్‌ వారంలో సెన్సెక్స్‌ 1,385 పాయింట్లు, నిఫ్టీ 502 పాయింట్లు చొప్పున ఆర్జించాయి.
- సెన్సెక్స్‌ 441 పాయింట్లు లాభపడటంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్‌ విలువ రూ.3.34 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్టం రూ.382 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది.
- కేంద్రం బడ్జెట్‌లో పర్యావరణ అనుకూల ఇంధనాలకు ప్రాధాన్యత నివ్వడం, అంతర్జాతీయంగా బ్యారెల్‌ క్రూడాయిల్‌ ధర 80 డాలర్ల దిగువకు చేరుకోవడం ఇంధన షేర్లకు కలిసొచ్చింది. బీపీసీఎల్‌ 10%, ఐఓసీ 8%, హిందుస్థాన్‌ పెట్రోలియం 5%, ఓఎన్‌జీసీ 4%, కోల్‌ ఇండియా 3% లాభపడ్డాయి.
- ఇంధన షేర్లలో భాగంగా రిలయన్స్‌ షేరు 2% పెరిగి రూ.2915 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 3.33% ర్యాలీ చేసి రూ.2950 వద్ద జీవితకాల గరిష్టాన్ని అందుకుంది. మార్కెట్‌ విలువ రూ. 41,860 కోట్లు పెరిగి రూ.19.72 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది.
- పేమెంట్స్‌ బ్యాంక్‌ (పీపీబీఎల్‌) ఫిబ్రవరి 29 తర్వాత నుంచి డిపాజిట్లు, టాపప్‌ వంటి పలు సర్వీసులను నిలిపివేయాలంటూ ఆర్‌బీఐ ఆదేశించిన నేపథ్యంలో వరుసగా రెండోరోజూ పేటీఎం షేరు 20% లోయర్‌ సర్క్యూట్‌ తాకింది. బీఎస్‌ఈలో శుక్రవారం 20% పతనమై రూ.487 వద్ద ముగిసింది.

టాటా మోటార్స్‌ లాభం జూమ్‌

- క్యూ3లో రూ. 7,100 కోట్లు
- క్యూ4లో మరింత మెరుగు!



న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్‌–డిసెంబర్‌ (క్యూ3)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 133 శాతం దూసుకెళ్లి రూ. 7,100 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 3,043 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 25 శాతం ఎగసి రూ. 1,10,600 కోట్లకు చేరింది. ఆటో విభాగంలోనూ మూడు రకాల బిజినెస్‌లూ సానుకూల పనితీరును చూపినట్లు టాటా మోటార్స్‌ పేర్కొంది. సీజనాలిటీ నేపథ్యంలో ఈ ఏడాది క్యూ4(జనవరి–మార్చి)లోనూ మరింత మెరుగైన ఫలితాలను సాధించే వీలున్నట్లు అంచనా వేసింది. ఇందుకు కొత్త ప్రొడక్టుల విడుదల, మెరుగైన సరఫరాలు తోడ్పాటునివ్వనున్నట్లు తెలియజేసింది. వాణిజ్య వాహన(సీవీ) ఆదాయం 19 శాతం వృద్ధితో రూ. 20,100 కోట్లను తాకింది. దేశీ సీవీ విక్రయాలు 1 శాతం వృద్ధితో 91,900 యూనిట్లకు చేరగా.. ఎగుమతులు 14 శాతం ఎగసి 4,800 యూనిట్లుగా నమోదయ్యాయి. ప్రయాణికుల వాహన అమ్మకాలు 5 శాతం పుంజుకుని 1,38,600 యూనిట్లకు చేరాయి. ఆదాయం 11 శాతం అధికమై రూ. 12,900 కోట్లను తాకింది. బ్రిటిష్‌ అనుబంధ కంపెనీ జేఎల్‌ఆర్‌ ఆదాయం 22 శాతం జంప్‌చేసి 7.4 బిలియన్‌ పౌండ్లకు చేరింది.

తగ్గిన రుణ భారం

ప్రస్తుత సమీక్షా కాలంలో కంపెనీ నికర రుణ భారాన్ని రూ. 9,500 కోట్లమేర తగ్గించుకోవడంతో రూ. 29,200 కోట్లకు చేరుకున్నట్లు టాటా మోటార్స్‌ వెల్లడించింది. నిర్వహణ లాభ(ఇబిట్‌) మార్జిన్లు రెట్టింపునకుపైగా బలపడి 8.8 శాతాన్ని తాకినట్లు వెల్లడించింది. ప్రణాళికలకు అనుగుణంగా రుణ తగ్గింపు లక్ష్యాన్ని సాధించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. విభిన్న వ్యూహాల ఆధారంగా చేపడుతున్న బిజినెస్‌ నిర్వహణ సంతృప్తికర ఫలితాలను చూపుతున్నట్లు టాటా మోటార్స్‌ గ్రూప్‌ సీఎఫ్‌వో పీబీ బాలాజీ పేర్కొన్నారు. పూర్తి ఏడాదిని పటిష్ట పనితీరుతో ముగించనున్నట్లు అభిప్రాయపడ్డారు. రానున్న త్రైమాసికాలలోనూ రుణ భారాన్ని తగ్గించుకోవడంతోపాటు.. మెరుగైన ఫలితాలను కొనసాగించగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్‌ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 879 వద్దే ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్‌



సీజన్‌ 100వ మ్యాచ్‌లో బెంగాల్‌ విజయం

ప్రొ కబడ్డీ లీగ్‌ 10వ సీజన్‌లో భాగంగా శుక్రవారం ఢిల్లీలో 100వ మ్యాచ్‌ జరిగింది. ఈ పోరులో బెంగాల్‌ వారియర్స్‌ 45–38 పాయింట్ల స్కోరుతో దబంగ్‌ ఢిల్లీపై విజయం సాధించింది. బెంగాల్‌ తరఫున నితిన్‌ కుమార్‌ 13 పాయింట్లతో అగ్రస్థానాన నిలవగా, కెప్టెన్‌ మణీందర్‌ సింగ్‌ 11 పాయింట్లు సాధించాడు. దబంగ్‌ ఢిల్లీ ఆటగాళ్లలో కెప్టెన్‌ అషు మలిక్‌ 17 పాయింట్లతో చెలరేగినా... ఇతర ఆటగాళ్ల వైఫల్యంతో జట్టుకు ఓటమి తప్పలేదు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్‌ 34–30 తేడాతో గుజరాత్‌ జెయింట్స్‌ను ఓడించింది. హరియాణా ఆటగాళ్లలో వినయ్‌ 9 పాయింట్లు రాబట్టగా... మోహిత్‌ నందల్‌, మోహిత్‌ చెరో 4 పాయింట్లు సాధించారు. గుజరాత్‌ తరఫున ఫజల్‌ అత్రచలి, పార్తీక్‌ దహియా చెరో 7 పాయింట్లు స్కోర్‌ చేయగా, దీపక్‌ సింగ్‌ 5 పాయింట్లు రాబట్టాడు. ఈ సీజన్‌లో 101 మ్యాచ్‌లు ముగించిన తర్వాత 71 పాయింట్లతో జైపూర్‌ పింక్‌ పాంథర్స్‌ అగ్రస్థానాన్ని పటిష్టపర్చుకుంది.

'యశస్వీభవ'

యశస్వి జైస్వాల్‌ 179 నాటౌట్‌
తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌ 336/6
ఇంగ్లండ్‌తో రెండో టెస్టు

తొలి రోజు 336 పరుగులు చేసిన తర్వాత కూడా జట్టు కాస్త అసంతృప్తికి గురి కావడం సాధారణంగా కనిపించదు... కానీ శుక్రవారం భారత్‌ పరిస్థితి దాదాపు అలాగే ఉంది. చక్కగా బ్యాటింగ్‌కు బాగా అనుకూలిస్తున్న పిచ్‌పై తమకు లభించిన ఆరంభాలను బ్యాటర్లు భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. అయితే ఇలాంటి సమయంలో ఒకే ఒక్కడు యశస్వి జైస్వాల్‌ అద్భుత బ్యాటింగ్‌తో శిఖరాన నిలిచాడు. మైదానం నలుమూలలా చూడముచ్చటైన స్ట్రోక్‌లు కొట్టడంతో పాటు పదునైన డిఫెన్స్‌ను ప్రదర్శిస్తూ భారీ శతకం బాదాడు. మరో వైపు ఆరు వికెట్లు తీసిన ఇంగ్లండ్‌ ఆనందంగా ఆటను ముగించింది. మిగిలింది బౌలర్లే కాబట్టే యశస్వి, అశ్విన్‌ జోడి రెండో రోజు భారత్‌ స్కోరును 400 వరకు తీసుకెళుతుందా లేక ఇంగ్లండ్‌ ఆలోపు నిలువరిస్తుందా చూడాలి.



విశాఖ స్పోర్ట్స్‌: ఇంగ్లండ్‌తో ప్రారంభమైన రెండో టెస్టులో తొలి రోజును భారత్‌ చెప్పుకోదగ్గ ప్రదర్శనతో ముగించింది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 93 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 336 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్‌ (257 బంతుల్లో 179 నాటౌట్‌; 17 ఫోర్లు, 5 సిక్స్‌లు) అద్భుత ఆటతో ఒంటరి పోరాటం చేస్తూ ద్విశతకానికి చేరువయ్యాడు. యశస్వి మినహా మిగతా బ్యాటర్లంతా ప్రభావం చూపలేకపోయారు. ప్రస్తుతం యశస్వితో పాటు అశ్విన్‌ (5 నాటౌట్‌) క్రీజ్‌లో ఉన్నాడు.

మూడు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు...

భారత్‌ ఇన్నింగ్స్‌లో వరుసగా 40, 49, 90, 70, 52, 29 పరుగుల భాగస్వామ్యాలు ఉన్నాయి. చూస్తే మెరుగ్గానే అనిపిస్తున్నా... ఇందులో ఒక్కటీ భారీ భాగస్వామ్యంగా మారలేకపోయింది. ఒకే ఒక్కడు యశస్వి ఒంటి చేత్తో అద్భుత ఇన్నింగ్స్‌ ఆడగా మిగతా బ్యాటర్ల స్కోర్లన్నీ 14నుంచి 34 పరుగుల మధ్య ఉండటం పరిస్థితిని చూపిస్తోంది. కెప్టెన్‌

రోహిత్‌ శర్మ (14) తన సహజశైలికి భిన్నంగా జాగ్రత్తగా ఇన్నింగ్స్‌ మొదలు పెట్టాడు. అయితే 41 బంతుల్లో ఒక్క ఫోర్‌ కూడా కొట్టలేకపోయిన అతను లెగ్‌స్లిప్‌లో క్యాచ్‌ ఇచ్చి వెనుదిరిగాడు. అరంగేట్ర బౌలర్‌ బషీర్‌ ఖాతాలో ఈ వికెట్‌ చేరింది. ఫామ్‌ కోల్పోయి ఇబ్బంది పడుతున్న శుబ్‌మన్‌ గిల్‌ (46 బంతుల్లో 34; 5 ఫోర్లు) ఒక దశలో ఆరు బంతుల వ్యవధిలో నాలుగు ఫోర్లు కొట్టి దూకుడు ప్రదర్శించాడు. అయితే అండర్సన్‌ చక్కటి బంతికి అతను అవుటయ్యాడు. లంచ్‌ తర్వాత కుదురుకునేందుకు ప్రయత్నించిన శ్రేయస్‌ అయ్యర్‌ (59 బంతుల్లో 27; 3 ఫోర్లు) కూడా తక్కువ ఎత్తులో వచ్చిన బంతిని ఆడలేక కీపర్‌కు క్యాచ్‌ ఇచ్చాడు. అనంతరం యశస్వికి రజత్‌ పటిదార్‌ (72 బంతుల్లో 32; 3 ఫోర్లు), ఆపై అక్షర్‌ పటేల్‌ (51 బంతుల్లో 27; 4 ఫోర్లు) అండగా నిలిచారు. టీ విరామ సమయానికి భారత్‌ స్కోరు 225/3. అయితే చివరి సెషన్‌లో ఇంగ్లండ్‌ బౌలర్లు మూడు వికెట్లు తీయడంలో సఫలమయ్యారు. రేహాన్‌ బౌలింగ్‌లో తన బ్యాట్‌ను తాకి వికెట్ల వైపు వెళుతున్న బంతిని ఆపడంలో విఫలమైన పటిదార్‌ పెవిలియన్‌ చేరాడు. అయితే ఆట ముగియడానికి కొద్ది సేపు ముందు భారత్‌ అనూహ్యంగా రెండు వికెట్లు కోల్పోయింది. అక్షర్‌ చెత్త షాట్‌తో వెనుదిరగ్గా...సొంత మైదానంలో సత్తా చాటేందుకు వచ్చిన అరుదైన అవకాశాన్ని కేఎస్‌ భరత్‌ (23 బంతుల్లో 17; 2 ఫోర్లు, 1 సిక్స్‌) వృథా చేసుకున్నాడు.

ఈ టెస్టు కోసం భారత తుది జట్టులో మూడు మార్పులు జరిగాయి. గాయాలతో దూరమైన రాహుల్‌, జడేజా స్థానాల్లో పటిదార్‌, కుల్దీప్‌ యాదవ్‌ రాగా...సిరాజ్‌కు బదులు ముకేశ్‌ను ఎంపిక చేశారు. ఇటీవల ఎక్కువ క్రికెట్‌ ఆడిన సిరాజ్‌కు విరామం ఇస్తూ జట్టునుంచి విడుదల చేశామని...అతను తర్వాతి టెస్టుకు అందుబాటులో ఉంటాడని బీసీసీఐ ప్రకటించింది.



జైస్వాల్‌ అలవోకగా...

రూట్‌ తొలి ఓవర్లో 2 ఫోర్లతో బౌండరీల ఖాతా తెరిచిన యశస్వి చివరి వరకు స్వేచ్ఛగా బ్యాటింగ్‌ చేస్తూ అదే జోరును కొనసాగించాడు. బషీర్‌ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4 కొట్టిన యశస్వి 89 బంతుల్లో అర్ధ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాతా అతడిని ఇబ్బంది పెట్టడంతో ఇంగ్లండ్‌ బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. హార్ట్‌లీ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు కొట్టి ఆధిక్యం ప్రదర్శించిన భారత ఓపెనర్‌ కొద్ది సేపటికే కెరీర్‌లో రెండో శతకం (151 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. హార్ట్‌లీ బౌలింగ్‌లో లాంగాన్‌ మీదుగా కొట్టిన భారీ సిక్సర్‌తో సెంచరీని అందుకోవడం విశేషం. యశస్వి చక్కటి షాట్లకు ఇంగ్లండ్‌ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. ఈ క్రమంలో రేహాన్‌ ఓవర్లో భారీ సిక్స్‌తో అతను టెస్టుల్లో తన అత్యధిక స్కోరును నమోదు చేశాడు.

ఇండోర్‌కు చెందిన రజత్‌ పటిదార్‌ ఈ మ్యాచ్‌తో టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. భారత్‌ తరఫున టెస్టు మ్యాచ్‌ ఆడిన 310వ ఆటగాడిగా రజత్‌ నిలిచాడు. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఆఫ్‌ స్పిన్నర్‌ షోయబ్‌ బషీర్‌ ఇంగ్లండ్‌ తరఫున టెస్టులు ఆడిన 713వ క్రికెటర్‌గా నిలిచాడు.

స్కోరు వివరాలు:

భారత్‌ తొలి ఇన్నింగ్స్‌: యశస్వి (నాటౌట్‌) 179; రోహిత్‌ (సి) పోప్‌ (బి) బషీర్‌ 14; గిల్‌ (సి) ఫోక్స్‌ (బి) అండర్సన్‌ 34; శ్రేయస్‌ (సి) ఫోక్స్‌ (బి) హార్ట్‌లీ 27; రజత్‌ (బి) రేహాన్‌ 32; అక్షర్‌ (సి) రేహాన్‌ (బి) బషీర్‌ 27; భరత్‌ (సి) బషీర్‌ (బి) రేహాన్‌ 17; అశ్విన్‌ (నాటౌట్‌) 5; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (93 ఓవర్లలో 6 వికెట్లకు) 336. వికెట్ల పతనం: 1–40, 2–89, 3–179, 4–249, 5–301, 6–330. **బౌలింగ్‌:** అండర్సన్‌ 17–3–30–1, రూట్‌ 14–0–71–0, హార్ట్‌లీ 18–2–74–1, బషీర్‌ 28–0–100–2, రేహాన్‌ 16–2–61–2.

ఫేవరెట్‌గా బరిలోకి భారత్‌

నేడు, రేపు పాకిస్తాన్‌తో డేవిస్‌ కప్‌ పోరు



ఐజాముల్‌, రామ్‌కుమార్‌

ఇస్లామాబాద్‌: డేవిస్‌ కప్‌ వరల్డ్‌ గ్రూప్‌–1 ప్లేఆఫ్స్‌లో భారత జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. నేడు, రేపు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగే పోటీల్లో విజయమే లక్ష్యంగా భారత్‌ ఆటకు సిద్ధమైంది. డేవిస్‌ కప్‌ చరిత్రలో పాకిస్తాన్‌పై భారత్‌ది అజేయమైన రికార్డు. దాయాది జట్టుపై ఆడిన ఏడు సార్లు కూడా భారత్‌ విజయం సాధించింది. ఇప్పుడు పాక్‌ గడ్డపై కూడా జైత్రయాత్రను కొనసాగించాలనే లక్ష్యంతో ఉంది. అయితే సొంతగడ్డపై ఈ డేవిస్‌ టై జరగడం, తురుపు ముక్క ఐజాముల్‌ హక్‌ ఖురేషి బరిలో ఉండటంతో పాక్‌ గంపెడాశలు పెట్టుకుంది. గ్రాస్‌ కోర్టులో ఖురేషికి విశేష అనుభవముంది. ఈ నేపథ్యంలో భారత్‌కు ఏమైన కఠిన సవాల్‌ అంటూ ఉంటే మాత్రం అది ఖురేషి నుంచే ఎదురు కావచ్చు. ఇస్లామాబాద్‌ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో మొదటి రోజు రెండు సింగిల్స్‌ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. తొలి సింగిల్స్‌లో రామ్‌కుమార్‌ రామనాథన్‌... ఐజాముల్‌ హక్‌ ఖురేషితో తలపడతాడు. అనంతరం జరిగే రెండో సింగిల్స్‌లో శ్రీరామ్‌ బాలాజీ... అఖిల్‌ ఖాన్‌ను ఎదుర్కొంటాడు. శ్రీరామ్‌ బాలాజీ చాన్నాళ్లుగా డబుల్స్‌కే పరిమితమయ్యాడు. అయితే భారత సింగిల్స్‌ స్పెషలిస్టు అయిన సుమిత్‌ నగాల్‌... గ్రాస్‌కోర్టు కావడంతో పాక్‌ వెళ్లేందుకు విముఖత చూపాడు. దీంతో శ్రీరామ్‌ను సింగిల్స్‌ బరిలో దించాల్సి వస్తోంది.



సచిన్‌, ఉదయ్‌

సెమీ ఫైనల్లో భారత్‌

- అండర్‌–19 ప్రపంచకప్‌
- నేపాల్‌పై 132 పరుగులతో విజయం

బ్లూమ్‌ఫోంటీన్‌ (దక్షిణాఫ్రికా): అండర్‌–19 ప్రపంచ కప్‌లో యువ భారత్‌ అజేయంగా సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన గ్రూప్‌–1 సూపర్‌ సిక్స్‌ పోరులో భారత్‌ 132 పరుగుల భారీ తేడాతో నేపాల్‌పై జయభేరి మోగించడంతో సెమీస్‌ స్థానం ఖాయమైంది. మొదట భారత్‌ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 297 పరుగులు చేసింది. 62 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దశలో కెప్టెన్‌ ఉదయ్‌ సహరన్‌ (107 బంతుల్లో 100; 9 ఫోర్లు), 'ప్లేయర్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌' సచిన్‌ దాస్‌ (101 బంతుల్లో 116; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 215 పరుగులు జోడించడం విశేషం. అనంతరం భారీ లక్ష్యఛేదనకు బరిలోకి దిగిన నేపాల్‌ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 165 పరుగులే చేసింది. కెప్టెన్‌ దేవ్‌ ఖానల్‌ (53 బంతుల్లో 33; 2 ఫోర్లు) ఇన్నింగ్స్‌ టాప్‌ స్కోరర్‌గా నిలిచాడు.

సెమీ ఫైనల్లో అష్మిత

బ్యాంకాక్‌: థాయ్‌లాండ్‌ మాస్టర్స్‌ వరల్డ్‌ టూర్‌ సూపర్‌–300 బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌లో భారత షట్లర్‌ అష్మిత చాలిహా సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో ప్రపంచ 61వ ర్యాంకర్‌ అష్మిత 21–14, 19–21, 21–13తో ప్రపంచ 44వ ర్యాంకర్‌ ఎస్టర్‌ నురుమి వార్డొయో (ఇండోనేసియా)పై గెలుపొందింది. నేడు జరిగే సెమీస్‌లో ఆమె... స్థానిక ప్లేయర్‌ సుపనిద కటెతాంగ్‌తో తలపడుతుంది. మహిళల డబుల్స్‌ క్వార్టర్స్‌లో ఆరో సీడ్‌ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జంట 12–21, 21–17, 21–23తో ఫెబ్రియానా దివుజి–అమలియా ప్రతివి (ఇండోనేసియా) జోడీ చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల సింగిల్స్‌ క్వార్టర్స్‌లో మిథున్‌ మంజునాథ్‌ 10–21, 15–21తో మార్క్‌ కాల్‌జౌ (నెదర్లాండ్స్‌) చేతిలో ఓడిపోయాడు.

అఫ్గానిస్తాన్‌ 198 ఆలౌట్‌

కొలంబో: శ్రీలంకతో శుక్రవారం ప్రారంభమైన ఏకైక టెస్టులో అఫ్గానిస్తాన్‌ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే ఆలౌటైంది. అఫ్గాన్‌ బ్యాటర్లలో రహ్మత్‌ షా (91; 13 ఫోర్లు) మాత్రమే ఒంటరి పోరాటం చేశాడు. విశ్వ ఫెర్నాండో 4 వికెట్లు పడగొట్టగా...అసిత ఫెర్నాండో, ప్రభాత్‌ జయసూర్య చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం ఆట నిలిచే సమయానికి లంక తొలి ఇన్నింగ్స్‌లో వికెట్‌ నష్టపోకుండా 80 పరుగులు చేసింది. నిషాన్‌ మదుష్క (36 నాటౌట్‌), దిముత్‌ కరుణరత్నే (42 నాటౌట్‌) క్రీజ్‌లో ఉన్నారు.

ఆస్ట్రేలియా ఘనవిజయం



బార్ట్‌లెట్‌

మెల్‌బోర్న్‌: అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మ్యాచ్‌లోనే ఆస్ట్రేలియా బౌలర్‌ జేవియర్‌ బార్ట్‌లెట్‌ (4/17) అదరగొట్టాడు. బార్ట్‌లెట్‌ పదునైన బౌలింగ్‌కు తోడు బ్యాటింగ్‌లో స్టీవెన్‌ స్మిత్‌ (79 బంతుల్లో 79 నాటౌట్‌; 8 ఫోర్లు), కామెరాన్‌ గ్రీన్‌ (104 బంతుల్లో 77 నాటౌట్‌; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగడంతో వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో 8 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై ఆసీస్‌ ఘన విజయం సాధించింది. ముందుగా వెస్టిండీస్‌ 48.4 ఓవర్లలో 231 పరుగుల వద్ద ఆలౌటైంది. కీసీ కార్టి (108 బంతుల్లో 88; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోస్టన్‌ చేజ్‌ (67 బంతుల్లో 59; 7 ఫోర్లు) విండీస్‌ను ఆదుకున్నారు. అనంతరం ఆస్ట్రేలియా 38.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. జోష్‌ ఇంగ్లిస్‌ (43 బంతుల్లో 65; 10 ఫోర్లు, 1 సిక్స్‌) రాణించాడు. మూడు వన్డేల సిరీస్‌లో ఆసీస్‌ 1–0తో ఆధిక్యంలో ఉండగా... సిడ్నీలో రేపు రెండో వన్డే జరుగుతుంది.

క్లుప్తంగా...

రాష్ట్రానికి త్వరలో 'సిబా' రీజనల్ కార్యాలయం



వడ్డి రఘురాంను సత్కరిస్తున్న ఏపీ ఆక్వా రైతుల సమాఖ్య ప్రతినిధులు

సాక్షి, అమరావతి: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్ (సిబా) ప్రాంతీయ కార్యాలయం త్వరలో ఏపీలో ఏర్పాటు కానుందని ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ అథారిటీ (అప్సడా) కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలితంగా కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ(సీఏఏ) ప్రాంతీయ కార్యాలయం విజయవాడలోని మత్స్యశాఖ కమిషనరేట్ ప్రాంగణంలో ఏర్పాటైందని..ఇదే రీతిలో త్వరలో సిబాతో పాటు ఆక్వా రంగానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా సంస్థలు ఏపీకి రానున్నట్లు తెలిపారు. అప్సడా కో వైస్ చైర్మన్ పదవీ కాలాన్ని పొడిగించడంతో పాటు కేబినెట్ ర్యాంక్ పొందిన వడ్డి రఘురాంను ఏపీ ఆక్వా రైతుల సమాఖ్య ఆధ్వర్యంలో కృష్ణ, గుంటూరు, పశ్చిమగోదావరి, నెల్లూరు, పల్నాడు జిల్లాలకు చెందిన ఆక్వారైతులు గురువారం తాడేపల్లిలోని సమాఖ్య కార్యాలయంలో సత్కరించారు.

చంద్రబాబు కోసం పచ్చ మీడియా ఆరాటం

- బాలినేనే మా నాయకుడు
- మంత్రి మేరుగు నాగార్జున



ఒంగోలు: చంద్రబాబును గద్దెనెక్కించాలని పచ్చ పత్రికలు, చానళ్లు తెగ ఆరాట పడుతున్నాయని సాంఘిక సంక్షేమశాఖా మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. ఒంగోలులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 45 సంవత్సరాల రాజకీయ జీవితం, 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా ఉండి ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితి చంద్రబాబుదన్నారు. దీంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై, ప్రభుత్వంపై కొన్ని పత్రికలు, చానళ్లు పనిగట్టుకుని విషపు వార్తలు వండి వారుస్తున్నారని మండిపడ్డారు. ఫ్లెక్సీలకు సంబంధించి రోడ్డుపక్కన వేసినవి కొన్ని చినిగి ఉండి ఉండవచ్చని దానికి రచ్చ చేయాల్సిన అవసరం లేదన్నారు. తమ నాయకుడు బాలినేనే అని స్పష్టం చేశారు. తనకు, బాలినేనికి అందరికీ సీఎం జగన్ ఆశీస్సులున్నాయన్నారు. చంద్రబాబు స్క్రిప్ట్‌తో వస్తున్న షర్మిల నాటకాలకు తాము సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.

శ్రీవారి సేవకుల ముసుగులో టీడీపీ శ్రేణులు

- తిరుమల పవిత్రత దెబ్బతినేలా జై అమరావతి నినాదాలు

తిరుమల: కోట్లాది హిందువుల మనోభావాలతో ముడిపడిన దివ్యక్షేత్రం తిరుమలలో రాజకీయ, మతపరమైన ప్రస్తావన చేయకూడదన్న టీటీడీ నిబంధనలను బేఖాతరు చేస్తూ శుక్రవారం శ్రీవారి సేవకుల ముసుగులో టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహం చూపించారు. శ్రీవారి సేవకులు ఉదయం వీఐపీ విరామ సమయంలో విధుల్లో పాల్గొన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన రాష్ట్ర మంత్రి ఆర్కే రోజాను చూసి జై అమరావతి, జై జై అమరావతి.. అంటూ నినాదాలు చేశారు. మరో అడుగు ముందుకేసి మంత్రి ఆర్కే రోజాను సైతం జై అమరావతి అంటూ నినాదం చేయాలని పట్టుబట్టారు. అందుకు మంత్రి నిరాకరించారు. పవిత్ర పుణ్యక్షేత్రంలో ఇలాంటి నినాదం ఏంటంటూ అక్కడినుంచి వెళ్లిపోయారు. టీడీపీ కార్యకర్తలు తిరుమల పుణ్యక్షేత్రంలో ఇలా చేయడం హైందవుల మనోభావాలు దెబ్బతీయడమే అని భక్తులు మండిపడుతున్నారు.

విభజన హామీల పరిష్కారానికి సహకరించండి

- వివిధ పార్టీల నేతల్ని కోరిన షర్మిల

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ విభజన హామీల పరిష్కారానికి సహకరించాలని పలువురు నేతలను కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కోరారు. ఢిల్లీలో కాంగ్రెస్ సీనియర్ నేతలు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కేవీపీ, మస్తాన్ వలీ, జేడీ శీలం, సుంకర పద్మ, కొప్పుల రాజు తదితరులతో కలిసి ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ, డీఎంకే రాజ్యసభ సభ్యుడు తిరుచి ఎస్.శివలను వారి నివాసాల్లో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏపీ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద షర్మిల ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఏపీకి బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ప్రత్యేక హోదాపై సోమవారం సభలో ప్రధాని మోదీ ఏదైనా హామీ ఇస్తారనే ఆశతో ఉన్నామని ఏపీ వ్యవహారాల ఇంఛార్జి మాణిక్యం ఠాగూర్ అన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేక హోదా, విభజన అంశాలను లేవనెత్తుతామని సీతారాం ఏచూరి అన్నారు. కాగా, ధర్నాకు అనుమతి లేదంటూ పోలీసులు కాంగ్రెస్ నేతలను అడ్డుకున్నారు. ధర్నాకు వచ్చిన వారిలో సగానికి పైగా నల్లగొండ, హైదరాబాద్, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు ఉన్నారు.

3 రైల్వే లైన్ల నిర్మాణానికి నిధులు

రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి పెరిగిన కేటాయింపులు

- రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు రూ.9,138 కోట్లు కేటాయింపు
- గత ఏడాది కేటాయింపులు రూ.8,406 కోట్లు
- 3 ప్రధాన రూట్లలో మూడో లైన్‌కు నిధులు.. ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలకు ప్రాధాన్యం

ఈ బడ్జెట్‌లో రాష్ట్రంలోని ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు.. (రూ.లలో)



- కోటిపల్లి - నరసాపూర్ కొత్త లైన్ నిర్మాణానికి 300 కోట్లు
- విజయవాడ-గూడూరు మూడో లైన్ 500 కోట్లు
- కాజీపేట - విజయవాడ మూడో లైన్ 310 కోట్లు
- విజయవాడ, రేణిగుంట, కాజీపేట, వాడి రైల్వే స్టేషన్ల వద్ద బైపాస్ లైన్లకు 209.8 కోట్లు
- ➤ అమృత్ భారత్ ప్రాజెక్టు కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధికి: 425 కోట్లు
- ➤ ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణానికి: 407 కోట్లు
- ➤ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు, హైలెవల్ ప్లాట్‌ఫారాల నిర్మాణానికి: 197 కోట్లు
- ➤ ట్రాఫిక్ ఫెసిలిటీ పనులకు: 172 కోట్లు
- ➤ రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిపై వంతెన నిర్వహణకు: 30 కోట్లు
- ➤ రాష్ట్రం గుండా ప్రయాణిస్తున్న వందేభారత్ రైళ్ల నిర్వహణకు: 10 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు భారీగా నిధులు రాబట్టడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఏడాది కూడా విజయవంతమైంది. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన రైల్వే లైన్లు కోటిపల్లి- నరసాపూర్, విజయవాడ - గూడూరు, కాజీపేట - విజయవాడ మధ్య మూడో లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించింది. ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణానికి ప్రాధాన్యం లభించడంతోపాటు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రైల్వే శాఖ పెద్ద పీట వేసింది. 2024-25కు గాను రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం రూ.9,138 కోట్లు కేటాయించింది. రాష్ట్రానికి 2022-23 బడ్జెట్‌లో రూ.7,032 కోట్లు కేటాయించగా, 2023-24 బడ్జెట్‌లో రూ.8,406 కోట్లు కేటాయించారు. గత ఏడాదికంటే ఈ ఏడాది రూ.732 కోట్లు అధికంగా కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు, తెచ్చిన ఒత్తిడితోనే రైల్వే బడ్జెట్ కేటాయింపులు ప్రతి ఏటా పెంచుతున్నారని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

విశాఖ టు శంషాబాద్

ఇక 4.30 గంటలే..

వచ్చే నెలాఖరులోగా ప్రాథమిక సర్వే పూర్తి

రెండు మార్గాల్లో హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు ఇలా....

1. శంషాబాద్‌లో ప్రారంభమై విజయవాడ మీదుగా విశాఖ వరకు ఒక రూట్
2. విశాఖపట్టణం నుంచి విజయవాడ మీదుగా కర్నూలు వరకు మరో రూట్



సాక్షి, హైదరాబాద్: హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి రైల్వేశాఖ చేపట్టిన ప్రాథమిక సర్వే తుదిదశకు చేరుకుంది. వచ్చే మార్చినాటికి ప్రిలిమినరీ ఇంజనీరింగ్ అండ్ ట్రాఫిక్ (పెట్) సర్వే పూర్తి కానుంది. పెట్ సర్వేకు రైల్వేశాఖ గతేడాది మే నెలలో ఎస్ఎం కన్సల్టెన్సీని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ సర్వే నివేదిక ఆధారంగా సమగ్రమైన సర్వే (డీపీఆర్) కోసం మరో కన్సల్టెన్సీని ఏర్పాటు చేయనున్నట్టు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రస్తుతానికి రూ.20,000 కోట్లకుపైగా వ్యయం అవుతుందని అధికారుల అంచనా. కానీ పనులు ప్రారంభించే నాటికి నిర్మాణ వ్యయం ఇంకా పెరిగే అవకాశముంది. పెట్ సర్వేలో భాగంగా ఎంపిక చేసిన రూట్‌లలో ఇంజనీరింగ్ అంశాలపై అధ్యయనం చేశారు. ఎక్కడెక్కడ వంతెనలు, ఇతర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందనే దానిపై కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 2 మార్గాల్లో ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్‌లో హైస్పీడ్ రైళ్లలో ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఎలా ఉంటుందనే అంశాలపైన కూడా పెట్‌సర్వే నివేదికలో పొందుపరచనున్నారు. దీని ఆధారంగా చేపట్టబోయే డీపీఆర్ సర్వేకు 6 నుంచి 8 నెలలకు పైగా సమయం పడుతుందని అధికారులు ఓ అంచనాకు వచ్చారు. హైస్పీడ్‌రైలు అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్‌కు చెందిన ప్రయాణికులతో పాటు, శంషాబాద్ విమానాశ్రయం నుంచి నాలుగున్నర గంటల్లోనే విశాఖకు చేరుకోవచ్చు.

ప్రస్తుతం జంటనగరాల నుంచి రైలులో విశాఖకు వెళ్లేందుకు 12 నుంచి 13 గంటల సమయం పడుతోంది. వందేభారత్ మాత్రం 9 గంటల్లో చేరుకుంటోంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ప్రతి రోజు సుమారు 55,000 మంది జాతీయ ప్రయాణికులు ఉండగా మరో 10 వేల మందికిపైగా అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అమెరికా, దుబాయ్, యూరోప్ తదితర దేశాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హైస్పీడ్ రైలులో నేరుగా విజయవాడ, విశాఖ, తదితర నగరాలకు చేరుకొనే వెసులుబాటు ఉంటుంది. ఇటు రైలు ప్రయాణికులు, అటు విమాన ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజధానులను అనుసంధానం చేసే విధంగా హైస్పీడ్ కారిడార్ మార్గాలను ఎంపిక చేసినట్టు దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సకాలంలో ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడితే రానున్న ఐదారేళ్లలో తెలుగు రాష్ట్రాలకు హైస్పీడ్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

ఎలివేటెడ్ కారిడార్ అయితే..

హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ప్రాథమిక సర్వే చేపట్టినా, కారిడార్ నిర్మాణానికి ఏ రకమైన సాంకేతిక వ్యవస్థ ఎంపిక చేసుకోవాలనే అంశంపైన కూడా అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం అన్ని రైళ్లు నేల మీద నిర్మించిన ట్రాక్‌లపైనే నడుస్తున్నాయి. ప్రధాన నగరాల్లో మెట్రోలకు మాత్రం ఎలివేటెడ్ కారిడార్‌లు నిర్మించారు. ఈ క్రమంలో పటిష్టమైన ట్రాక్ వ్యవస్థ, అత్యధిక వేగం, ప్రయాణికుల భద్రత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని హైస్పీడ్ రైల్‌కు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తేనే బాగుంటుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అయితే 922 కి.మీల వరకు ఎలివేటెడ్ నిర్మాణానికి భారీ వ్యయం కావొచ్చు. ఇప్పుడున్న అంచనాలకు రెట్టింపు ఖర్చు చేయాల్సి రావొచ్చు. నేలపైనే హైస్పీడ్ కారిడార్ నిర్మిస్తే నిర్మాణ వ్యయం తగ్గే అవకాశముంది.

చర్లపల్లికి సోలార్ ప్రాజెక్టు


హైదరాబాద్‌లో నాలుగో టెర్మినల్‌గా అందుబాటులోకి రానున్న చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో విద్యుత్ సరఫరాకు చేపట్టిన సోలార్ ప్రాజెక్టుకు కేంద్రం తాజా బడ్జెట్‌లో రూ.93.75 కోట్లు కేటాయించింది. స్టేషన్ అవసరాలకు కావాల్సినంత విద్యుత్ ఈ ప్రాజెక్టు నుంచి తీసుకుంటామని అధికారులు తెలిపారు. మార్చి నెలాఖరులో చర్లపల్లి నుంచి రైల్వేసేవలు ప్రారంభించనున్నట్టు జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. సౌరశక్తి ప్రాజెక్టుతో పాటు తుదిదశలో ఉన్న చర్లపల్లి టెర్మినల్ నిర్మాణ పనులకు మరో రూ.46 కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించారు.

నేడు 'సిద్ధం' సభ

ఏలూరులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల సన్నాహక రెండో సభ

110 ఎకరాల్లో సభా ప్రాంగణం.. ఏర్పాట్లు పూర్తి





సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, ఏలూరు/దెందులూరు: జన బలమే గీటురాయిగా, సామాజిక న్యాయమే అభిమతంగా శాసనసభ, లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల నియామకంపై కసరత్తు చేస్తూనే.. మరోవైపు 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే 63 శాసనసభ, 16 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల్ని నియమించడంతో పాటు 'సిద్ధం' పేరుతో శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా గత శనివారం విశాఖపట్నం జిల్లా భీమిలి వేదికగా ఎన్నికల సమరానికి శంఖం పూరించారు. ఆ సభ సూపర్‌హిట్ అయిన నేపథ్యంలో శనివారం ఏలూరులో 'సిద్ధం' రెండో సభ నిర్వహిస్తున్నారు. ఈ సభకు ఉత్తర కోస్తా (ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు)లోని 50 నియోజకవర్గాల నుంచి భారీగా శ్రేణులు, అభిమానులు తరలిరానున్నారు. గోదావరి జిల్లాల రాజకీయ చరిత్రలో ఈ సభ అతి పెద్ద రాజకీయ బహిరంగ సభ కానుంది. ఏలూరు నగర శివారు ఆటోనగర్ సమీపంలో, దెందులూరు మధ్య ఉన్న సహారా గ్రౌండ్స్‌లో బహిరంగ సభకు సర్వం సన్నద్ధమైంది. లక్షలాది మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల రాక నేపథ్యంలో అట్టహాసంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 110 ఎకరాల సభా ప్రాంగణం, ఎనిమిది ప్రాంతాల్లో 150 ఎకరాల్లో పార్కింగ్ సెంటర్లతో సర్వం సన్నద్ధం చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సీఎం లక్షలాదిగా తరలివచ్చే పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేస్తారు. యుద్ధ ప్రాతిపదికన సభా వేదిక, హెలిప్యాడ్ నిర్మాణం, గ్యాలరీలు, సిట్టింగ్ ఏర్పాట్లు, తాగునీరు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, వడ్డీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తదితరులు ఏర్పాట్లు పరిశీలించారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.మేరి ప్రశాంతి భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

షర్మిల కారణంగా వైఎస్సార్ ఆత్మ క్షోభిస్తోంది

- ఆమె మెడలో కాంగ్రెస్ కండువా.. చదివేది చంద్రబాబు స్క్రిప్ట్
- మండిపడ్డ మంత్రి ఆర్కే రోజా



పుత్తూరు (తిరుపతి జిల్లా): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆత్మ నేడు క్షోభిస్తోందంటే షర్మిల వ్యవహార శైలే కారణమని రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. ఆమెకు వైఎస్సార్ బిడ్డగా చెప్పుకోవడానికే అర్హత లేదన్నారు. తిరుపతి జిల్లా వేపగుంటలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. షర్మిల మెడలో కాంగ్రెస్ కండువా వేసుకుని, చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారని విమర్శించారు. కుటుంబాల్లో చిచ్చుపెట్టి తన పబ్బం గడుపుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ఆయన ఎన్టీఆర్ కుటుంబంలో చిచ్చుపెట్టడం చూశామని, నేడు వైఎస్సార్ కుటుంబంలో చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ కుటుంబంలో చిచ్చు పెట్టడానికి చంద్రబాబుకు అవకాశం కల్పించిన షర్మిలదే తప్పుగానీ, జగనన్నది కాదని చెప్పారు. షర్మిల తెలంగాణాలో అబద్ధాల ఆటను ముగించి, నేడు ఆంధ్రాలో ప్రారంభించారన్నారు. జగనన్న మేనిఫెస్టోలోని హామీలను 98 శాతం పూర్తిచేసి, సింహంలా సింగిల్‌గా ఎన్నికల బరిలోకి దిగుతున్నారని చెప్పారు. చంద్రబాబుకు 14 ఏళ్ల పాలనలో ఇది చేశానని చెప్పుకోవడానికి ఏమీలేదని, అలాగే గుంపుగా వచ్చినా 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను సైతం పెట్టుకోలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. వయసు అయిపోయింది చివరి అవకాశం ఇవ్వండంటూ అడుక్కోవడంతో ప్రజలు నివ్వెరపోతున్నారన్నారు.

6 నుంచి అంతర్జాతీయ థియేటర్ ఫెస్టివల్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెండో ఏడాది అంతర్జాతీయ థియేటర్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ చెప్పారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఏపీ ప్రభుత్వ సహకారంతో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఫిబ్రవరి 6-11 వరకు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు పలు దేశాల్లో ప్రఖ్యాత నాటక దర్శకులు రూపొందించిన 6 నాటకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో '23వ భారత్ రంగ్ మహోత్సవ్- ఇంటర్నేషనల్ థియేటర్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా-2024' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 6న 'మైరిమెకాసెకహు' నాటకాన్ని హిందీలో ప్రదర్శిస్తారని చెప్పారు. 7న గదాయుద్ధ నాటకాన్ని కన్నడలో, 8న 'ఎండ్ గేమ్' నాటకాన్ని ఆంగ్లంలో, 9న 'శోనా' నాటకాన్ని బెంగాలీలో, 10న 'కహాన్ కబీర్' నాటకాన్ని హిందీలో, 11న 'అయోధ్య కాండ' నాటకాన్ని కన్నడ భాషలో ప్రదర్శించనున్నట్లు వివరించారు.

వైఎస్సార్‌సీపీ సామాన్యుడి వజ్రాయుధం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మడకశిర: వైఎస్సార్ సీపీ సామాన్యుడికి వజ్రాయుధం వంటిదని రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా కడుపేద వారినీ పార్టీ సమన్వయకర్తలుగా నియమించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. బీసీల పార్టీ అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు మాత్రం పార్టీ టికెట్లను అమ్ముకుంటున్నారన్నారు. ఈ విషయం తాను చెప్పడం లేదని, ఇన్నాళ్లూ టీడీపీలో ఉన్న విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని నాని చెప్పారన్నారు. శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో పర్యటించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ మడకశిర సమన్వయకర్త ఈర లక్కప్ప, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, పార్టీ మడకశిర నియోజకవర్గ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్‌తో కలిసి అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురంలో జరిగిన వైఎస్సార్‌సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. గుడిబండ మండలం పశారం గ్రామంలో మంత్రి పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడారు. మడకశిరలో ఓ సామాన్యుడు ఈర లక్కప్పను తమ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించామని, చంద్రబాబు ఇలాంటి నిర్ణయం తన జీవితంలో ఏనాడైనా తీసుకున్నాడా? అని ప్రశ్నించారు. షర్మిల ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందన్నారు. ఆమె ఉద్దేశపూర్వకంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్సార్ సీపీని టార్గెట్ చేస్తున్నారని చెప్పారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ఖుర్దా రోడ్-విజయనగరం మధ్య మూడో రైల్వేలైన్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ఒడిశాలోని ఖుర్దా రోడ్ నుంచి ఏపీలోని విజయనగరం వరకు మూడో రైల్వేలైన్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఖుర్దా రోడ్ నుంచి విజయనగరం వరకు 363 కిలోమీటర్ల దూరం మూడో రైల్వేలైన్ నిర్మాణంతోపాటు భద్రక్-విజయనగరం సెక్షన్‌లో నెర్గుడి-బరంగ్ మధ్య 22 కిలోమీటర్ల మేర మూడో రైల్వేలైన్‌ను రూ.4,962 కోట్లతో నిర్మించే ప్రతిపాదనలకు గత ఏడాది ఆగస్టులోనే ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద ఈ రెండు సెక్షన్లలో మూడో రైల్వేలైన్ నిర్మాణ ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తవుతుందో ఇప్పుడే చెప్పలేమన్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేయడమనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏడాదిలో ఎన్ని నెలల పాటు ప్రాజెక్టు పనులు నిర్విరామంగా కొనసాగుతాయనే పలు అంశాల ఆధారంగా మాత్రమే ప్రాజెక్టు నిర్మాణం ఎప్పటిలోగా పూర్తవుతుందో ఒక అంచనాకు రాగలమని మంత్రి చెప్పారు.

హస్తకళల అభివృద్ధికి ఏపీకి రూ.3,911 కోట్లు

జాతీయ హస్తకళల అభివృద్ధి కార్యక్రమం (ఎన్‌హెచ్‌డీపీ), సమగ్ర హస్తకళల క్లస్టర్ అభివృద్ధి పథకం (సీహెచ్‌సీడీఎస్) కింద గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.3,911.25 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర జౌళిశాఖ సహాయమంత్రి దర్శన జర్దోష్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి , వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2018-19 నుంచి 2023-24 వరకు ఎన్‌హెచ్‌డీపీ, సీహెచ్‌డీసీ పథకాల కింద విడుదల చేసిన మొత్తం నిధుల్లో రూ.2,439.8 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎన్‌హెచ్‌డీపీ కింద ఐదేళ్లలో రూ.3,378.99 కోట్లు విడుదల చేయగా రూ.1,907.54 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. సీహెచ్‌డీసీ కింద ఐదేళ్లలో విడుదల చేసిన మొత్తం రూ.532.26 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సీహెచ్‌డీఎస్ కింద 2022-23లో ఆంధ్రప్రదేశ్‌కు మెగా క్లస్టర్ ప్రాజెక్టు మంజూరు చేసినట్లు చెప్పారు.

ఏపీలో మూడులక్షల మందికి శిక్షణ అవసరం



స్కిల్ గ్యాప్ అనాలిసిస్ నివేదిక ప్రకారం ఏపీలో మూడులక్షల మందికి శిక్షణ అవసరం ఉందని కేంద్ర జౌళిశాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ తెలిపారు. స్పిన్నింగ్, నేత, అల్లికలు, కటింగ్, కుట్టడం వంటి అంశాల్లో నైపుణ్య శిక్షణ అవసరమని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీలో 1,630 స్టార్టప్‌లు

ఆంధ్రప్రదేశ్‌లో డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) గుర్తింపు పొందిన స్టార్టప్‌లు 1,630 ఉన్నాయని కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రి సోం ప్రకాశ్ తెలిపారు. 2019లో 161 స్టార్టప్‌లు, 2020లో 215, 2021లో 286, 2022లో 382, 2023లో 586 స్టార్టప్‌లను డీపీఐఐటీ గుర్తించినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్‌నత్వానీ ప్రశ్నకు సమాధానమిచ్చారు. 15,441 మందికి నేరుగా ఉద్యోగాలు లభించాయని తెలిపారు.

లోక్‌సభ

ప్రత్యేకహోదా హామీ నెరవేర్చాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీ సత్యవతి డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ విభజన చట్టంలోని అన్ని హామీలు నెరవేర్చడం ద్వారా దేశ ప్రగతికి ఏపీ సహకారం మరింత మెరుగవుతుందని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తే భారత సమగ్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో రాష్ట్రం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విద్య, సముద్ర ఎగుమతులు, సేంద్రియ వ్యవసాయం, రైతులకు మద్దతు, మహిళలకు సాధికారత కల్పించడంలో రాష్ట్రం అత్యుత్తమంగా ఉందని గుర్తుచేశారు. 2011 జనాభా లెక్కల కారణంగా ఆహారభద్రత చట్టం అమలులో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. లబ్ధిదారులను గుర్తించడానికి జనగణన అత్యవసరమని చెప్పారు. కేంద్రం మినహాయించిన లబ్ధిదారులకు రాష్ట్రం పెడుతున్న ఖర్చులకు పరిహారం ఇవ్వాలని కోరారు. గతేడాది నైరుతి రుతుపవనాల కారణంగా ఏపీ రికార్డు స్థాయిలో వర్షపాతం లోటు ఎదుర్కొందని, ఫలితంగా పత్తి, మిర్చి వంటి ప్రధాన పంటల ఉత్పత్తి తగ్గిందని చెప్పారు. దీనిపై కేంద్రం జోక్యం చేసుకోవాల్సి ఉందన్నారు. ఏపీ తుపాను ప్రభావిత రాష్ట్రం కాబట్టి బాధితులకు తక్షణ సాయం అందించేందుకు శాశ్వత కేంద్రనిధి ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

ఏపీలో 37 వైద్యకళాశాలలు

ఏపీ ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 37 వైద్యకళాశాలలు ఉన్నాయని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. 6,485 యూజీ సీట్లు, 3,568 పీజీ సీట్లు అందుబాటులో ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ సత్యవతి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. దీనిపై సత్యవతి అడిగిన అనుబంధ ప్రశ్నకు ఆ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ స్పందిస్తూ.. వైద్య కళాశాలల కోసం రాష్ట్ర సిఫార్సులను నేషనల్ మెడికల్ కమిషన్ పరిశీలించి సామర్థ్యం ఉంటే అనుమతి ఇస్తుందని తెలిపారు.

33% 'పొగాకు' క్యాన్సర్ వ్యాధులే



దేశంలో క్యాన్సర్ వ్యాధుల్లో 33% పొగాకు వాడకంతో సంభవించినవేనని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ఎస్.పి.సింగ్ భగేల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2021 నివేదికల ప్రకారం పొగాకు వాడకంతో సంబంధం ఉన్న క్యాన్సర్ వ్యాధులు పురుషుల్లో 48.7%, స్త్రీలలో 16.5% ఉన్నాయని చెప్పారు.

ఫార్మా రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం

దేశంలో ఫార్మా రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని కేంద్ర రసాయనాలు, ఎరువులశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ సమాధానం ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఫార్మా, మెడికల్ డివైజ్ సెక్టార్‌ను ప్రోత్సహించడం కోసం ఫార్మాస్యూటికల్ డిపార్ట్‌మెంట్ రెగ్యులేటర్‌లు, పాలసీ మేకర్లు, ఇండస్ట్రీ లీడర్లతో 'ఇండియా ఫార్మా అండ్ ఇండియా మెడికల్ డివైస్'ని నిర్వహిస్తోందని వివరించారు. 2021 నుంచి 2023 వరకు మూడేళ్లపాటు ఢిల్లీ కేంద్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

ఆర్ఏఎన్‌తో పేదలకు చికిత్స



గుర్తించిన ప్రాణాంతక వ్యాధులు/క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులకు చికిత్స నిమిత్తం రాష్ట్రీయ ఆరోగ్య నిధి (ఆర్ఏఎన్) కింద పేద రోగులకు కేంద్ర ఆరోగ్యశాఖ సహకరిస్తోందని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి భారతి ప్రవీణ్‌పవార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. రాష్ట్రీయ ఆరోగ్య నిధి కింద 3 భాగాలుగా గుర్తించిన ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న పేద రోగులకు ప్రభుత్వ ఆస్పత్రులు/సంస్థల ద్వారా గరిష్ట సాయం నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రీయ ఆరోగ్య నిధి ద్వారా క్యాన్సర్ మినహా ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రూ.15 లక్షలు, క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులకు రూ.15 లక్షలు, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రూ.20 లక్షలు సాయం అందిస్తున్నట్లు మంత్రి వివరించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai - 600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 3 ఫిబ్రవరి : 2024


బెంగళూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసు విభాగం చర్యలు చేపట్టింది. శుక్రవారం కేఆర్‌పురం వద్ద డ్రోన్లను ప్రయోగించిన దృశ్యం

న్యూస్‌రీల్

ఈడీ విచారణపై హైకోర్టు స్టే



బనశంకరి: విచారణ సమయంలో ఈడీ అధికారులు తనను హింసించారని ఆరోపిస్తూ కోముల్ డైరెక్టర్ వైబీ అశ్వత్థనారాయణ ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ఇద్దరు ఈడీ అధికారులపై విల్సన్ గార్డెన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈడీ డిప్యూటీ డైరెక్టర్ మనోజ్‌మిట్టల్, అసిస్టెంట్ డైరెక్టర్ అజయ్‌కుమార్ వైద్యపై విల్సన్ గార్డెన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు రద్దు చేయాలని ఈడీ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయపీఠం ముందు వైబీ అశ్వత్థనారాయణ ప్లాస్టిక్‌పైపుతో తనపై దాడి చేశారని ఆరోపించారు. ఇది అబద్ధమని అదనపు సోలిటరీ జనరల్ ఎస్‌వీ.రాజు కోర్టు దృష్టికి తెచ్చారు. హైకోర్టు న్యాయపీఠం కేసుకు సంబంధించి ఫిర్యాదుదారుడు వైబీ.అశ్వత్థనారాయణకు నోటీస్ జారీచేసి కేసుకు సంబంధించి ఎలాంటి విచారణ చేపట్టరాదని విల్సన్‌గార్డెన్ పోలీసులకు స్టే ఇచ్చింది.

బీఎంటీసీ బస్సు ఢీకొని విద్యార్థిని దుర్మరణం


కుసుమిత(ఫైల్)

యశవంతపుర: బెంగళూరు నగరంలో బీఎంటీసీ బస్సు స్కూటర్‌పైకి దూసుకెళ్లి విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన రాజాజీనగర హరిశ్చంద్ర ఘాట్ వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. కెంగేరి సమీపంలోని ప్రైవేట్ కాలేజీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న మల్లేశ్వరానికి చెందిన కుసుమిత (21) రోజులాగానే శుక్రవారం ఉదయం 8:30 గంటలకు కళాశాలకు బయల్దేరింది. మార్గం మధ్యలో బీఎంటీసీ బస్సు స్కూటర్‌ను ఢీకొని కొంత దూరం వరకు లాక్కెళ్లింది. ప్రమాదంలో కుసుమితాకు బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసీ జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మల్లేశ్వరం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు డీసీపీ సిరిగౌరి తెలిపారు.


సిగరెట్ డిస్ట్రిబ్యూటర్‌పై దాడి, రూ. 15 లక్షల దోపిడీ

- పిస్తోల్ చూపి నగదుతో ఉడాయింపు



బనశంకరి: పట్టపగలే పిస్తోల్ చూపి ఓ సిగరెట్ డిస్ట్రిబ్యూటర్‌పై దాడి చేసిన దోపిడీదొంగలు అతని వద్ద ఉన్న రూ.15 లక్షలు దోచుకెళ్లారు. ఈఘటన అన్నపూర్ణేశ్వరి నగర పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సిగరెట్ డిస్ట్రిబ్యూటర్ గోపాల్ శుక్రవారం టాటా ఎస్ వాహనంలో దుకాణాల నుంచి సిగరెట్ బిల్లులు సేకరిస్తున్నారు. కెంగేరి నుంచి గోపాల్ దుకాణాల ద్వారా సిగరెట్ బిల్లు సేకరించుకుని వస్తున్నారు. ఈ సమయంలో బైకుల్లో వెంబడించిన ముగ్గురు దోపిడీదొంగలు నాగరబావి పాపిరెడ్డి పాళ్యకు వచ్చిన గోపాల్, నాథూరామ్ దుకాణం వద్ద వాహనం నిలిపి సిగరెట్ బిల్లు వసూలు చేసుకోవడానికి కిందికి దిగాడు. ఈ సమయంలో దోపిడీ దొంగలు గోపాల్‌పై దాడికి యత్నించగా ఆయన సమీపంలోని ప్రావిజన్‌స్టోర్‌లోకి దూరాడు. దొంగలు అతనిపై పెప్పర్‌స్ప్రే చేసి గన్ చూపించి కొడవలితో దాడి చేసి అతని వద్ద ఉన్న నగదు బ్యాగ్ తీసుకుని బైక్‌ల్లో ఉడాయించారు. బాధితుడిపై అన్నపూర్ణేశ్వరినగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం


మహనీయులకు విజయేంద్ర పూజలు

తుమకూరు: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 28 నియోజకవర్గాల్లో విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే బీవై విజయేంద్ర అన్నారు. శుక్రవారం తుమకూరు నగరంలోని శ్రీ సిద్ధ వినాయక సముదాయ భవనంలో జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి శక్తి వందనా అభియాన్ సమావేశంలో మాట్లాడారు. అంతకు ముందు ఆయన మహనీయుల చిత్రపటాలకు పూజలు చేసి మాట్లాడారు. వారం రోజులుగా తాను రాయచూరు, యాదగిరి, మంగళూరు, చిక్కమగళూరు, హావేరి, హుబ్బళిలలో పర్యటించానని, ప్రస్తుతం తుమకూరు వచ్చినట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

మహానగరం.. ట్రాఫిక్ చక్రబంధం

- బెంగళూరులో తీవ్రమైన వాహనాల రద్దీ
- పీక్ అవర్స్‌లో గంటకు 18 కిలోమీటర్లే ప్రయాణం
- రోజులో సగం సమయం రోడ్లపైనే
- తీవ్ర ఒత్తిడి, అలసటతో నగరవాసులు సతమతం




ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతే అంతే సంగతులు


వాహనాలతో రద్దీగా ఉన్న ఒక ప్రాంతం



ట్రాఫిక్ సమస్యకు కారణాలు..
- విపరీతంగా జనాభా పెరుగుదల
- రోజురోజుకూ వాహనాల సంఖ్య పైపైకి
- ప్రముఖులకు కల్పించే జీరో ట్రాఫిక్
- అధ్వానంగా ఉన్న రోడ్లు
- రాజకీయ, ధార్మిక సభలు, సమావేశాలు
- ధర్నాలు, ఊరేగింపులు

బనశంకరి: సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలు నగరవాసులను చుక్కలు చూపుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవాల్సిన పరిస్థితిని ప్రతిరోజూ ఎదుర్కొంటున్నారు. ఉదయం ఏడుగంటలకు రోడ్డెక్కితే ఆఫీసుకు వెళ్లి తిరిగి వచ్చేందుకు రాత్రి 8 గంటలు అవుతోందని నగరవాసుల ఆవేదన. ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు.

సమయం, ఇంధనం వృథా..

అత్యంత నిదానంగా ట్రాఫిక్ సాగే నగరాల్లో బెంగళూరు నగరం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. రోడ్లు వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే సమయాల్లో నగరంలో ప్రయాణం గంటకు 18 కిలోమీటర్లే. ఉద్యాననగరిలో వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యల కోసం పోలీస్‌శాఖ నగరంలో 20 హైడెన్సిటి ట్రాఫిక్ కారిడార్లు, అవుటర్‌రింగ్‌రోడ్లలో అధ్యయనం చేసింది. ట్రాఫిక్ సమస్యతో సమయం, ఇంధనం భారీగా వృథా అవుతున్నట్లు తేలింది. నగరవాసులు తమదైనందిన ప్రయాణంలో సగానికి పైగా సమయం ట్రాఫిక్ సిగ్నల్స్‌లోనే గడిచిపోతున్నట్లు అధ్యయనంలో తేలింది.

1.25 కోట్లు దాటిన వాహనాల సంఖ్య..

నగరంలో వాహనాల సంఖ్య ఏటేటా లక్షల సంఖ్యలో పెరుగుతుండగా సంచారం మాత్రం అత్యంత మందగతిలో ఉంది. బెంగళూరు నగరం దేశంలోనే శరవేగంగా విస్తరిస్తున్న మహానగరాల్లో ఒకటి. నగర జనాభాకు సమానంగా వాహనాల సంఖ్య పెరుగుతుంది. దేశంలోనే అత్యధికంగా ఐటీ కంపెనీలు కలిగి ఉండే లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది బెంగళూరు నగరం. దీంతో అనేక రాష్ట్రాల నుంచి ఉద్యోగ, ఉపాధి, శిక్షణ కోసం ప్రజలు రాజధాని బెంగళూరుకు పోటెత్తుతున్నారు. దీంతో వ్యక్తిగత వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది. నగరంలో నిత్యం సుమారు 2 వేల నూతన వాహనాలు రోడ్లపైకి వస్తుండగా ప్రస్తుతం వాహనాల సంఖ్య 1.25 కోట్లు దాటింది. ఇందులో 70 శాతం ద్విచక్రవాహనాలు ఉన్నాయి. నగరంలో 2003లో ప్రతి వెయ్యిమందికి 400 వాహనాలు ఉండగా ప్రస్తుతం ప్రతి ఒక వెయ్యిమందికి సరాసరి 827 వాహనాలు ఉన్నట్లు అంచనా. ఢిల్లీలో ప్రతి వెయ్యిమందికి 320 వాహనాలు, ముంబైలో 220 వాహనాలు ఉన్నాయి. దేశంలోనే అత్యధిక ప్రైవేటు కార్లు కలిగిన నగరాలపైకి బెంగళూరు నగరం ఢిల్లీని దాటేసింది. ఢిల్లీలో 20.70 లక్షల ప్రైవేటు కార్లు ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మెట్రోరైలు, లోకల్ రైళ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. సంచారం ఆలస్యం కావడం, సిగ్నల్‌లో వాహనాలు నిలపడంతో ఇంధనం వృథాకు సంబంధించి ఏటా రూ.19,725 కోట్లు నష్టం వాటిల్లుతున్నట్లు ట్రాఫిక్ పరిష్కార నిపుణుల బృందం అంచనావేసింది.

20 లోక్‌సభ స్థానాల్లో గెలుపు కోసం కాంగ్రెస్ వ్యూహ రచన

- మంత్రులతో సీఎం, డీసీఎం భేటీ

శివాజీనగర: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. 28 స్థానాల్లోకి కనీసం 20 చోట్ల విజయపతాకం ఎగురవేయాలనే లక్ష్యంతో పావులు కదుపుతోంది. ఎన్నికల నిర్వహణ, వనరుల సేకరణ, విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం సిద్దరామయ్య గురువారం రాత్రి విందు పేరుతో మంత్రులతో భేటీ అయ్యారు. హైకమాండ్ ఆమోదం తెలిపిన తరువాత జాబితాను ఫైనల్ చేస్తారని, నేటి నుంచి అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ మంత్రులకు తెలిపారని తెలిసింది. గ్యారెంటీ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిసింది. బీజేపీ తరహాలో 28కి 28 స్థానాలు గెలుపొందుతామని చెప్పలేమని, 20 స్థానాల్లో విజయం సాధించేలా లక్ష్యం పెట్టుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి అన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన ఎత్తుగడలపై మంత్రులతో చర్చించేందుకు సీఎం సమావేశం ఏర్పాటు చేశారని, అయితే మంత్రుల పోటీ గురించి చర్చ జరుగలేదన్నారు. హైకమాండ్ సూచనను పాటించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. హైకమాండ్ సూచిస్తే ఎన్నికల్లో బరిలోకి దిగుతామని చెలువరాయస్వామి తెలిపారు.

వణికిస్తున్న కోతి జ్వరాలు

యశవంతపుర: ఉత్తరకన్నడ జిల్లాను కోతిజ్వరాలు వణికిస్తున్నాయి. సిద్ధాపుర తాలూకా కొర్లకై, బిళగి గ్రామాల్లో జ్వరాల బారిన పడినవారి సంఖ్య పెరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా 21 మంది కోతి జ్వరం బారిన పడినట్లు రక్త పరీక్షల్లో వెలుగు చూసింది. ఇద్దరు మంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో, ఆరు మంది సిద్ధాపుర తాలూకా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా 13 మందికి వైద్యులు ఇంటి వద్దనే చికిత్స అందజేస్తున్నారు.

ఆపరేషన్ కమలమే వారి పని


కార్యక్రమం ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

- ప్రజల విశ్వాసం కమలనాథులకు లేదు
- బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోపణ

సాక్షి,బళ్లారి/ రాయచూరు రూరల్: ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంలో బీజేపీ విఫలమైనందునే ఆపరేషన్ కమల పేరుతో ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తోందని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విజయపుర జిల్లా ముద్దేబిహాళ్ హెలిప్యాడ్ వద్ద విలేకరులతో మాట్లాడారు. డబ్బులతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ చూస్తోందన్నారు. కాంగ్రెస్ నుంచి పలువురు ఎమ్మెల్యేలు బీజేపీలోకి వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, విధాన పరిషత్ సభ్యుడు, మాజీ సీఎం జగదీష్‌శెట్టర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. బీజేపీ రాష్ట్రంలో గతంలో రెండు సార్లు అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఆపరేషన్ కమలం ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 2008 అధికారంలో వచ్చినప్పుడు బీజేపీకి పూర్తి అధికారం ఇవ్వలేదన్నారు. ఆపరేషన్ కమలం చేసి యడియూరప్ప సీఎం అయ్యారన్నారు. అనంతరం బసవరాజ్ బొమ్మై కూడా ఇదే తరహాలో సీఎం అయ్యారన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అయినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రస్తుతం ఎవరూ బీజేపీలోకి వెళ్లే ప్రశ్నే లేదన్నారు. రాష్ట్రంలో పూర్తి మెజార్టీ బీజేపీకి ఇవ్వకపోవడంతో గతంలో 2008, 2013, 2018 బీజేపీకి అధికారం ఇవ్వలేదన్నారు.

పూర్తి మెజార్టీ కాంగ్రెస్‌కే

కాంగ్రెస్ పార్టీ 2013లో పూర్తి మెజార్టీతో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం 136 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి ఉన్నారన్నారు. వారి పగటి కలలు సాకారం కాబోవన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాతీర్పుతో అధికారంలోకి వస్తే వారు దొడ్డిదారిన అధికారంలో వస్తారని ఎద్దేవా చేశారు. మండ్యలో ఏమి జరిగిందన్న వాస్తవాలను బీజేపీ చూడటం లేదన్నారు. 140 కోట్ల మంది ప్రజలు జాతీయ జెండాను గౌరవిస్తారన్నారు. బీజేపీ వారికి జాతీయ జెండాపై గౌరవం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి జాతీయ జెండాపై ఎంతో గౌరవం ఉందన్నారు. 1935లో జాతీయ జెండాను దేశానికి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని గుర్తు చేశారు. అనంతరం ఆయన ముద్దేబిహాళ్ తాలూకాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. కష్టకాలంలో కూడా ఐదు గ్యారెంటీలను ప్రజలకు అందజేస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటిని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. అనంతరం ఆయన హంపీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కరువులోనూ మన సంస్కృతిని కాపాడుకోవడానికి హంపీ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణపై ఈసీకి ఫిర్యాదు

శివాజీనగర: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలైతే గ్యారెంటీ పథకాలు రద్దు అవుతాయనే వ్యాఖ్యానించిన మాగడి కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణపై జేడీఎస్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. జేడీఎస్ యువ విభాగం రాష్ట్రాధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి నేతృత్వంలో జేడీఎస్ నాయకుల బృందం శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి మనోజ్‌కుమార్ మీనాను భేటీ చేసి ఎమ్మెల్యే బాలకృష్ణపై ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని, బాలకృష్ణ ఎమ్మెల్యే సభ్యత్వాన్ని తొలగించాలని విన్నవించారు. కాంగ్రెస్ పార్టీ లోకసభలో ఓటమిపాలైతే ఐదు గ్యారెంటీ పథకాలు రద్దు చేస్తామని చెప్పటం ప్రజలను బెదిరింపులకు గురిచేయడమేనని, బాలకృష్ణ ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని జేడీఎస్ డిమాండ్ చేసింది.

ఓటమి భయంతోనే..

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం నిఖిల్ కుమారస్వామి విలేకరులతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే బాలకృష్ణ ముఖ్యమంత్రి సిద్దరామయ్య, రాహుల్ గాంధీ అనుమతి లేకుండానే ఇలాంటి వ్యాఖ్యలు చేయటానికి సాధ్యం కాదని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి తథ్యమనే కాంగ్రెస్ నాయకులు ఇటువంటి వ్యాఖ్యలను చేయిస్తున్నారని ఆరోపించారు.

నభూతో.. నభవిష్యతి.. రాయల ఖ్యాతి


సంగీత ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


శుక్రవారం రాత్రి హంపి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు

- అంగరంగ వైభవంగా ప్రారంభ వేడుక
- హాజరైన సీఎం, పలువురు మంత్రులు
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, పర్యాటకులు

సాక్షి,బళ్లారి: రాయల వైభవాన్ని చాటుతూ విజయనగర జిల్లా హంపీలో ఉత్సవాలు శుక్రవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే హంపీ ఉత్సవాలను శుక్రవారం సీఎం సిద్దరామయ్య భువనేశ్వరీ మాత చిత్రపటానికి పూజలు చేసి ప్రారంభించారు. హంపీ ఉత్సవాలను తిలకించేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి భారీ ఎత్తున తరలివచ్చిన జనంతో హంపీ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. దేశ విదేశాల నుంచి వచ్చి సంగీత కళాకారులు ఇచ్చిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉమ్మడి బళ్లారి జిల్లాతో పాటు కర్ణాటకలోని పలు జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు నాలుగు ప్రధాన వేదికల మీదునుంచి వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. గ్రామీణ క్రీడా పోటీలు అద్భుతంగా జరిగాయి. ప్రధాన వేదికలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు కూడా ఏర్పాటు చేశారు. ప్రజలు ఎక్కడ నిలబడినా, కూర్చొన్నా ప్రధాన వేదిక వద్ద నిర్వహించే కార్యక్రమాలు తిలకించేలా స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

స్మారకాలు జిగేల్..

రాత్రి వేళలో కూడా పగటి వేళలా కనిపించేలా విద్యుత్ దీపాలను అలంకరించారు. శ్రీవిరుపాక్షేశ్వరుని ఆలయం నుంచి ప్రతి కట్టడం వద్ద రంగురంగుల విద్యుత్ దీపాలను అలంకరించడంతో సందర్శకులు తన్మయత్వం పొందారు.

పర్యాటకులకు సకల సౌకర్యాలు..

పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హంపీ పరిసరాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. హంపీ బైస్కైని కూడా ప్రారంభించడంతో హెలిప్యాడ్ వద్ద జనం సందడి కనిపిస్తోంది. 10 నిమిషాల్లో హంపీ మొత్తం చూసేందుకు ఏర్పాటు చేయడంతో జనం ఆసక్తి చూపుతున్నారు.

ఉత్సవాలపై పర్యాటకుల హర్షం..

దేశ భాషలందు తెలుగు లెస్స అని గర్వంగా చాటిన విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల పాలన గత వైభవం తాము చూడకపోయినా ప్రస్తుతం ఆయన పాలించిన ప్రాంతంలో ఉత్సవాలను చూస్తుండటం ఆనందంగా ఉందని పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు. పిల్లాపాపలు, వృద్ధులు ఇలా వయో భేదం లేకుండా హంపీ వీధుల్లో ఉత్సవాల్లో జనం కనిపిస్తున్నారు. ఒకవైపు శ్రీ కృష్ణదేవరాయల గత వైభవం తలపించేలా ఏర్పాట్లు, మరోవైపు వినోదం, ఆహ్లాదం కలిగించేందుకు సంగీత, సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు, ఇంకో వైపు ఎంతో మహిమాన్వితమైన శ్రీవిరుపాక్షేశ్వర స్వామి దర్శనంతో భక్తులు తరించారు.


ముగ్గులను ఫొటో తీసుకుంటున్న పర్యాటకురాలు

గత వైభవ ప్రతీకగా హంపీ ఉత్సవాలు

- సీఎం సిద్దరామయ్య

సాక్షి,బళ్లారి: శ్రీకృష్ణదేవరాయల పాలన గుర్తుకు వచ్చేలా హంపీ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. ఆయన శుక్రవారం రాత్రి విజయనగర జిల్లా హంపీలో ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ విజయనగర రాజుల కాలంలో హంపీలో దసరా ఉత్సవాలను నిర్వహించే వారని, అనంతరం దసరా ఉత్సవాలు మైసూరులో దసరా ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. 27 సంవత్సరాల క్రితం మాజీ ఉప ముఖ్యమంత్రి దివంగత ఎం.పీ.ప్రకాష్ కృషితో హంపీలో ఉత్సవాలు జరిపేందుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. హంపీ ఉత్సవాలు జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రాయల కాలం తరహాలో కర్ణాటకను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్రం నుంచి ఏటా దాదాపు రూ.4 లక్షలు కోట్లు పన్నుల రూపంలో చెల్లిస్తుంటే కేంద్రం నుంచి కేవలం రూ.50 వేలు కోట్లు మాత్రమే పంపుతున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని తాలూకాలను కరువు తాలూకాలుగా ప్రకటించామన్నారు. కేంద్రం నుంచి నయాపైసా కరువు నిధులు కూడా రావడం లేదన్నారు. దీంతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 7వ తేదీన ఢిల్లీలో తనతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో మంత్రులు పరమేశ్వర, నాగేంద్ర, శివరాజ్ తంగడిగి, జమీర్ అహమ్మద్, ఎమ్మెల్యేలు నారా భరత్ రెడ్డి, నేమిరాజ్‌నాయక్, లతా మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగల ప్రదర్శన జిగేల్


నగలు, వజ్రాభరణాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి : బెంగళూరులోని హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ బీడీఏ కాంప్లెక్స్ సమీపంలోని వైట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన ది బెంగళూరు జ్యూవెలరి షో ఆభరణా ప్రదర్శనను శుక్రవారం కన్నడ నటి శరణ్య శెట్టి, మరో నటి, మిస్ సౌత్ ఇండియా సుష్మా నాణయ్య ప్రారంభించారు. బంగారు నగలు, వజ్రాభరణాలతో నటీమణులు హొయలు పోయారు. ఈ నెల 4 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో కళ్లు మిరమిట్లు గొలిపే వైవిధ్యమైన డిజైన్లతో కూడిన బంగారు నగలు, వజ్రాభరణాలు మగువలను కనువిందు చేశాయి.సుమారు 16 జ్యూవెలరీ సంస్థలు ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేసి బంగారు నగలను ప్రదర్శించారు.

7న ఢిల్లీలో కర్ణాటక కాంగ్రెస్ ధర్నా

బనశంకరి: కేంద్ర బడ్జెట్‌లో కర్ణాటక రాష్ట్రానికి నిరంతరం అన్యాయం జరుగుతోందని కేంద్రం తారతమ్య ధోరణితో గత ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.62 వేల కోట్లు నష్టపోయిందని దీంతో కాంగ్రెస్ పార్టీ ఈనెల 7వ తేదీన కర్ణాటక ప్రభుత్వం తరపున ఢిల్లీలో ధర్నా చేపడతామని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తెలిపారు. శుక్రవారం విధానసౌధలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో తనతో పాటు రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. ధర్నాకు స్థలం కోసం కేంద్రానికి లేఖ రాశామని, అనుమతి లభించిన వెంటనే ధర్నా చేస్తామని చెప్పారు. 2018-19 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.46 వేల కోట్ల నిధులు అందాయి. అయితే 2024-25లో రాష్ట్రానికి వచ్చిన నిధులు కేవలం రూ.50 వేల కోట్లు మాత్రమే. కేంద్రప్రభుత్వ బడ్జెట్ మాత్రం భారీగా పెరిగినప్పటికీ రాష్ట్రానికి వచ్చే నిధుల ప్రమాణంలో అత్యల్పంగా మాత్రమే ఉందన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్‌కు ఆర్టీసీ బస్సు ఢీ

- 12 మందికి పైగా గాయాలు



ఘటన స్థలంలో దెబ్బ తిన్న ట్రాక్టర్

చెళ్లకెరె రూరల్: ఇటుకలు నింపుకొని వెళుతున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ రాజహంస బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో సుమారు 12 మందికి పైగా గాయపడిన ఘటన తాలూకాలోని తళకు ఫిర్కా హిరెహళ్ల వద్ద జరిగింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణహాని జరగలేదు. తీవ్రగాయాలైన వారిని చికిత్స కోసం చిత్రదుర్గ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పెళ్లి వేడుక ముగించుకొని కలబుర్గి నుంచి మాగడికి బంధుపరివారంతో వెళుతున్న రాజహంస బస్సు ట్రాక్టర్‌కు వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై తళకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

వీధి కుక్కలను తరలించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో వీధి కుక్కలను ఊరి బయటకు తరలించి, వాటి బెడదను నివారించాలని మూల నివాసి దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద అందోళన చేపట్టిన సంచాలకుడు హజ్రత్ మాట్లాడారు. నగరంలో ఎక్కడ పడితే అక్కడ వీధి కుక్కలు చిన్న పిల్లలపై దాడులు జరిపి గాయపరుస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేదన్నారు. వీధి కుక్కలను తొలగించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పరిశుభ్రతపై జాగృతి అవసరం



జ్యోతి వెలిగిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్ : విద్యార్థులను పరిశుభ్రతపై జాగృతం చేయాలని జెడ్పీ ఉప కార్యదర్శి శశికాంత్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ విద్యాలయం ఆవరణలో జిల్లాధికార యంత్రాంగం, కిర్లోస్కర్ కంపెనీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మరుగుదొడ్ల పరిశుభ్రత, స్వచ్ఛత, శ్రమదానం, వాతావరణ కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందడానికి పరిశుభ్రత అత్యవసరమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ బీఈఓ వెంకోబరావు, రోషన్‌లున్నారు.


బాలలను పనిలో పెట్టుకోవడం నేరం



కూలీ పనుల్లో నిమగ్నమైన బాల కార్మికులు

కంప్లి: కురుగోడు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జిల్లా బాలకార్మిక యోజనాధికారి మౌనేష్ ఆధ్వర్యంలో దాడులు జరిపి ఇద్దరు బాల కార్మికులకు రక్షించినట్లు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా న్యాయ ప్రాధికార, జిల్లా కార్మిక యోజన, కార్మిక శాఖ, పోలీసు, జిల్లా బాలల రక్షణ కేంద్రం, విద్య, ఆరోగ్య, సమాజ కళ్యాణ, చైల్డ్‌లైన్ సహయోగంతో బాలకార్మిక, కిశోర కార్మిక ఫోర్స్ సమితి సమావేశం నిర్వహించి బాల కార్మికులు ఎక్కడ ఉన్నా ప్రజలు తమకు సమాచారం అందించి సహకరించాలని, విద్యాభ్యాసానికి బదులు పనులకు పంపడం నేరమని హెచ్చరించారు.

డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీక్



డ్రైనేజీ నుంచి లీకై పారుతున్న నీరు

కంప్లి: కూడ్లిగి పట్టణంలోని ఆర్‌టీసీ సంస్థ ఆవరణలో మురుగునీటి పైప్‌లైన్ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు రోడ్డుపై కాలువలా పారుతోంది. దీంతో అటు వైపు రాకపోకలు సాగించే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్తున్నారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్ల పైప్‌లైన్ చాంబర్ నిండిపోయి లీకవుతోంది. మురుగునీరు బస్టాండ్ ప్రాంగణంలో పారడంలో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు అత్యవసర పరిస్థితిలో మలమూత్ర విసర్జనకు మరుగుదొడ్డికి వెళ్లాలంటే కాలు మోపే అవకాశం కూడా లేదు. ఇటు బస్టాండ్ ఆవరణలోనూ అదే నీరు ముందు రోడ్డుపై పారడంతో సమస్య ఎదురైంది. వెంటనే అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయించాలని అటు పట్టణ ప్రజలు, ఇటు ప్రయాణికులు ఒత్తిడి చేస్తున్నారు.

ఉత్సవ స్ఫూర్తి.. హంపీ గత వైభవ దీప్తి

- ఉత్సవాలకు ఆద్యుడు ఎంపీ ప్రకాష్
- ప్రముఖ సాహితీవేత్త కుంబార వీరభద్రప్ప



హంపీ ప్రధాన వీధిలో ఉత్సవాలకు హాజరైన అశేష జనవాహిని



హంపీ ఉత్సవ వేదికపై గీతాలను ఆలపిస్తున్న గాయకులు

హొసపేటె: రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన హంపీ ఉత్సవాలకు స్ఫూర్తి నింపి గత వైభవాన్ని దశదిశలా వ్యాపింపజేసేందుకు ఆద్యుడు, దివంగత మాజీ ఉపముఖ్యమంత్రి, సాహితీ ప్రియుడు ఎంపీ ప్రకాష్ అని ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత కుంబార వీరభద్రప్ప అభిప్రాయపడ్డారు. సాంస్కృతిక రాయబారి. హంపీలోని విరుపాక్షేశ్వర ఆలయ వేదికపై ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. హంపీ ఉత్సవం మన దేశ పూర్వ వైభవాన్ని, పర్యావరణ వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెబుతోందన్నారు. హడగలి గ్రాడ్యుయేట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ పాటిల్, వన్యప్రాణి పరిశోధకుడు, అధ్యాపకుడు డాక్టర్ సమద్ కొట్టూరు, డాక్టర్ చంద్రప్ప, మల్లికార్జున బి.మాన్పడే, కేఎస్.శివప్రకాష్, డాక్టర్ హంపీ వీరేష్ ఉత్తంగి, డాక్టర్ కే.రవీంద్రనాథ్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న వస్తు ప్రదర్శన

హంపీ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మొదటి రోజు శుక్రవారం సిరిధాన్య, పుస్తకాలు, ఆరోగ్య, ఎద్దుల, మత్స్య తదితర వివిధ ప్రదర్శనలను మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సారి హంపీ ఉత్సవాలు విజయనగర సామ్రాజ్య రాయల కాలం నాటి గత వైభవం గుర్తు తెచ్చేలా నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలు వీక్షించేందుకు వచ్చే ప్రజలకు అన్ని విధాలా మౌలిక సౌకర్యాలను కల్పించామన్నారు. ఉత్సవాల సందర్భంగా మూడు రోజులు పాటు హొసపేటె నుంచి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాధికారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఎద్దుల ప్రదర్శన

- పాల్గొన్న 52 జతల ఎద్దులు

హంపీ ఉత్సవాల్లో తొలిరోజు నిర్వహించిన ఎద్దుల ప్రదర్శన ప్రజల దృష్టిని ఆకర్షించింది. పొలాన్ని దుక్కి దున్నడంలో రైతుల భాగస్వాములుగా సహకరిస్తున్న వివిధ దేశీయ జాతుల ఎద్దులు ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచాయి. కమలాపుర పట్టణంలోని హంపీ డెవలప్‌మెంట్ అథారిటీ వెనుక ఆవరణలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ గోవులకు పూజ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో దాదాపు 52 జతల ఎద్దులు పాల్గొన్నాయి. హళ్లికర్, అమృత్ మహల్, కిలార్ తదితర అనేక దేశవాళీ జాతి ఎద్దులు రైతులకు నచ్చాయి. హొసపేటె నగరానికి చెందిన బండి కృష్ణప్ప ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ అవార్డుకు ప్రథమ స్థానంలో నిలిచాడు. హొసపేటె తాలూకా నల్లాపుర గ్రామానికి చెందిన రైతు హనుమంతప్ప ముడియప్ప ద్వితీయ స్థానం, వెంకటాపుర గ్రామానికి చెందిన రైతు హులిగేష్ తృతీయ స్థానం సాధించారు. మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ స్వయంగా రూ.లక్ష బహుమతిని అందించడం విశేషం. ఈ సందర్భంగా విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప, జిల్లాధికారి దివాకర్, జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు, రైతులు, ప్రజలు హాజరయ్యా రు. ఎద్దుల ప్రదర్శనకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ఎస్ఎస్.పాటిల్, డాక్టర్ మంజునాథ్ వ్యవహరించారు.

ఫల, పుష్పప్రదర్శన ప్రారంభం

ఈ ఏడాది హంపీ ఉత్సవాల సందర్భంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫల, పుష్ప ప్రదర్శనలో హంపీలోని కమల్ మహల్ నమూనాను 2 లక్షల చెండు పూలు, లక్ష గులాబీ పూలు, వివిధ రకాల పూలతో రూపొందించారు. విజయనగర సామ్రాజ్య గతవైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవం, ఉద్యానవన శాఖ నుంచి హంపీ మాతంగ పర్వత మైదానంలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరిగిన ఫల, పుష్ప ప్రదర్శనను మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ ప్రారంభించారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ యూనిట్లు, మిక్స్‌డ్ హార్టికల్చర్ ఫార్మింగ్ మోడల్, మహాత్మా గాంధీ వంటి స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, సంఘం సంస్కర్తలు బసవణ్ణ, శివకుమార స్వామీజీ, మాజీ అధ్యక్షులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల కళాఖండాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మరో విశేషమేమిటంటే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మైసూరు దసరా అంబారీని మోసే ఏనుగు అర్జున ప్రతిరూపాన్ని కూడా ప్రదర్శించారు.

సేంద్రియ, తృణధాన్యాల ప్రదర్శన

హంపీ ఉత్సవంలో భాగంగా మాతంగ పర్వత మైదానంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సేంద్రియ, తృణధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన ప్రజల దృష్టిని ఆకర్షించింది. మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. కన్నడాంబ భువనేశ్వరి మాత, విశ్వగురు బసవణ్ణ వివిధ కళా ఖండాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు అదుర్స్

హంపీ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రధాన వేదికలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకొన్నాయి. అదే విధంగా వివిధ కళాకారుల ఊరేగింపు ప్రదర్శనలు కూడా అలరించాయి.

రంగురంగుల రంగోలిలతో శోభాయమానం

హంపీ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం విరుపాక్షేశ్వర ఆలయం ఎదుట నిర్వహించిన రంగోలి పోటీల్లో రంగురంగుల రంగోలి చిత్రాలు హంపీ ఉత్సవాలను శోభాయమానం చేశాయి. పోటీలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 74 మంది మహిళలు పాల్గొన్నారు. వివిధ రంగోలిలు పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప, జిల్లాధికారి దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు, కన్నడ, సంస్కృతి శాఖ సహాయ సంచాలకులు సిద్దలింగేష్ రంగన్న, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.



రంగురంగుల ముగ్గులను వేసిన దృశ్యం



విజేతకు నగదును అందిస్తున్న మంత్రి



వివిధ రకాల వెదురు ఉత్పత్తుల ప్రదర్శన



వివిధ రకాల సిరిధాన్యాల ప్రదర్శన



విశ్వగురు బసవణ్ణ, భువనేశ్వరిమాత ప్రతిమలు



అర్జున అంబారీ ప్రదర్శన



ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన ఫలప్రదర్శనలో పండ్లపై చెక్కిన మహనీయుల చిత్రాలు



వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన పంటల సాగు ప్రదర్శన



లక్షలాది పూలతో రూపుదిద్దుకున్న కమల మహల్ నమూనా



హంపీ ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన మత్స్యప్రదర్శన



ఫలప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పండ్లు

జిల్లాలో ముగ్గురు కేఏఎస్ అధికారుల బదిలీ



దురుగేష్ , మెహబూబ్ జిలాని , మెహబూబీ

రాయచూరు రూరల్: జిల్లాలో ముగ్గురు కేఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆధీన కార్యదర్శి ఉమాదేవి గురువారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. అదనపు జిల్లాధికారి దురుగేషను బదిలీ చేస్తూ ఎక్కడా పోస్టింగ్‌ను ఇవ్వలేదు. ఆయన స్థానంలో బెళగావి సిటీ కార్పొరేషన్ కమిషనర్ అశోక్ దుడుగుంటిని, రాయచూరు అసిస్టెంట్ కమిషనర్ మెహబూబీని బెళగావి జిల్లా చిక్కోడి అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో బెళగావి కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సంపగావిని, రాయచూరు నగరాభివృద్ధి ప్రాధికార కమిషనర్ మెహబూబ్ జిలానిని కలబుర్గి సిటీ కార్పొరేషన్ కార్యదర్శిగా, ఆయన స్థానంలో కలబుర్గి కార్పొరేషన్‌కార్యదర్శి మల్లేష్ తంగాను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఓటు హక్కుపై జాగృతి జాతా



నరేగ కూలీలకు ఓటు హక్కుపై జాగృతి కల్పిస్తున్న అధికారులు

గంగావతి: తాలూకాలోని హేరూరు జీపీలోని కలకేరి చెరువులో పూడికతీత సందర్భంగా నరేగ దినోత్సవాన్ని అధికారులు, కూలీలు జరిపారు. పథకం డైరెక్టర్ సంతోష్‌కుమార్ కేక్ కట్ చేసి మాట్లాడుతూ నరేగ పథకం కూలీలు తన ఆరోగ్య రక్షణ కోసం తాము చేపట్టే ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీపీ, షుగర్ ఇతర పలు వ్యాధులకు పరీక్షలు చేయడమే కాక ఈ వ్యాధులు ఉన్న వారిని ఉచితంగా మందులను సైతం అందజేస్తామన్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎవరి ప్రలోభాలకు గురికాకుండా మీరే ఆలోచించి సమర్థ అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు. ప్రస్తుతం 18 ఏళ్ల వయస్సు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, ఇతర ఓటు హక్కు వినియోగ సామగ్రిని కూలీల ముందు ప్రదర్శించి వారితోనే ఓటు వేయడమెలానో చూపించారు. కార్యక్రమంలో జీపీ అధికారులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

భార్యను వేధించినందుకే స్నేహితుడి హత్య



విజయబసవ(హతుడు), నిందితుడు అజర్

హుబ్లీ: యువకుడిని దారుణంగా హత్య చేసి నిప్పంటించి కాల్చి వేసిన నిందితుడిని అరెస్ట్ చేయడంలో పాత హుబ్లీ పోలీసులు సఫలీకృతులయ్యారు. హతుడి ఆప్త మిత్రుడు, మంటూరు రోడ్డు మిల్లత్ నగర్ నివాసి సయ్యద్ అజర్(25) అనే వ్యక్తి నిందితుడని జంట నగరాల పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార మీడియాకు తెలిపారు. వివరాలు.. అజర్, హతుడు విజయ బసవ ఇద్దరు ఆప్త మిత్రులు. అయితే హతుడు విజయ్ బసవ తన స్నేహితుడు అజర్ భార్యకు ఫోన్ చేసి రకరకాలుగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో మిత్రుడికి అజర్ ఎంత బుద్ధి చెప్పినా కూడా వినలేదు. దీంతో హత్య చేయాలని పథకం రూపొందించి ఆ మేరకు నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఇకపై అవన్ని వదిలేయాలని నచ్చచెప్పాడు. అయినా విజయబసవ వినిపించుకోలేదు. దీంతో కోపోద్రిక్తుడైన అజర్ బండరాయి తీసుకొని స్నేహితుడిపై దాడి చేయడమే కాక పెట్రోల్ తెచ్చి శరీరంపై పోసి నిప్పుపెట్టి పరారయ్యాడు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కేసులో అతడొక్కడే నిందితుడని ఆమె వివరించారు.

లక్ష్మీనృసింహునికి స్వాతి నక్షత్ర పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కేజీఎఫ్: నగరంలోని స్వామినాథపురం మెయిన్ రోడ్డులో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర విశేష పూజా కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామితో పాటు ఆలయంలో ఉన్న లక్ష్మీ అమ్మ వారికి కూడా ప్రత్యేక పూజలను చేశారు. నగరంలో 130 సంవత్సరాల చరిత్ర కలిగిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రతియేటా మాదిరిగా స్వాతి నక్షత్ర విశేష పూజల్లో భాగంగా హోమం, హవనం, అభిషేకం, కలశపూజ, అష్టోత్తర పూజ, నైవేద్యం, మహామంగళారతి తదితర కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ జరిగింది.

హంపీలో సీఎంకు ఘన స్వాగతం



సీఎంకు ఘన స్వాగతం పలుకుతున్న మంత్రులు,ఎమ్మెల్యేలు తదితరులు

సాక్షి,బళ్లారి/హొసపేటె: రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు హంపీలో ఘన స్వాగతం లభించింది. హంపీ ఉత్సవాలను ప్రారంభించేందుకు ఆయన ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో హంపీ హెలిప్యాడ్‌కు శుక్రవారం సాయంత్రం చేరుకున్నారు. హంపీకి చేరుకున్న వెంటనే సీఎంకు బళ్లారి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌తో పాటు ఉమ్మడి బళ్లారి జిల్లా ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, గణేష్, గవియప్ప తదితరులతో పాటు జిల్లాధికారులు, ఎస్పీలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ జన హితం, కళాకారులకు మేలు చేయాలనే సంకల్పంతో హంపీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలు నిర్వహించడం వల్ల మన సంస్కృతి వారసత్వాలను కాపాడుకునేందుకు దోహదం చేస్తుందన్నారు.

ఎస్పీ కార్యాలయం ప్రారంభం



నూతన ఎస్పీ కార్యాలయంలో మొక్క నాటి నీరు పోస్తున్న సీఎం, మంత్రులు

హొసపేటె: విజయనగర జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం సీఎం సిద్దరామయ్య ప్రారంభించారు. హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్, మంత్రులు జమీర్ అహమ్మద్ ఖాన్, శివరాజ్ తంగడగి, కేఎంఎఫ్ అధ్యక్షులు భీమానాయక్, అధికారులు పాల్గొన్నారు. కాగా ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే గవియప్ప కోసం సీఎం సిద్దరామయ్య 10 నిమిషాల పాటు వేచిచూశారు. అనంతరం సీఎం సిద్దరామయ్య మొక్కలు నాటి, రిబ్బన్ కత్తరించి ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఎయిమ్స్‌పై కేంద్రం సానుకూలం



ఎంపీ రాజా అమరేశ్వర నాయక్

రాయచూరు రూరల్: నగరంలో ఎయిమ్స్ ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని రాయచూరు లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వ నాయక్ వెల్లడించారు. గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కర్ణాటకలోని రాయచూరుకు అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)ను మంజూరు చేయాలన్న లేఖకు స్పందించారని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లతో చర్చించి రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించేలా చూస్తామన్నారు. గిణిగెరా–రాయచూరు–మహబూబ్‌నగర్ రైలు మార్గ నిర్మాణానికి రూ.300 కోట్ల నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా చలువాది మహాజన సభ

కంప్లి: రాజ్యాంగ ప్రముఖ ఆశయాలైన లౌకిక ప్రజాప్రభుత్వం, సమాజవాదం అవసాన దశలో ఉందని చలువాది మహాసభ జిల్లా అధ్యక్షుడు సీఆర్ హనుమంత తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా చలువాది మహాజన సభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు సంఘం ప్రారంభం, తనకు నూతన పదాధికారుల ప్రమాణోత్సవంలో పాల్గొనే అవకాశం లభించడం సంతోషమన్నారు. రాజ్యాంగ ఆశయాల బాట చేపట్టడం మహాసభ ఉద్దేశమని, సమాజ అభివృద్ధి ముమ్ముందు మరింత బలోపేతం చేస్తామన్నారు.

టిప్పుకు అవమానం.. నిందితుడి అరెస్ట్



నిందితుడు ఆకాష్

రాయచూరు రూరల్: జిల్లాలోని సిరవారలో టిప్పు చిత్రపటానికి పాదరక్షలతో అవమానం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నిఖిల్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం సాయంత్రం సిరవారకు చెందిన ఆకాష్ అనే యువకుడిని అరెస్ట్ చేశామన్నారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టిప్పుసుల్తాన్ చిత్రపటానికి చెప్పుల దండతో అవమానించిన అంశంపై విచారణ జరిపి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉత్సవాలకు కౌన్సిలర్లకు ఆహ్వానమేదీ?



నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

హొసపేటె: హంపీ ఉత్సవాలకు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ సహా సభ్యులందరినీ విస్మరించారు. దీంతో వారు ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. హొసపేటె మున్సిపల్ కౌన్సిల్‌లో అధ్యక్షురాలు ఏ.లత, ఉపాధ్యక్షులు ఎన్. రూపేష్‌కుమార్ సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. విజయనగర జిల్లాలో హంపీ ఉత్సవం కొనసాగుతోంది. ప్రతి ఏటా మున్సిపల్ కౌన్సిల్, కమలాపుర మున్సిపాలిటీ, హంపీ గ్రామంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఆహ్వానించారు. అయినా ఈసారి హొసపేటె మున్సిపల్ కౌన్సిల్‌ను పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. జిల్లాధికారి ఆధ్వర్యంలో తుంగభద్ర హారతి, బైక్ ర్యాలీ, వసంత వైభవానికి పురపాలక సంఘం చైర్మన్‌ను ఆహ్వానించకుండా స్థానిక సభ్యులను అవమానించారని మండిపడ్డారు. నగర కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సంతోష్‌కుమార్, సభ్యుడు తారిహళ్లి జంబునాథ్ తదితరులు మాట్లాడుతూ హెచ్‌ఆర్.గవియప్ప ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నగరసభ సభ్యులను ఉద్దేశపూర్వకంగా దూరం పెట్టారన్నారు.

హంపీలో ఉత్సవాల్లో నేటి కార్యక్రమాలు

హొసపేటె: ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీ ఉత్సవాల్లో రెండో రోజు శనివారం జరిగే కార్యక్రమాల వివరాలివే. ప్రధాన గాయత్రీ పీఠ వేదికలో ప్రసిద్ధ కన్నడ సినీ నటుడు దర్శన్, సంగీత దర్శకుడు హరికృష్ణల ఆధ్వర్యంలో రసమంజరి కార్యక్రమం, పశ్చిమబెంగాల్‌కు చెందిన గోల్డన్ గర్ల్స్ ఆధ్వర్యంలో విశేష నృత్యాలు, ఎదురు బసవణ్ణ వేదికలో సాయంత్రం 4 గంటలకు స్థానిక కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, విరుపాక్షేశ్వర దేవస్థాన వేదిక వద్ద మహిళాగోష్ఠి,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సాసివెకాళు గణపతి వేదిక వద్ద వివిధ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, అలాగే కుస్తీ పోటీలు కూడా నిర్వహిస్తున్నారు.

ఘనంగా హుచ్చీరప్ప రథోత్సవం

కంప్లి: తెక్కలకోట పట్టణంలోని 14వ వార్డులో హుచ్చీరప్ప రథోత్సవం ఘనంగా జరిగింది. రథోత్సవం సందర్భంగా సామూహిక వివాహాలు జరిగాయి. గురువారం సాయంత్రం హుచ్చీరప్ప ఇంటి నుంచి వివిధ వాయిద్యాలతో తాత చిత్రపటం ఊరేగింపు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఖాదీ మండలికి నిధుల కోసం ప్రతిపాదిస్తాం



బాధ్యతలు స్వీకరించిన బసనగౌడ దద్దల్

రాయచూరు రూరల్: బెంగళూరులోని ఖాదీ అభివృద్ధి మండలి కార్యాలయంలో శుక్రవారం మస్కి ఎమ్మెల్యే బసనగౌడ తుర్విహాళ్ అధ్యక్ష పదవి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాదీ మండలికి రూ.300 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర చిన్న పరిశ్రమల అభివృద్ధి మండలి అధ్యక్షుడు హంపనగౌడ బాదర్లి, రాష్ట్ర ఎస్టీ మండలి అధ్యక్షుడు బసనగౌడ దద్దల్, మాజీ ఎమ్మెల్సీ బసవరాజ్ పాటిల్ ఇటగి, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి వసంత్ కుమార్‌లున్నారు.